www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

బుధవారం | 26-6-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 71 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం; తిథి: పంచమి రా. 8.55 తదుపరి షష్ఠి; నక్షత్రం: ధనిష్ఠ మ. 1.05 తదుపరి శతభిషం; వర్జ్యం: రా. 7.50-9.20; దుర్ముహూర్తం: ఉ. 11.51-12.44; అమృతఘడియలు: తె. 4.51 మొదలు; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 5.46; సూర్యాస్తమయం: 6.49 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


అంతరిక్షంలోనే సునీత



బోయింగ్ వ్యోమనౌకలో హీలియం లీక్.. సరిదిద్దే పనిలో నాసా
ఇద్దరు వ్యోమగాముల తిరుగు ప్రయాణం మరోసారి వాయిదా
సునీతతోపాటు విల్‌మోర్ కూడా ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌లోనే
2018 నుంచి పదే పదే ప్రమాదాలతో బోయింగ్‌పై విమర్శలు
ఇప్పుడు రోదసిలోనూ వ్యోమనౌకలో లోపాలతో ఇక్కట్లు!

12





కుప్పం బస్టాండ్ వద్ద జరిగిన సభలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, హాజరైన ప్రజానీకం

మోయలేనంత భారముంది!

ఎంత కష్టమైనా భరిస్తా: చంద్రబాబు

పరిస్థితులు ఆశాజనకంగా లేవు.. ఖజానా ఖాళీ
కష్టాలు చూసి పారిపోయేదే లేదు
రాష్ట్ర ప్రజల భవిష్యత్ తిరగరాయబోతున్నాను
అప్పులు, అక్రమాలపై 7 శ్వేత పత్రాలు
ఇచ్చిన హామీల మేరకు ఐదు సంతకాలు
పాస్‌పుస్తకాలపై ఇక జగన్ బొమ్మలుండవు
మళ్లీ జన్మ ఉంటే కుప్పం ముద్దుబిడ్డగానే పుడతా
సొంత నియోజకవర్గంలో ముఖ్యమంత్రి ఉద్ఘాటన
హంద్రీ-నీవా కుప్పం బ్రాంచ్ కెనాల్ పరిశీలన

'రాష్ట్రంలో పరిస్థితులు మీరు అనుకున్నంత ఆశాజనకంగా ఏమీ లేవు. ఖజానా ఖాళీగా ఉంది. మోయలేనంత భారముంది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఎలా పరిపాలిస్తావని అందరూ అంటున్నారు. నాకు మనోధైర్యం ఉంది. కష్టాలు చూసి పారిపోయేవాడిని కాను. ఎంత కష్టమైనా పడతా.. ఎంత భారమైనా మోస్తా' -చంద్రబాబు

కుప్పం, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల భవిష్యత్‌ను తిరగరాయబోతున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. నాలుగోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన తొలిసారిగా తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో రెండ్రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం వచ్చారు. భారీవర్షం కురుస్తున్నా.. కుప్పం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద బహిరంగ సభలో ప్రసంగించారు. ఈ ఎన్నికల్లో యువత, మహిళలు, బలహీన వర్గాలకు అవకాశమిచ్చామని.. 164 మంది కూటమి అభ్యర్థులను ప్రజలు ఎమ్మెల్యేలుగా గెలిపించారని తెలిపారు. వైసీపీ ఉంటే తమకు

మిగతా 12వ పేజీలో...

రాజధానికి డ్వాక్రా మహిళల భూరి విరాళం
చంద్రబాబుకు రూ.4.5 కోట్ల చెక్కు అందజేత

సుప్రీంకోర్టుకే ద్వివేది మస్కా

ఏపీలో అక్రమ ఇసుక తవ్వకాలు ఆపాలంటూ
ఈ ఏడాది ఏప్రిల్ 29, మే10న కోర్టు ఆదేశం
అప్పటికే కలెక్టర్లతో కోర్టుకు తప్పుడు నివేదికలు
అక్రమాలపై మే15న సుప్రీం చేతికి ఆధారాలు
ఆ మరుసటి రోజే చర్యలకోసం సుప్రీం ఆదేశాలు
అయితే, మైండ్ గేమ్ ఆడిన గోపాలకృష్ణ ద్వివేది
15వ తేదీతో 16న అధికారులకు నోటీసులు
సుప్రీం చెప్పకముందే చర్యలన్నట్టు కలరింగ్
19న ఇచ్చిన అఫిడవిట్‌లో అదే ప్రస్తావన
కానీ, కేసుల్లేవు, విచారణల్లేదు, నోటీసులతో సరి
జగన్ సర్కారును కాపాడేందుకు విఫల యత్నం



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

నాటి జగన్ సర్కారులో గనుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన గోపాలకృష్ణ ద్వివేది ఎనలేని స్వామిభక్తి చాటుకున్నారు. గనుల శాఖ అధికారిగా ప్రజాధనాన్ని, సహజవనరులైన ఇసుకను కాపాడాల్సిన ఈయన, అందుకు విరుద్ధంగా వ్యవహరించారని ఇప్పుడు సుప్రీం కోర్టు సాక్షిగా తేలిపోయింది. ఇసుక అక్రమ తవ్వకాల్లో పీకల్లోతు మునిగిపోయిన జగన్ సర్కారును కాపాడేందుకు ద్వివేది చివరినిమిషం దాకా ప్రయత్నించారు. ఎన్నికలయ్యాక కూడా ప్రజాసరళిని అర్థం చేసుకోకుండా జగన్‌ను కాపాడే ప్రయత్నాలు చాలా గట్టిగా చేశారు. ఇందుకోసం ఏకంగా దేశంలోని అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీం కోర్టుకే

మిగతా 2వ పేజీలో...



శరణు.. శరణు!

ఢిల్లీ అండ కోసం జగన్ పాట్లు

కేంద్ర సర్కారుకు బయటి నుంచి మద్దతు!
లిఖితపూర్వకంగా బీజేపీకి సమాచారం
అంశాల వారీగా కాదు... 'అన్నింటికీ' జై
పాత కేసులకు తోడు... కొత్త స్కాములు
ఐదేళ్ల పాలనలో అడ్డగోలు నిర్ణయాలు
చంద్రబాబును అరెస్టు చేయించి ఆనందం
తననూ అరెస్టు చేస్తారని జగన్ ఆందోళన!?

స్పీకర్ ఎన్నికల్లో ఎన్డీయేకే మద్దతు
బీజేపీ అడగ్గానే అంగీకరించిన జగన్

అమరావతి/న్యూఢిల్లీ, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): అధికారం కోల్పోయి... అనుకున్నవేవీ జరగక.. దిక్కుతోచని పరిస్థితిలో పడ్డ వైఎస్ జగన్మోహన్ రెడ్డి కేంద్ర పెద్దల శరణుజొచ్చినట్లు తెలుస్తోంది. ఎన్డీయే సర్కారుకు పదేళ్లుగా ఆయన మద్దతు ఇస్తూనే ఉన్నారు. తాజాగా... ప్రభుత్వానికి బయటి నుంచి తమ మద్దతు ఉంటుందని 'బేషరతు'గా వెల్లడించినట్లు తెలిసింది. రెండు రోజుల కిందట దీనిపై కేంద్రానికి లిఖితపూర్వకంగానే సమాచారం పంపినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అక్రమాస్తుల కేసులో జగన్ అరెస్టయి... దాదాపు పదేళ్లుగా బెయిలుపై ఉన్న సంగతి

మిగతా 2వ పేజీలో...

నాకు విపక్ష నేత హోదా ఇవ్వాల్సిందే!

బెదిరించే ధోరణిలో జగన్ లేఖ.. ఇస్తేనే అసెంబ్లీకి వస్తానని సంకేతాలు
ఆ హోదా ఇస్తేనే ప్రజా సమస్యలపై నిలదీసే వీలుంటుందట!
1984లో టీడీపీ నేత ఉపేంద్రకు లోక్‌సభలో విపక్ష నేత పదవి ఇచ్చారు
ఉమ్మడి అసెంబ్లీలో పీజేఆర్‌కూ ఇచ్చారు.. 'పది శాతం' నిబంధన ఎక్కడా లేదు
స్పీకర్ అయ్యన్నకు జగన్ లేఖ.. అందులోనే అనేక అసత్యాలు, అర్ధసత్యాలు
నాడు ఉపేంద్ర లోక్‌సభ సభ్యుడే కాదు.. పీజేఆర్‌కు సీఎల్పీ నేతగానే గుర్తింపు

2



స్పీకర్ పదవికి పోటీ!

లోక్‌సభ చరిత్రలో నాలుగోసారి.. ఎన్డీఏ నుంచి మళ్లీ ఓం బిర్లా
కేరళ ఎంపీ కె. సురేశ్‌ను నిలిపిన ప్రతిపక్షం.. నేడు ఓటింగ్
గడువుకు కొద్ది నిమిషాల ముందు నామినేషన్ల దాఖలు
స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవానికి కేంద్ర మంత్రుల రాయబారం విఫలం
'డిప్యూటీ స్పీకర్' ఇవ్వాలని విపక్షం పట్టు.. అంగీకరించని ఎన్డీఏ
ఎన్డీఏ మిత్రపక్షానికి డిప్యూటీ స్పీకర్ పదవి?

2



కేజ్రీ బెయిల్‌పై స్టే

ట్రయల్ కోర్టు తీరు అనాలోచితం..
ఈడీ పత్రాలను పరిగణనలోకి తీసుకోలేదు
వాదనలకూ తగిన అవకాశం ఇవ్వలేదు
విచారణలో ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యలు



2

మళ్లీ 'అన్నదాత సుఖీభవ'

11

రైతు భరోసా పేరు మార్పు
ఇకపై రైతన్నకు ఏటా రూ.20 వేల సాయం
త్వరలో విధి విధానాలు జారీ



ఉండిలో నిర్మాణంలో ఉన్న భవనానికి అంటిస్తున్న నోటీసు

మరో ఐదు వైసీపీ కార్యాలయాలకు

నోటీసులు

11

అక్రమ నిర్మాణాలను ఎందుకు కూల్చివేయకూడదో వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశం
స్థలాల ఆక్రమణపైనా గళం విప్పుతున్న బాధితులు
మాజీ మంత్రి అనిల్‌పై పోలీసులకు ఫిర్యాదు



12

సభలో హుందాగా ప్రవర్తిద్దాం

మన నడవడిక, చర్చలు మన్ననలు పొందాలి
అసెంబ్లీలో ప్రజల ఆకాంక్షలను ప్రతిఫలింపజేద్దాం
పార్టీ శ్రేణులను బలోపేతం చేసే బాధ్యత మీదే
జనసేన ఎమ్మెల్యేలకు డిప్యూటీ సీఎం పవన్ నిర్దేశం
నియోజకవర్గాల్లో 'జన వాణి' చేపట్టాలని సూచన
సభా వ్యవహారాలపై వారికి అవగాహన కార్యక్రమం

'ఎమర్జెన్సీ' మైండ్‌సెట్

ఇంకా పోలేదు

ఆ చీకటి రోజుల్లో దేశాన్నే జైలుగా మార్చారు



వెంకయ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రధాని మోదీ

356 అధికరణను ఎడాపెడా ప్రయోగించారు
రాజ్యాంగాన్ని అణచివేశారు.. స్వేచ్ఛ హరించారు
అలాంటివారు రాజ్యాంగంపై ప్రేమ ప్రకటిస్తారా?
కాంగ్రెస్ పార్టీపై ప్రధాని మోదీ ధ్వజం
వైఫల్యాల్ని కప్పిపుచ్చేందుకే గతం తవ్వుతున్నారు
మాట్లాడేదానికి భిన్నంగా వ్యవహరిస్తుంటారు
ఎప్పుడూ ఏకాభిప్రాయం తీసుకోలేదు
తిప్పికొట్టిన ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే

వెంకయ్య ఇంటికి మోదీ

పలు అంశాలపై ఇద్దరు నేతల చర్చలు
దేశ ప్రగతిపై వెంకయ్య వివేకం భేష్: ప్రధాని

న్యూఢిల్లీ, జూన్ 25: దేశంలో ఎమర్జెన్సీ విధించినవారికి రాజ్యాంగంపై ప్రేమ ఉందని ప్రకటించే హక్కు లేదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. కాంగ్రెస్‌కు ఇప్పటికీ ఆ మైండ్ సెట్ పోలేదని ధ్వజమెత్తారు. 1975లో సరిగ్గా ఇదే రోజు ఇందిరాగాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అత్యవసర పరిస్థితి విధించిందని ఆయన మంగళవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఆ చీకటి రోజుల్లో దేశాన్నే జైలుగా మార్చారని.. రాజ్యాంగాన్ని అణచివేశారని.. ప్రాథమిక స్వేచ్ఛ లేకుండా చేశారని గుర్తుచేశారు. ఎన్నికైన ప్రభుత్వాలను రద్దు చేసే 356 అధికరణను ఎడాపెడా ప్రయోగించారని.. పత్రికాస్వేచ్ఛను

మిగతా 2వ పేజీలో...

తమిళ ఎంపీ గోపీనాథ్ తెలుగులో ప్రమాణ స్వీకారం

2



రాజ్యాంగంతో రాహుల్ ప్రమాణం

లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్‌గాంధీ
ప్రొటెం స్పీకర్‌కు సోనియా లేఖ.. ఆమోదం
పదేళ్ల తర్వాత.. లోక్‌సభలో ప్రతిపక్ష నేత
16 రోజుల యోచన తర్వాత రాహుల్ ఓకే



'ఎమర్జెన్సీ' మైండ్‌సెట్ ఇంకా పోలేదు



(మొదటి పేజీ తరువాయి)

నాశనం చేయడానికి బిల్లు తెచ్చారని.. సమాఖ్య విధానాన్ని నాశనం చేశారని.. రాజ్యాంగాన్ని ప్రతి దశలో ఉల్లంఘించారని దుయ్యబట్టారు. కాగా, ఓ కుటుంబాన్ని అధికారంలో ఉంచడం కోసం కాంగ్రెస్ చాలా సార్లు రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసిందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ధ్వజమెత్తారు. కాంగ్రెస్ మైండ్‌సెట్‌లో ప్రజాస్వామ్యానికి తావే ఉండదని బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా అన్నారు. లోక్‌సభ స్పీకర్ ఎన్నిక విషయంలో విపక్షాలు కపటంతో, రెండు నాల్కల ధోరణితో వ్యవహరిస్తున్నాయని ధ్వజమెత్తారు. కాగా, ప్రధాని మోదీ తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే గతాన్ని తవ్వితీస్తుంటారని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. నిజానికి గత పదేళ్లుగా ఆయన అప్రకటిత ఎమర్జెన్సీని అమలుచేస్తున్నారని 'ఎక్స్'లో ఆరోపించారు. ఆయన తరచూ ఏకాభిప్రాయం, సహకారం గురించి మాట్లాడతారని... తద్విరుద్ధంగా వ్యవహరిస్తుంటారని విమర్శించారు. 'పార్టీలను చీల్చడం.. ఎన్నికైన ప్రభుత్వాలను దొడ్డిదోవన పడగొట్టడం, 95 శాతం మంది ప్రతిపక్ష నాయకులపైకి ఈడీ, సీబీఐ, ఐటీ వంటి సంస్థలను ఉసిగొల్పడం.. సీఎంలను జైల్లో పెట్టడం.. ఇవన్నీ అప్రకటిత ఎమర్జెన్సీ కాదా?' అని ప్రశ్నించారు.

వెంకయ్య ఇంటికి మోదీ

న్యూఢిల్లీ, జూన్ 25(ఆంధ్రజ్యోతి): మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడితో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. మంగళవారం ఢిల్లీలోని త్యాగరాజ్ మార్గ్‌లో వెంకయ్య నాయుడి నివాసానికి వెళ్లిన ఆయన కొద్దిసేపు అక్కడే గడిపారు. మోదీకి వెంకయ్య పుష్పగుచ్ఛం అందించి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దేశ ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాలపై ఇరువురూ తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ విషయాన్ని 'ఎక్స్' వేదికగా మోదీ, వెంకయ్యలు వెల్లడించారు. భారతదేశ పురోగతి పట్ల ఆయన వివేకం, అభిరుచి ఎప్పుడూ ప్రశంసనీయమేనని కొనియాడారు.

కేజ్రీవాల్ బెయిలుపై స్టే

న్యూఢిల్లీ, జూన్ 25: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు రౌస్ అవెన్యూ కోర్టు మంజూరు చేసిన బెయిలుపై ఢిల్లీ హైకోర్టు స్టే విధించింది. మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన కేజ్రీవాల్ తిహాడ్ జైల్లో ఉన్నారు. ట్రయల్ కోర్టు ఈ నెల 20న కేజ్రీవాల్‌కు సాధారణ బెయిలు మంజూరు చేసింది. దీన్ని సవాలు చేస్తూ ఈడీ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ట్రయల్ కోర్టు ఏకపక్షంగా వ్యవహరించిందని, తమకు వాదనలు వినిపించడానికి తగిన సమయం కూడా ఇవ్వలేదని తెలిపింది. కేజ్రీవాల్‌కు మంజూరు చేసిన బెయిల్‌పై స్టే ఇవ్వాలని కోరింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ సుధీర్‌కుమార్ జైన్ నేతృత్వంలోని వెకేషన్ బెంచ్ మంగళవారం విచారణ జరిపింది. కేజ్రీవాల్‌కు బెయిలు మంజూరు చేసే విషయంలో ట్రయల్ కోర్టు కనీస ఆలోచన చేయలేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈడీ సమర్పించిన పత్రాలను జడ్జి సరిగా పరిశీలించలేదని, దర్యాప్తు సంస్థ లేవనెత్తిన అభ్యంతరాలనూ పట్టించుకోలేదని పేర్కొంది. బెయిలు పిటిషన్‌పై వాదనలు వినిపించేందుకు ఈడీకి సరైన అవకాశం కల్పించలేదని న్యాయమూర్తి జస్టిస్ జైన్ పేర్కొన్నారు. కాగా, తన బెయిలు విషయమై కేజ్రీవాల్ ఇప్పటికే దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరగనుంది. మరోవైపు, తిహాడ్ జైల్లో ఉన్న కేజ్రీవాల్‌ను సీబీఐ మంగళవారం అరెస్టు చేసింది. బుధవారం ఆయన్ను ట్రయల్ కోర్టులో ప్రవేశపెట్టనున్నారు. ఈడీ కేసులో బెయిల్ పిటిషన్‌పై సుప్రీంలో విచారణ జరగడానికి ఒకరోజు ముందు కేజ్రీవాల్‌ను సీబీఐ అరెస్టు చేయడం గమనార్హం. ఇదిలా ఉండగా, బెయిలు పిటిషన్లపై అనవసరంగా వాయిదాలు వేయొద్దని సుప్రీం సూచించింది.

స్పీకర్ పదవికి ఎన్నిక!

లోక్‌సభ చరిత్రలో ఇది నాలుగోసారి.. ఎన్డీఏ నుంచి మరోసారి బరిలో ఓం బిర్లా

- ఇండియా నుంచి కేరళ ఎంపీ సురేశ్
- కేంద్ర మంత్రుల రాయబారం విఫలం
- నేడు ఓటింగ్.. పేపర్ స్లిప్పుల ద్వారానే



ఓం బిర్లా నామినేషన్ పత్రాలను సమర్పిస్తున్న ఎన్డీయే నేతలు

న్యూఢిల్లీ, జూన్ 25: చర్చలు.. సంప్రదింపులు విఫలం కావడం.. అధికార, ప్రతిపక్ష కూటములు పట్టు విడవకపోవడంతో.. స్వతంత్ర భారత చరిత్రలో నాలుగోసారి.. దాదాపు యాభై ఏళ్ల అనంతరం మొదటిసారి లోక్‌సభ స్పీకర్ పదవికి పోటీ జరగనుంది. గడువు మరికొద్ది సేపట్లో ముగుస్తుందనగా మంగళవారం ఇరు పక్షాల అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. బీజేపీ ఎంపీ, గత లోక్‌సభ స్పీకర్ ఓంప్రకాశ్ బిర్లాను ఎన్డీఏ మరోసారి బరిలో దించగా, కేరళకు చెందిన కాంగ్రెస్ ఎంపీ సురేశ్ కొడికున్నిల్‌ను ఇండియా కూటమి పోటీకి నిలిపింది. బుధవారం ఉదయం 11 గంటలకు స్పీకర్ ఎన్నిక జరగనుంది. ఈ పరిస్థితిని తప్పించేందుకు ఇండియా కూటమి నేతలు కేసీ వేణుగోపాల్ (కాంగ్రెస్), టీఆర్ బాలు (డీఎంకే)తో కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా చర్చలు జరిపారు. బిర్లా అభ్యర్థిత్వానికి మద్దతు ఇస్తామని, ప్రతిగా తమకు డిప్యూటీ స్పీకర్ ఇవ్వాలంటూ విపక్షం షరతు విధించింది. అధికార పక్షం ససేమిరా అనడంతో సంప్రదింపులు విఫలమయ్యాయి. అనంతరం బయటకువచ్చిన కేసీ వేణుగోపాల్.. డిప్యూటీ స్పీకర్ పదవిని ప్రతిపక్షానికి ఇచ్చే ఆనవాయితీని అధికార పక్షం పాటించనందున స్పీకర్ పదవికి తమ అభ్యర్థిని నిలుపుతున్నట్లు ప్రకటించారు. ఓటింగ్ అనివార్యమైన రీత్యా.. స్పీకర్ ఎన్నికకు ఎంపీలకు పేపర్ స్లిప్‌లను పంపిణీ చేయనున్నారు. కొత్త పార్లమెంటు భవనంలో ఎలక్ట్రానిక్ వ్యవస్థ ఇంకా అందుబాటులోకి రాకపోవడం, సభ్యులకు సీట్ల కేటాయింపు కొనసాగుతుండడమే దీనికి కారణం. కాగా, ఉదయం 11.50 వరకు ఎన్డీఏ ప్రతిస్పందన కోసం ఎదురుచూసి నామినేషన్ దాఖలు చేశామని సురేశ్ తెలిపారు. స్పీకర్ ఎన్నికలో అనుసరించాల్సి వ్యూహంపై ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల నేతలు మంగళవారం రాత్రి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే నివాసంలో సమావేశమై చర్చించారు.

బలం బిర్లా వైపే..!

లోక్‌సభలో ప్రస్తుతం సభ్యుల సంఖ్య 542. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ వయనాడ్‌కు రాజీనామా చేయడంతో ఒక స్థానం ఖాళీగా ఉంది. ఎన్డీఏకు 293 మంది, ఇండియాకు 233 మంది సభ్యుల బలం ఉంది. మరో ముగ్గురు స్వతంత్రులు సైతం విపక్షానికి మద్దతిస్తున్నారు. ఈ ప్రకారం చూస్తే స్పీకర్‌గా ఓం బిర్లా గెలుపు లాంఛనమే. రాజస్థాన్‌లోని కోటా స్థానం నుంచి ఈయన మూడుసార్లు గెలిచారు. మరోవైపు దళిత నేత అయిన సురేశ్ కేరళలోని మవేలీకర నుంచి 8 సార్లు విజయం సాధించారు. కాగా, సురేశ్‌ను ఇండియా అభ్యర్థిగా నిలిపే అంశంపై తమను కలువుకొని పోలేదని టీఎంసీ మొదట అసంతృప్తి వ్యక్తం చేసింది. అయితే గాంధీ టీఎంసీ అధినేత్రి మమతతో మాట్లాడడంతో ఖర్గే నివాసంలో మంగళవారం రాత్రి నిర్వహించిన సమావేశానికి ఆ పార్టీ లోక్‌సభా పక్ష నేత కూడా హాజరయ్యారు.

మోదీ.. ఇదేనా నిర్మాణాత్మకం:రాహుల్

ఆనవాయితీ ప్రకారం డిప్యూటీ స్పీకర్ పదవి ప్రతిపక్షానికి దక్కాలని తాము చెప్పామని, అందుకు అంగీకరిస్తే స్పీకర్ పదవి ఏకగ్రీవం అయ్యేందుకు సహకరిస్తామని ప్రతిపాదించామని రాహుల్ గాంధీ చెప్పారు. దీనికి ప్రధాని మోదీ అంగీకరించలేదని ఆరోపించారు. ప్రతిపక్షాలు నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని పిలుపునిచ్చి.. ఆయనే నిర్మాణాత్మకంగా వ్యవహరించలేదన్నారు. అయితే డిప్యూటీ స్పీకర్ పదవిని ప్రతిపక్షాలకే ఇవ్వాలన్న నిబంధన ఎక్కడా లేదని కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ తెలిపారు. ఎన్డీఏ మిత్రపక్షాలకు ఈ పదవిని కేటాయించాలని బీజేపీ భావిస్తున్నట్లు సమాచారం.

1952, 1967, 1976 తర్వాత..

తొలి లోక్‌సభ ఏర్పడిన 1952లో స్పీకర్ పదవికి ఎన్నిక జరిగింది. నాడు శంకర్ శాంతారామ్ మోరేపై జీవీ మావలంకర్ గెలుపొందారు. తర్వాత రెండోసారి 1967లో ఎన్నిక అనివార్యమైంది. కాంగ్రెస్‌కు చెందిన నీలం సంజీవరెడ్డి... ప్రతిపక్షం మద్దతిచ్చిన స్వతంత్ర ఎంపీ తెన్నేటి విశ్వనాథంపై గెలిచారు. దేశంలో ఎమర్జెన్సీ అమల్లో ఉండగా 1976లో స్పీకర్ పదవికి మూడోసారి ఎన్నిక జరిగింది. అప్పట్లో జగన్నాథ్‌రావుపై బలిరామ్ భగత్ విజయం సాధించారు.

లోకం తీరు



తమిళ ఎంపీ గోపీనాథ్ తెలుగులో ప్రమాణ స్వీకారం



చెన్నై, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కృష్ణగిరి ఎంపీ కె.గోపీనాథ్ మంగళవారం పార్లమెంటులో తెలుగులో ప్రమాణ స్వీకారం చేయడం అందరినీ ఆకట్టుకుంది. కాంగ్రెస్ సీనియర్ నేత గోపీనాథ్ తెలుగు కుటుంబానికి చెందిన వారు. కృష్ణగిరి జిల్లా హోసూరుకు చెందిన ఆయన విద్యాభ్యాసం తెలుగు మాధ్యమంలోనే కొనసాగింది. 2001, 2006, 2011లో హోసూరు నియోజకవర్గం నుంచి గోపీనాథ్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. తమిళనాడులో నెలకొన్న తెలుగు భాషా సమస్యల కోసం, తెలుగు వారి కోసం పోరాడే యోధుడిగా ఆయనకు మంచి పేరుంది. తమిళనాడు అసెంబ్లీలోనూ ఆయన పలుమార్లు తెలుగులోనే ప్రసంగించారు. మాతృభాష పట్ల ఎనలేని మమకారమున్న గోపీనాథ్.. పార్లమెంటులో కూడా తెలుగులోనే ప్రమాణస్వీకారం చేయడంతో పలువురు తమిళ ఎంపీలు హర్షధ్వానాలతో ఆయన్ని అభినందించారు.

లోక్‌సభలో విపక్ష నేతగా రాహుల్

న్యూఢిల్లీ, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభలో విపక్ష నేతగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నియమితులయ్యారు. దశాబ్ద కాలం తర్వాత మళ్లీ లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా దక్కింది. మోదీని దీటుగా ఎదుర్కొనేది రాహుల్ ఒక్కడేననే అభిప్రాయంతో ఈ నెల 9న జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) సమావేశం కూడా విపక్ష నేత విషయంలో ఏకగ్రీవంగా తీర్మానించిన విషయం తెలిసిందే.! అయితే.. రాహుల్ మాత్రం తాను ఇంకా ఆలోచించుకోవాల్సి ఉందని అప్పట్లో వ్యాఖ్యానించారు. అయితే, మంగళవారం రాత్రి జరిగిన విపక్ష పార్టీల భేటీలో ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉండేందుకు రాహుల్ తన ఆమోదాన్ని ప్రకటించారు. దాంతో.. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ(సీపీపీ) ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ ప్రొటెం స్పీకర్ భర్తృహరికి రాహుల్‌ను తమ పార్టీ తరఫున ప్రధాన ప్రతిపక్ష నేతగా పేర్కొంటూ లేఖ రాశారు.

రాజ్యాంగ ప్రతితో ప్రమాణం

పార్లమెంటులో రెండో రోజు సభ్యుల ప్రమాణ స్వీకారాల సందర్భంగా పలు ఆసక్తికర అంశాలు చోటుచేసుకున్నాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నుంచి సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ దాకా విపక్ష నేతలు మంగళవారం రాజ్యాంగ ప్రతులను చేతబట్టి ఎంపీలుగా ప్రమాణం చేశారు. ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్.. సభ్యులతో ప్రమాణం చేయించారు. రాహుల్‌గాంధీ పేరు పిలవగానే కాంగ్రెస్ సభ్యులు భారత్ జోడో అంటూ నినాదాలు చేశారు. ఆయన రాజ్యాంగ ప్రతిని చేతబట్టి ఇంగ్లిష్‌లో ప్రమాణం చేశారు. కాగా, ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ ఎంపీ ఛత్రపాల్ సింగ్(బీజేపీ) ప్రమాణం స్వీకారం అనంతరం 'జై హిందూ రాష్ట్ర.. జై భారత్' అంటూ నినాదం చేశారు. దీనిపై విపక్ష సభ్యులు అభ్యంతరం తెలిపారు. దీంతో రికార్డులో ఆ నినాదాన్ని తొలగిస్తామని ప్రొటెం స్పీకర్ ప్రకటించారు. ఇక గజియాబాద్ ఎంపీ అతుల్‌గార్గ్ (బీజేపీ) ప్రమాణ స్వీకారం తర్వాత 'నరేంద్రమోదీ జిందాబాద్' అంటూ నినదించారు.

సుప్రీంకోర్టుకే ద్వివేది మస్కా

(మొదటి పేజీ తరువాయి)

మస్కాకొట్టారు. అదీ ఇసుక అక్రమ తవ్వకాల కేసులోనే! ఇది మామూలు సాహసం కాదు. జగన్‌పై ఎంత నమ్మకం, అభిమానం, ఇంకా అంతకు మించినదేదో ఉంటే తప్ప ఇలాంటి దుస్సాహసాలు బ్యూరోక్రాట్లు చేయబోరని ప్రభుత్వ వర్గాలే అంటున్నాయి. అసలేం జరిగిందంటే.. ఇసుక అక్రమ తవ్వకాలకు సంబంధించి జేపీ వెంచర్స్ వర్సెస్ నాగేంద్రకుమార్ మధ్య సుప్రీంకోర్టులో కేసు నడుస్తోంది. రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయని, పర్యావరణ, గనుల అనుమతులు లేకుండా జీసీకేసీ, ప్రతిమ ఇన్‌ఫ్రా వంటి సంస్థలు అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నాయని గుంటూరుకు చెందిన నాగేంద్ర కుమార్ ఏప్రిల్ 29న జరిగిన విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో తక్షణమే ఇసుక అక్రమ తవ్వకాలు నిలిపివేయాలని సుప్రీం కోర్టు అదే రోజు ఆదేశించింది. అక్రమ తవ్వకాలను కనిపెట్టేందుకు కలెక్టర్లు, గనుల అధికారులను ఫీల్డ్‌కు పంపి క్షేత్రస్థాయి నివేదికలు ఇవ్వాలని కోర్టు ఆదేశించింది.

కోర్టు కళ్లు కప్పే ప్రయత్నం

సుప్రీంకోర్టులో ఈ కేసు మే 10న మరోసారి విచారణకు వచ్చింది. అప్పటికీ అక్రమ తవ్వకాలు నిలిచిపోలేదు. మరోవైపు అక్రమ తవ్వకాలు జరగడం లేదని గనులశాఖ అఫిడవిట్ వేసింది. అది సరిగ్గా లేదని కోర్టు అభిప్రాయపడింది. మరోవైపు, అక్రమ తవ్వకాలు జరిగిపోతున్నాయని నాగేంద్రకుమార్ మరోసారి ఆధారాలు సమర్పించారు. వాటిని పరిశీలించిన సుప్రీంకోర్టు... రాష్ట్ర సర్కారుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ధిక్కార చర్యలు ఎందుకు తీసుకోరాదని హెచ్చరించింది. తక్షణమే అక్రమ తవ్వకాలు నిలిపివేయాలని ఆదేశించింది. జిల్లా కలెక్టర్లు, పోలీసులు, గనుల శాఖ అధికారులతో కమిటీలు ఏర్పాటుచేసి రీచ్‌లను తనిఖీలు చేసి వాస్తవిక నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. అక్రమ తవ్వకందారులపై, అక్రమాలకు కొమ్ము కాస్తున్నవారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఆదేశించింది. ఆ తర్వాత కలెక్టర్లు క్షేత్రస్థాయిలో తనిఖీలు జరిపి అక్రమ తవ్వకాల ఆనవాళ్లే లేవని నివేదికలు పంపించారు. అయితే, సుప్రీం రెండుసార్లు (ఏప్రిల్ 29, మే 10న) ఆదేశించినా అక్రమ తవ్వకాలను అడ్డుకునేందుకు సర్కారు చర్యలు తీసుకోలేదని నాగేంద్రకుమార్ మే 15న సుప్రీం కోర్టుకు తిరుగులేని ఆధారాలు సమర్పించారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలో 16 రీచ్‌ల్లో భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేస్తున్న ఫొటోలను కోర్టుకు నివేదించారు. ఆ ఫొటోల్లోని రీచ్‌లకు అక్షాంశ, రేఖాంశాలను జత చేశారు. జియోట్యాగింగ్ చేశారు. ప్రతిమ ఇన్‌ఫ్రా, జీసీకేసీ అక్రమ తవ్వకాలు చేస్తున్నాయని చెప్పడానికి అవి తిరుగులేని ఆధారాలు. వీటిని పరిగణనలోకి తీసుకున్న సుప్రీం కోర్టు 16న రాష్ట్రానికి ఈమెయిల్ ద్వారా నోటీసు ఇచ్చింది. "రాష్ట్రంలో అక్రమ ఇసుక తవ్వకాలే జరగడం లేదని పదే పదే ప్రభుత్వం చెబుతోంది. ఈ ఆధారాల్లోని రీచ్‌లు, తవ్వకాలు ఎలా జరుగుతున్నాయి? ఈ ఫొటోలను చూసి మీరెలా స్పందిస్తారు? అని ప్రశ్నించింది.

టాలెంట్ వాడిన ద్వివేది

ప్రభుత్వ సర్వీసులో గోపాలకృష్ణ ద్వివేది తల పండిపోయారు. ఏ సమస్య వస్తే ఎలా పరిష్కరించాలో తెలిసిన వ్యక్తికి ఏ సమస్య నుంచి ఎలా తప్పించుకోవచ్చో కూడా తెలిసే ఉంటుంది. దాన్నే ఇసుక అక్రమాల విషయంలో ద్వివేది ప్రయోగించారు. మే 16న సుప్రీంకోర్టు రాష్ట్రానికి ఈమెయిల్ ద్వారా నోటీసులు ఇవ్వడంతో ద్వివేది హడావుడిగా ఆ రెండు జిల్లాల్లోని ఏడుగురు అధికారులకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. అదెప్పుడో తెలుసా? 15వ తేదీనే. అంటే, కోర్టు నోటీసు అందుకోవడానికి ఒకరోజు ముందే నోటీసులు ఇచ్చినట్లుగా మంత్రాంగం నడిపారు. వాటిని 16న ఆ ఏడుగురు అధికారులకు వాట్సాప్ ద్వారా పంపించారు. కోర్టు నోటీసులు ఇవ్వకముందే తాము ఆ రెండు ఉమ్మడి జిల్లాల అధికారులపై చర్యలు తీసుకున్నామని మే 19న సర్కారు సుప్రీంకు ఆఫిడవిట్ సమర్పించింది. అందులో మే 15న కృష్ణా, గుంటూరు జిల్లాల గనుల అధికారులకు ఇచ్చిన షోకాజ్‌నోటీసులను జత చేశారు. ఇదీ ద్వివేది మైండ్ గేమ్. కానీ, ఆయా జిల్లాల్లో ఇసుక అక్రమ తవ్వకాలే జరగడం లేదని, అంతకు ముందే కలెక్టర్‌లతో ఇప్పించిన నివేదికలు, కోర్టు పరిశీలనలోనే ఉన్నాయన్న విషయం మరచిన సర్కారు కోర్టుకు పక్కాగా దొరికిపోనుంది. సాధారణంగా గనుల శాఖ అధికారులకు ఆ శాఖ డైరెక్టర్‌తోనే నోటీసులు ఇప్పించాలి. కానీ, సుప్రీంకోర్టు నుంచి సీరియస్ నోటీసులు రావడంతో, ద్వివేదినే ఏడుగురు అధికారులకు నోటీసులు ఇచ్చారు. ఇది జరిగి ఇప్పటికే 39 రోజులవుతోంది. ఏ ఒక్కరిపైనా చర్యలు తీసుకోలేదు. ఆ తర్వాత తేలిందేమంటే, అవి ఉత్తుత్తి నోటీసులని! అదెలాగంటారా?..నోటీసులు అందుకున్న వారిలో ఐదుగురు ప్రభుత్వానికి బాగా కావాల్సిన మనుషులే. కాబట్టి వారిని కాపాడి తీరాల్సిందే అనుకున్నారు. అంతే, మే 15 తర్వాత వారిపై ఏ చర్యలు లేవు. దీంతో ఆ నోటీసులు ఉత్తుత్తివే అని తేలిపోయింది.

నాకు విపక్ష నేత హోదా ఇవ్వాల్సిందే!



- బెదిరించే ధోరణిలో జగన్ లేఖ

అమరావతి, జూన్ 25(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో తనకు ప్రతిపక్ష నేత హోదా కల్పించాలని మాజీ సీఎం, వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి స్పీకర్ అయ్యన్న పాత్రుడికి లేఖ రాశారు. లేదంటే సభకు వచ్చి ఉపయోగం ఉండదని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటీవలి ఎన్నికల్లో వైసీపీకి అసెంబ్లీలో 11 స్థానాలే దక్కాయి. సభలో ఆ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా, జగన్‌కు ప్రతిపక్ష నేత హోదా లభించాలంటే కనీసం పది శాతం సీట్లలో అంటే.. 18 స్థానాల్లో విజయం సాధించాలి. కానీ ఏడు స్థానాలు తగ్గాయి. దీంతో స్పీకర్ ఆయన్ను సభలో వైసీపీ శాసనసభాపక్ష నేతగా గుర్తిస్తారు తప్ప.. ప్రతిపక్ష నేతగా గుర్తించే వీలు లేకుండా పోయింది. అయినా సరే.. తనకు విపక్ష నేత హోదా ఇవ్వాల్సిందేనని.. లేదంటే అసెంబ్లీకి రానన్నట్లుగా బెదిరించే ధోరణిలో జగన్ స్పీకర్‌కు లేఖ రాశారు. కొత్త అసెంబ్లీ సమావేశాల తొలిరోజు మాజీ ముఖ్యమంత్రి నైన తనను సీఎం చంద్రబాబు తర్వాత కాకుండా మంత్రుల తర్వాత ఎమ్మెల్యేగా ప్రమాణం చేయించడం అసెంబ్లీ పద్ధతులకు విరుద్ధమని తెలిపారు. తద్వారా తనకు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వకూడదని ముందుగానే నిర్ణయించుకున్నట్లు ఉన్నారని అన్నారు. విపక్షంలో ఎవరికి ఎక్కువ సీట్లు ఉంటే వారికి ప్రతిపక్ష హోదా ఇవ్వాలని చట్టంలో నిర్వచించారని.. ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటే పది శాతం సీట్లు ఉండాలని చట్టంలో ఎక్కడా లేదని.. పార్లమెంటులో గానీ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గానీ ఈ నిబంధన పాటించలేదని అన్నారు. "1984లో లోక్‌సభలో టీడీపీకి చెందిన పర్వతనేని ఉపేంద్రకు ప్రతిపక్ష నేత హోదా ఇచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో 1994లో 294 స్థానాలకు కాంగ్రెస్ 26 సీట్లలో గెలిచింది. నాడు కాంగ్రెస్ నేత పి.జనార్దన్‌రెడ్డికి ప్రతిపక్ష నేత హోదా ఇచ్చారు" అని జగన్ పేర్కొన్నారు.

శత్రుత్వం ప్రదర్శిస్తున్నారు..: అధికార కూటమి, స్పీకర్ తనపై శత్రుత్వం ప్రదర్శిస్తున్నారని జగన్ ఆరోపించారు. అసెంబ్లీలో గొంతు విప్పే పరిస్థితులు కనిపించడం లేదని తెలిపారు. "ఎన్నికల్లో వైసీపీ 40% ఓట్లు సాధించింది. సభలో ప్రజల సమస్యలను ప్రస్తావించాల్సిన బాధ్యత నాపై ఉంది. నాపై పాలక కూటమి నేతలు, స్పీకర్ బహిరంగంగానే శత్రుత్వం ప్రదర్శించారు. ఈ పరిస్థితుల్లో ప్రతిపక్ష హోదా లేకుండా కేవలం 11 మంది సభ్యుల పార్టీగా చూస్తే సభా కార్యకలాపాల్లో పాల్గొనడం వల్ల ఉపయోగమేంటి? ఈ అంశాన్ని నా దృష్టికోణంలో అర్థం చేసుకుని త్వరగా స్పందించాలి" అని జగన్ స్పీకర్‌ను కోరారు.

అసత్యాలు.. అర్ధసత్యాలే...

స్పీకర్‌కు రాసిన లేఖలో అనేక అసత్యాలు, అర్ధసత్యాలు ఉండటం గమనార్హం. జగన్ తన లేఖలో పేర్కొన్నట్లుగా... పర్వతనేని ఉపేంద్ర 1984లో లోక్‌సభ సభ్యుడు కాదు. ఆ ఏడాది ఏప్రిల్లో ఆయన రాజ్యసభకు మొదటిసారి ఎన్నికయ్యారు. అలాగే 1994లో ఉమ్మడి ఏపీ అసెంబ్లీలో పి.జనార్దన్‌రెడ్డిని ప్రధాన ప్రతిపక్ష నేతగా స్పీకర్ గుర్తించలేదు. కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) నేతగా మాత్రమే గుర్తించారు. అప్పట్లో ఆయన చేత అసెంబ్లీలో అక్షర క్రమంలో అందరు ఎమ్మెల్యేలతో సమానంగానే ప్రమాణ స్వీకారం చేయించారు. ఇప్పుడు జగన్‌తో కూడా అలాగే చేయించవచ్చు. కానీ... ఆయనకు ప్రత్యేక గౌరవం ఇస్తూ ముఖ్యమంత్రి, మంత్రుల తర్వాత ప్రమాణ స్వీకారం చేయించారు. దీనిని కూడా జగన్ జీర్ణించుకోలేకపోవడంపై విశ్లేషకులు విస్తుపోతున్నారు. సభకు రాకుండా తప్పించుకోవడానికి ముందుగానే ఆయన సాకులు వెతుక్కుంటున్నారని అభిప్రాయపడుతున్నాయి.

లోక్‌సభలో ఆ సంప్రదాయం లేదు..

లోక్‌సభలో అధికార పక్షం కాకుండా.. అధిక సభ్యులు కలిగిన రాజకీయ పార్టీ నేతకు ప్రతిపక్ష హోదా ఇచ్చే సంప్రదాయం లేదు. ప్రతిపక్ష నాయకుడి హోదాపై చట్టం చేసిన 1977లోనే ఐదో లోక్‌సభకు అధికారికంగా ప్రతిపక్ష నేతను ప్రకటించలేదు. ఇందిరాగాంధీ హయాంలో 1970 డిసెంబరు 27 నుంచి 1977 జూన్ 30 దాకా ప్రతిపక్ష నేత పదవి ఎవరికీ దక్కలేదు. మళ్లీ ఆమె ప్రధాని అయ్యాక 1980-84 మధ్య కూడా ఎవరికీ విపక్ష నేత హోదా లేదు. 1984-89 నడుమ రాజీవ్‌గాంధీ హయాంలోనూ అధికారికంగా ప్రతిపక్ష నేత ఎవరూ లేరు. దీనికి కారణం.. సభలో ఉన్న మొత్తం స్థానాల్లో 10శాతం ఎవరికీ రాకపోవడమే. 2014, 19ల్లో మోదీ హయాంలో కాంగ్రెస్‌కు వరుసగా 44, 52 సీట్లే వచ్చాయి. అధిక సంఖ్యా బలం ఉన్నప్పటికీ ఈ పదేళ్లూ దానికి విపక్ష హోదా లభించలేదు. కాగా, స్పీకర్‌కు జగన్ రాసిన లేఖను పరిశీలిస్తే ఆయన తీరు ప్రజాతీర్పును కించపరిచినట్లుగానే ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. 2019-24 మధ్యకాలంలో జగన్ తాను గేట్లు తెరిస్తే 23మంది సభ్యులున్న టీడీపీ నుంచి వైసీపీలోకి ఎందరొస్తారో చెప్పలేనని.. టీడీపీకి ప్రతిపక్ష హోదా కూడా ఉండదని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. అంటే ప్రతిపక్ష హోదా దక్కాలంటే కనీసం 18మంది సభ్యులు ఉండాలని తానే చెప్పారు. ఇప్పుడేమో 11మంది ఎమ్మెల్యేలే ఉన్నా తనకు ప్రతిపక్ష హోదా ఇవ్వాలని బెదిరింపులకు దిగుతున్నారు. చట్టసభలు విలువలు, సంప్రదాయాలపై ఆధారపడి నడుస్తాయన్న విషయాన్ని జగన్ గ్రహించడం లేదని రాజకీయ వర్గాలు విమర్శిస్తున్నాయి.

ఆర్నెల్లలో స్వర్ణకార కార్పొరేషన్: లోకేశ్



దివ్యాంగుల సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి నారా లోకేశ్

మంగళగిరి, జూన్ 25: స్వర్ణకార వృత్తిదారులను ఆదుకునేందుకు ఆరు నెలల్లో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని తన నివాసంలో మంగళవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ప్రజలు తమ సమస్యలను మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని మంగళగిరికి చెందిన లక్ష్మీ నరసింహ గోల్డ్ స్మిత్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు మంత్రి లోకేశ్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటుకు సంబంధించిన విధివిధానాలు, స్వర్ణకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసి వివరాలు అందజేయాలని సూచించారు. ఉండవల్లి పంచాయతీలో మహిళా పారిశుధ్య కార్మికులపై లైంగిక వేధిపులతోపాటు ఉద్యోగులను అనేక రకాలుగా ఇబ్బంది పెడుతున్న సూపర్‌వైజర్ పిల్లి చిరంజీవి, మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి రైట్‌హ్యాండ్‌గా పేరుగాంచిన డి.రాంబాబును విధుల నుంచి తొలగించాలని మహిళా కార్మికులు లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు.

ఎమ్మెల్సీ ఉపఎన్నికలకు నోటిఫికేషన్

అమరావతి, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని శాసన మండలిలో ఖాళీ అయినా రెండు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాల ఉప ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎమ్మెల్సీ ఉపఎన్నికల నామినేషన్ల దాఖలుకు జూలై 2వ తేదీని తుది గడువుగా పేర్కొన్నారు. జూలై 3న నామినేషన్ల పరిశీలన, జూలై 5న నామినేషన్ల ఉప సంహరణకు తుది గడువుగా నిర్ణయించారు. జూలై 12వ తేదీన పోలింగ్, అదే రోజు ఫలితాలు వెలువడనున్నాయి.

కోస్తాకు వర్ష సూచన

విశాఖపట్నం, అమరావతి, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. మరోవైపు కేరళ, మహారాష్ట్ర వరకూ ద్రోణి విస్తరించింది. ఈ రెండింటి ప్రభావంతో నైరుతి రుతుపవనాలు చురుగ్గా మారాయి. ఉత్తర కోస్తాలో అనేకచోట్ల మంగళవారం మధ్యాహ్నం నుంచి వర్షాలు కురిశాయి. అక్కడక్కడా భారీవర్షాలు పడ్డాయి. అయితే, దక్షిణకోస్తాలో మాత్రం ఎండ తీవ్రత కొనసాగింది. అనేకచోట్ల సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బాపట్లలో గరిష్ఠంగా 39.3 డిగ్రీలు నమోదైంది. కాగా, బుధ, గురువారాల్లో కోస్తాలో అనేకచోట్ల, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని, ఉత్తరకోస్తాలో అక్కడక్కడ భారీవర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది.

శరణు... శరణు!

(మొదటి పేజీ తరువాయి)

తెలిసిందే. ఆయనపై అరెస్టు కత్తి వేలాడుతూనే ఉంది. ఈ నేపథ్యంలో... ఏపీలో విపక్షంలో ఉన్నప్పుడూ, అధికారంలో ఉన్నప్పుడు బీజేపీతో పూర్తిస్థాయి సఖ్యత ప్రదర్శిస్తున్నారు. పైకి 'అంశాల వారీగా మద్దతు' అని చెబుతూనే.. బీజేపీ అడగకముందే మద్దతు ప్రకటిస్తూ వచ్చారు. ఇప్పుడు ఆయనపై కేసులు పాతవే అయినప్పటికీ.. పరిస్థితులు పూర్తిగా కొత్తవి! రాష్ట్రంలో జగన్ అధికారం కోల్పోయారు. వైసీపీ స్థాయిని ప్రజలు 11 అసెంబ్లీ స్థానాలకు కుదించారు. 4 లోక్‌సభ స్థానాలు మాత్రమే కట్టబెట్టారు. రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఘనవిజయం సాధించడమే కాకుండా... కేంద్ర ప్రభుత్వానికి టీడీపీ ఎంపీల మద్దతు అత్యంత కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో చంద్రబాబుకు జాతీయ స్థాయిలో ప్రాధాన్యం పెరిగింది. ఇవన్నీ జగన్ ఊహించని, అస్సలు కోరుకోని పరిణామాలు. తాను సీఎంగా ఉండగా... చంద్రబాబును స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఇరికించి, అరెస్టు చేసి... 53 రోజులు జైలులో పెట్టారు. అచ్చెన్నాయుడు నుంచి ధూళిపాళ్ల నరేంద్ర వరకు అనేకమంది టీడీపీ నేతలను రకరకాల కేసుల్లో అరెస్టు చేయించారు. "నేను ఇంత చేసినప్పుడు.. నన్ను ఏమీ చేయకుండా ఉంటారా?" అనే భయం జగన్‌కు పట్టుకున్నట్లుంది. పైగా... జగన్ హయాంలో జరిగిన మద్యం, ఇసుక, గనుల కుంభకోణాల లెక్కలను కొత్త ప్రభుత్వం బయటికి లాగుతోంది. ఈ కేసుల్లో జగన్‌ను పూర్తి ఆధారాలతో అరెస్టు చేయడం పెద్ద కష్టమేమీ కాదు. అటు సీబీఐ కేసులకు ఇటు రాష్ట్ర పోలీసులు పెట్టే కేసులు తోడైతే మరోమారు కారాగారవాసం తప్పదని జగన్ ఆందోళన చెందుతున్నట్లు కనిపిస్తోంది. ఈ కష్టాల నుంచి గట్టెక్కాలన్నా, కేసుల నుంచి ఉపశమనం లభించాలన్నా కేంద్ర పెద్దల 'అండ' ఉండాల్సిందే అని భావిస్తున్నట్లు సమాచారం. అందుకే... తనకు ఉన్న నలుగురు ఎంపీలతో కేంద్రానికి బయటి నుంచి, బేషరతుగా మద్దతు ప్రకటించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే... బుధవారం జరిగే లోక్‌సభ స్పీకర్ ఎన్నికల్లోనూ ఎన్డీయేకు జగన్ మద్దతు ప్రకటించేశారు.

స్పీకర్ ఎన్నికల్లో ఎన్డీయేకే మద్దతు

- బీజేపీ అడగ్గానే అంగీకరించిన జగన్

అమరావతి, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ స్పీకర్ ఎన్నికల్లో వైసీపీ అధినేత జగన్ ఎన్డీయేకు తమ మద్దతు ప్రకటించారు. ఎన్డీయే అభ్యర్థి, మాజీ స్పీకర్ ఓం బిర్లా తిరిగి ఎన్నికయ్యేందుకు సహకరించాలని మంగళవారం బీజేపీ నేతలు కోరగానే... ఆయన అంగీకరించారు. లోక్‌సభలో వైసీపీకి నలుగురు సభ్యులు ఉన్న సంగతి తెలిసిందే. సభలో ఎన్డీయేకి 292 మంది సభ్యుల బలం ఉంది. 237 మంది సభ్యులున్న ఇండియా కూటమి కాంగ్రెస్ ఎంపీ కె.సురేశ్‌ను స్పీకర్ పదవికి తమ అభ్యర్థిగా ప్రకటించింది. సభలో ఎన్డీయేకి మెజారిటీ మార్కు (272) కంటే 20 సీట్లు అదనంగా ఉన్నా.. మరింత బలం పెంచుకోవడానికి ప్రయత్నాలు చేస్తోంది. ఎన్డీయే ప్రభుత్వంలో చేరిన బాబు.. ప్రధాని మోదీని ప్రత్యేక హోదా ఎందుకు కోరలేదని జగన్ ఇటీవల ప్రశ్నించిన సంగతి తెలిసిందే. మరి స్పీకర్ ఎన్నికకు సహకరించాలని బీజేపీ తనను కోరినప్పుడు.. అందుకు ప్రతిగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేయలేదు. బీజేపీకి దూరంగా ఉన్నామని ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆయన.. స్పీకర్ ఎన్నికకు మద్దతివ్వాలంటే హోదా ఇవ్వాలని ఎందుకు డిమాండ్ చేయలేదని రాజకీయ పక్షాలు నిలదీస్తున్నాయి.




కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును మేఘాలయ గవర్నర్ నల్లు ఇంద్రాసేనరెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఢిల్లీలోని రాజీవ్‌గాంధీ భవన్‌కు వచ్చిన ఇంద్రసేనా రెడ్డి కేంద్ర మంత్రికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇదిలావుంటే, టీడీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా ఎంపికైన లావు శ్రీకృష్ణ దేవరాయలును కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ ఎంపీలు పాల్గొన్నారు.

-ఆంధ్రజ్యోతి, న్యూఢిల్లీ



పార్లమెంటులో ప్రజావాణిని వినిపించే స్థాయికి ఎదగాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి కలిశెట్టి అప్పలనాయుడును మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు ఆశీర్వదించారు. మంగళవారం ఢిల్లీలోని తన నివాసానికి వచ్చిన అప్పలనాయుడును అభినందించిన ఆయన, ప్రజలతో మమేకమై, వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా ప్రజావాణిని వినిపించాలని సూచించారు.

-ఆంధ్రజ్యోతి, న్యూఢిల్లీ

వీవీఐటీ విద్యార్థులకు ఉద్యోగ నియామకాలు



నంబూరులోని వీవీఐటీ కళాశాల

పెదకాకాని, జూన్ 25: ప్రముఖ ఐటీ దిగ్గజాలు టీసీఎస్, కాగ్నిజెంట్, టెక్ మహీంద్ర వంటి బహుళ జాతీయ సంస్థలు ఈ నెలలో విడుదల చేసిన ఫలితాల్లో గుంటూరు జిల్లా నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీవీఐటీ) కళాశాలకు చెందిన 105 మంది విద్యార్థులు ఉద్యోగ నియమకాలు పొందారని కళాశాల ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మంగళవారం తెలిపారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపిక ప్రక్రియలో ఉత్తమ ప్రతిభ చూపి 46 మంది విద్యార్థులు 4.5 నుంచి 7 లక్షల వార్షిక వేతనంతో నియామకాలు పొందారని తెలిపారు. 26 మంది 4 లక్షల వార్షిక వేతనంతో టెక్ మహీంద్రలో, డేటా స్పెషలైజేషన్ అండ్ సైబర్ సెక్యూరిటీ(స్కిల్ హైరింగ్) కోర్సు అభ్యసించిన 25 మంది 5 లక్షల వార్షిక వేతనంతో కాగ్నిజెంట్‌లో, ఇద్దరు మెకానికల్ విద్యార్థులు హ్యుందాయ్ సంస్థలో, ఆరుగురు విద్యార్థులు శ్రీ చక్ర పాలిప్లాస్ట్‌లో ఉద్యోగాలు సాధించారన్నారు. మరో 200 మంది విద్యార్థులు వివిధ బహుళజాతీయ సంస్థల ప్రాంగణ ఎంపిక ప్రక్రియ పూర్తిచేసుకుని నియామక పత్రాలు అందుకోవాల్సి ఉందన్నారు. ఎంపికైన విద్యార్థులను ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి. వైస్‌ఛైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, డీన్ డాక్టర్ ఎం.వి.రఘురావ్, ఉపాధి శిక్షణ అధికారి డాక్టర్ మాధవయ్య, అధ్యాపకులు అభినందించారు.

బహుళ అంతస్తుల భవనాల్లో విద్యుత్ ప్రమాణాలు తప్పనిసరి

» విద్యుత్ భద్రతా విభాగ డైరెక్టర్ విజయలక్ష్మి

విజయవాడ, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 15 మీటర్ల ఎత్తు ఉన్న బహుళ అంతస్తులు, విమానాశ్రయాలు, హోటళ్లు, స్టేడియం, విద్యాలయాల్లో 2023 సీఈఏ రెగ్యులేషన్స్ ప్రకారం విద్యుత్ ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని విద్యుత్ భద్రతా విభాగ డైరెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసుపత్రులు, వినోద స్థలాలు, ప్రార్థన స్థలాలు, సాంస్కృతిక కేంద్రాలు, పరీక్ష ల్యాబ్‌లు, పరిశ్రమలు, రైల్వేస్టేషన్లలో పాటించాల్సిన నిబంధనలను వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో భవనానికి విద్యుత్ సరఫరాను పూర్తిగా వేరు చేయడానికి కటౌట్ లేక బ్రేకర్‌తో తగిన ఐసోలేటింగ్ పరికరం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పవర్ కేబుల్ కోసం ఏర్పాటు చేసిన నాలాల ద్వారా ఇతర పైపులు, కేబుల్స్‌ను పంపకూడదన్నారు. హాలోజన్ లేని ఫ్లేమ్ రిటార్డెంట్, పవర్ కేబుల్స్ భవనం ఎత్తుతో సంబంధం లేకుండా విమానాశ్రయాలు, ఆసుపత్రులు, హోటళ్లలో ఉండాలని సూచించారు. బస్‌బార్ ట్రంకింగ్ వ్యవస్థను ఉపయోగించి అంతస్తులకు విద్యుత్ పంపిణీ చేయాలని.. ప్రతి భవనానికి లైటింగ్ స్పైక్ ఏర్పాటు చేయాలని స్పష్టంచేశారు. మెట్ల మార్గంలో విద్యుత్ మీటర్ ఏర్పాటు చేయకూడదని, న్యూట్రల్ కండక్టర్ ఎర్త్ చేయాలని తెలిపారు. రెసిడెన్షియల్, కమర్షియల్ భవనాల్లో కాకుండా ఇండోర్‌లో ఏర్పాటు చేసిన చమురుతో నిండిన ట్రాన్స్‌ఫార్మర్లు గ్రౌండ్‌ఫ్లోర్‌లో గానీ, మొదటి బేస్‌మెంట్‌కి దిగువన లేవని నిర్ధారించుకోవాలని విజయలక్ష్మి సూచించారు.

అవినీతి, అక్రమాలకు పాల్పడితే చర్యలు

» అర్హులందరికీ సంక్షేమ పథకాలు: హోం మంత్రి అనిత



పాయకరావుపేట, జూన్ 25: అవినీతి, అక్రమాలకు పాల్పడినవారు ఎవరైనా సరే చర్యలు తీసుకుంటామని హోం మంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. మంగళవారం అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన ఆమె అనంతరం విలేకరులతో మాట్లాడారు. సంక్షేమ పథకాల మంజూరుకు ఎవరికీ ఒక్క పైసా ఇవ్వనవసరం లేదని.. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందజేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రతి మండల కేంద్రం, తహసీల్దారు కార్యాలయం, కాంప్లెక్స్‌లు, కళాశాలల వద్ద ఫిర్యాదు బాక్సులు ఏర్పాటుచేస్తామన్నారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా ఫిర్యాదును కంప్లయింట్ బాక్సులో వేయాలని.. మూడు రోజులకు ఒకసారి ఆ బాక్సుల్లోని ఫిర్యాదులు సేకరించి సంబంధిత అధికారులకు పంపించి పరిష్కరిస్తామని తెలిపారు.

భాష, సంస్కృతిని విస్మరిస్తే మనుగడ లేదు

» జీడబ్ల్యూటీసీఎస్ సంస్థ అధ్యక్షుడు కృష్ణ లాం

పొన్నూరు టౌన్, జూన్ 25: భారతదేశం వెలుపల నివసిస్తూ భారతీయ భాష, సంస్కృతి పరిరక్షణే లక్ష్యంగా పని చేస్తున్నామని గ్రేటర్ వాషింగ్టన్ తెలుగు సంఘం.. జీడబ్ల్యూటీసీఎస్ సంస్థ అధ్యక్షుడు కృష్ణ లాం అన్నారు. వాషింగ్టన్ డీసీలో జీడబ్ల్యూటీసీఎస్ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల లోగోను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణ లాం మాట్లాడుతూ అమెరికాలో ఐదు దశాబ్దాల క్రితం భాష, సంస్కృతి, ఆచార వ్యవహారాలను పరిరక్షించేందుకు ఏర్పడిన తొలి సంస్థ జీడబ్ల్యూటీసీఎస్ అన్నారు. తన భాషను, సంస్కృతిని విస్మరించిన ఏ జాతి మనుగడ సాగించలేదని చెప్పారు. ఈ 50 వసంతాల వేడుకలో కుల, మత ప్రాంతాలకు అతీతంగా అమెరికాలో ఉన్న ప్రతి ఒక్క తెలుగు వారు భాగస్వాములు కావాలన్నారు. తానా మాజీ అధ్యక్షుడు సతీష్ వేమన మాట్లాడుతూ ఐదు దశాబ్దాల సుదీర్ఘ ప్రయాణంలో జీడబ్ల్యూటీసీఎస్ ఆధ్వర్యంలో కళలు, సాహిత్యం, క్రీడలు, విద్య, వైద్యానికి సంబంధించిన అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు.



జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలు ప్రారంభిస్తున్న నిర్వాహకులు

ప్రాథమిక విద్య విధ్వంసం

ఐదేళ్లలో 592 బడులు పూర్తిగా మూత

- » అడ్డగోలుగా తరగతుల విలీనం
- » ఈ విద్యా సంవత్సరంలో దాని ప్రభావం
- » 6500 బడుల్లో ఒక్కరూ చేరని దుస్థితి
- » 73 బడుల్లో ఒక్కరే విద్యార్థి
- » ఇద్దరు విద్యార్థులున్న బడులు 158
- » 290 పాఠశాలల్లో ఉన్నది ముగ్గురే
- » ఐదేళ్లలో భ్రష్టు పట్టించిన జగన్ ప్రభుత్వం

వైసీపీ పాలనలో ప్రాథమిక విద్య కోలుకోలేనంతగా విధ్వంసానికి గురైంది. నాడు- నేడు, విద్యా కానుక అంటూ ఊదరగొట్టిన జగన్ సర్కారు.. విద్యార్థులు తగ్గిపోతున్న విషయాన్ని మాత్రం దాచిపెట్టింది. ఆ విషయం బయటకు రాకుండా అవిగో అద్భుతాలు అంటూ నాడు-నేడు పథకం కింద వేసిన రంగులను చూపించి రాజకీయ ప్రచారం చేసుకుంది. తీరా ఇప్పుడు ప్రభుత్వం మారాక ఆ ప్రభుత్వంలో విద్యా రంగం ఏ స్థాయిలో దిగజారిందో బయటపడుతోంది. బడులు పునఃప్రారంభమైనప్పటికీ.. 6,500 పాఠశాలల్లో ఒక్క విద్యార్థీ కొత్తగా చేరలేదంటే పరిస్థితిని ఎంతగా దిగజార్చారో అర్థం చేసుకోవచ్చు. ఎలాంటి హేతుబద్ధతా లేకుండా అకస్మాత్తుగా జీవో 117ను అమలు చేసి తరగతులు విలీనం చేయడం వల్లే ఇలాంటి దుస్థితి దాపురించింది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వంలో జగన్ నియంతృత్వ ధోరణి కారణంగా ప్రాథమిక విద్యా రంగం కుదేలైపోయింది. ఒకప్పుడు ఊరి బడి విద్యార్థులతో కళకళలాడితే వైసీపీ పాలనలో క్రమంగా విద్యార్థుల సంఖ్య దారుణంగా పడిపోతూ వచ్చింది. మొత్తంగా సుమారు ఆరు వేల పాఠశాలలను జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. గత ప్రభుత్వం చేసిన నిర్వాకం ఈ విద్యా సంవత్సరంపైనా కనిపిస్తోంది. జీవో 117ను తీసుకొచ్చి తరగతుల విలీనం చేయడం వల్ల ఈ ఏడాది ఒకటో తరగతి అడ్మిషన్లు ఘోరంగా పడిపోయాయి. ఈ నెల 13న బడులు పునఃప్రారంభం కాగా ఇప్పటికీ 6,500 పాఠశాలల్లో ఒక్క విద్యార్థీ కొత్తగా అడ్మిషన్ తీసుకోలేదు. దీంతో ఆ పాఠశాలల్లో వచ్చే ఒకటో తరగతి మొత్తం ఖాళీ అయ్యే పరిస్థితి నెలకొంది. ఫలితంగా వచ్చే ఏడాది రెండో తరగతి ఖాళీగా కనిపిస్తుంది. పైగా ప్రస్తుతం ఉన్న విద్యార్థుల్లోనూ కొందరు వెళ్లిపోయే పరిస్థితి వచ్చింది.



తరగతుల వారీగా ఇలా..

రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి ప్రాథమిక పాఠశాలలు 42,120, ప్రాథమికోన్నత పాఠశాలలు 3,874, ఉన్నత పాఠశాలలు 5,427 ఉన్నాయి. వాటిలో 2020-21 విద్యా సంవత్సరంలో 182, 2021-22లో రెండు, 2022-23లో 164, 2023-24లో 244 పాఠశాలలు ఒక్క విద్యార్థీ లేక మూతపడ్డాయి. ఈ వివరాలను తాజాగా పాఠశాల విద్యాశాఖ ప్రభుత్వానికి సమర్పించింది. అంటే మొత్తంగా ఐదేళ్లలో 592 బడులు మొత్తానికే మూతపడ్డాయి. ఇక 2023-24లో విద్యార్థుల సంఖ్యను పరిశీలిస్తే... ఒక్కరే విద్యార్థి ఉన్న బడులు 73, ఇద్దరున్న బడులు 158, ముగ్గురు విద్యార్థుల బడులు 290 ఉన్నాయి. గరిష్ఠంగా 9మంది వరకు విద్యార్థులున్న పాఠశాలలు ఏకంగా 4,712 ఉన్నాయి. మూతపడిన బడులతో కలిపితే 5,825 బడులు విద్యార్థుల్లేక వెలవెలబోయే స్థితికి చేరాయి. ఇక 25 మంది కంటే తక్కువ విద్యార్థులున్న ఉన్నత పాఠశాలలు ఐదు ఉన్నాయి. 26 నుంచి 50 మంది వరకు విద్యార్థులున్న ఉన్నత పాఠశాలలు 48, 51 నుంచి 75 వరకు విద్యార్థులున్నవి 124, 76 నుంచి 100 వరకు విద్యార్థులున్నవి 243 ఉన్నాయి. అంటే మొత్తంగా వంద మంది విద్యార్థులతోనే నెట్టుకొస్తున్న ఉన్నత పాఠశాలలు 420కి చేరాయి.

వద్దని గగ్గోలు పెట్టినా వినకుండా..

ప్రపంచ బ్యాంకు రుణం కోసం కక్కుర్తి పడిన జగన్ ప్రభుత్వం టీచర్ల సంఖ్యను తగ్గించుకునేందుకు జీవో 117 తీసుకొచ్చింది. ఓవైపు టీచర్లకు బోధనా సమయాన్ని పెంచి మరోవైపు 3, 4, 5 తరగతులను సమీపంలోని ప్రాథమికోన్నత పాఠశాలల్లో విలీనం చేసింది. ఫలితంగా 4200 బడులు విలీనంతో దెబ్బతిన్నాయి. మా ఊరి బడిని మాకు ఉంచండి అంటూ చిన్న పిల్లలు, వారి తల్లిదండ్రులు రోడ్డెక్కి రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, నిరసనలు చేసినా గత ప్రభుత్వం వారి గోడు వినలేదు. సరికదా అప్పటి ఉన్నతాధికారులు వారి నిరసనలను చులకన చేసి మాట్లాడారు. తాను జీవో జారీచేస్తే దానిని ఎవరూ మార్చలేరు అంటూ అప్పట్లో ఓ అధికారి వ్యాఖ్యానించారు. తర్వాత కొద్దిరోజులకు ఆయనే జీవోను సవరించి మరో జీవో జారీచేశారు. అయినా అప్పటికే ప్రాథమిక విద్యలో జరగాల్సిన నష్టం జరిగిపోయింది. తరగతుల విలీనంపై మాత్రం ప్రభుత్వం వెనక్కి తగ్గలేదు.

అటు విలీనం.. ఇటు ప్రభావం

మూడు తరగతులు (3, 4, 5) తరలించినా 1, 2 తరగతులు ఇక్కడే ఉంటాయి కదా అని అప్పటి ప్రభుత్వం అడ్డగోలుగా వాదించింది. కానీ దాని ప్రభావం మిగిలిన రెండు తరగతులపై కూడా పడుతుందనే ఆలోచన చేయలేకపోయింది. సాధారణంగా ఒక బడిలో విద్యార్థి చేరితే ప్రాథమిక విద్యను అక్కడే పూర్తిచేస్తారని తల్లిదండ్రులు భావిస్తారు. కానీ విలీనం కారణంగా రెండే తరగతులు మిగిలినందున రెండేళ్లకు ఈ బడిలో ఎందుకులే అనే ఆలోచనతో పిల్లలను ఇతరత్రా బడుల్లో చేర్పిండంతో ఆ బడులు ఉనికిని కోల్పోవాల్సి వచ్చింది. పేదలు సైతం తమ పిల్లలను చిన్నపాటి ప్రైవేటు బడుల్లో చేర్పించారు.

బహ్రెయిన్‌లో వైభవంగా శ్రీవేంకటేశ్వర కల్యాణోత్సవం

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ప్రవాస భారతీయుల కోసం విదేశాల్లో శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలను టీటీడీ నిర్వహిస్తోంది. గల్ఫ్‌లోని బహ్రెయిన్‌లో శ్రీ వేంకటేశ్వర కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. బహ్రెయిన్‌తో పాటు సౌదీ అరేబి యా, ఖతర్ దేశాల నుంచి భక్తులు కార్యక్రమానికి హాజరై స్వామిసేవలో పాల్గొన్నారు.

EDUCATION
» B.Sc. FORENSICS / AI & ML / AGRICULTURE ; B.VOC. MEDICAL IMAGING & RADIOLOGY; BBA - STELLA COLLEGE - VJA. Cell : 74166 98395
AJB -194725

ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
APTRANSCO వారు దిగువ పని కొరకు ఆన్‌లైన్ బిడ్లు కోరుచున్నారు: విజయవాడ జోన్‌లో విజయవాడ O&M సర్కిల్‌లో 220KV SS గుణదల వద్ద 1x100+2x160MVA నుండి 1x100+3x160MVA కు 220/132KV PTR సామర్థ్య పెరుగుదల యొక్క పని కొరకు Spec. No. APT VJA-e-11/2024-25. టెండరు లభ్యత తేది: www.apeprocurement.gov.in లో 26.06.2024న సా.05.00 గం.ల నుండి లభించును. ఫోన్ నం. 9494096298-9494094610.
సం/- చీఫ్ ఇంజనీర్, APTRANSCO, విజయవాడ జోన్
DIPR R.O. No. 3047 PP/CL/ADVT/1/1/2021-22, Dt: 25.06.2024

INDIAN MARITIME UNIVERSITY
(A Central University, Govt. of India)
Visakhapatnam Campus, Vangali, Sabbavaram Mandal
VISAKHAPATNAM – 531035.
Admission Notification for Lateral Entry Scheme (2024-2025)
IMU Visakhapatnam Campus invites applications from eligible candidates for Admission into lateral entry in second year B Tech (Naval Architecture and Ocean Engineering) and B Tech (Naval Architecture and Ship Building)
For details please see website: www.imuv.edu.in/ www.imu.edu.in
DIRECTOR

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ లిమిటెడ్ (APSCSCL)
ఆంధ్ర ప్రదేశ్ యూనిట్
ఇ.నం.10-152/1, 4వ & 5వ అంతస్తు, శ్రీ సాయి టవర్స్, అశోక్ నగర్, SIRIS కంపెనీ పక్కన, బందర్ రోడ్, కానూరు, విజయవాడ-520007
టెండర్లు కోరుతూ ప్రకటన (ఇ-ప్రొక్యూర్‌మెంట్)
NIT No.17/Engg/APSCSCL/2024-25 తేది.24.06.2024
పని పేరు: గుంటూరు జిల్లా తెనాలి వద్ద APSCSCL స్థలంలో సిసి రోడ్ ఏర్పాటు మరియు LPG గోడౌన్ MLS పాయింట్ గోడౌన్‌కు మరమ్మత్తులు & నిర్వహణ

అంచనా కాంట్రాక్టు విలువ [ECV]	: రూ. 51,99,918/-
పనిని పూర్తి చేయు కాలం	: నాలుగు (4) నెలలు
బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది	: 25.06.2024న ఉ.10.00 గం.లకు
బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ముగింపు తేది	: 09.07.2024న సా.05.00 గం.లకు
బిడ్‌ల స్వీకరణకు చివరి తేదీ మరియు సమయం	: 09.07.2024న సా.05.30 గం.లకు
టెండర్ తెరచు తేది	: 09.07.2024న సా.05.35 గం.లకు

మరిన్ని వివరాల కొరకు వెబ్‌సైట్ www.apeprocurement.gov.in ను చూడగలరు.
VC & మేనేజింగ్ డైరెక్టర్, APSCSCL, విజయవాడ కొరకు



Honda Motorcycle & Scooter India Pvt. Ltd., Registered Office: Plot No. 1, Sector - 03, IMT Manesar, Distt. Gurugram, (Haryana) – 122050, India; Website: www.honda2wheelersindia.com; Customer Care: customercare@honda.hmsi.in

Honda Exclusive Authorized Dealerships: VIJAYAWADA: Sri Santosh Honda - 7207333222, 8662544979; Anvita Honda - 9225922599, 0866-6628333; Vihari Honda - 9703247365, 9703218817; BHAVANIPURAM: Vihari Honda - 9703218820; NUZIVIDU: Srishivani Honda - 7893194444, KANCHIKACHERLA: Sri Spandana Honda - 08678-273066, 8523034242; VISSANNAPETA: Aishwarya Honda - 08673-272722, 9000866319; TIRUVURU: Sri VenkataSatya Honda - 08673-295446, 8977836666; ONE TOWN (VIJAYAWADA): Anvita Honda - 8142941414; GUDIVADA: Pruthvi Honda - 8297642888, 9491803888; KAANURU: Sri Santosh Honda - 7207235566, 9908824249; GANNAVARAM: Sri Santosh Honda - 9912195558, 9391935558; KAIKALURU: Pruthvi Honda - 9642854888, 8297681888; MACHILIPATNAM: Nagasai Honda - 9676945616; NANDIGAMA: Apple Honda - 7660867722; CHALLAPALLI: Annapurna Honda - 8499900065; VUYYURU: Pruthvi Honda - 8142026888, 8297895888; IBRAHIMPATNAM: Leo Honda - 9348686966; KANKIPADU: Sri Santosh Honda - 9949422233; HANUMAN JUNCTION: Anvita Honda - 9515028062, 9985775959.
For Bulk/Institutional enquiries, please write us at: institutionalsales@honda2wheelersindia.com

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఉపశమనం

దాదాపు రెండునెలలుగా మండుటెండలను, వడగాడ్పులను అనుభవిస్తున్న ఉత్తరభారతంలో కొన్ని ప్రాంతాలకు త్వరలోనే నిర్దిష్టమైన ఉపశమనం దక్కవచ్చునని భారతవాతావరణశాఖ మంగళవారం చేసిన ప్రకటన సూచిస్తోంది. బిహార్ వంటి రాష్ట్రాల్లో వేడిమి తగ్గడం, పశ్చిమభారతంలోనూ, ఈశాన్యంలోనూ వర్షాలు కురవడం ఇత్యాది పరిణామాలను ఐఎండీ లెక్కవేసింది. పంజాబ్, పశ్చిమరాజస్థాన్‌లో వడగాడ్పుల బాధ మరికొంతకాలం తప్పదని, ఇందుకు పూర్తిభిన్నంగా పశ్చిమబెంగాల్ తడిసిముద్దవుతుందని ఈ ప్రకటన సారాంశం. నైరుతి రుతుపవనాల విస్తరణతో దేశం చల్లబడుతుందన్న విశ్లేషణలు మనసుకు ఎంతో ఉపశమనాన్ని ఇస్తున్నాయి.

ఏప్రిల్ మొదలు జూన్ మూడోవారం వరకూ ఇంతటి సుదీర్ఘకాలం వేడిమిని, వడగాడ్పులను దేశం గత దశాబ్దకాలంలో చూసివుండదు. కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతలు అనూహ్యంగా ఉంటూ ప్రధానంగా ఉత్తరాది యావత్తూ మాడిపోయింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా గరిష్ఠం స్థాయిలో ఉంటూ, రాత్రి వేళల్లోనూ వేడినిలబడి జనజీవితం దుర్భరమైంది. అర్ధరాత్రిళ్ళు నలభైడిగ్రీల వేడిని సైతం ఢిల్లీ అనుభవించింది. ఈనెలలో, పట్టుమని పదిరోజుల్లోనే రెండువందలమంది నిరుపేదలు, నిరాశ్రయులు మరణించడం వడగాడ్పుల తీవ్రతను తెలియచేస్తోంది. అత్యంత వేడిమి శరీరంమీద మిగల్చే ప్రభావాలు అంతుచిక్కవు. ప్రాణానికి ముప్పువాటిల్లేవరకూ ఆ వేడి శరీరాన్ని పైకి కనిపించకుండా దొలిచేస్తుంది. ఆస్పత్రులు కిటకిటలాడిపోతూ, ఒకదశలో చికిత్స అందించలేని స్థితిలోకి జారుకున్నాయి. మిగతా అందరికంటే ఎక్కువగా కార్మికులు, వలసకూలీలు ప్రత్యక్షనరకం చవిచూశారు. ఎండల్లో పనిచేయలేక, ఆకలితో ఉండలేక అల్లాడిపోయారు. గిగ్ వర్కర్లు కాలుకదపలేకపోయారు. రోడ్లమీద చిన్నచిన్న వ్యాపారాలు చేసుకొనేవారిని మండుటెండలు చావుదెబ్బకొట్టాయి. ఈ దేశంలో డెబ్బయ్‌ఐదుశాతంమంది శ్రామికులు ఎండల్లోనే పనిచేస్తున్నందువల్ల మండుటెండలు, వడగాడ్పులతో ఉత్పన్నమైన పరిస్థితులు వారి ఉపాధిని గణనీయంగా దెబ్బతీయడమే కాక, దేశ ఉత్పత్తి కూడా తీవ్రంగా పతనమవుతుందన్నది వాస్తవం. ఈశాన్యభారతంలోని ఎత్తయిన పర్వతప్రాంతాల్లో కూడా కొద్దివారాల్లోనే అధిక వడగాడ్పు రోజులు నమోదైనాయి.

దేశరాజధాని చవిచూసిన పరిస్థితులను గమనించినప్పుడు, మీడియా కన్ను అంతగా పడని మిగతా ప్రాంతాలు ఇంకెంతటి నరకాన్ని చూవిచూశాయో సులువుగా అర్థమవుతుంది. జనానికి సరిపడా నీటిని అందించలేక, రాజకీయ నాయకుల అండదండలతో చెలరేగిపోయిన ప్రైవేటు ట్యాంకర్ల మాఫియాను నియంత్రించలేక ఢిల్లీ ప్రభుత్వం చతికిలబడిపోయింది. ఎండిన యమునలోకి కాస్తంత నీటిని వదలాల్సిందిగా హర్యానాను కోరినా ఆ రాష్ట్రం రాజకీయకారణాలతో సహకరించలేదని ఢిల్లీ ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం ఆరోపించింది. ఢిల్లీకి కాసిన్ని తాగునీళ్ళు ఇప్పించడానికి న్యాయస్థానాలు సైతం రంగంలోకి దిగాల్సివచ్చింది. విద్యుత్ వినియోగం రికార్డు స్థాయికి చేరి, తగినంత సరఫరా లేక, దిగుమతి చేసుకున్నది కూడా చాలక ఢిల్లీ ప్రజలు నానారకాల కష్టాలూ అనుభవించారు. ప్రజల బాధల్ని తీర్చలేని పాలకులు ప్రతీ విషయాన్నీ ఎంత తెలివిగా రాజకీయం చేస్తారో ఢిల్లీ ప్రజలు మరోమారు చూశారు.

ఇదంతా ఎల్‌నినో ప్రభావమే కావచ్చును కానీ, గత మూడునాలుగేళ్ళుగా వడగాడ్పులను దేశం చవిచూస్తున్నది. వచ్చే సంవత్సరాల్లోనూ ఈ పరిస్థితుల్లో విశేషమైన తేడా ఉండకపోవచ్చు. వాతావరణమార్పులు ఇందుకు దోహదం చేస్తున్నప్పటికీ, స్థానిక పరిస్థితులు, ప్రభుత్వాల నిష్క్రియాపరత్వం తోడైనప్పుడు సామాన్యుడు సులువుగా బలైపోతాడు. ముందస్తు ప్రణాళికలతో, అత్యయిక స్థితి తరహా ఏర్పాట్లతో మండుటెండల నుంచి ప్రజలను కాపాడేందుకు ప్రభుత్వాలు సంసిద్ధంగా ఉండాలి. నేడు ఢిల్లీ ఎదుర్కొంటున్న పరిస్థితులు రేపు అన్ని నగరాలూ అనుభవించక తప్పదేమో. కాంక్రీట్ అరణ్యాలుగా మారిపోయిన నగరాలన్నీ ఈ తరహా ఉపద్రవాలు చవిచూస్తూ, ఉద్యోగ ఉపాధులు దెబ్బతినిపోతే ఎలా అన్నది ప్రశ్న. ఈసారి రుతుపవనాలు త్వరగానే కేరళను తాకినప్పటికీ, గత పదిహేను రోజులుగా అవి స్తంభించిపోవడంతో, అటు వర్షాలు లేక, ఇటు ఎండలు తగ్గక, ఉక్కపోత భరించలేక దేశం యావత్తూ అల్లాడిపోతున్నది. ఈ దీర్ఘకాలిక వేసవికి త్వరలోనే విముక్తి లభించబోతున్నందుకు కచ్చితంగా సంతోషించాల్సిందే.

బొగ్గు గనుల కేటాయింపు అంతా చట్ట ప్రకారమే అంటున్న కేంద్ర ప్రభుత్వం అదే చట్టంలో సింగరేణి తరహా సంస్థలకు రిజర్వేషన్ విధానంలో గనులను కేటాయించే వెసులుబాటు ఉన్నదనే విషయాన్ని ఉపేక్షిస్తోంది. సగటు పౌరుడికి అవసరమైన విద్యుత్ కోణం నుంచి సింగరేణికి గనుల కేటాయింపును పరిగణనలోకి తీసుకోవాలి. సౌదీ అరంకో, అద్నాక్‌ల తరహాలో సింగరేణికి కూడ జాతి విశాల ప్రయోజనాల దృష్ట్యా బొగ్గు గనులు కేటాయించాలి. తద్వారా మాత్రమే ఆత్మనిర్భర్ భారత్, వికసిత భారత్ సుసాధ్యమవుతాయి.

సౌదీ అరంకో–సింగరేణి


సహజ వనరు అయిన ఖనిజ సంపదను సద్వినియోగం చేస్తే జాతి దిశ, దశ పురోగమన శీలమవుతాయి. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న గల్ఫ్ దేశాలే ఇందుకు ఒక చక్కటి ఉదాహరణ. వాటి సహజ సంపద అయిన చమురు నిక్షేపాలు పూర్తిగా ప్రభుత్వాల యాజమాన్యం, అజమాయిషీలో ఉండడం వల్లే ఆ దేశాల పురోగతి సాధ్యమయింది. ఒకప్పుడు తినడానికి తిండి లేక అలమటించిన ఈ ఎడారి దేశాలు ప్రైవేట్ రంగానికి పెద్ద పీటం వేయడం ద్వారా సంపూర్ణ స్వేచ్ఛా విపణి విధానాన్ని పాటిస్తున్నాయి. అయితే సహజ వనరుల విషయానికి వచ్చే సరికి గల్ఫ్ రాజ్యాల రాచరిక పాలకులు ఆ సంపదపై ప్రభుత్వ నియంత్రణను పూర్తిగా కొనసాగిస్తూ తమ ప్రజలకు ఉజ్వల భవిష్యత్తును నిర్మిస్తున్నారు. అనేక సంక్షోభాలు, సవాళ్ల మధ్య కూడ చమురు ఉత్పాదక దేశాలు పురోగమనిస్తున్నాయి. కారణమేమిటి? ఆ దేశాల ప్రభుత్వ రంగ సంస్థల చిత్తశుద్ధి, సహజ వనరుల కేటాయింపు తీరు తెన్నులే ఒక ప్రధాన కారణమని చెప్పవచ్చు. ప్రభుత్వ రంగంలోని సౌదీ అరంకో, అద్నాక్, ఖతర్ ఎనర్జీ మొదలైన సంస్థలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ముఖ్య భూమిక వహించే స్థాయికి ఎదగడానికి చమురు, సహజ వాయువు నిక్షేపాలపై ప్రభుత్వాలకు పూర్తి అధిపత్యం ఉండడమేనని నిస్సంకోచంగా చెప్పి తీరాలి.

గల్ఫ్ దేశాలకు చమురు నిక్షేపాల తరహాలో భారత్‌కు అపార ఖనిజ సంపద దేవుడిచ్చిన వరమే. అయితే అపరిమిత ఖనిజ సంపద ఉన్నా పేదరికం తాండవించడం దేశ దౌర్భాగ్యం. బొగ్గు నిల్వలు అత్యధికంగా ఉన్న జార్ఖండ్ ఒక పేద రాష్ట్రం. తెలుగునాట గోదావరి పరివాహక ప్రాంతాలలో బొగ్గు సమృద్ధిగా ఉన్నా అటు ఇల్లెందు నుంచి ఇటు తాడిచెర్ల వరకు ఉన్న గ్రామాలు పట్టణాలు కూడా వెనుకబడిన పేద ప్రాంతాలనే విషయాన్ని విస్మరించరాదు.

గల్ఫ్ లేఖ

ఇక ఖనిజాలను శుద్ధి చేసి ఉత్పత్తి చేసే ప్రభుత్వరంగ సంస్థలను సాక్షాత్తు పాలకులే వ్యూహాత్మకంగా బలహీనపర్చడం ఒక విచిత్ర విషాదం. దేశంలో నాణ్యమైన ఉక్కును ఉత్పత్తి చేస్తూ టాటా స్టీల్‌తో పోటీ పడే విశాఖ ఉక్కు కర్మాగారానికి గనులు కేటాయించకుండా దెబ్బతీస్తున్న విధానాన్ని మనం చూస్తున్నాం.

దేశ పారిశ్రామిక, విద్యుదుత్పత్తి రంగాలకు వెన్నుదన్నుగా ఉన్న



బొగ్గు విషయాన్నే చూడండి. జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిషా రాష్ట్రాలలోని పరిస్థితులనూ గమనించండి. బిహార్ లోని కోల్ బెల్ట్ ప్రాంతమైన ధన్‌బాద్ లోని దయనీయ పరిస్థితుల ఆధారంగా నిర్మించిన హిందీ సూపర్ హిట్ సినిమా 'కాల పత్థర్ (1979)లో అమితాబచ్చన్, శశికపూర్, శత్రుఘ్న సిన్హాలను ఒక్కసారి గుర్తు చేసుకుంటే కళ్లు ఆర్ద్రమవుతాయి. ఆ రకమైన దుర్భర పరిస్థితుల నుంచి కోలుకుంటూ క్రమంగా పురోగమనంలో పయనిస్తున్న ప్రభుత్వ రంగ బొగ్గు సంస్థలకు తాజాగా శ్రీకారం చుట్టిన గనుల వేలం విధానం అశనిపాతమే అవుతుందనడంలో సందేహం లేదు.

సింగరేణి సంస్థ తెలంగాణ కొంగు బంగారం. తెలంగాణ శ్రామిక జీవన జీవనాడి అయిన ఈ సంస్థ, గనుల వేలం విధానం మూలంగా క్రమేణా ఉనికి కోల్పోయి మున్ముందు ఒక దివాళా సంస్థగా మిగిలిపోయే ప్రమాదం ఎంతైనా ఉన్నది. తెలుగునాట సింగరేణి కానీ ఈశాన్య రాష్ట్రాలలో కోల్ ఇండియా, దాని అనుబంధ సంస్థలు గానీ బొగ్గు ఉత్పత్తి ద్వారా దేశ విద్యుదుత్పాదనలో కీలక పాత్ర వహిస్తున్నాయి. మరోవైపు ప్రైవేటు రంగాన్ని సైతం ఆదుకుంటున్నాయి. 2013లో 565 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి కాగా 2023లో 893 మిలియన్ టన్నులకు పెరిగింది. ప్రభుత్వ రంగ సంస్థలు కాబట్టి ప్రజాహితాన్ని కాంక్షిస్తాయి. అందుకే బహిరంగ విపణి విధానంలో కాకుండా జాతి సేవా దృక్పథంతో అవి బొగ్గును విక్రయిస్తున్నాయి. పైగా అడుగడుగునా రాజకీయ జోక్యం కారణాన ఈ ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేటు రంగం తరహాలో కేవలం లాభాల బాటలో మాత్రమే పయనించలేవు. ప్రధాని నరేంద్ర మోదీ గొప్పగా వర్ణించే ఆత్మనిర్భర్ భారత్‌కు ఈ బొగ్గు గనులు నిలువెత్తు సాక్ష్యం. దురదృష్టవశాత్తు కేంద్ర ప్రభుత్వమే వాటిని నిర్వీర్యం చేస్తోంది. పశ్చిమ బెంగాల్‌లో రెండు ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రం బొగ్గు గనుల వేలంలో పాల్గొనకుండా చేయడం ద్వారా ఆ రాష్ట్రంలో విద్యుదుత్పత్తి సంస్థలు ప్రైవేటు కంపెనీలను ఆశ్రయించవల్సిన అవసరాన్ని కేంద్రం సృష్టించింది.

సంపన్న పాశ్చాత్య దేశాలలో పర్యావరణ కాలుష్యం సమస్యకు బొగ్గు ఒక కారణంగా ఉన్నది. భారత్‌లో ఇప్పటికీ ఆ నల్ల బంగారం ఒక ప్రధాన ఇంధన వనరు. విద్యుదుత్పత్తికి అవసరమైన ముడి పదార్థం. పన్నులు వగైరా కారణాన దేశీయ బొగ్గు కంటె విదేశీ దిగుమతి బొగ్గు ధర చౌకగా ఉండడాన్ని కూడ గమనించాలి. దేశ విద్యుత్ ఉత్పత్తి వ్యవస్థ ప్రైవేటీకరణ జరుగుతుండగా ఆ రంగంలో అదానీ సంస్థ అనూహ్యంగా దూసుకెళ్తుంది. విదేశీ బొగ్గుతో పాటు ఖతర్ సహజ వాయువు దిగుమతిలో కూడ అదానీ సంస్థదే సింహభాగం. ఈ నేపథ్యంలో సింగరేణికి బొగ్గు గనుల కేటాయింపు విషయం ప్రాధాన్యత సంతరించుకొంటోంది. అంతా చట్ట ప్రకారమే అంటున్న కేంద్ర ప్రభుత్వం అదే చట్టంలో సింగరేణి తరహా సంస్థలకు రిజర్వేషన్ విధానంలో గనులను కేటాయించే వెసులుబాటు ఉన్నదనే వియాన్ని విస్మరిస్తోంది, ఉపేక్షిస్తోంది. పూర్తిగా మౌనం వహించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఒక సంస్థ మనుగడ లేదా అందులో పని చేసే ఉద్యోగుల భవిష్యత్తుకు సంబంధించిన విషయంగా కాకుండా సగటు పౌరుడికి అవసరమైన విద్యుత్ కోణం నుంచి సింగరేణికి గనుల కేటాయింపు విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. సౌదీ అరంకో, అద్నాక్‌ల తరహాలో సింగరేణికి కూడ జాతి ప్రయోజనాల దృష్ట్యా బొగ్గు గనులు కేటాయించాలి. తద్వారా మాత్రమే ఆత్మనిర్భర్ భారత్, వికసిత భారత్ సుసాధ్యమవుతాయి.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

కొత్త పార్లమెంట్ చరిత్ర సృష్టిస్తుందా?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

'ఓహ్, నీవు నన్ను ఓడించావు కదా!' అని ఒడిషా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తనకు అసెంబ్లీలో నమస్కరించిన లక్ష్మణ్ బాగ్ అనే ఎమ్మెల్యేకు ప్రతి నమస్కారం చేస్తూ చిరునవ్వు నవ్వారు. రెండు నియోజకవర్గాల్లో పోటీ చేసి, ఒక నియోజకవర్గంలో కేవలం 4,700 ఓట్లతో గెలిచిన నవీన్ పట్నాయక్ ఇటీవల అసెంబ్లీలో ప్రవేశించినప్పుడు అధికార పార్టీ ఎమ్మెల్యేలు అవహేళన చేయలేదు. పైగా ముఖ్యమంత్రితో సహా ఎమ్మెల్యేలందరూ లేచి నిలబడి పట్నాయక్‌ను గౌరవపూర్వకంగా ఆహ్వానించారు. పార్లమెంటరీ ఉత్తమ సంప్రదాయాల్ని ఈ దృశ్యం అద్భుతంగా ప్రతిఫలించింది.

అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఇలాంటి సత్సంబంధాలు నెలకొనాలంటే ఇరు వర్గాలు పరస్పరం పార్లమెంటరీ సంప్రదాయాలను అనుసరించాలి. జాతీయ స్థాయిలో గత కొన్నేళ్లుగా ఉభయ పక్షాలు ఈ సంప్రదాయాలకు తిలోదకాలిస్తున్నాయి. 17వ లోక్‌సభలో అనేక అవాంఛనీయమైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. అది పార్లమెంటరీ ప్రమాణాల క్షీణతను తార స్థాయిలో ప్రతిఫలించింది. ప్రతిపక్షాలు లేవనెత్తిన కొన్ని అంశాలకు పార్లమెంట్‌లో ప్రతిస్పందించేందుకు ప్రభుత్వం నిరాకరించడం, దాన్ని కారణంగా తీసుకుని అసలు సభలే నిర్వహించకుండా రోజుల తరబడి ప్రతిపక్షాలు స్తంభింపచేయడం... చివరకు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 143 మంది ఎంపీలను ప్రభుత్వం సస్పెండ్ చేయించడం 17వ లోక్‌సభలో పార్లమెంటరీ ప్రమాణాలను ప్రశ్నార్థకం చేసింది. పార్లమెంట్‌లో ఎవరు గౌరవం కోల్పోవడానికి ఎవరు కారణమయ్యారు అనే చర్చను పక్కన పెడితే, ఇరు వర్గాలు పరస్పర గౌరవం కోల్పోయినప్పుడే ఇలాంటి పరిస్థితులు తలెత్తుతాయన్న విషయంలో సందేహం లేదు. తత్ఫలితంగా లేబర్ కోడ్ వంటి అనేక ముఖ్యమైన బిల్లులు చర్చలు లేకుండా ఆమోదమయ్యాయి. పార్లమెంట్ చరిత్రలో మొదటిసారిగా 17వ లోక్‌సభ సమావేశాలు అతి తక్కువ రోజులు జరిగాయి. బడ్జెట్ ప్రతిపాదనలపై కూడా కూలంకషంగా చర్చలు జరగలేదు. ప్రజల జీవితాలపై ప్రభావం చూపించే ఆర్థిక నిర్ణయాలు చర్చకు నోచుకోలేదు. స్థాయీ సంఘాలకు నివేదించకుండానే నూటికి 90 శాతం బిల్లులను ఆమోదించారు. దీనితో సమావేశాల పట్ల ప్రజాప్రతినిధులకే ఆసక్తి తగ్గిపోయింది. ప్రెస్ గ్యాలరీ కూడా దాదాపు ఖాళీగా కనిపించేది. శాసన, అధికార, న్యాయవ్యవస్థల్లో అధికార వ్యవస్థ చాలా శక్తిమంతమైనది. మిగతా రెండు వ్యవస్థలు తమ అస్తిత్వాన్ని, ప్రాధాన్యాన్ని నిరూపించుకోకపోతే అధికార వ్యవస్థ ఆధిపత్యాన్ని అంగీకరించినట్లవుతుందన్న విషయంలో సందేహం లేదు. అందువల్ల ఈ మూడు వ్యవస్థలూ సమతుల్యం పాటించి పరస్పర ప్రాధాన్యాన్ని గుర్తించినట్లయితే ప్రజాస్వామ్యం ఆరోగ్యకరంగా, జవాబుదారీతనంతో పరిఢవిల్లుతుంది. తద్వారా వ్యవస్థల పట్ల ప్రజల గౌరవం కూడా పెరుగుతుంది.

18వ లోక్‌సభ కాలంలో కూడా గత సమావేశాల నాటి సంక్లిష్ట పరిస్థితులు పునరావృతం అవుతాయా అన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. పార్లమెంట్‌లో ఎవరి సంఖ్యాబలం ఎంత మేరకు ఉన్నదో అన్న అంశంతో నిమిత్తం లేకుండా పార్లమెంటరీ సంప్రదాయాలను పాటించడం నేతల వ్యవహార శైలిని బట్టి ఆధారపడి ఉంటుంది. 1957లో లోక్‌సభలో జనసంఘ్‌కు నలుగురే సభ్యులు ఉండేవారు. అయినప్పటికీ ఆ పార్టీ నేత అటల్ బిహారీ వాజపేయి చివరి వరుసలో నిలబడి విదేశాంగ విధానంపై అనర్గళంగా మాట్లాడిన తర్వాత ప్రధానమంత్రి నెహ్రూ ఆయనను అభినందించారు. 'మీకు దేశ ప్రధాని అయ్యే లక్షణాలున్నాయి' అని వ్యాఖ్యానించారు. ఇప్పుడా పరస్పర గౌరవాలు మృగ్యమయి పోయాయి.

ఆశ్చర్యకరమేమంటే 18వ లోక్‌సభలో వాతావరణం చూస్తుంటే అధికార కూటమి శిబిరంలో కంటే ప్రతిపక్ష కూటమిలో విజయోత్సాహాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఎన్డీఏ కూటమి కంటే దాదాపు 60 సీట్లు తగ్గినప్పటికీ బిజెపి మెజారిటీని బాగా తగ్గించామని ప్రతిపక్ష నేతల్లో ఆనందం కనిపిస్తోంది. గత లోక్‌సభలో కంటే అధికంగా సీట్లను దక్కించుకోవడమే ఈ సంతోషానికి కారణం కావచ్చు. ఈ రకంగా పార్లమెంట్‌లో రెండు గెలిచిన పార్టీలు కనిపిస్తున్నాయి.

అధికారంలోకి రాలేకపోయినా గెలిచామనుకోవడమంత అల్పసంతోషం మరొకటి లేదు. ఈ సంతోషంతోనే ప్రతిపక్షాలు మరింత సంఘటితమవుతున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో బిజెపి సీట్లను తగ్గించిన కాంగ్రెస్ నేత రాహుల్, సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ పక్కపక్కనే కూర్చోవడం, మొదటి రోజు నుంచే ఇండియా కూటమి పార్టీలన్నీ సమిష్టిగా నిర్ణయాలు తీసుకోవడం విస్మరించదగిన పరిణామం కాదు. ప్రమాణ స్వీకారం నాటి నుంచే కలిసికట్టుగా కార్యాచరణ నిర్ణయించుకోవడం, రాజ్యాంగ ప్రతితో ఊరేగింపు నిర్వహించడం, ప్రోటెమ్ స్పీకర్ అభ్యర్థిని తీవ్రంగా వ్యతిరేకించడం, డిప్యూటీ స్పీకర్ పదవిని తమకు కేటాయిస్తేనే స్పీకర్ పదవి విషయంలో అధికార కూటమికి మద్దతు నిస్తామని ప్రకటించడం ప్రతిపక్షాల సంఘటిత వైఖరిని స్పష్టం చేస్తోంది. ప్రశ్నపత్రాల లీక్ వల్ల యుజిసి నెట్ పరీక్షలు రద్దు కావడం, లక్షలాది మంది అభ్యర్థులు రాసే నీట్ పేపర్లు లీక్ కావడం వంటి పరిణామాలన్నీ ప్రతిపక్షాలకు ఆయుధాలుగా మారాయి. ఈ రీత్యా ప్రతి అంశంపై ఇకనుంచి ప్రతిపక్షాలు విభేదించి అధికార పార్టీని ఆత్మరక్షణలో పడవేసేందుకు ప్రయత్నించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ రీత్యా 18వ లోక్‌సభలో కూడా గత సమావేశాల్లో కంటే తీవ్రంగా సంఘర్షణాయుత వాతావరణం కనపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. వయనాడులో రాహుల్ గాంధీ ఖాళీ చేసిన సీటులో ప్రియాంక కూడా గెలిచి వస్తే లోక్‌సభలో ఈ ఇద్దరు అన్నాచెల్లెళ్ల దాడిని ఎదుర్కొనేందుకు బిజెపి, మిత్రపక్షాలు సిద్ధపడాల్సి ఉంటుంది. గత సమావేశాల్లో బహిష్కృతురాలైన తృణమూల్ కాంగ్రెస్ ఎంపి మహువా మొయిత్రా మళ్లీ గెలిచి సభలో అడుగుపెట్టారు. ఎన్డీఏతో పోలిస్తే ప్రతిపక్ష శిబిరంలోనే అద్భుత వక్తలు ఉన్నారు. వారిని ఎదుర్కొనే వక్తలను ఎన్డీఏ సిద్ధం చేయవలసి ఉంటుంది.

17వ లోక్‌సభతో పోలిస్తే 18వ లోక్‌సభలో తొలిసారి పార్లమెంట్‌లో అడుగుపెట్టిన ఎంపీలు ఎక్కువ మంది ఉన్నారు. బిజెపిలో 45 శాతం కొత్త ఎంపీలైతే, కాంగ్రెస్‌లో 60 శాతం కొత్త ఎంపీలే. తెలుగుదేశం, సమాజ్‌వాది పార్టీ, ఎన్‌సిపిల్లో కూడా మూడింట నాలుగోవంతు కొత్తవారే. దాదాపు 50 శాతం లోక్‌సభ ప్రక్షాళనం అయినట్లు కనిపిస్తోంది. సభలో తమ ప్రత్యేకత నిలబెట్టుకోవాలని కొత్త ఎంపీలు ఆశిస్తున్నారు. అతి సామాన్య నేపథ్యం నుంచి వచ్చిన కలిశెట్టి అప్పల్నాయుడు సైకిల్‌పై పార్లమెంట్‌కు వచ్చి తన ప్రత్యేకత నిరూపించుకున్నారు. మాజీ కేంద్ర మంత్రి సుష్మాస్వరాజ్ కూతురు బాన్సురీ స్వరాజ్ నుంచి యూపీ దళిత నేత చంద్రశేఖర్ ఆజాద్ వరకూ ఒక రకమైన వైవిధ్యం ఈసారి లోక్‌సభలో కనిపిస్తోంది.



మంచికో, చెడుకో ఇవాళ దేశ ప్రజలు రెండు కూటముల వైపే మొగ్గు చూపారు. ఎన్డీఏ కూటమి, ఇండియా కూటమిలో భాగం కాని పార్టీలను ప్రజలు దాదాపు తిరస్కరించారు. బిఆర్ఎస్, వైసీపీ, బిజెడి తదితర పార్టీల ఎంపీలు 18 మంది మాత్రమే ఉండగా మిగతా 525 మంది ఏదో ఒక కూటమికి చెందినవారే. ఎవరు ఒప్పుకోకపోయినా భారత దేశం రెండు రాజకీయ శిబిరాల మధ్య విభజితమైంది. ఈ విభజన కేవలం రాజకీయాలకే పరిమితం కాదని, అభివృద్ధి నుంచి ప్రజాసమస్యల వరకూ అవలంబించాల్సిన సైద్ధాంతిక దృక్పథానికి సంబంధించిందనేది స్పష్టం.

అయితే ఎంత వైవిధ్యం, ఎంత యువరక్తం ఉన్నా పార్లమెంట్‌లో సరైన చర్చలు జరగనంతవరకూ వాటి ప్రాధాన్యత ఏమీ ఉండదు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానం, బడ్జెట్ నుంచి కీలక బిల్లులు, స్వల్పవ్యవధి చర్చల వరకు ఒకరిపై మరొకరు దుమ్మెత్తి పోసుకోకుండా తమ అభిప్రాయాలను విస్పష్టంగా చెప్పే ఎంపీల కోసం దేశం ఎదురు చూస్తోంది. దేశం ఎదుర్కొనే సమస్యలను చర్చించాలంటే ఎంపీలు ముందుగా వాటిని లోతుగా అధ్యయనం చేయాలి. ఒక దృక్కోణం, దృక్పథం లేకుండా ఏ అంశంపై నైనా అలవోకగా ఊకదంపుడు ఉపన్యాసాలు చేసే వారు చాలా మంది ఉన్నారు. అయితే సభను ఆకట్టుకునే విధంగా విషయ పరిజ్ఞానంతో మాట్లాడేవారు తక్కువ. 17వ లోక్‌సభలో అత్యధిక తెలుగు ఎంపీలు తమ ఉనికిని నిరూపించుకోలేకపోయారన్నది వాస్తవం.

18వ లోక్‌సభలో నిరక్షరాస్యులు ఎవరూ లేరు. అత్యధిక సంఖ్యలో గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు ఉన్నారు. వృత్తిపరమైన డిగ్రీలు సాధించిన వారు, డాక్టరేట్లు, న్యాయవాదులు, సినీ కళారంగానికి చెందినవారు దాదాపు వంద మందికి పైగా ఉన్నారు. వందమంది వ్యాపారస్తులు కూడా ఉన్నారు. వీరందరి ప్రతిభను సరిగా ఉపయోగించుకోవాలంటే సభలో వారికి మాట్లాడే అవకాశం కల్పించాలి. మంత్రిత్వ శాఖలకు చెందిన స్థాయీ సంఘాల్లో వారిని చేర్చి మొక్కుబడిగా కాకుండా చైతన్యవంతంగా ప్రతి బిల్లును క్షుణ్ణంగా పరిశీలించేలా చూడాలి. న్యాయవ్యవస్థలో అత్యున్నత స్థాయిలో తీర్పు చెప్పగలిగేది సుప్రీంకోర్టు అయితే శాసన వ్యవస్థలో అత్యున్నత స్థాయిలో చర్చలు జరిపి ప్రజల భవిష్యత్తును నిర్ణయించగలిగే వేదిక పార్లమెంట్ మాత్రమే.

దురదృష్టకరమైన విషయం ఏమంటే పార్లమెంట్‌లో దేశ ప్రయోజనకరమైన అంశాలపై కంటే రాజకీయాలకు ఎక్కువ ప్రాధాన్యం లభిస్తోంది. 18వ లోక్‌సభలో రాజకీయాలను పక్కన పెట్టి దేశం ఎదుర్కొనే సమస్యలపై చర్చ జరిగేలా చూడాలి. మంచికో, చెడుకో ఇవాళ దేశ ప్రజలు రెండు కూటముల వైపే మొగ్గు చూపారు. ఎన్డీఏ కూటమి, ఇండియా కూటమిలో భాగం కాని పార్టీలను ప్రజలు దాదాపు తిరస్కరించారు. బిఆర్ఎస్, వైసీపీ, బిజెడి తదితర పార్టీలకు చెందినవారు కేవలం 18 మంది మాత్రమే ఉండగా మిగతా 525 మంది ఏదో ఒక కూటమికి చెందినవారే. ఎవరు ఒప్పుకోకపోయినా భారతదేశం రెండు రాజకీయ శిబిరాల మధ్య విభజితమైంది. ఈ విభజన కేవలం రాజకీయాలకే పరిమితం కాదని, అభివృద్ధి నుంచి ప్రజా సమస్యల వరకూ అవలంబించాల్సిన సైద్ధాంతిక దృక్పథానికి కూడా సంబంధించిందని భావించవలసి ఉంటుంది. ప్రస్తుత పార్లమెంట్‌లో రెండు వేర్వేరు సైద్ధాంతిక శిబిరాల అభిప్రాయాల బలమైన వ్యక్తీకరణకే కాని వ్యక్తుల ప్రాధాన్యతకు అంత తావు ఉండకూడదన్న స్పృహ ఇరు వర్గాలకు ఉండాలి. అప్పుడే పార్లమెంట్‌లో చర్చలు రసవత్తరంగా, అర్థవంతంగా మారుతాయి.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

చీకటి అధ్యాయం ముగిసింది

ఆంధ్రప్రదేశ్‌లో గత ఐదేళ్లుగా సాగుతున్న విధ్వంసక పాలనకు తెరపడింది. ఒక చీకటి అధ్యాయం ముగిసింది. ఈ ఐదేళ్ల రాష్ట్రంలో ఏమి జరిగిందో సింహావలోకనం చేసుకుంటే కనిపించేది కక్షలు, ఇదేంటని అడిగిన వారిపై దాడులు, కేసులు, అరెస్టులు. సాధారణ పరిపాలన అనేది మచ్చుకు కూడా కనబడదు. ప్రజాధనంతో నిర్మించిన ప్రజావేదిక కూల్చడంతోనే ఆ విధ్వంసక పాలన మొదలైంది. ప్రభుత్వం తీసుకున్న ఏ నిర్ణయమూ ప్రజారంజకంగానూ, ప్రజామోదకంగానూ లేదు. వీటిలో ముఖ్యమైనది, మూడు రాజధానుల ప్రస్తావన. తాను ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో సాక్షాత్తు శాసన సభలోనే అంగీకారం తెలిపి, తరువాత 2019 ఎన్నికల సందర్భంలో కూడా తాను అమరావతి రాజధానికి కట్టుబడి ఉన్నానని, అందుకే ఇక్కడ ఇల్లు నిర్మించుకున్నానని, నమ్మబలికిన జగన్మోహన్‌రెడ్డి, అమరావతిని నిర్వీర్యం చేసే ప్రయత్నంలో భాగంగా మూడు రాజధానుల ప్రస్తావన తెరమీదకు తీసుకువచ్చారు. ఆయనతోపాటు సహచర మంత్రివర్గ సభ్యులు కూడా ఎన్నికలకు ముందు అమరావతే రాజధాని అనే విషయాన్ని పలు సభల్లో ప్రస్తావించారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రికి భజనపరులుగా మారి అమరావతికి భూములు ఇచ్చిన రైతుల పట్ల హీనసంస్కృతిని ప్రదర్శించారు. మూడు రాజధానులకు వ్యతిరేకంగా ఉద్యమించిన రైతులను దారుణాతి దారుణంగా హింసించారు. బహుశా దేశంలో కానీ, ఇతర దేశాలలో కానీ 1631 రోజులు సుదీర్ఘంగా నడిచిన ఉద్యమం మరొకటి కానరాదు. ఎన్నో కష్టాలకు ఓర్చుకున్న రాజధాని రైతులు అంతిమ విజయం అందుకున్న తర్వాతనే ఉద్యమానికి ముగింపు పలికారు. అంతేకాదు, అమరావతి ఏకైక రాజధాని అనే నినాదానికి రాష్ట్రం అన్ని ప్రాంతాల నుండి మొన్నటి ఎన్నికల్లో సానుకూలత వచ్చింది. ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టే పాలకుల మోసాలను ప్రజలు తిప్పి కొట్టారు. అమరావతి ఉద్యమంలో అక్రమ కేసులు ఎదుర్కొంటున్న రైతులపై ఆ కేసులు ఎత్తివేయడం, ఉద్యమ సందర్భంలో ప్రాణాలు కోల్పోయిన రైతుల కుటుంబాలకు ఆసరా కల్పించడం, ఆగిపోయిన కౌలును విడుదల చేయించడం, అభివృద్ధి చేసిన ప్లాట్లను రైతులకు అందజేయడం వంటివి ఇకపై జరగాలి. వీటితో పాటు గత ప్రభుత్వపు నిర్లక్ష్యంతో అభివృద్ధి ఆలస్యం అవ్వడం వల్ల రైతులకు ఇస్తున్న కౌలు మరో మూడేళ్ల పొడిగించే ఏర్పాటు కూడా చేయాలి.

అమరావతి రైతు ఉద్యమం ఒకపక్క జరుగుతూండగా, సిఆర్‌డిఏ చట్టాన్ని రద్దు చేస్తూ పాలకులు అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టారు. అది శాసనమండలిలో వీగిపోవడంతో దానిని రద్దు చేయాలని ప్రయత్నించారు. అక్కడి నుంచి మొదలుపెట్టి వందలాది ప్రభుత్వ నిర్ణయాలు, హైకోర్టు, సుప్రీంకోర్టు గడపలెక్కాయి. ఎన్నిసార్లు న్యాయస్థానాలు ఆయా నిర్ణయాలను రాజ్యాంగ విరుద్ధమని చెప్పినా వినకుండా పదేపదే తప్పుడు నిర్ణయాలు తీసుకోవడం గత ప్రభుత్వపు అహంకారపూరిత చర్యగా ప్రజలు భావించారు. గత ప్రభుత్వ హయాంలో ఏ శాఖను ఎవరు నిర్వహిస్తున్నారో అర్థమయ్యేది కాదు. అందరి బదులు ఒకే ఒక్క సలహాదారు సకల శాఖల మంత్రిగా వ్యవహరించారు. ఏ మంత్రి కూడా తన శాఖలోని అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించడం కానీ, ఆ శాఖకు సంబంధించిన నిర్ణయాలను ప్రకటించడం కానీ గత ఐదేళ్లలో చూడలేదు. ప్రభుత్వం ఎప్పుడూ ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. ఈ లక్షణాలు మంత్రులలో కానీ, శాసనసభ్యులలో కానీ, ఇతర నాయకులలో కానీ లేని స్థితిని ప్రజలు గమనించారు. కాగా ఈ నాయకమ్మన్యులు మాట్లాడిన భాష అత్యంత జుగుప్సాకరంగా, హేయంగా ఉండడంతో ప్రజలు వీరిని అసహ్యించుకున్నారు. దాని పర్యవసానమే గత ఎన్నికలలో 151 సీట్లు గెలుచుకొని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, ఈ ఎన్నికల్లో 11 స్థానాలతో అథఃపాతాళానికి చేరుకుంది. అహంకారపూరిత భాషను ఉపయోగించే ఏ నాయకునికైనా ఇదే శాస్తి జరుగుతుందనే గుణపాఠం నాయకులందరూ నేర్చుకోవాలి.





అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం, గత ప్రభుత్వ పతనానికి కారణమైన అన్ని అంశాలను కేస్ స్టడీగా పరిశీలించి, ఆ తప్పులు మళ్ళీ జరగకుండా చర్యలు తీసుకోవాలి.

కేవలం సంక్షేమం ద్వారానే అధికారం నిలుపుకోగలం అని ఆలోచించే పాలకులకు ఈ ఎన్నికలు గట్టి గుణపాఠం చెప్పాయి. సంక్షేమ పథకాల సొమ్ము నాయకుల జేబు సొమ్ము కాదని, అధికారంలోకి ఏ పార్టీ వచ్చినా ఈ పథకాలు కొనసాగుతాయని ఆలోచనతో ప్రజలు ఉన్నారనేది ఈ ఎన్నికలు స్పష్టం చేశాయి. సంక్షేమం, అభివృద్ధి సమపాళ్ళలో మేళవించాలని గుర్తుచేశాయి. అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం, గత ప్రభుత్వ పతనానికి కారణమైన అన్ని అంశాలను కేస్ స్టడీగా పరిశీలించి, ఆ తప్పులు మళ్ళీ జరగకుండా చర్యలు తీసుకోవాలి. గతంలో ప్రారంభించిన రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు అన్నింటినీ కొనసాగించాలి. ముఖ్యంగా విద్యారంగంలో ఇటీవల చోటుచేసుకున్న అసంబద్ధ నిర్ణయాలను పునః సమీక్షించాలి. కుంటుపడిన అన్ని రంగాలను సమీక్షించి తక్షణ నివారణ చర్యలను తీసుకోవడం ద్వారా రాష్ట్రాన్ని ముందడుగు వేయించాలి.

◆ బండ్ల మాధవరావు

నిరంతర పోరాటాలతోనే విశ్వసనీయత

'జనఝంఝా ప్రభంజనం ధాటికి కొట్టుకెళ్లిన 'జగజ్జనులు' వ్యాసంలో (జూన్ 6 – ఆంధ్రజ్యోతి) చెరుకూరి సత్యనారాయణ సిపిఎంపై అనేక నిందారోపణలు చేసారు. ఈ వ్యాసంలో ఎక్కడా బీజేపీ ప్రమాదం గురించి ఒక్క మాట కూడా మాట్లడలేదంటే ఇది రాసింది నేనెరిగిన చెరుకూరి గారేనా లేక బీజేపీ వారా అనే అనుమానం కలిగింది. దేశ ప్రజలందరూ గుర్తించిన మోదీ మతోన్మాద రాజకీయాలను 'మా వామపక్షవాది' సత్యనారాయణ గుర్తించలేదంటే నమ్మగలమా?

అధికార పార్టీల జయాపజయాలు ఎలా ఉన్నా, ఓడిపోయింది 'మా వామపక్ష సోదరులే' అంటూ చెరుకూరి 'మా'పై దాడికి సిద్ధపడ్డారు. 'ముచ్చటగా మూడవసారి కూడా వారికి ప్రవేశం లేకుండానే ఆంధ్ర శాసనసభ కొలువుతీరింది' అని కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం లేనందుకు ముచ్చటపడుతున్నట్లు ఉంది. విధానాలకు కట్టుబడి, గాలివాటం రాజకీయాలకు కొట్టుకుపోనందుకు మమ్మలను నిందిస్తున్నారు. ఎన్నికల ధన ప్రళయ భీకర ప్రవాహంలో కూడా అటు ఇటు మొగ్గకుండా సిపిఎంకు అండగా అరకు పార్లమెంట్‌లో లక్షపాతిక వేలు, అరకు అసెంబ్లీలో 45 వేలు, పాడేరులో 27,700, రంపచోడవరంలో సుమారు 25 వేల మంది ఓటువేయడం సత్యనారాయణ దృష్టిలో కమ్యూనిస్టులకు దక్కిన 'గౌరవంగా' కనిపించలేదు.

1984 ఆగస్టులో కేంద్రంలోని కాంగ్రెసు ప్రభుత్వం ఎన్‌టిఆర్‌ను అధికారం నుంచి బర్తరఫ్ చేస్తే, ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం జరిగిన పోరాటాల్లో 1985 మధ్యంతర ఎన్నికల్లో అన్ని పక్షాలు కలిసి పనిచేయడాన్ని, నేటి పరిస్థితులకు ముడివేయాలని చూస్తున్నారు. తక్షణావసరంగా బీజేపీతో కలిసిన ఎన్‌టిఆర్ ఆ తర్వాత కొద్దికాలానికే అదే బిజెపీకి వ్యతిరేకంగా కేంద్రంలో వివిధ పార్టీలతో కలిసి నడచిన విషయం సత్యనారాయణకు జ్ఞాపకం లేదా? 'ఏపీలో కూడా మరోరకమైన ఎత్తుగడ ఎందుకు అనుసరించలేదు?' అని కమ్యూనిస్టులను ప్రశ్నిస్తున్నారు. అంటే బీజేపీతో కలిసిన వారితో మీరు ఎందుకు స్నేహం చేయలేదన్నది ఆయన ప్రశ్న. ఈయన కోరినట్లు చేయడం కమ్యూనిస్టుల మౌలిక స్వభావానికే కాక, నేటి తక్షణ దేశ పరిస్థితులకు అత్యంత ప్రమాదకరం కాదా? బీజేపీని బలపరిచే విధానాన్ని తప్పుపట్టినందుకు 'వామపక్ష శ్రేణులు ముఖ్యంగా సీపీఎం గాని, ఆ పార్టీకి చెందిన కొందరు మేధావులు గాని ఇద్దరు దొంగలపై పెట్టే విమర్శల్లో పెద్ద దొంగ పట్ల విమర్శల స్థాయి తక్కువ చేసి తమ విశ్వసనీయతను పోగొట్టుకున్నారట' ఈయన దృష్టిలో పెద్ద దొంగ అంటే వైసీపీ కావొచ్చు. మరీ బీజేపీ ఏ స్థాయి దొంగో చెప్పలేదు! కమ్యూనిస్టులకు విశ్వసనీయత అవి అనుసరించే ప్రజానుకూల విధానాల ద్వారా, చేసే ప్రజాపోరాటాల ద్వారా వస్తుందే తప్ప, సీట్ల కోసం ఏ ఎండకు ఆ గొడుగు పట్టడం ద్వారా రాదు.

'పార్టీ పార్లమెంటరీ ప్రజాపంథా స్వీకరించిన నాటి నుంచి... ఎత్తుగడల వైఫల్యాలు వున్నాయి' అని చెబుతున్నారు. పార్లమెంటరీ పంథా అంటే కేవలం ఓట్లు, సీట్లు అని ఈయన అనుకుంటున్నారు. పోనీ అదే అనుకున్నా పశ్చిమబెంగాల్, త్రిపురల్లో సుదీర్ఘకాలం, ప్రస్తుతం కేరళలో పరిపాలిస్తున్నది వామపక్షాలే కదా! సిపిఎం దృష్టిలో 'ఎత్తుగడలు' అంటే కేవలం ఎన్నికల కోసం వేసే జిమ్మిక్కులు కాదు, విప్లవోద్యమాన్ని నిర్మించే కృషిలో భాగంగా పార్లమెంటరీ, పార్లమెంటేతర రంగాల్లో అనుసరించే ఆచరణాత్మక పట్టువిడుపులు. చెరుకూరి వారు మాత్రం 'విప్లవోద్యమాన్ని ఎలాగూ నిర్మించలేం. కనీసం పార్టీని పార్లమెంటరీ పంథాలోనైనా సరైన ఎత్తుగడలతో నడిపి మరో ఐదేళ్ళ తర్వాతనైనా' అసెంబ్లీలోకి వెళ్లమని మాకు సలహా ఇస్తున్నారు. విప్లవోద్యమం ఉధృతంగా ఉన్నప్పుడు ఎవరైనా కలుస్తారు, నిలుస్తారు. కానీ శత్రువు కొత్త రూపాల్లో ప్రజలను భ్రమింపచేస్తున్నప్పుడు, ఎదురుదెబ్బలు తీవ్రమౌతున్నపుడు, భౌతిక శక్తి సన్నగిల్లుతున్నప్పుడు నమ్మిన ఆశయాన్ని తుదకంటూ కొనసాగించే కష్టజీవులు, వారికి నాయకత్వం వహించే కమ్యూనిస్టు పార్టీలు మాత్రమే ఇప్పటివరకు చరిత్రగతిని మార్చాయి. ప్రస్తుత పెట్టుబడిదారీ వ్యవస్థ ఎంత అసమానకరమైందో, ఎంత అనాగరికమైందో, ఎంత దుర్మార్గమైందో ప్రపంచ ఆర్థికవేత్తలు తాజాగా ప్రకటిస్తున్న నివేదికలు చాటిచెబుతున్నాయి. ఈ స్థితికి ప్రత్యామ్నాయం ఈ సమాజాన్ని మార్చడం తప్ప మరొకటి ఏముంది? ఒకవైపు పోరాటాల ద్వారా, అనుభవాల ద్వారా ప్రజాచైతన్యాన్ని పెంచడం, మరోవైపు శత్రువులు వారి అవసరాల కోసం కల్పించే అవకాశాలను ఉపయోగించుకుంటూ తక్షణ లక్ష్యాన్ని సాధించడానికి ఆచరణాత్మక విప్లవ ఎత్తుగడలు రూపొందించుకోవడం సిపిఎం విధానం.



ఎవరికి నచ్చినా, నచ్చకపోయినా మార్క్సిజం వెలుగులో పీడిత, తాడిత ప్రజల పక్షాన నిలబడడం, ఎంత పెద్ద ప్రజా శత్రువైనా ఎదురు నిలిచి కలబడడం, విజయాన్ని సాధించేవరకు పోరాడడం సిపిఎం విధానం. అది ఎవరు అధికారంలో ఉన్నా కొనసాగుతూనే ఉంటుంది.

ఈ ఐదేళ్ళ కాలంలో వైసీపీ ప్రభుత్వ వినాశకర విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరిగిన సమరశీల ప్రజా, కార్మిక ఉద్యమాలు సత్యనారాయణ గారికి గుర్తులేవేమో కాని, ఈ తెలుగు నేలమీద పోరాడిన ప్రతి ఒక్కరికీ సీపీఎం పోరాట విశిష్టత ఏమిటో తెలుసు. నాటి ఉద్యమాలకు ఏనాడూ కనీస మద్దతు కూడా ఇవ్వని వారు 'మా' ముసుగులో మాపై దాడి చేయడాన్ని ప్రజలు, కార్మికులు, అభ్యుదయ, ప్రజాతంత్రవాదులు హర్షించరు. ఎవరికి నచ్చినా, నచ్చకపోయినా మార్క్సిజం వెలుగులో పీడిత, తాడిత ప్రజల పక్షాన నిలబడడం, ఎంత పెద్ద ప్రజా శత్రువైనా ఎదురునిలిచి కలబడడం, విజయాన్ని సాధించేవరకు పోరాడడం సిపిఎం విధానం. అది ఎవరు అధికారంలో వున్నా కొనసాగుతూనే ఉంటుంది.

◆ వి. రాంభూపాల్
సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు





జగ్గయ్యపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు

మరో 15 మందికి..

పేటలో పెరుగుతున్న డయేరియా కేసులు

- పట్టణం, ఎస్‌ఎం పేట, వత్సవాయి మండలాల నుంచే అధికం
- పురపాలకశాఖ ఆర్డీ పర్యటన
- పారిశుధ్యం మెరుగుపడాలని ఆదేశం

జగ్గయ్యపేట, జూన్ 25 : జగ్గయ్యపేటలో డయేరియా బాధితులు రోజురోజుకూ పెరుగుతున్నారు. మంగళవారం మరో 15 డయేరియా కేసులు నమోదవడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. జగ్గయ్యపేట పట్టణంలో పలు ప్రాంతాలు, వత్సవాయి మండలం నుంచి కేసులు అధికంగా ఉన్నాయి. పట్టణంలో చెరువుబజార్‌కు చెందిన చరణ్ (14), చుట్టుచూపుగా తెలంగాణా రాష్ట్రం బాణాపురం నుంచి విద్యానగర్‌లో బంధువుల ఇంటికి వచ్చిన యంద్రాతి అఖిల్ (8), మార్కండేయబజార్‌కు చెందిన బి.దేవిశ్రీ (11), ఎర్రకాల్వకట్ట ప్రాంతానికి చెందిన వై.యశ్వంత్ (57), దుర్గాపురానికి చెందిన ఎస్.వెంకటరాజు (40), మిట్టగూడేనికి చెందిన షేక్ ఖాజాబీ (58), తొర్రగుంటపాలేనికి చెందిన పి.దుర్గాభవాని (32), వత్సవాయి మండలం గోపి నేనిపాలేనికి చెందిన దంపతులు ఆర్.హనుమంతు (45), పార్వతి (35), దేచుపాలేనికి చెందిన వి.లక్ష్మి (60), మంగోల్లుకు చెందిన వసీముద్దీన్ (16), జి.కోటేశ్వరరావు (38), జగ్గయ్యపేట మండలం షేర్‌మహ్మద్‌పేటకు చెందిన కుంభా గోపి (24), కే.స్వరాజ్యం (50), కే.మంగా (47) జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిలో 18 మందిని డిశ్చార్జ్ చేశామని, ముగ్గురిని విజయవాడకు మెరుగైన వైద్యం కోసం విజయవాడ పంపామని డీఎంహెచ్‌వో సుహాసిని తెలిపారు. స్వల్ప లక్షణాలు కనిపించినా ముందు జాగ్రత్తగా ఆసుపత్రిలో చేర్చి పరీక్షలు చేయిస్తున్నామని, తమ పర్యవేక్షణలో ఉంచుతున్నామని ఆమె వివరించారు.



జగ్గయ్యపేట నకాసిబజార్‌లో నీటి నమూనాలను పరీక్షిస్తున్న ఆర్డీ నాగ నరసింహారావు, కమిషనర్ మల్లేశ్వరరావు

పురపాలకశాఖ ఆర్డీ సందర్శన

- శానిటేషన్ మెరుగుపరచాలని ఆదేశం

రాజమండ్రి పురపాలకశాఖ ప్రాంతీయ సంచాలకులు (ఆర్డీ) నాగ నరసింహారావు మంగళవారం జగ్గయ్యపేటలో విస్తృతంగా పర్యటించారు. పారిశుధ్యం మెరుగుపడాలని అధికారులను ఆదేశించారు. తొలుత ప్రభుత్వాసుపత్రికి వెళ్లి రోగులతో మాట్లాడారు. వారికి డయేరియా సోకటానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యఆరోగ్య శాఖ డీఎంహెచ్‌వో డాక్టర్ సుహాసినితో చర్చించారు. వ్యాధి ఉధృతం కావటానికి, మరణాలు సంభవించటానికి గల కారణాలను తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలో సత్యనారాయణపురం వద్ద ఉన్న రిజర్వాయర్ వద్ద నీటి నామూనాలను స్వయంగా పరీక్షించారు. అక్కడ నుంచి నకాసిబజార్‌కు వెళ్లి అక్కడ పురపాలక సంఘం సరఫరా చేసిన మంచినీటి నమూనాలను పరీక్షించారు. డయేరియా రోగుల బంధువులను విచారించారు. పలుచోట్ల శానిటేషన్‌ను పరిశీలించారు. పురపాలకసంఘ కార్యాలయంలో నీటి సరఫరా, శానిటేషన్ అధికారులతో సమీక్షించారు. పురపాలకసంఘంలో పారిశుధ్యం మరింత మెరు గుపడాల్సి ఉందని సూచించారు. పైపులైన్ లీకేజీలను నియంత్రించాలని అధికారులను ఆదేశించారు. డయేరియా కేసులు అదుపులోకి వచ్చే వరకు వీధి వెంబడి వ్యాపారాలను నిలిపివేయాలని సూచించారు. 13 చోట్ల లీకేజీలను అరికట్టామని కమిషనర్ మల్లేశ్వరరావు తెలిపారు. మునిసిపల్ డీఈ శివకోటేశ్వరరావు, ఏఈ హనుమంతురావు, శానిటరీ ఇన్స్‌పెక్టర్ దుర్గా ప్రసాద్, ఆర్ఐ సునీల్ బాబు సమీక్షలో పాల్గొన్నారు.

ఈఎంఐ చెల్లించలేదని ప్రైవేట్ ఫైనాన్స్ ఒత్తిడి

- వారి ముందే ఇంట్లోకి వెళ్లి ఉరేసుకున్న మహిళ



6లో..



స్టేషన్ హౌస్ ఆఫీసర్ సీట్లో కూర్చోవాలి. అదీ ఏదోఒక పోలీస్‌స్టేషన్ కాదు. స్టేషన్ పరిధి పెద్దగా ఉండాలి. ఆదాయానికి అంతరాయం ఉండకూడదు. ఇదీ కొంతమంది ఇన్‌స్పెక్టర్ల ఆలోచన. అందుకు అనుగుణంగానే వారి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇటు ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్, అటు ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఆదాయం పుష్కలంగా ఉండే స్టేషన్లలో పోస్టింగ్‌ల కోసం ఇన్‌స్పెక్టర్లు పోటీ పడుతున్నారు. ఇప్పటికే ప్రజాప్రతినిధుల ఆశీస్సుల కోసం వారి గుమ్మం మెట్లు ఎక్కిన ఇన్‌స్పెక్టర్లు ఏ స్టేషన్‌లో పోస్టింగ్‌ను ఆశిస్తున్నారో ప్రతిపాదన చేసుకుని వచ్చారు. ఇప్పటికే రాజకీయ నేతల ఆశీస్సులు తీసుకోవడంతో ఉన్నతాధికారులు ఆశీస్సుల కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

హాట్ సీట్లు

ఆదాయం ఉన్న పోలీస్‌స్టేషన్ల కోసం ఆరాటం

పోస్టింగుల కోసం 8 పోలీస్‌స్టేషన్లపై ఇన్‌స్పెక్టర్ల గురి

- రోజురోజుకు పెరుగుతున్న పోటీ
- పగలు, రాత్రి పోస్టింగ్ ఆలోచనలే

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : పోలీసు కమిషనరేట్, కృష్ణాజిల్లాలో మొత్తం ఏడు హాట్ స్టేషన్లు ఉన్నాయి. ఏదోఒకలా ఆ స్టేషన్లలో కూర్చోవాలని ఇన్‌స్పెక్టర్లు ఆశిస్తున్నాయి. ఆ స్టేషన్ల పరిధిలో ఆర్థిక లావాదేవీలు, వాణిజ్యపరమైన సముదాయాలు ఎక్కువగా ఉండడంతో పలువురు ఇన్‌స్పెక్టర్లు ఆ స్టేషన్లపై మనస్సు పారేసుకున్నారని తెలుస్తోంది. ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ పటమట, భవానీపురం, ఇబ్రహీంపట్నం, వన్‌టౌన్, గవర్నరుపేట, జగ్గయ్యపేట పోలీసు స్టేషన్ల కోసం ప్రయత్నాలు చేస్తున్న ఇన్‌స్పెక్టర్ల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. మరోపక్క కృష్ణాజిల్లాలో విజయవాడను ఆనుకుని ఉన్న పెనమలూరు, గన్నవరం ఎస్‌హెచ్‌వో పోస్టులకు డిమాండ్ ఎక్కువగా ఉంది.

పేట పరిధిలో మద్యం మాఫియా నుంచి ఆదాయం

రాష్ట్ర సరిహద్దు ప్రాంతం జగ్గయ్యపేట పరిధిలో ఉంటుంది. ఇక్కడ రెండు రాష్ట్రాల చెక్‌పోస్టులు ఉంటాయి. మద్యం మీద ఆదాయాన్ని మరిగిన మాఫియా తెలంగాణ నుంచి మద్యం సరుకును అక్రమంగా తీసుకొచ్చి జగ్గయ్యపేటకు చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లో డంపింగ్ చేస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న సిబ్బందికి నెలావారీ ముడుపులు అందినట్టు ప్రచారం నడుస్తోంది.

హోల్‌సేల్ వ్యాపారాలకు నెలవుగా వన్‌టౌన్, భవానీపురం

వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వాణిజ్య ప్రాంతమంతా ఉంది. హోల్‌సేల్, బంగారం వ్యాపారాలకు వన్‌టౌన్ కేంద్ర బిందువు. సక్రమంగా సాగే వ్యాపారాలతోపాటు అక్రమ వ్యాపారాలకూ వన్‌టౌన్ కేంద్రంగా ఉందన్నది బహిరంగ రహస్యం. స్మగ్లింగ్ బంగారాన్ని తీసుకొచ్చి విక్రయించే ముఠా ఇక్కడ పనిచేస్తోందని ఆరోపణలు బలంగా ఉన్నాయి. దీనితోపాటు గుట్కా సరఫరా ముఠా వన్‌టౌన్ నుంచే పనిచేస్తుందని పలుమార్లు గుర్తించారు. భవానీపురంలో హోల్‌సేల్ మార్కెట్లు ఉన్నాయి. గొల్లపూడి కేంద్రంగా హోల్‌సేల్ వ్యాపారం సాగుతోంది. మరోపక్క ఐరన్ యార్డ్ ఉంది. ఐరన్ హోల్‌సేల్ వ్యారానికి భవానీపురం నెలవు.

వ్యాపార కేంద్రంగా పటమట

పటమట పోలీస్‌స్టేషన్ స్వరూపం భిన్నంగా ఉంటుంది. దీని పరిధిలో ఎక్కువగా ఖరీదైన వ్యాపారాలు జరుగుతాయి. బందరు రోడ్డు కొంతభాగం ఈ స్టేషన్ పరిధిలోకి వస్తుంది. ఆసియాలోనే అతిపెద్ద ఆటోనగర్ ఇక్కడే ఉంది.

విద్యాసంస్థల కేంద్రం పెనమలూరు..

పెనమలూరు పోలీసుస్టేషన్ విజయవాడను ఆనుకుని ఉంటుంది. కొత్త ఆటోనగర్, గోశాల వరకు బందరు రోడ్డుతోపాటు ప్రముఖ విద్యాసంస్థలన్నీ ఈ స్టేషన్ పరిధిలోనే ఉన్నాయి. గన్నవరం పోలీస్‌స్టేషన్ పరిధిలోనే విజయవాడ విమానాశ్రయం ఉంది. విమానాశ్రయం లోపలి భద్రత సీఐఎస్ఎఫ్ పరిధిలో ఉంటుంది. బయట ప్రాంతమంతా స్థానిక పోలీసుల పరిధిలోనే ఉంటుంది. ఈ ఎనిమిది పోలీస్‌స్టేషన్లకు కమిషనరేట్ కార్యాలయం విడుదల చేసే నిధుల కంటే వివిధ మార్గాల ద్వారా వచ్చే ఆదాయం ఎక్కువగా ఉంటుంది. ఈ కారణంగానే ఆయా స్టేషన్లలో పోస్టింగ్ కోసం ఇన్‌స్పెక్టర్లు పోటీ పడుతున్నట్టు తెలుస్తోంది.

సముద్రపు దొంగలు దొరికేనా?

- నిందితుడు శ్రీనివాసరావు ఫోన్ పరిశీలన
- సీడీఆర్‌ను పరిశీలిస్తున్న అటవీ శాఖాధికారులు

విజయవాడ, జూన్ 25(ఆంధ్రజ్యోతి) : సముద్రగర్భంలో 10-20 కిలోమీటర్లకు దిగువున ఉన్న అరుదైన జలరాశులు 'సీ ఫ్యాన్స్'ను బయటకు తీసుకొచ్చిన కేసులో దర్యాప్తును అటవీ శాఖాధికారులు వేగవంతం చేశారు. నిందితుడు శ్రీనివాసరావు విచారణలో ఎలాంటి వివరాలూ వెల్లడించకపోవడంతో సాంకేతిక అడుగులు ముందుకు వేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా నిందితుడి సెల్‌ఫోన్ కాల్ రికార్డ్స్‌ను పరిశీలిస్తున్నారు. శ్రీనివాసరావు తన ఫోన్ నుంచి ఏ నంబర్లకు ఫోన్ చేశాడో జాబితాలను వడబోస్తున్నారు. ఇప్పటికే ఒక బృందం సైబర్ ల్యాబ్‌లో ఈ పని చేస్తున్నట్టు తెలిసింది. అక్షయనిధి పేరుతో షాపును కొన్ని నెలల ముందే తెరిచానని



శ్రీనివాసరావు అధికారులకు వెల్లడించాడు. విజయవాడ అయ్యప్పనగర్‌లో అతడు ఏడాదిన్నర నుంచి ఈ వ్యాపారం చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు. అప్పటి నుంచి శ్రీనివాసరావు సెల్‌ఫోన్‌ను విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా రెండు, మూడు నంబర్ల నుంచి శ్రీనివాసరావుకు అధికంగా కాల్స్ రావడం, అతడి నుంచి కాల్స్ వెళ్లడం జరిగినట్టు అధికారులు గుర్తించారని తెలిసింది. ఆ నంబర్లు ఎవరివో తేల్చే పనిలో అధికారులు ఉన్నారు. చెన్నై కేంద్రంగా పనిచేస్తున్న వైల్డ్‌లైఫ్ జస్టిస్ కమిషన్ కేసును పర్యవేక్షిస్తుండడంతో అటవీశాఖ జిల్లా అధికారులు అత్యంత జాగ్రత్తగా దర్యాప్తులో అడుగులు వేస్తున్నారు. 'సీ ఫ్యాన్స్'కు ముళ్లపొదలా ఉండే భాగానికి పైన తెల్లటి పదార్థం ఉంటుంది. వీడియోల్లో చూసినప్పుడు ఇది ముత్యంలా మెరుస్తుంది. నీటిలో నుంచి పైకి తీసుకొచ్చిన చనిపోయిన 'సీ ఫ్యాన్'కు ఈ తెల్లటి పదార్థాన్ని తొలగించారని అధికారులు గుర్తించారు. 'సీ ఫ్యాన్స్' శరీరం పూర్తిగా ఆరిపోయిన తర్వాత ఫొటో ఫ్రేమ్‌లను తయారు చేసే యంత్రంపై వాటి తల భాగాన్ని తొలగించినట్టు అధికారులు భావిస్తున్నారు. మొత్తంగా 'సీ ఫ్యాన్స్' స్మగ్లింగ్‌లో సముద్రపు దొంగలు ఎవరన్నది ఇంకా పూర్తిగా నిర్ధారణ కాలేదు.

పనులు శూన్యం.. బిల్లులు ఘనం



పునాదుల దశను దాటని బాలికల వసతి గృహ నిర్మాణం

కృష్ణా యూనివర్శిటీలో భవనాల నిర్మాణం ప్రహసనంగా మారింది. భవన నిర్మాణ అంచనాలు కాగితాలపై ఘనంగా పెంచుతున్నారే తప్ప నిర్మాణం మాత్రం ముందుకు సాగడం లేదు. వీసీలు, రిజిస్ట్రార్‌లుగా ఎవరొచ్చినా భవనాల నిర్మాణ పనులను మాత్రం పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారు. ఏడాది క్రితం భవన నిర్మాణాల అంచనాలను పెంచుతూ యూనివర్శిటీ భవన నిర్మాణ కమిటీ తీర్మానం చేసింది. పునాదుల దశలో ఉన్న నిర్మాణాలకు కోట్లాది రూపాయల బిల్లులు కూడా చెల్లించారు. బిల్లులు తీసుకున్న కాంట్రాక్టర్లు నిర్మాణాలు చేయకుండా విస్మకుండిపోయినా యూనివర్శిటీ అధికారులు ఏడాదిగా పెదవి విప్పడంలేదు. దీంతో ఇక్కడి భవనాల నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారాయి.

కృష్ణా యూనివర్శిటీలో భవనాల నిర్మాణంలో మతలబు

పనులు చేయకుండానే గత ప్రభుత్వంలో అంచనాలు పెంపు

- రూ.43.31 కోట నుంచి 51.19 కోట్లకు పెరుగుదల
- రెండేళ్లుగా భవనాల నిర్మాణ పనులు శూన్యం
- పునాదుల దశ దాటని నిర్మాణాలకు రూ.కోట్లలో బిల్లుల చెల్లింపు
- మానవ వనరులు, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్‌కు ప్రొఫెసర్ల ఫిర్యాదు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కృష్ణా యూనివర్శిటీ ప్రాంగణంలో బాలికలు, బాలుర వసతిగృహాలు, ఫార్మసీ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల, క్యాంపస్ చుట్టూ ప్రహరీ, ప్రధాన ప్రవేశద్వారం, నూజివీడు పీజీ సెంటరులో అకడమిక్ బ్లాక్‌పై జీ+2, బాలికల వసతిగృహం కోసం రూ.43.31 కోట్లతో తొలుత అంచనాలు రూపొందించారు. వీటి నిర్మాణం ఆలస్యం కావడంతో ఏడాదిక్రితం ఈ అంచనాలను రూ.51.19 కోట్లకు పెంచుతూ యూనివర్శిటీ భవన నిర్మాణకమిటీ నిర్ణయం తీసుకుంది. పెంచిన అంచనాల మొత్తం రూ.7.87 కోట్లుగా ఉంది. యూనివర్శిటీ భవన నిర్మాణ కమిటీలో ఉన్న 11 మంది సభ్యుల్లో ఇతర యూనివర్శిటీల్లో పనిచేసే నిపుణులను కూడా సభ్యులుగా చేర్చాల్సి ఉండగా మొక్కుబడిగా రెండు, మూడు పేర్లు చేర్చారు. యూనివర్శిటీలో పనిచేసే అధ్యాపకులనే ఈ కమిటీలో అధికంగా చేర్చి ఈ అంచనాలకు ఆమోదం తెలపడం గమనార్హం. కమిటీలో ఉన్న 11 మందిలో ఏడుగురు సభ్యులే అంచనాల పెంపునకు ఆమోదం తెలుపుతూ సంతకాలు చేశారు.

కట్టని భవనాలకు పర్యవేక్షణ కోసం..

యూనివర్శిటీలో భవనాల నిర్మాణం జరగకున్నా పనుల పర్యవేక్షణ కోసం ఏపీ డబ్ల్యూఐపీడీసీతో యూనివర్శిటీ అధికారులు ఒప్పందం చేసుకున్నారు. పనులు పర్యవేక్షించినందుకుగాను పనుల విలువలో 4 శాతం, క్వాలిటీ కంట్రోల్ పనులను పర్యవేక్షించినందుకుగాను 0.5 శాతం చార్జీల రూపంలో చెల్లించేలా 2022 డిసెంబరులో ఒకసారి, 2023 జనవరిలో మరోసారి ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ విభాగం అధికారులు పనులను పర్యవేక్షించేందుకు ఇక్కడ అందుబాటులో ఉండనే ఉండరు. ఏపీ డబ్ల్యూఐపీడీసీ అధికారులు పర్యవేక్షణ చేస్తున్నట్టుగా ఒకవైపు చూపుతూనే, మరోవైపు ఏపీ హౌసింగ్ కార్పొరేషన్‌లో ఈఈగా పనిచేసి పదవీ విరమణచేసిన ఒకరిని పనుల పర్యవేక్షణ నిమిత్తం నెలకు రూ.50వేల జీతంతో, మరో ప్రైవేటు ఇంజనీరుకు నెలకు రూ.25వేల జీతంగా ఇస్తూ నియామకం చేయడం గమనార్హం. ఏపీ డబ్ల్యూఐపీడీసీకి, ఈ ఇద్దరు ఇంజనీర్లకు లక్షలాది రూపాయల నగదును యూనివర్శిటీ నుంచి చెల్లించడం గమనార్హం. కూటమి ప్రభుత్వం ఆదేశాలతో రెండు, మూడు రోజుల క్రితం పనులను పర్యవేక్షిస్తున్న ఈఈని తొలగించారు. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వ హయాంలో యూనివర్శిటీలో భవనాల నిర్మాణానికి ఎలాంటి నిధులూ విడుదల చేయలేదు. యూనివర్శిటీలో చదివే విద్యార్థుల నుంచి ఫీజుల రూపంలో వసూలు చేసిన నగదును భవనాల నిర్మాణం, ఇతరత్రా ఖర్చులకు వినియోగించడం గమనించదగ్గ అంశం.

పునాదుల దశను దాటని హాస్టల్ భవనాల నిర్మాణం

కృష్ణా యూనివర్శిటీ ప్రాంగణంలో బాలుర వసతిగృహానికి తొలుత రూ.8.69 కోట్లతో అంచనాలు రూపొందించారు. ఈ మొత్తాన్ని రూ.5.49 కోట్లకు తగ్గించారు. రూ.2.22 కోట్లను బిల్లులుగా చెల్లించారు. బాలికల వసతిగృహానికి తొలుత రూ.8.69 కోట్లతో అంచనాలు రూపొందించారు. ఈ మొత్తాన్ని రూ.14.62 కోట్లకు పెంచారు. ఇందులో రూ.2.99 కోట్లను బిల్లులుగా చెల్లించారు. రెండేళ్ల క్రితం ఈ రెండు హాస్టళ్ల భవనాల నిర్మాణం ప్రారంభించినా పనులు పునాదుల దశలోనే నిలిచిపోయాయి. ఫార్మసీ కళాశాల భవనం నిర్మాణం అంచనాను రూ.6 కోట్ల నుంచి రూ.10.01 కోట్లకు పెంచారు. రూ.3.57 కోట్లను బిల్లులుగా చెల్లించారు. ఇంజనీరింగ్ కళాశాల భవనం నిర్మాణ అంచనాలను రూ.6.20 కోట్ల నుంచి రూ.4.21 కోట్లకు తగ్గించారు. ఇందులో రూ.3.27 కోట్లను బిల్లులుగా చెల్లించారు. ఈ రెండు భవనాల నిర్మాణం ప్రస్తుతం జరగడంలేదు. ఫుడ్‌కోర్టు అంచనాలను రూ.1.50 కోట్ల నుంచి రూ.3.20 కోట్లకు పెంచారు. ఈ భవన నిర్మాణం సగం మాత్రమే పూర్తయింది. రూ.73 లక్షలను బిల్లులుగా చెల్లించారు. యూనివర్శిటీ చుట్టూ ప్రహరీ నిర్మాణం కోసం రూ.3.02 కోట్లతో రూపొందించిన అంచనాలను రూ.4.80 కోట్లకు పెంచారు. రూ.1.06 కోట్లను బిల్లులుగా చెల్లించారు. ప్రహరీ నిర్మాణ పనులు రెండు సంవత్సరాలుగా అసంపూర్తిగానే ఉన్నాయి. ప్రధానగేటు, ఆర్చీ నిర్మాణం కోసం రూ. 30 లక్షలతో రూపొందించిన అంచనాలను రూ.72 లక్షలకు పెంచారు. రూ.8 లక్షలను బిల్లులుగా చెల్లించారు. నూజివీడు పీజీ సెంటరులో అకడమిక్ బ్లాక్ జీ+2 పద్ధతిలో భవనాల నిర్మాణకోసం తొలుత రూ.5.50 కోట్లతో అంచనాలు రూపొందించి ఈ మొత్తాన్ని రూ.6.65 కోట్లకు పెంచారు. రూ.3.95 కోట్లను బిల్లులుగా చెల్లించారు. బాలికల వసతి గృహం ఫస్ట్‌ఫ్లోర్ నిర్మాణం కోసం రూ.1.10 కోట్ల అంచనాలు రూపొందించగా, ఈ మొత్తాన్ని రూ.1.45కోట్లకు పెంచారు. రూ. 85.75 లక్షలను బిల్లులుగా చెల్లించారు. భవనాల నిర్మాణం సక్రమంగా జరగకున్నా అంచనాలు పెంచడం, వాటికి కోట్లాది రూపాయల బిల్లులు చెల్లించడంలో యూనివర్శిటీ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవడం వెనుక బలమైన కారణాలు ఉన్నాయనే గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేయించాలని కోరుతూ ఇటీవల రాష్ట్ర మానవ వనరులు, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్‌కు కొందరు ప్రొఫెసర్లు, తెలుగునాడు స్టూడెంట్స్ ఫెడరేషన్ నాయకులు పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేశారు.

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగా విజయవాడ తూర్పు బైపాస్ ప్రాజెక్టు మూలన పడింది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నపుడు వెస్ట్ బైపాస్‌తో పాటుగా తూర్పు బైపాస్ ప్రాజెక్టుకు కూడా కేంద్రానికి ప్రతిపాదించింది. రాజధాని అవుటర్ రింగ్ రోడ్డు నేపథ్యంలో, ఈ ప్రాజెక్టు ప్రతిపాదన ముందుకు కదల్లేదు. అవుటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టును కొనసాగిస్తూనే విజయవాడ తూర్పు బైపాస్ రోడ్డుపై కూడా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మచిలీపట్నం - హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించటానికి, విజయవాడ వెలుపల నుంచి గుంటూరుకు రాకపోకలు సాగించే భారీ వాహనాల ట్రాఫిక్ రద్దీని తగ్గించటానికి తక్కువ ఖర్చులో విజయవాడ తూర్పు బైపాస్ ఉపయోగపడుతుంది. ఈ ప్రాజెక్టుకు పెద్దగా ఖర్చు, సమయం కూడా పట్టే అవకాశాలు ఉండవు.

తూర్పు బైపాస్‌పై ప్రతిష్టంభన

వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ప్రాజెక్టు

- గత టీడీపీ ప్రభుత్వం ప్రతిపాదించిన అలైన్‌మెంట్‌కు అడ్డగోలుగా మార్పు
- డీపీఆర్ సిద్ధమైనా ముందుకు సాగని రహదారి పనులు
- మంగళగిరి నియోజకవర్గం మీదుగానే సింహభాగం రాకపోకలు
- కూటమి ప్రభుత్వం దృష్టి పెడితేనే ప్రాధాన్యమైన తూర్పు బైపాస్ పనులు సాగేది

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వైసీపీ ప్రభుత్వం అమరావతి అవుటర్ రింగ్ రోడ్డును పక్కన పెట్టిన తర్వాత.. విజయవాడ తూర్పు బైపాస్‌ను తెరమీదకు తెచ్చినా.. దీని అలైన్‌మెంట్‌ను మార్చింది. వైసీపీ ప్రభుత్వ పెద్దలు భారీ ఎత్తున గన్నవరం వైపు భూములు కొని ఉన్నారు. మాజీ మంత్రి, ఆయన అనుచరులకు సంబంధించిన వెంచర్లు, స్థానిక ప్రజాప్రతినిధులకు సంబంధించిన వెంచర్లు ఎక్కువగా ఉన్న ప్రాంతం మీదుగా ఈస్ట్ బైపాస్ అలైన్‌మెంట్‌ను మార్చేలా ఒత్తిళ్లు తీసుకొచ్చారు. దీంతో చిన్న అవుటపల్లి నుంచి మొదలు కావాల్సిన తూర్పు బైపాస్‌ను పొట్టిపాడు టోల్‌ప్లాజా దగ్గర నుంచి మొదలయ్యేలా అలైన్‌మెంట్ మార్పించారు. డీపీఆర్‌లో ఇచ్చిన ఆప్షన్లలో దీనినే

- మిగతా 6లో

చింతలపూడిని పూర్తి చేయండి

▸▸ జలవనరులశాఖ మంత్రిని కోరిన టీడీపీ నేతలు


మంత్రి నిమ్మలను కలిసిన టీడీపీ నేతలు

ఇబ్రహీంపట్నం, జూన్ 25 : ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి మెట్ట ప్రాంతాల రైతుల వరప్రదాయిని చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేయించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు జంపాల సీతారామయ్య, కేవీవీ సత్యనారాయణ (విజయబాబు)లు రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడ్ని కోరారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు వారు మంగళవారం మంత్రిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. టీడీపీ హయాంలో తొమ్మిది నియోజకవర్గాల్లో 33 మండలాల్లో 4.80 లక్షల ఎకరాలకు సాగునీటితో పాటు అనేక ప్రాంతాలకు తాగునీరు అందించేందుకు సుమారు రూ.4,900 కోట్లతో పనులు ప్రారంభించి 72శాతం పూర్తి చేస్తే తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం గడచిన ఐదేళ్లలో ప్రాజెక్టుకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా రైతు ప్రయోజనాలను గాలికొదిలేసిందని మంత్రికి వివరించారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ సమస్యను సత్వరమే పరిష్కరించి ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను విడుదల చేయించి ఈపథకాన్ని పూర్తిచేసి రైతులకు సాగునీరు అందించాలని మంత్రికి విన్నవించారు. కార్యక్రమంలో మైలవరం ఏఎంసీ మాజీ చైర్మన్ ఉయ్యూరు వెంకట నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య లేకుండా చూడండి : రవీంద్ర


ఇరిగేషన్ మంత్రి నిమ్మలతో రవీంద్ర, సారథి

మచిలీపట్నం టౌన్, జూన్ 25 : ఖరీఫ్ సాగు సమీపిస్తున్న దృష్ట్యా మచిలీపట్నం నియోజకవర్గంలో సాగునీటితో పాటు తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును ఎక్సైజ్, గనుల శాఖా మంత్రి కొల్లు రవీంద్ర కోరారు. సచివాలయంలో ఇరిగేషన్ శాఖా మంత్రి రామానాయుడితో సాగు, తాగునీటి సమస్యపై మంత్రి చర్చించారు. ఈ చర్చల్లో సమాచార శాఖా మంత్రి కె.పి.సారథి కూడా పాల్గొన్నారు.

వెంకయ్యనాయుడుని కలిసిన వెనిగండ్ల



గుడివాడ : భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడిను మంగళవారం ఢిల్లీలోని ఆయన స్వగృహంలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము వెంకయ్యనాయుడుతో ముచ్చటించారు. ప్రజలకు మంచి చేసేలా రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించాలని సూచించినట్టు చెప్పారన్నారు.

బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించండి

▸▸ నారా లోకేశ్‌కు ఎస్సీ, ఎస్టీ టీచర్ల సంఘం నేతల వినతి



మచిలీపట్నం టౌన్ , జూన్ 25 : బోధనేతర పనులను ఉపాధ్యాయులకు అప్పగించవద్దని, టీచర్ల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్‌కు మంగళవారం అమరావతిలో ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మద్ది బాబూ రాజేంద్ర ప్రసాద్ వినతిపత్రం సమర్పించారు. లోకేశ్‌ను రాజేంద్ర ప్రసాద్, సీహెచ్ వెంకటేశ్వర్లు కలిసి టీచర్ల సమస్యలపై చర్చించారు. హైస్కూల్ ప్లస్ టు విద్యలో లోపాలను సవరించాలని, ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి మెరుగైన విద్య నందించాలన్నారు. 117 జీవోను రద్దు చేసి నష్టపోయిన పాఠశాలలకు న్యాయం చేకూర్చాలన్నారు. దీనిపై చర్చలు జరుపుతామని లోకేశ్ హామీ ఇచ్చినట్టు తెలిపారు. మంత్రి లోకేశ్‌ను ఏపీ ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘ రాష్ట్ర సహాధ్యక్షుడు జి.మెహది తదితరులు కలిసి టీచర్ల సమస్యలను వివరించారు.


మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో

దుర్గమ్మసేవలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దంపతులు

వన్‌టౌన్ : దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో కనకదుర్గమ్మను మంగళవారం రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. వీరికి ఈవో కేఎస్ రామారావు, అధికారులు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.


నిడమానూరులో ఏపీ స్టేట్ బెవరేజెస్ సంస్థ సిబ్బంది ఆందోళన

మా ఉద్యోగాలకు భద్రత కల్పించండి

▸▸ ఏపీ స్టేట్ బెవరేజ్ కార్పొరేషన్ సిబ్బంది ఆందోళన

గుణదల, జూన్ 25 : నూతన మద్యం పాలసీ విధానంపై తమకు ఎటువంటి అభ్యంతరం లేదని.. అయితే తమ ఉద్యోగాలకు భద్రత కల్పించాలంటూ నిడమానూరులో ఏపీ స్టేట్ బెవరేజ్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ పరిధిలో మద్యం దుకాణాల్లో పని చేస్తున్న సిబ్బంది రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. నిడమానూరులోని సంస్థ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కోరుకొండ రమేశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన మద్యం పాలసీ అమలుతో తమ ఉద్యోగాలకు భద్రత లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు, సేల్స్ మెన్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో డిస్ట్రిక్ సెలక్షన్ కమిషన్ ద్వారా 80మంది సూపర్‌వైజర్లు, 250మంది సేల్స్‌మెన్‌లు నియమితులయ్యారన్నారు. టెండర్ పాలసీ ప్రవేశపెట్టబోతున్నట్టు ప్రసార మాధ్యమాల్లో కథనాలు తెలుసుకుని ఆందోళనకు దిగినట్టు చెప్పారు. తామంతా ప్రభుత్వ నిర్ణయానికి కట్టుబడి పని చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాధవరావు, విజయ్‌రామ్, బి.సతీష్, ఎస్. రాజేష్, కళ్యాణ్, నాగరాజు, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎంఎస్ఎంఈ అంతర్జాతీయ దినోత్సవం

వన్‌టౌన్, జూన్ 25 : ఈ నెల 27వ తేదీన ఎంఎస్ఎంఈ అంతర్జాతీయ దినోత్సవ వేడుకలను విజయవాడలోని హోటల్ ఫార్చ్యూన్ మురళీ పార్కులో నిర్వహిస్తున్నట్టు ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ స్మాల్, మీడియం ఇండస్ట్రీస్ అసోసియేషన్ పేర్కొంది. మంగళవారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అధ్యక్షుడు వాసిరెడ్డి మురళీకృష్ణ, కార్యదర్శి ఇ.పూర్ణచంద్రరావు, ఎస్.వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ, గురువారం జరిగే వేడుకలకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో పాటు అసోసియేషన్ సంయుక్త నిర్వహణలో ఈ వేడుకలు జరుగుతాయని తెలిపారు. ఆరోజు ఉదయం 9.30 గంటల నుంచి సభ్యుల నమోదు కార్యక్రమం మొదలవుతుందని మధ్యాహ్నం 12.40 గంటలకు ముగింపు, రిమార్కులతో కార్యక్రమం ముగుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎంఈ మంత్రిగా కొండపల్లి శ్రీనివాస్‌ను నియమించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. వేడుకలలో 'ఆర్థిక వ్యవస్థ వెన్నుముకను శక్తివంతం చేయడం' అనే అంశంపై ప్యానల్ చర్చలు ఉంటాయని ఉన్నతాధికారులు పలువురు ప్రసంగిస్తారని తెలిపారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ వాసు సమావేశంలో పాల్గొన్నారు.

నీరు పారేదెలా!


ఏలూరు, రైవస్ కాల్వల్లో పేరుకుపోయిన తూడు, గుర్రపు డెక్క

▸▸ కాల్వల్లో అడ్డంగా పేరుకుపోయిన తూడు, డెక్క

గుణదల, జూన్ 25 : ఖరీఫ్‌కు సమయం ఆసన్నం కాగా.. పంటపొలాలకు సాగునీరు వదిలితే కాల్వల్లో నీరు పారుదల అయ్యే పరిస్థితి లేదు. కృష్ణానది నుంచి వచ్చే నీరు కాల్వల ద్వారా దిగువ ప్రాంతాల్లోని పంటపొలాలకు చేరుతుంది. అయితే కాల్వలు వదిలినా నీరు పారుదల అయ్యేందుకు పరిస్థితులు అనుకూలంగా లేవనే చెప్పాలి. గత పాలకులు కాల్వల్లో పూడిక తీయడం.. ఎక్కడికక్కడ పేరుకుపోయిన తూడు, గుర్రపు డెక్కను తొలగించే ప్రయత్నం చేయకపోవడంతో కాల్వల్లో భారీగా పేరుకుపోయింది. దీంతో రైవస్, ఏలూరు, బుడమేరు కాల్వల్లో తూడు, గుర్రపు డెక్క పేరుకుపోయి పంటపొలాలను తలపిస్తున్నాయి. నీటిపారుదలశాఖ అధికారులు ఇప్పటికైనా కాల్వల్లో పూడిక తీసిన తర్వాత కాల్వల్లో నీరు వదిలే ప్రయత్నం చేస్తే దిగువ ప్రాంతాలకు నీరు సజావుగా పారుదల అవుతుందన్నది రైతుల వాదన. ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని రైతులు పేర్కొంటున్నారు.


నీటిపారుదలశాఖ, విద్యుత్‌శాఖ అధికారులతో యార్లగడ్డ వెంకట్రావు

సకాలంలో నీరందించండి

▸▸ ఎమ్మెల్యే యార్లగడ్డ

గుణదల, జూన్ 25 : మెట్టప్రాంత భూములకు సాగునీటి విడుదల విధానం, పంట కాల్వల పూడికతీత పనులపై క్షేత్రస్థాయిలో అధ్యయనం జరిపి నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను గన్నవరం నియోజకవర్గం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశించారు. నీటిపారుదలశాఖ, వ్యవసాయ శాఖ, విద్యుత్‌శాఖఅధికారులతో నగరంలోని ఫన్‌టైమ్స్‌క్లబ్ రోడ్‌లోగల క్యాంపు కార్యాలయంలో యార్లగడ్డ వెంకట్రావు మంగళవారం సమావేశం నిర్వహించారు. కరీఫ్ సాగు ప్రారంభం అవుతున్న వేళ గన్నవరం నియోజకవర్గం పరిధిలోని రైతుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని యార్లగడ్డ వెంకట్రావు అధికారులను ఆదేశించారు. పట్టిసీమ కాలువ ద్వారా మెట్ట ప్రాంత భూములకు సాగునీరు అందించేందుకు ఏయే ప్రాంతాల్లో మోటర్లు అవసరమౌతాయో క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని అధికారులను కోరారు. పంటకాల్వల పూడికతీత పనులు చాలా కాలంగా పెండింగ్ ఉన్నందున వాటిని వెంటనే బాగుచేసేందుకు దృష్టిసారించాలన్నారు. రైతు సంఘాల నేతలు, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పని చేస్తే మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు.

గుర్రపుడెక్కతో నిండిపోయిన ఏనుగులకోడు

▸▸ ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని రైతుల వినతి

తోట్లవల్లూరు, జూన్ 25 : తోట్లవల్లూరు మండలంలో మేజర్ డ్రెయిన్‌గా ఉన్న ఏనుగులకోడు డ్రెయిన్ గుర్రపుడెక్కతో నిండిపోయింది. గత వైసీపీ సర్కారు డ్రెయినేజీల ఆధునీకరణను, సాగునీటి రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేయటంతో ఈ దుస్థితి నెలకొంది. పెనమలూరు, తోట్లవల్లూరు, పమిడిముక్కల మండలాల పరిధిలో విస్తరించి వున్న ఏనుగులకోడు డ్రెయిన్ వేల ఎకరాల్లోని మురుగును దిగువకు తీసుకెళుతుంది. గుర్రపుడెక్క నిర్మూలన చేయకపోతే మరో పది రోజుల్లో వేయనున్న వరి నాట్లకు ముంపు బెడద తప్పదని వల్లూరుపాలెంకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ చెన్నుపాటి పూర్ణచంద్రరావు తెలిపారు. గతేడాది వరినాట్లు ఏనుగులకోడు డ్రెయిన్‌లో గుర్రపుడెక్క కారణంగా ముంపునకు గురై చనిపోయాయయని, రెండవసారి నాట్లు వేసుకోవలసి వచ్చిందన్నారు. గుర్రపుడెక్క నిర్మూలనకు నూతన ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.


ఏనుగులకోడు డ్రెయిన్‌లో ఏపుగా గుర్రపు డెక్క

అసోసియేట్ డీన్‌పై చర్యలు తీసుకోండి

▸▸ తరగతులు బహిష్కరించి ఆందోళన చేపట్టిన వెటర్నరీ విద్యార్థులు



వెటర్నరీ కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

గన్నవరం, జూన్ 25 : తమ పట్ల అనుచిత వైఖరి అవలంబిస్తున్న అసోసియేట్ డీన్‌పై చర్యలు తీసుకోవాలని వెటర్నరీ విద్యార్థులు ఆందోళన చేపట్టారు. విద్యార్థినులు అని కూడా చూడకుండా ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మండలంలోని కేసరపల్లి డాక్టర్ ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ పీవీఎస్ కిషోర్ వైఖరికి నిరసనగా మంగళవారం విద్యార్థులు తరగతులను బహిష్కరించి కళాశాల భవనంపై, ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. డీన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ పీవీఎస్ కిషోర్ అసోసియేట్ డీన్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి విద్యార్థులంటే చులకన భావనతో ఉంటున్నారని తెలిపారు. ఏదైనా సమస్య చెబుదామని వెళితే వినకుండా వెటకారంగా మాట్లాడుతూ, అవమానపరుస్తున్నారని చెప్పారు. అమ్మాయిల వసతి గృహం వద్ద గడ్డి బాగా పెరగడంతో పాములు తిరుగుతున్నాయని ఇదే విషయాన్ని డీన్ దృష్టికి తీసుకువెళ్లగా.. పాము కాటు మందు తెప్పిస్తానని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థినులపై డీన్ అపనిందలు వేస్తున్నారని వాపోయారు. సమస్యలు చెప్పేందుకు వెళితే తల్లిదండ్రుల పెంపకాన్ని అవమానపరిచేలా కించపరుస్తున్నారని చెప్పారు. క్రీడా సామగ్రి కొనుగోలుకు నిధులు కేటాయించకపోవటం, బయట వ్యక్తులు వచ్చి కళాశాల విద్యార్థినులపై అనుచిత వ్యాఖ్యలు చేశారని చెప్పిన డీన్ పట్టించుకునేవారు కాదని తెలిపారు. డీన్ వైఖరిపై గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం ఉపకులపతికి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాలకు ఎంతో పేరు ఉందని, పేరును చెడగొట్టే విధంగా డీన్ వ్యవహారశైలి ఉందని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అన్ని రంగాల్లో రాష్ట్ర ప్రగతికి కృషి చేద్దాం

▸▸ ఎన్జీవో నేతలతో మంత్రి పార్థసారథి


ఎన్జీవో నేతలతో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

వన్‌టౌన్, జూన్ 25 : రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రగతి పథంలో పయనించేలా కృషి చేద్దామని తనను కలిసిన ఎన్జీవో నేతలతో గృహ నిర్మాణ, పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. విజయవాడలోని మంత్రి కార్యాలయంలో మంగళవారం ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తమ నాయుడు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ తదితరులు అసోసియేషన్ సభ్యులతో కలిసి మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఎన్జీవో నేతలతో మంత్రి మాట్లాడుతూ, సంక్షేమం, అభివృద్ధి తారకమంత్రంగా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు నూరుశాతం ప్రజలకు అందేలా సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వంలో భాగంగా ఉన్న ఉద్యోగులు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తమ విధులను నిర్వహించాలన్నారు. ఉద్యోగులు సమన్వయంతో మంచి ఆకాంక్షతో పనిచేసినప్పుడే రాష్ట్రంలో పేదరికం నిర్మూలన అవుతుందన్నారు. గత ఐదేళ్ల కాలంలో జరిగిన పరిణామాలు ఉద్యోగులందరికీ తెలిసినవేనని, రానున్న ఐదు సంవత్సరాల కాలంలో దేశంలోనే రాష్ట్రం గుర్తింపు పొందేందుకు ఉద్యోగుల సహకారం ఎంతో అవసరమన్నారు. ఉద్యోగులకు రావాల్సిన ప్రతి ప్రయోజనాన్ని ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. సంతృప్త స్థాయిలో ఆర్థిక, ఆర్థికేతర ప్రయోజనాలను చేకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఉద్యోగ సంఘాల నాయకులు తమ సమావేశాలలో ఈ విషయాన్ని తెలియజేయాలన్నారు. రాష్ట్రంలో ప్రజల జీవనప్రమాణాలు మెరుగుపరిచేలా సామాజికంగా, పారిశ్రామికంగా, ఆర్థికంగా ప్రగతిబాటలో రాష్ట్రం ఉండేందుకు సమిష్టి కృషి అవసరమని పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో వివిధ పదవులలోని ఎన్జీవో నాయకులు మహమ్మద్ ఇక్బాల్, ఇ.రమేష్, వి.సతీష్, రామకృష్ణ, దిలీప్, శివలీల, సీవీఆర్ ప్రసాద్, షేక్ నజీరుద్దీన్, రాజశేఖర్, వేమూరి ప్రసాద్, మధుసూదనరావు, కేసర గణేశ్, మాచిరాజు అక్కిరాజు, కె.చంద్రశేఖర్‌లతో పాటు ఇంకా పలువురు జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

ఢిల్లీకి వెళ్లింది.. కమీషన్ల కోసమేనా!

▸▸ రాజీనామా చేసిన అధికారికి ఫ్లైట్ ఖర్చులు

▸▸ వివాదాస్పదంగా ఏపీటీడీసీ తీరు

▸▸ ఢిల్లీ నుంచి భారీగా ఫర్నిచర్ కొనుగోలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాజీనామా చేసిన అధికారి.. ఆఫీసుకు రావటంతో పాటు ప్రభుత్వ ఖర్చులతో ఢిల్లీ వెళ్లిన ఏపీటీడీసీ సీఈ వ్యవహారం మరింత వివాదాస్పదమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులకు భిన్నంగా రాజీనామా చేసినా ఇంకా పదవిలోనే కొనసాగుతున్న సీఈపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. రాజీనామా చేసిన అధికారి ఢిల్లీకి వెళ్లటానికి విమాన ఖర్చులు కూడా ఏపీటీడీసీ పెట్టడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. ఇంతకీ ఆ అధికారి ఢిల్లీకి ఎందుకు వెళ్లాడన్నది చూస్తే.. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి అయితే కాదని సమాచారం. ఇటీవల ఢిల్లీ నుంచి పెద్ద ఎత్తున ఫర్నిచర్‌ను కొనుగోలు చేసినట్టు తెలుస్తోంది. పదవికి రాజీనామా చేయటంతో ఫర్నిచర్ సంస్థ నుంచి తనకు రావాల్సిన కమీషన్ల లెక్క తేల్చుకోవటానికే ఢిల్లీ వెళ్లినట్టుగా ఏపీటీడీసీలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

కిమ్‌ను మించిన పెత్తందారీ జగన్

▸▸ దేవినేని ఉమా

గొల్లపూడి, జూన్ 25 : కిమ్‌ను మించిన పెత్తందారీ వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన గొల్లపూడిలో విలేకర్లతో మాట్లాడుతూ, ఇంటి వద్ద 986 మంది సెక్యూరిటీని పెట్టుకున్న జగన్ బయటకు వెళితే అంతకు మూడు రెట్లు భద్రత పెట్టుకుంటున్నాడన్నారు. తన రాజభవనాల రక్షణ కోసం ఏకంగా ప్రత్యేక చట్టమే చేశాడంటూ దుయ్యబట్టారు. సొంత ప్యాలెస్‌ల రక్షణకు వందల కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల భద్రతను గాలికొదిలేసి వారి సొమ్ముతో విలాసాలు అనుభవించే జగన్ పెత్తందారి కాక మరేమిటని ప్రశ్నించారు.

ఆటో ప్రయాణికురాలిపై దాడి

▸▸ అభరణాలు దోచుకుని ముగ్గురు పరారీ

▸▸ పోలీసుల అదుపులో ఒక నిందితుడు



పామర్రు, జూన్ 25 : ఆటోలో వెళుతున్న వృద్ధురాలిపై దాడిచేసి బంగారు అభరణాల చోరీకి యత్నించిన అగంతకుడిని పామర్రు పోలీసులు అదుపులోకి తీసుకున్నన్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం మచీలిపట్నంనుంచి విజయవాడకు వెళుతున్నపాసింజర్ ఆటోలో నిడుమోలు సెంటర్ వద్ద ఎన్ సీత(60) పామర్రు వెళ్లాలని ఎక్కింది. ఆటోలో ఇతర ప్రయాణీలు ఎవరూ లేకపోవడంతో ఆటో డ్రైవర్, మరో ఇద్దరు వ్యక్తులు 14 మైలురాయి సమీపంలో ఆటో ఆపి మహిళ కళ్లలో కరం కొట్టి ఇనుపరాడ్‌తో గాయపరచారు. అనంతరం ఆమె మెడలోని మూడు కాసుల బంగారు ఆభరణాలు లాక్కుని పారిపోయారు. స్థానికులు సీతను పామర్రులోని ఓ ప్రవేటు ఆసుపత్రిలో చేర్చారు. ఎస్సై పి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని దుండగుల్లో ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులు విజయవాడకు చెందిన వారుగా ఎస్సై తెలిపారు. బాధితురాలి ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ఈఎంఐ చెల్లించలేదని ప్రయివేట్ ఫైనాన్స్ వత్తిడి


▸▸ వారి ముందే ఇంట్లోకి వెళ్లి ఉరివేసుకున్న మహిళ



పాయకాపురం, జూన్ 25 : ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థ వేధింపులకు వాంబేకాలనీకి చెందిన ఓ మహిళ మంగళవారం ఆత్మహత్యకు పాల్పడింది. సంస్థ ప్రతినిధుల ఉండగానే ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకుని ఉరివేసుకుంది. అల్లంపల్లి మస్తానమ్మ అలియాస్ మాధవి(45) కాలనీలోని సీ బ్లాక్‌లో నివాసం ఉంటోంది. పదేళ్లుగా భర్తకు దూరంగా ఉంటున్న మాధవి ఒంటరిగా జీవిస్తున్నది. ఇటీవల ఇరుగు పొరుగు మహిళలను కలుపుకొని ఓ గ్రూపుగా ఏర్పడి నగరంలోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో లోన్ తీసుకుంది. వారం వారం చెల్లింపు విధానం ద్వారా లోన్‌వడ్డీ చెల్లిస్తూ వచ్చారు. అయితే గత నెల ఈఎంఐ చెల్లించని కారణంగా ఫైనాన్స్ సంస్థ ప్రతినిధులు మాధవి ఇంటి వద్దకు వచ్చి గట్టిగా నిలదీశారు. అదే సమయంలో మాధవితో గ్రూపుగా ఏర్పడిన మహిళలు తాము చెల్లించాల్సిన డబ్బులు మాధవికి ఇచ్చేశామని సంస్థ ప్రతినిధులకు చెప్పారు. గ్రూపు సభ్యుల నుంచి వసూలు చేసిన డబ్బులు ఆమె వద్దే ఉన్నాయని, అయినా సంస్థకు కట్టలేదని తెలియడంతో సంస్థ ప్రతినిధులు మరింత గట్టిగా ఆమెపై ఒత్తిడి చేశారు. దీంతో మాధవి సంస్థ ప్రతినిధులు, చుట్టుపక్కల మహిళలు ఉండగానే చనిపోతానంటూ ఇంట్లోకిలో వెళ్లి తలుపులు వేసుకుంది. ఎంత సేపటికి తలుపులు తీయకపోవడంతో చుట్టుపక్కల వారు తలుపులను బలవంతంగా తెరిచారు. అప్పటికే మాధవి ఉరివేసుకుని వేలాడుతూ ఉండగా ఆమెను కిందకి దింపి ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో ఆమె మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

తూర్పు బైపాస్‌పై ప్రతిష్టంభన

(5వ పేజీ తరువాయి)



ప్రాతిపదికగా తీసుకున్నారు. ఈ ప్రతిపాదనే కేంద్రానికి వెళ్లింది. కాబట్టి టీడీపీ ప్రభుత్వం ఈ అలైన్‌మెంట్‌పై పరిశీలన చేయాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత వెస్ట్ బైపాస్ నుంచి చూస్తే చిన్న అవుటపల్లి నుంచి గతంలో టీడీపీ ప్రతిపాదించిన అలైన్‌మెంట్‌నే పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. కృష్ణానది మీద చోడవరం దగ్గర ఒక బ్రిడ్జి వస్తుంది. ఈ ప్రాజెక్టును గట్టిగా రెండేళ్లలో పూర్తి చేయొచ్చు.

సింహభాగం మంగళగిరి నియోజకవర్గంలోకి వస్తుంది..

విజయవాడ ఈస్ట్ బైపాస్ రోడ్డు కృష్ణాజిల్లాలో చిన్న అవుటపల్లి నుంచి చోడవరం వరకు ఉంటే.. గుంటూరు జిల్లాలో మరీ ముఖ్యంగా మంగళగిరి నియోజకవర్గంలో పాతూరు, చిర్రావూరుల మధ్యన ప్రారంభమై కాజ దగ్గర ముగుస్తుంది. గుంటూరు జిల్లాలో ఈ ప్రాజెక్టు సింహభాగం మంగళగిరి నియోజకవర్గం నుంచే సాగుతూ ఉంటుంది కాబట్టి.. ఈ కేంద్ర ప్రాయోజిత విజయవాడ తూర్పు బైపాస్‌ను చేపట్టేందుకు ప్రయత్నించాల్సిన అవసరం ఉంది. మంగళగిరి నియోజకవర్గంలో కాజ దగ్గరే విజయవాడ వెస్ట్ బైపాస్‌కు అనుసంధానంగా ప్యాకేజీ - 4లో భాగంగా కృష్ణానది బ్రిడ్జి, దీనికి అనుసంధానమయ్యే రోడ్డు కూడా కలుస్తుంది. కాజ దగ్గర ఎన్‌హెచ్ - 65 దగ్గర అటు వెస్ట్ బైపాస్, ఇటు ఈస్ట్ బైపాస్‌లు అనుసంధానమయ్యే చోట భారీ జంక్షన్ ఏర్పడుతుంది. ఈ అవకాన్ని టీడీపీ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోకూడదని ప్రజలు కోరుకుంటున్నారు.

లాజిస్టిక్ పార్క్ భూముల సంగతి తేల్చాలి..

లాజిస్టిక్ పార్క్‌ను కేంద్రం గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే చివర్లో మంజూరు చేసింది. విజయవాడ తూర్పు బైపాస్ ప్రాజెక్టును మంజూరు చేయటానికి కేంద్ర ప్రభుత్వం లాజిస్టిక్ పార్క్‌కు ప్రతిగా భూములు కేటాయించాలని కోరింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వచ్చింది కాబట్టి దీనిపై వైసీపీ ప్రభుత్వం ఆసక్తి చూపలేదు. కేంద్రం పదేపదే కోరితే.. అమరావతిలో ఒకసారి భూములు ఇస్తామన్నారు. అమరావతిలో లాజిస్టిక్ పార్కును ఏర్పాటు చేయలేమని, రైలు, రోడ్డు మార్గాలకు దగ్గర్లో ఉన్నచోట మాత్రమే భూములు కావాలని కోరితే.. ఆ తర్వాత ప్రభుత్వం స్పందించలేదు. దీంతో విజయవాడ తూర్పు బైపాస్ ప్రాజక్టు ప్రతిష్టంభనలో పడింది.

విజయవాడ

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	138, 147, 158
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278
నెక్ కోడిగుడ్డు ధర	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.15	

దుర్గగుడిలో సంకటహర గణపతి హోమం



వన్‌టౌన్, జూన్ 25: దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో చవితి తిథిని పురస్కరించుకుని మంగళవారం సంకటహర గణపతి హోమాన్ని నిర్వహించారు. ఆలయ వైదిక కమిటీ ఆధ్వర్యంలో ముఖ్య అర్చకుడు యజ్ఞనారాయణ శాస్త్రి తదితర అర్చకులు గణపతి హోమాన్ని నిర్వహించారు. అంతకు ముందు గణపతి విగ్రహానికి పంచామృతాభిషేకాలు, పూజలు చేశారు. జపం అనంతరం తర్పణ చేశారు. లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు, మూలమంత్రంతో హవనం చేశారు.

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, జూన్ 25 : రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం కూటమి వలనే సాధ్యమని, రాష్ట్ర ప్రజలంతా కూటమికి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 65 శాతం ఓట్లు వేశారని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. రాష్ట్రాభివృద్ధిలో తాను కూడా ఒక సైనికుడి మాదిరిగా పనిచేస్తానన్నారు. మంగళవారం 10వ డివిజన్లో గద్దె రామ్మోహన్ పర్యటించారు. ఇంటింటికి వెళ్లి కాలనీ వాసులతో మాట్లాడారు అనంతరం స్వయం ఉపాధి నిమిత్తం అట్లూరి మోహన్‌కుమార్ కొనుగోలు చేసి ఇచ్చిన కుట్టుమిషన్, ఇస్త్రీ బండిని గద్దె రామ్మోహన్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో ప్రతీ ఒక్కరికి లబ్ధి జరుగుతుందని అన్నారు. కార్పొరేటర్లు దేవినేని అపర్ణ, ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి ఉషారాణి, అట్లూరి మోహన్‌కుమార్, డాక్టర్ వై.రమేష్, కోనేరు నరేంద్ర, పి.జగన్‌మోహన్‌రావు, మన్నే జయప్రకాష్, మార్త సూర్యకుమారి, వాసు, అరుణలు పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రభుత్వంలో క్రీడాకారులకు ప్రాధాన్యత

టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ప్రతిసారీ కూడా సీఎం చంద్రబాబు క్రీడలకు అధిక ప్రాధానత్య కల్పిస్తూ క్రీడాకారులను ప్రోత్సహించారని, రానున్న రోజుల్లో కూడా అదే విధంగా క్రీడలకు ప్రోత్సాహం ఉంటుందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. కాకినాడలో ఈ నెల 19 నుంచి 21 వరకు జరిగిన ఇంటర్నేషన్ ఇండోర్ స్కేటింగ్ రింక్‌లో జరిగిన రాష్ట్రస్థాయి జోన్-2 చాంపియన్‌షిప్‌లో విజయవాడ శరత్ రోలర్ స్కేటింగ్ అకాడమీలో శిక్షణ పొందిన క్రీడాకారుల్లో టి. గ్రీష్మిత, సీహెచ్.రతన్‌రాజ్, యోహిత్‌రెడ్డి, ఎం.సుధీర్, మధుబాల స్వర్ణాలు సాధించగా, రిషికేశ్(రజతం), భార్గవ్, తన్విక(కాంస్యా)లు సాధించారు. వీరిని గద్దె రామ్మోహన్ ప్రత్యేకంగా అభినందించారు. గద్దె రామ్మోహన్‌ను కలిసిన వారిలో ఎస్‌ఆర్‌ఎస్ చీఫ్ కోచ్ మాకాని శరత్‌కుమార్, శిక్షకులు హర్షిత, అరుణ్, రోషన్, టీమ్ మేనేజర్స్ జి. దుర్గాకుమార్, కరీముస్నీసాలు పాల్గొన్నారు.



స్కేటింగ్ క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

42 సంవత్సరాలుగా... ✆ 2477470, 2471617 8500030028
❖ 2010 నుండి 23 వరకు వరుసగా అబ్దుల్‌కలాం అమెరికా అవార్డులు
❖ Robotics ❖ 3D Printing ❖ నేషనల్ సైన్స్ హాట్
మీ పిల్లల్లో ఒకర్ని మా స్కూల్లో చేర్చి చదువు కంపేర్ చేసుకోండి.
ది డాన్ బాస్కో స్కూల్
గురునానక్ రోడ్, ఆటోనగర్ కాలని ఎదురుగా, విజయవాడ-7.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

లబ్బీపేట: లబ్బీపేటలోని మదర్ థెరెసా ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం విద్యావ్యవస్థ పటిష్టతకు, విద్యార్థుల భవిష్యత్‌కు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని అన్నారు. స్కూల్ హెచ్‌ఎం రాజేష్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక టీడీపీ నేతలు ఫిరోజ్, బీజేపీ అధ్యక్షుడు పసుపులేటి వాసు, వాటాల హరిప్రసాద్ పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్లకు మరమ్మతులు చేయించండి

● కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన టీడీపీ కార్పొరేటర్లు



కమిషనర్ స్వప్నిల్ దినకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న టీడీపీ కార్పొరేటర్లు

చిట్టినగర్, జూన్ 25: నగరంలో పలు ప్రాంతాల్లో మంచినీటి సమస్యతోపాటు రంగుమారి వస్తున్న మంచినీటి సమస్యను, పాడైన పైపులైన్లకు మరమ్మతులు నిర్వహించాలని టీడీపీ కార్పొరేటర్లు నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్‌కు వినతి పత్రం అందజేశారు. మంగళవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన ఛాంబర్‌లో కమిషనర్‌ను కలిసి రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని దోమల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని కోరారు. కమిషనర్ సానుకూలంగా స్పందించి మంచినీటి సమస్యతోపాటు రంగుమారి వస్తున్న మంచినీటి సమస్య, పైపులైన్లకు మరమ్మతులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. అనంతరం టీడీపీ కార్పొరేటర్లతో కమిషనర్ కొద్దిసేపు నగర సమస్యలపై మాట్లాడారు. కమిషనర్‌ను కలిసిన వారిలో టీడీపీ ఫ్లోర్‌లీడర్ నెలిబండ్ల బాలస్వామి, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, కార్పొరేటర్లు ముమ్మనేని వెంకట ప్రసాద్, పొట్నూరి శివసాయి ప్రసాద్, వల్లభనేని రాజేశ్వరి, చెన్నుపాటి క్రాంతి, చెన్నగిరి రామ్మోహన్‌రావు, కంచి దుర్గ, మాజీ కార్పొరేటర్ చెన్నుపాటి గాంధీ తదితరులు ఉన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించాలని బిందెలతో మహిళల ధర్నా



చిట్టినగర్, జూన్ 25: ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటిని అందించాలని, రంగుమారి వస్తున్న మంచినీటి సమస్యను పరిష్కరించాలని, సక్రమంగా సరఫరా చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం వించిపేట సీఎస్ఐ చర్చి సమీపంలో మహిళలు బిందెలతో ధర్నా నిర్వహించారు. ధర్నాలో పాల్గొన్న కార్పొరేటర్ సత్యబాబు మాట్లాడుతూ డివిజన్‌లో పలుచోట్ల మంచినీటి పైపులైన్లు లీకేజీలు ఉన్నాయని, వాటికి వెంటనే మరమ్మతులు నిర్వహించాలన్నారు. డివిజన్ ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటిని అందించి, సక్రమంగా సరఫరా చేయాలని కోరారు. మాజీ కార్పొరేటర్ గాదె ఆదిలక్ష్మి, పలువురు సీపీఎం నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE VII ADDL DISTRICT AND SESSIONS JUDGE :: VIJAYAWADA
E.P.No.29 / 2023 in O.S. No. 253 / 2017
Between:-
Yerramaneni Poornachandra Rao S/o Venkata Subbaiah, Hindu, aged about 65 years, Properties, R/o # D.No.24-5-8, P.V. Raju Street, Gandhi Nagar, Vijayawada .. D.H.r
and
Kota Venkata Durga Prasad, S/o Venkateswara Rao, Hindu, aged about 54 years, R/o. #44-8-5/3, Narasaiah Street, Gunadala, Vijayawada, NTR District. ..J.D.r
పై నెంబరు గల గ్రంథములో డిక్రీ బాకీ వసూలు కోరకు J.D.R అయిన కోటా వెంకట దుర్గాప్రసాద్ S/o వెంకటేశ్వరరావు చెందిన వారి సంపూర్ణ స్వాదీన హక్కుభుక్తములలో గల క్రింది వివరించిన షెడ్యూలు స్థిరాస్తిని పై నెంబరులో పై కోర్టువారు ది.06-08-2024వ తేదీన ఉదయం గం.10.30 ని:ల నుండి సాయంత్రం గం.05.00 ని:ల లోపు పై కోర్టులో బహిరంగ వేలం వేయుదురు. కావున యావన్మంది వేలంలో పాల్గొని ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని పాడుకోనవచ్చును.
షెడ్యూలు ఆస్తి వివరం:- Krishna Dist (Present in NTR District), Vijayawada District Registrar area, Vijayawada East (Gunadala) Sub-registrar area, Vijayawada Municipal Corporation area, Vijayawada, Gunadala Village, R.S.No.211/6, to an extent of 62-19 sq. yards of vacant site being bounded by:- East: Property belongs to Kolli Venkata Ratnam, South: Property belongs to Kotamarthi Subramanyam, West: Property belongs to others and 4 feet Road, North: Property belongs to K. Sivarama Krishna Prasad Within above boundaries of an extent of 62-19 sq. yards of vacant site with all easement rights.
D.H.R value of the Property is Rs. 10,00,000/-. Ameen Value of the Property is Rs. 15,00,000/-. Government Value of the Property is Rs. 16,00,000/-
వేలం తేదీ : 06-08-2024.
Further Hearing Date : 13-08-2024
శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం
Sri Venkat Rao. Madala, Advocate, VJA

మర్యాదపూర్వక కలయిక



లబ్బీపేట, జూన్ 25: రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావును జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, విజయవాడ పార్లమెంట్ ఇన్‌చార్జి అమ్మిశెట్టి వాసు మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన డీజీపీగా బాధ్యతలు చేపట్టిన అయనకు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రేమించిన వ్యక్తి మాట్లాడటం లేదని యువతి అదృశ్యం

● సోదరుడి ఫిర్యాదు

విద్యాధరపురం, జూన్ 25: ప్రేమించిన వ్యక్తి గత రెండు నెలలుగా మాట్లాడడం లేదని మనస్తాపంతో భవానీపురం హెచ్‌బీ కాలనీకి చెందిన యువతి (23) ఇంట్లో నుంచి వెళ్లిపోయినట్లు ఆమె సోదరుడు మంగళవారం భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిజియోథెరపి చదివిన యువతి ఆరునెలల నుంచి కొత్త ప్రభుత్వాసుపత్రిలో శిక్షణకు వెళుతుంది. ఈ క్రమంలో ఆమెకు అక్కడ ఓ ప్రొఫెసర్ పరిచయమయ్యాడు. ఆయన ఆ యువతిని ప్రేమిస్తున్నట్లు చెప్పాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. దీంతో పాటు గత రెండు నెలలుగా ఆయన తనతో మాట్లాడడం లేదని యువతి చెప్పి బాధపడుతూ ఉండేదని సోదరుడు తన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ఆమెకు నచ్చజెప్పామని తెలిపారు. కాగా ఆమె ఈ నెల 23న సాయంత్రం 5 గంటల నుంచి ఇంట్లో కనిపించ లేదని, ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదని ఇంట్లో నుంచి వెళ్లిపోయినట్లుగా భావిస్తున్నామని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

అడ్మిషన్లు జరుగుచున్నవి
త్రివేణి కాలేజెస్
Top in Academics... Best in Placements...
DEGREE : B.Sc., (Comp. Science), B.Sc., (Data Science) B.Com., (Computers), INTER : MPC, MEC, CEC
బాలికల క్యాంపస్ : NSM స్కూల్ రోడ్డు, పటమట, 8897313456, 8790466755
బాలికల క్యాంపస్ : సీతారామపురం సిగ్నల్ దగ్గర, ఏలూరు రోడ్, విజయవాడ. సెల్ : 9393965566, 9393975566.
బాలుర క్యాంపస్ : దుర్గామహల్ దగ్గర, పటమట. 8897813456, 8790466766
THINK OF PLACEMENTS - JOIN IN TRIVENI

మాట నిలబెట్టుకోవడం చంద్రబాబుకే సాధ్యం

● లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్

విద్యాధరపురం, జూన్ 25: ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం సీఎం చంద్రబాబుకే సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో జరిగిన తొలి కేబినేట్ సమావేశంలో 5 హామీలను ఆమోదించడం హర్షణీయమన్నారు. చంద్రబాబు తాను ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్నారని, సంక్షేమం అభివృద్ధి సమపాళ్లలో నడుస్తుందనడానికి ఇదే గీటురాయి అని ఆయన పేర్కొన్నారు.

సితార మెయిన్‌రోడ్డులో వీధిలైట్లు ఏర్పాటు చేయాలి

భవానీపురం, జూన్ 25 : గత నెల రోజులుగా సితార సెంటర్ నుంచి చర్చి సెంటర్ మెయిన్ రోడ్డులో వీధిలైట్లు వెలగకపోవడం వలన ఈ ప్రాంతంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని డీవైఎఫ్ఐ పశ్చిమ నగర కమిటీ కార్యదర్శి ఎండీ.మస్తాన్ ఒక ప్రకటనలో అధికారులకు విన్నవించారు. లైట్లు వెలగకపోవడం వలన కుక్కలు ప్రజలు వెంట పడుతున్నాయన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించి వీధిలైట్లు వెలిగించే ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు.

భర్త కనిపించడం లేదని ఫిర్యాదు

చిట్టినగర్, జూన్ 25: వేర్వేరు కేసుల్లో ఇద్దరు అదృశ్యమైనట్లు కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు.

పోలీసుల వివరాల ప్రకారం కె.పావని, వెంకట సాయిబాబు దంపతులు జక్కంపూడి హౌసింగ్ కాలనీలో కుటుంబంతో నివాసం ఉంటున్నారు. వీరికి ఒక కుమార్తె. కుటుంబ పోషణ నిమిత్తం అప్పులు ఎక్కువ కావడంతో భార్యభర్తల మధ్య వివాదం జరిగింది. ఈ నెల 16న వెంకట సాయిబాబు బైక్‌పై బయటకు వెళ్లి తిరిగి రాలేదని, చుట్టుపక్కల బంధువుల వద్ద ఆచూకీ తీసినా సమాచారం లేదని బాధితురాలు ఫిర్యాదు చేసింది.

మేనకోడలు కనిపించడం లేదని..

బ్రహ్మంగారిమఠం ప్రాంతంలో ఉంటున్న వ్యక్తి మేనకోడలు(20) సోమవారం బయటకు వెళ్లివస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదని బాధితుడు పోలీసులు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

బీజేపీ ఆధ్వర్యంలో ఎమర్జెన్సీ వ్యతిరేక దినం



ఎమర్జెన్సీ వ్యతిరేక దినం ర్యాలీలో పాల్గొన్న నాయకులు

వన్‌టౌన్, జూన్ 25: ఇందిరా గాంధీ హయాంలో 1975 జూన్‌లో విధించిన ఎమర్జెన్సీ ఒక చీకటి కాలమని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో ఎమర్జెన్సీ వ్యతిరేక దినం పాటించారు. ఈ సందర్భంగా చిట్టినగర్ బంగారయ్య కొట్టు సెంటర్ నుంచి కేబీఎన్ కాలేజీ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం కేబీఎన్ కాలేజీలో జరిగిన సమావేశంలో నాయకులు ఆనాటి ఎమర్జెన్సీ పరిస్థితులను దేశంలో నెలకొన్న ఆందోళన తదితరాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమర్జెన్సీలో జైలు శిక్ష అనుభవించిన వామరాజు సత్యమూర్తి, తన ప్రసంగంలో ఎమర్జెన్సీని వ్యతిరేకించిన వారిని జైలులో నిర్బంధించి చిత్రహింసలకు గురిచేశారని తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు కోలపల్లి గణేష్, భోగవల్లి శ్రీధర్, సీనియర్ నాయకులు బొడ్డు నాగలక్ష్మి, జొన్నవిత్తుల రామకృష్ణ, పీయూష్ దేశాయ్, నున్న కృష్ణదేవి, హరిప్రసాద్, పచ్చిపులుసు ప్రసాద్, మారుతి పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ సెన్సార్ టెక్నాలజీపై వర్క్‌షాప్ ప్రారంభం



వన్‌టౌన్, జూన్ 25: కటింగ్ ఎడ్జ్ సెన్సార్ టెక్నాలజీ హ్యూమన్ సెంటర్డ్ అప్లికేషన్‌లను ట్రాన్స్‌ఫార్మ్ చేయడానికి ఎంతో ఉపయోగంగా ఉంటుందని కళాశాల కార్యదర్శి సీపీ చిట్టా అమర్ సుధీర్ అన్నారు. కొత్తపేటలోని పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు ఇంజనీరింగ్ కళాశాలలో హ్యూమన్ సెంటర్డ్ అప్లికేషన్స్‌లో సీమోస్-మెమ్స్ ఇంటిగ్రేటెడ్ సెన్సార్ టెక్నాలజీపై మంగళవారం ఐదు రోజుల వర్క్‌షాప్‌ను ప్రారంభించిన ఆయన మాట్లాడారు. ఇందుకు సంబంధించిన వివిధ అంశాలపై ఆయన మాట్లాడుతూ హెల్త్ కేర్, సేఫ్టీ, ఎన్విరాన్‌మెంటల్ సెన్సింగ్, తదితరాలపై ఈ వర్క్‌షాప్ అవగాహన కల్పిస్తుందన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల ప్రెసిడెంట్ చలువాది మల్లికార్జున రావు మాట్లాడుతూ తమ కాలేజీలో విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు నిర్వహిస్తున్నామని, ఎమర్జెన్సింగ్ టెక్నాల జీలపై శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కే.శ్రీనివాసరావు వివిధ అంశాల గురించి మాట్లాడారు. అమృత స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ దీపక్ పాండా ప్రాక్టికల్‌గా ఉండే సాదకబాధకాలను వివరించారు. హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ డాక్టర్ ఎం.రంగారావు వర్క్‌షాప్ ఉద్దేశాలను వివరించారు. కన్వీనర్ డాక్టర్ పి.అశోక్ కుమార్ విద్యార్థులకు ఈ వర్క్‌షాప్ ద్వారా సమగ్ర అవగాహన కలుగుతుందన్నారు.

పూర్ణాహుతితో ముగిసిన బ్రహ్మోత్సవాలు





ప్రత్యేక అలంకారంలో వేంకటేశ్వరస్వామి, వసంతోత్సవంలో పాల్గొన్న మహిళలు

చిట్టినగర్,జూన్ 25: స్థానిక పద్మావతి గోదాదేవి సమేత గరుడాచల స్థిత వేంకటేశ్వరస్వామివార్ల దేవస్థానం త్రయోదశ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం పూర్ణాహుతితో ముగిశాయి. ఉదయం ధ్రువమూర్తికి, ఉత్సవమూర్తులకు పూజలు చేశారు.

సాయంత్రం ద్వాదశ ప్రదక్షణలు, పవళింపు సేవ కన్నుల పండువగా జరిగింది. భక్తులు ఆలయానికి తరలి వచ్చి స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిల్లా శ్రీనివాసరావు తదితరులు పర్యవేక్షించారు.

ముఠా కార్మికుల సమస్యలను పరిష్కరిస్తా



భవానీపురం, జూన్ 25 : 43వ డివిజన్ భవానీపురం ఐరన్‌యార్డులో ముఠా కార్మికుల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటానని సీనియర్ టీడీపీ నాయకులు బొమ్మసాని సుబ్బారావు అన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి సూచనలతో ఆయన మరో నాయకులు మోరబోయిన రాంబాబుతో కలిసి మంగళవారం యార్డులో పర్యటించి వారితో మాట్లాడారు. కార్మికులు మంచి వసతులతో పనులు చేసుకోవడంతో విశాంత్రికి తగు ఏర్పాట్లు చేస్తామని సుబ్బారావు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కార్మికులు సుబ్బారావును దుశ్శావాలుతో సత్కరించారు.

కృష్ణానదిలో గుర్తు తెలియని మృతదేహం

విద్యాధరపురం, జూన్ 25: భవానీపురం స్టేషన్ పరిధిలోని హెడ్‌వాటర్ వర్క్స్ ప్రాంతంలోని కృష్ణానదిలో సుమారు 60 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతి చెంది ఉన్నాడు.

సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన ప్రదేశానికి చేరుకుని విచారించగా సమాచారం లభించలేదు. గుర్తు తెలియని మృతదేహంగా పేర్కొంటూ కేసు నమోదు చేసుకుని భవానీపురం పోలీసులు జీజీహెచ్‌కు తరలించారు. మృతదేహంపై తెల్లటి లాల్చీ, పంచె మాత్రమే ఉన్నాయని, వివరాలు తెలిసిన వారు భవానీపురం స్టేషన్‌లో సంప్రతించాలని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పాయకాపురం, జూన్ 25 : విద్యుత్ లైన్లకు, ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతుల కారణంగా పాయకాపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్ రెడ్డి రోడ్డు, డాక్టర్స్ కాలనీ, న్యూ రాజీవ్‌నగర్, రాధానగర్, బర్మాకాలనీ, విశాలాంధ్రకాలనీ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 10 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

సత్యనారాయణపురం: సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్, లెవన్‌కేవి లైన్లు మరమ్మతుల కారణంగా ముత్యాలంపాడు స్టేషన్ శ్రీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 8గంటల నుంచి 10 వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీరు బి.వి.సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనగర్‌కాలనీ మెయిన్ రోడ్డు, రైల్వేట్రైనింగ్ సెంటర్, రైల్వేక్వార్టర్స్ , శ్రీనగర్‌కాలనీ జీరోలైన్, ఒకటి, రెండు, మూడులైన్‌లలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ఉద్యానశాఖ అవగాహన సదస్సు

నందిగామ రూరల్, జూన్ 25: నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయటంతోపాటు పెంపకంలో యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీనివాస్ అన్నారు. మం డల పరిషత్ కార్యాలయంలో షేడ్‌నెట్ నర్సరీ నిర్వాహకులతో మంగళ వారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారు పెంచే ప్రతినర్సరీ చుట్టూ ఇన్సెక్ట్ నెట్ ఉండాల న్నారు. ముఖ్యంగా నర్సరీ నిర్వాహకులు విధిగా రిజిష్టర్ చేయించుకోవాలని, నర్సరీ లైసెన్స్ పొందిన ప్రింట్ నెంబర్ ప్రకారం కొనుగోలు దారులకు బిల్లులు అందించాలని సూచించారు. నాసిరకం నారును రైతులకు అందించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏవో ఖాసీం, ఉద్యాన అధికారి నీలిమ, నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

GRAND GALA RELEASE ON 27TH JUNE at NAVRANG A/c



(IN TELUGU-3D) DAILY 4 SHOWS
11-00 AM, 2-45 PM
6-15 PM, 10-00 PM
Advance Booking Open Online "Book My Show"
Balcony Rs. 206/-, 1st Class Rs. 175/-, 2nd Class Rs. 150/- & for 3d Glass Rs. 20/- Extra
Today last day MAHARAJA (Telugu)

రేపే విడుదల
అప్సర సినిమా



రోజూ 5 ఆటలు : 7-00AM, 11-00AM, 02-30PM, 6-10PM, 9-40PM
www.justickets.in
www.bookmyshow.com

FAMILY ENTERTAINMENT నేడే చూడండి



స్వర్ణ కాంప్లెక్స్ - విజయవాడ
రవీంద్ర కాంప్లెక్స్ - పాయకాపురం
స్వర్ణ థియేటర్ - ఇబ్రహీంపట్నం
సాయి మహల్ - వుయ్యూరు
94413 71133

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

GOLD FINANCE
» బంగారము బ్యాంకులలో, ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్ సంప్ర : 88024 89999
AJB-194760

PLOTS FOR SALE
» విజయవాడ, బందరు రోడ్డుకు సమీపంలో కంకిపాడు దగ్గర CRDA Layout Open Plots అందుబాటు ధరలలో కలవు. బ్యాంక్ లోన్ సౌకర్యం. సెల్ : 83418 15371
AJB - 194723
» విజయవాడ, బందరు రోడ్డు దగ్గరలో గోసాలలో CRDA Approved Open Plots అందుబాటు ధరలలో కలవు. సంప్రదించండి. సెల్ : 92477 70999
AJB - 086048

SALE
» అమ్మకానికి 50 రీడింగ్ రూమ్ వుడెన్ కెబిన్స్ మరియు కుర్చీలు. వెస్టిన్ కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్మెంట్ ఎదుట, భారతినగర్, విజయవాడ. సెల్ : 77801 08405
AJB - 194714

LAND FOR SALE
» 6 కోళ్ళ ఫారము షెడ్లు, 3 బోర్లు, 400 మీటర్లు ఉత్తరము తారురోడ్డు ఫేసింగ్ కలిగిన 20 ఎకరములలో మూడు సంవత్సరముల పామాయిల్ మొక్కలతో కృష్ణా జిల్లా, గన్నవరం మండలం, సగ్గూరు అమాని నందు పొలము అమ్మకమునకు కలదు. సెల్. 6300506275
AJB -194814

WANTED
» విజయవాడ, పటమట, UZVIS గ్రూప్ ఆఫ్ కంపెనీలకు ప్యాకింగ్ బాయ్స్, ప్యాకింగ్ గర్ల్స్, డెలివరీ బాయ్స్, హెల్పర్స్, అనుభవము ఉన్నవారు కావలెను. సంప్ర. సెల్. 91771 03101
AJB-194722
» విజయవాడ, మెట్రోపాలిటిన్ వారికి స్టాఫ్ కావలెను. నార్త్ ఇండియన్ చెఫ్, చైనీస్ చెఫ్, సెక్యూరిటీ గార్డ్స్, హౌస్ కీపింగ్ బాయ్స్, ప్లంబర్స్, ఎలక్ట్రీషియన్స్, సివిల్ ఇంజినీర్స్, ఆకర్షణీయమైన జీతం. సంప్ర. సెల్. 7288885598
AJB-342

FLATS FOR SALE
» విజయవాడ, బందర్ రోడ్, గంగూరులో 1237, 1270 చ.అ.ల 2BHK ఫ్లాట్స్ మరియు 1803, 1805 చ.అ.ల 3BHK ఫ్లాట్స్ అమ్మకమునకు కలవు. ఫుల్ ఫినిష్డ్, బ్యాంక్ లోన్ సౌకర్యం కలదు. AP RERA NO. P06180044432. సంప్ర. 97016 89312
AJG - 90

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
GST 5%
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
బ్లాక్ & వైట్ 4 లైన్ల ప్రకటన రూ. 290/- ప్రతి అదనపు లైనుకు రూ. 40/- కలర్ 30% EXTRA
1 టౌన్ : 99854 09286, పటమట, పెనమలూరు : 99854 11868, ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777
మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733,
గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు
✆ 99854 11868, 99854 85777, 99854 11733, 99854 09286, 99854 09587
ఆంధ్రజ్యోతి దినపత్రిక కావల్సిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు
✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604, డీజీఎం : 9885821929, జీఎం : 99854 11234

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
బుధవారం • 26 జూన్ 2024
cinema@andhrajyothy.com


శ్రీవారికి తలనీలాలు సమర్పించిన
గాయని సుశీల



సీనియర్ నేపథ్య గాయని పి. సుశీల మంగళవారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. సోమవారం రాత్రి తిరుమలకు చేరుకున్న ఆమె శ్రీవారికి తలనీలాలు సమర్పించి మంగళవారం ఉదయం ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు. ఆలయం ముందు సుశీలను చూసిన పలువురు అభిమానులు దగ్గరకు వెళ్లి పలకరించారు. కొందరు ఆమెతో సెల్ఫీలు తీసుకున్నారు. ఎన్నాళ్ల నుంచో స్వామి వారికి తలనీలాలు సమర్పించే మొక్కు ఉందనీ, ఇన్నాళ్లకు అది తీరిందని సుశీల చెప్పారు.

తిరుమల, (ఆంధ్రజ్యోతి)

అధర్మాన్ని అణిచేయగా...



భారీ అంచనాల మధ్య 'కల్కి 2898 ఏడీ' చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ప్రమోషనల్ కంటెంట్‌తో చిత్ర బృందం ఎప్పటికప్పుడు ఆ అంచనాలను రెట్టింపు చేస్తోంది. తాజాగా 'థీమ్ ఆఫ్ కల్కి' లిరికల్ వీడియోను మంగళవారం విడుదల చేశారు. 'అధర్మాన్ని అణిచేయగా' అంటూ చంద్రబోస్ రాసిన ఈ పాటను కాలభైరవ పాడారు. సంతోష్ నారాయణ్ స్వరాలు సమకూర్చారు. పాత్రల తాలుకు నేపథ్యం, వాటి సంఘర్షణ.. ఇవన్నీ పాటలో చూపించారు. ఇటీవల ఈ పాటను మధురలో ఆవిష్కరించారు. ప్రముఖ నటి, నర్తకి శోభనా చంద్రకుమార్ ఈ పాట కోసం గజ్జె కట్టారు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతీ మూవీస్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, ప్రభాస్, దీపిక, దిశా పటాని కీలక పాత్రలు పోషించారు.



నేతాజీ మార్గంలో నేను

'ఇది రెండో స్వతంత్ర పోరాటం... గాంధీజీ మార్గంలో మీరు, నేతాజీ మార్గంలో నేను' అంటున్నారు కమల్‌హాసన్. ఆయన కథానాయకుడిగా నటించిన 'ఇండియన్ 2' (తెలుగులో 'భారతీయుడు 2') చిత్రంలోనిదీ డైలాగ్. మంగళవారం చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. దేశంలో అవినీతిపరులను ఏరి పారేసేందుకు ఈ సారి సేనాపతి పాత్రలో కమల్‌హాసన్ ఎలాంటి సాహసాలు చేయబోతున్నాడో అనే ఆసక్తిని కలిగించేలా ట్రైలర్‌ను రూపొందించారు. కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్‌సింగ్, సిద్ధార్థ్ కీలకపాత్రలు పోషించిన ఈ చిత్రానికి శంకర్ దర్శకుడు. 1996లో వచ్చిన 'భారతీయుడు' చిత్రానికి ఇది కొనసాగింపు. జూలై 12న 'భారతీయుడు 2' ప్రేక్షకుల ముందుకు రానుంది. లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ బ్యానర్స్‌పై సుభాస్కరన్ నిర్మించారు.

సెప్టెంబర్‌లో ఎమర్జెన్సీ

బాలీవుడ్ హీరోయిన్ కంగనా రనౌత్ ఇందిరా గాంధీ పాత్రలో నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ఎమర్జెన్సీ'. గతేడాదే చిత్రీకరణ పూర్తయింది. పలుమార్లు విడుదల తేదీని ప్రకటించినా ప్రేక్షకుల ముందుకు తీసుకురాలేకపోయారు. తాజాగా చిత్రబృందం కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటించింది. సెప్టెంబర్ 6న 'ఎమర్జెన్సీ' ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో ఇందిరాగాంధీ పాత్రలో కంగన లుక్ ఆకట్టుకుంది. 'మణికర్ణిక' చిత్రం తర్వాత కంగన దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. మాజీ ప్రధాని వాజ్‌పాయ్ పాత్రలో శ్రేయస్ తల్పడే, జయప్రకాశ్ నారాయణ్ పాత్రలో అనుపమ్ ఖేర్ కనిపించనున్నారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కంగనా రనౌత్ మధ్య ప్రదేశ్‌లోని మండి నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున ఎంపీగా గెలిచిన విషయం తెలిసిందే.



ఎలా ఉన్నావ్ శ్రీలీల

• బుగ్గ గిల్లి.. ఆప్యాయంగా పలకరించిన సంగీత దర్శకుడు తమన్

శ్రీవారి దర్శనార్థం వచ్చిన హీరోయిన్ శ్రీలీలను చూసిన సినీ సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్ ఆప్యాయంగా పలకరించారు. శ్రీలీల మంగళవారం స్వామిని దర్శించుకుని ఆలయం వెలుపలకు వస్తున్న క్రమంలో దర్శనానికి వెళుతున్న తమన్ మహాద్వారం వద్ద ఎదురుపడ్డారు. దీంతో తమన్ ఆగి శ్రీలను బుగ్గ గిల్లి.. ఎలా ఉన్నావ్ అంటూ పలకరించారు. అనంతరం శ్రీలీల తన కుటుంబ సభ్యులను తమన్‌కు పరిచయం చేసింది. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

తిరుమల, (ఆంధ్రజ్యోతి)



ఆయ్.. ఆగస్టులో వస్తున్నామండీ



నార్నే నితిన్, నయన్ సారిక జంటగా నటించిన 'ఆయ్' చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది. ఎన్నో విజయవంతమైన చిత్రాలను అందించిన ప్రముఖ సంస్థ జీఏ 2 పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ సినిమాతో అంజి కె మణిపుత్ర దర్శకుడిగా పరిచయమవుతున్నారు. డిఫరెంట్ ప్రమోషనల్ కంటెంట్‌తో ఈ సినిమా ఇప్పటికే అందరినీ ఆకర్షిస్తోంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు బన్నీ వాసు, విద్యా కొప్పినీడి మాట్లాడుతూ 'ఆగస్టు 15 గురువారం. ఆ తర్వాత రోజు నుంచి వీకెండ్ మొదలవుతుంది. ఇక సోమవారం రక్షా బంధన్. అందుకే ఆ డేట్‌ను ఎన్నుకున్నాం. గోదావరి బ్యాక్‌డ్రాప్‌తో ఈ సినిమా రూపుదిద్దుకుంది. ఈ ఫన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తో నార్నే నితిన్ ప్రేక్షకులను ఆకట్టుకుంటారు' అని చెప్పారు. అల్లు అరవింద్ సమర్పణలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి సంగీతం: రామ్ మిర్యాల, సినిమాటోగ్రఫీ: సమీర్ కల్యాణి.



న్యూ ఏజ్ ఫ్యామిలీ డ్రామా

అరవై ఏళ్ల అద్భుత చరిత్ర కలిగిన సురేశ్ ప్రొడక్షన్స్ సంస్థ రెండేళ్ల గ్యాప్ తర్వాత అందిస్తున్న చిత్రం ' 35.. చిన్న కథ కాదు'. ఇటువంటి ఆసక్తికరమైన టైటిల్‌తో న్యూ ఏజ్ ఫ్యామిలీ డ్రామాగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, తమిళ దర్శకుడు భాగ్యరాజా ముఖ్య పాత్రలు పోషించారు. నందకిశోర్ ఈమని దర్శకత్వంలో రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్దార్థ్ రాళ్లపల్లి నిర్మిస్తున్నారు. స్కూల్ ఎపిసోడ్స్ స్పెషల్ ఎట్రాక్షన్‌గా రూపుదిద్దుకున్న ఈ క్లీన్ ఎంటర్‌టైనర్‌ను ఆగస్టు 15న తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో ఒకేసారి విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: వివేక్ సాగర్, ఫొటోగ్రఫీ: నికేత్ బొమ్మి, ఎడిటింగ్: టీసీ ప్రసన్న.

కలయిక కుదిరిందా?

దక్షిణాదితో పాటు బాలీవుడ్‌లోనూ హిట్ చిత్రాలతో టాప్ కథానాయికగా ఎదిగారు రష్మిక మందన్న. అక్కడి అగ్ర దర్శకులు, నిర్మాతల నుంచి హీరోయిన్‌గా అవకాశాలు వెల్లువెత్తుతున్నా ఆమె మాత్రం ఆచి తూచి సినిమాలను ఎంచుకుంటున్నారు. అయితే రష్మిక ఓ కొత్త ప్రాజెక్ట్‌కు 'ఎస్' చెప్పారని ప్రస్తుతం బాలీవుడ్‌లో వినిపిస్తోంది. 'స్త్రీ, భేడియా, ముంజ్యా' లాంటి హారర్ చిత్రాలతో నిర్మాతగా వరుస విజయాలను దక్కించుకున్న దినేశ్ విజన్ గ్రామీణ



నేపథ్యంలో 'వాంపైర్స్ ఆఫ్ విజయ్ నగర్' పేరుతో ఓ హారర్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో ఆయుష్మాన్ ఖురానా కథానాయకుడిగా నటిస్తున్నారు. ఆయనకు జోడీగా రష్మికను ఎంపిక చేశారని అక్కడి పరిశ్రమ వర్గాల్లో వినిపిస్తోంది. అయితే అధికారిక ప్రకటన వస్తేనే ఈ కాంబినేషన్‌పై స్పష్టత వస్తుంది. ఈ ఏడాది చివర్లో ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది. రష్మిక ప్రస్తుతం అల్లు అర్జున్ 'పుష్ప 2: ది రూల్', సల్మాన్‌ఖాన్ 'సికందర్' చిత్రాల్లో నటిస్తున్నారు.



పవన్‌తో అల్లు అరవింద్ భేటీ




ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఎన్నికల్లో కూటమి అద్భుత విజయం సాధించిన నేపథ్యంలో పవన్ కల్యాణ్‌కు అభినందనలు తెలిపారు. ఏపీలో సినీ నిర్మాణ రంగం, ప్రదర్శన రంగం ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు చిత్ర పరిశ్రమ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను గురించి ఈ సమావేశంలో వారి మధ్య చర్చకు వచ్చినట్లు తెలిసింది.

డివోషనల్ థ్రిల్లర్



ఆది సాయికుమార్, ఆవికా గోర్ జంటగా రూపుదిద్దుకుంటున్న డివోషనల్ థ్రిల్లర్ 'షణ్ముఖ'. ఈ చిత్రానికి షణ్ముగం సాప్పని దర్శకుడు. ఇంతకుముందు 'శాసనసభ' చిత్రాన్ని నిర్మించిన తులసీరామ్ సాప్పని, షణ్ముగం సప్పని, రమేశ్ యాదవ్ ఈ సినిమాకు నిర్మాతలు. దర్శకుడు మాట్లాడుతూ 'ఇప్పటివరకూ ఎవరూ టచ్ చేయని ఓ అద్భుతమైన పాయింట్‌తో రూపుదిద్దుకుంటున్న డివోషనల్ థ్రిల్లర్ ఇది. అద్భుతమైన గ్రాఫిక్స్‌తో విజువల్ వండర్‌గా ఉంటుంది. ఇటీవల హైదరాబాద్‌లో నిర్మించిన భారీ సెట్‌లో చివరి షెడ్యూల్ పూర్తయింది. రవి బస్రూర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. హీరో ఆది కెరీర్‌లో ఓ మైలు రాయిగా నిలిచిపోతుంది' అని చెప్పారు.

అజర్ బైజాన్‌లో అజిత్ యాక్షన్



తమిళ హీరో అజిత్ కుమార్ మరోసారి తనలోని యాక్షన్ కోణాన్ని సరికొత్తగా చూపించబోతున్నారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న 'విడాముయార్చి' చిత్రం తాజా షెడ్యూల్ అజర్‌బైజాన్‌లో మొదలైంది. 45 రోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో పతాక సన్నివేశాల్లో భాగంగా భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను అక్కడ చిత్రీకరించనున్నారు. మంగళవారం మేకర్స్ షూటింగ్‌కు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో విడుదల చేశారు. ప్రమాదకరమైన స్టంట్స్‌లోనూ అజిత్ డూప్‌ను వాడడం లేదు అని చిత్రబృందం తెలిపింది. తిరుమేని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో త్రిష కథానాయిక. అర్జున్ సర్జా, రెజీనా కసాండ్రా కీలకపాత్రలు పోషిస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందిస్తున్నారు.

ఎస్.. బాస్..
షూటింగ్ పూర్తయింది



'రాక్షసుడు', 'ఖిలాడీ' వంటి చిత్రాలను అందించిన నిర్మాత, కె.ఎల్ యూనివర్సిటీ ఛైర్మన్ కోనేరు సత్యనారాయణ నిర్మిస్తున్న తాజా చిత్రం 'ఎస్..బాస్'. మంగళవారం చిత్ర కథానాయకుడు హవీస్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి ఆయన స్టైలిష్ లుక్ విడుదల చేశారు. 'భాగమతి' వంటి బ్లాక్ బస్టర్ చిత్రాన్ని రూపొందించిన దర్శకుడు అశోక్ పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రూపుదిద్దుకుంటున్న 'ఎస్ బాస్' షూటింగ్ పూర్తయింది. ఈ చిత్రానికి కథ, మాటలు: ఆకుల శివ, సంగీతం: అనూప్ రూబెన్స్, ఫొటోగ్రఫీ: కబీర్‌లాల్.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
బుధవారం • 26 జూన్ 2024

హెల్తీ డ్రింక్

ఈ టీలతో ఆరోగ్య రక్ష

హెర్బల్ టీతో మనసుకు, శరీరానికి సాంత్వన చేకూరడంతో పాటు కొన్ని రుగ్మతలు కూడా అదుపులోకొస్తాయి. కాబట్టి రుగ్మతకు తగిన టీని ఎంచుకుని, తరచూ తాగుతూ ఉండాలి.

బ్లాక్ టీ

- మధుమేహంతో పాటు హృద్రోగాల బారిన పడే అవకాశాలు తగ్గుతాయి.
- రక్తంలో చక్కెర స్థాయులు స్థిరంగా ఉంటాయి.
- వాపులు తగ్గిస్తుంది.

గ్రీన్ టీ

- దీన్లో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ.
- చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది.
- కణాలు ఆరోగ్యంగా పెరగటానికి దోహదపడుతుంది.
- సాంత్వన చేకూరుస్తుంది.

పెప్పర్‌మింట్

- కఫం బయటికొచ్చేలా చేస్తుంది.
- యాంటీ ఇన్‌ఫ్లమేటరీ (వాపులు తగ్గించేదిగా) పని చేస్తుంది.
- ఆకలిని తగ్గిస్తుంది.

శొంఠి టీ

- అలర్జీలను తగ్గిస్తుంది.
- యాంటీ ఇన్‌ఫ్లమేటరీగా పని చేస్తుంది.
- ప్రయాణాల్లో తలెత్తే మోషన్ సిక్‌నెస్‌ను నివారిస్తుంది.
- రుచిని పెంచుతుంది.

దాల్చిన చెక్కటీ

- కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది.
- వైరస్‌లతో పోరాడుతుంది.
- ఆర్థ్రయిటిస్ లక్షణాలను పారదోలుతుంది.



పేరెంటింగ్

హోమ్‌వర్క్ ఇష్టంగా...

పిల్లలతో హోమ్‌వర్క్ చేయించటానికి తల్లితండ్రులు సతమతమయిపోతూ ఉంటారు. దగ్గరుండి చేయించలేక, ఆ వర్క్ తామే పూర్తి చేసి హమ్మయ్య... అని ఊపిరి పీల్చుకుంటూ ఉంటారు. ఇలా కాకుండా తమంతట తాము పిల్లలే ఇష్టంగా హోమ్‌వర్క్ చేసుకుపోయేలా చేయగల చిట్కాలున్నాయి. అవేంటంటే...

- రోజూ స్కూలు నుంచి ఇంటికి రాగానే హోమ్‌వర్క్ చేయమని బలవంత పెట్టకుండా గంటపాటు పిల్లలని ఆటలాడనివ్వాలి.
- ఆటల తార్వత స్నానం చేయించి, హోమ్‌వర్క్ చేయమని పురమాయిస్తే కొత్త ఉత్సాహంతో ఇష్టంగా చేస్తారు.
- కొందరు పిల్లలకి ఇంట్లో చదవటం, రాయటం నచ్చదు. ఇంట్లో ఉన్నంతసేపు తమకిష్టమైనట్టు ఉండాలని ప్రయత్నిస్తారు. ఇలాంటి పిల్లలకు హోమ్‌వర్క్ చేయమని చెబితే విసుగ్గా చూస్తారు. ఈరోజు స్కూల్లో ఏం చెప్పారు? ఏం రాయించారు? ఆ టీచర్ ఏం చెప్పింది? అని మాటల్లో పెట్టి పుస్తకాలు తీయించాలి.
- అవసరమైతే దగ్గరుండి అనుమానాలను నివృత్తి చేయాలి.
- ఒకసారి సహాయం చేసినా, రెండోసారి వాళ్లంతట వాళ్లే హోమ్‌వర్క్ పూర్తి చేసేలా చూడాలి.
- ప్రతి రోజూ హోమ్‌వర్క్‌కు ఓ సమయాన్ని, స్థలాన్ని కేటాయించి దాన్నే ప్రతిరోజూ అనుసరించేలా చేయాలి.
- ఎప్పుడైనా పిల్లలు హోమ్‌వర్క్ చేయటానికి నిరాకరిస్తే కారణం అడిగి తెలుసుకుని అందుకు తగ్గట్టు స్పందించాలి.
- హోమ్‌వర్క్ చేయటం కూడా ఆటల్లో భాగంగా పిల్లలు ఇష్టంగా చేసే వాతావరణాన్ని కల్పించాలి.





ఫ్యాషన్

గంజి పట్టించి, ఇస్త్రీ చేయనిదే కాటన్ చీరలను కట్టుకోలేం అనుకునే రోజులు పోయాయి. పైగా కాటన్ చీరలు వేసవికే పరిమితమనే భావన కూడా అంతరించింది. అన్ని చీరల్లాగే నచ్చినప్పుడు కట్టుకునేలా ఇప్పుడెన్నో రకాల కాటన్ చీరలు అందుబాటులోకొచ్చాయి. వాటిలో చెప్పుకోదగినవి 'గబ్రు' చీరలు. వాటినొకసారి చూసేద్దామా!

'గబ్రు'లో గమ్మత్తుగా..

హ్యాండ్ ప్రింట్ గబ్రు కాటన్ చీరల మూలాలు రాజస్థాన్‌లో ఉన్నాయి. ఈ సంప్రదాయ రాజస్థానీ పద్ధతి తరతరాలుగా మహిళలను అలరిస్తూనే ఉంది. సహజసిద్ధ రంగులతో ఆకట్టుకునే డిజైన్లను అద్దే ఈ గబ్రు కళ నేటికీ ప్రపంచవ్యాప్త పర్యాటకులను ఆకర్షిస్తూనే ఉంది. గబ్రు హ్యాండ్ ప్రింట్ కాటన్‌లో మెటీరియల్స్, చీరలు రెండింటికీ మంచి ఆదరణ ఉంది. వెలసిపోని రంగులు, డిజైన్లను కలిగి ఉండే గబ్రు చీరలు సాదాసీదా కాటన్ చీరల్లా నాలుగైదు ఉతుకులకే వెలసిపోయి, చీకిపోకుండా ఎక్కువ కాలం మన్నడం వల్ల కూడా మహిళలు వీటిని క్యాజువల్ వేర్‌గా ఎంచుకుంటూ ఉంటారు.

సొగసులీనుతూ...

గబ్రు చీరల్లో రెట్టింపు ఆకర్షణీయంగా కనిపించడం కోసం కొన్ని ఫ్యాషన్ చిట్కాలు పాటించాలి. అవేంటంటే...

- సింపుల్‌గా, హుందాగా కనిపించాలంటే, తేలిక రంగులు, చిన్న డిజైన్లు, సన్నని బార్డర్లు కలిగి ఉండే బగ్రు చీరలనే ఎంచుకోవాలి. ఇలాంటి చీరలు ఆఫీస్ వేర్‌గా కూడా చాలా బాగుంటాయి.
- స్నేహితులతో సరదాగా షికారుకు బయల్దేరేటప్పుడు ముదురు ఎరుపు, నీలం, పసుపు కాంట్రాస్ట్ చీరలు బాగుంటాయి. ఫ్యాషన్‌గా కనిపించడం కోసం పొట్టి చేతులు, కాలర్ కలిగిన బ్లౌజ్‌లు లేదంటే స్లీవ్‌లెస్ బ్లౌజులు ఎంచుకోవాలి.
- ఫ్యామిలీ గెట్ టు గెదర్స్‌లో నలుగురిలో ప్రత్యేకంగా కనిపించాలనుకుంటే, సింపుల్ జ్యువెలరీతో చీరను మ్యాచ్ చేయాలి.
- మెత్తగా, హాయిగొలిపే గబ్రు చీరల అందమంతా వాటి మీది అద్దకంలోనే ఉంటుంది. రంగులు, ప్రింట్లు వెలసిపోకుండా ఉండడం కోసం వీటిని నీడ పట్టునే ఆరేస్తూ ఉండాలి. తక్కువ వేడి మీద ఇస్త్రీ చేయించుకోవాలి.



మా బతుకు

మమ్మల్ని బతకనిస్తే చాలు



ట్రాన్స్ మహిళల పట్ల సమాజంలో పాతుకుపోయిన రకరకాల అపోహలకు, దురాభిప్రాయాలకు దీటైన సమాధానం సుబ్బలక్ష్మీ రెడ్డి జీవితం. హైదరాబాద్‌లోని 'కాదంబరి స్టూడియోస్' బోటిక్ యజమానురాలిగా ఫ్యాషన్ ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు సాధించారు. ఆమె డిజైన్ చేసిన వస్త్రాలకు సామాన్యుల మొదలు సెలబ్రిటీల వరకు... ఎంతో మంది అభిమానులున్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తగా తన అనుభవాలను, జీవిత విశేషాలను 'నవ్య'తో పంచుకున్నారు.

"మా కాదంబరీ స్టూడియోస్ బోటిక్‌లో యాభైమందికిపైగా ఉద్యోగులున్నారు. దాని టర్నోవర్ ఏడాదికి నాలుగు కోట్ల రూపాయలు. ప్రతినెలా పదిలక్షల రూపాయల వరకు జీతభత్యాలు చెల్లిస్తాను. లంగా-ఓణీ లాంటి సంప్రదాయ వస్త్రాలను కస్టమర్ల అభిరుచికి తగినట్టుగా సరికొత్తగా డిజైన్ చేయడం మా ప్రత్యేకత. అదీ బడ్జెట్‌లో. అందుకే ఇక్కడి సినిమా, సీరియల్ నటీమణులతో పాటు అమెరికా, ఆస్ట్రేలియా, యూకే తదితర దేశాల్లోని తెలుగువారి నుంచి మాకు ఎక్కువ ఆర్డర్లు వస్తుంటాయి. మా దగ్గర నుంచి విదేశాలకు వెళ్లే పార్సిల్స్ రోజుకు పదికి తక్కువ ఉండవు. పెళ్లిళ్ల, సీమంతం, పుట్టినరోజు లాంటి వేడుకలు, శుభకార్యాలకు తగినట్టుగా పెన్‌కలంకారీ దుస్తులు, లెహంగాస్, అనార్కలీ సల్వార్ సూట్స్, లాంగ్ ఫ్రాక్‌లు రూపొందిస్తాం. ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్ చేసిన రకరకాల డిజైన్లలో వస్త్రాలు అందిస్తాం. కాబట్టి మా 'కాదంబరి'ని చాలామంది ఇష్టపడతారు. పెళ్లికుమారుడి సంప్రదాయ దుస్తులు సైతం మా బోటిక్‌లో ఉంటాయి. ఒక డ్రస్సు కుట్టేముందు దాని కలర్ కాంబినేషన్ దగ్గర నుంచి డిజైనింగ్ వరకు... ప్రతిదీ నేనే దగ్గరుండి చూసుకుంటాను. అలా ఇప్పటివరకు కొన్నివందల వెరైటీలు డిజైన్ చేసి ఉంటాను. అవి ఫ్యాషన్ వస్త్ర వ్యాపార సముదాయంలో మాకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చిపెట్టాయి. ఇదంతా నాకు నేనుగా సాధించిందే అయినా, ఒక్కరోజులో సాధ్యపడలేదు. నా కఠోర శ్రమ, సృజనాత్మకతతో పాటు మా ఉద్యోగుల తోడ్పాటు వల్ల అతి చిన్న బోటిక్‌తో ప్రారంభమైన మా వ్యాపారం ఆరేళ్లలో ఒక పరిశ్రమ స్థాయికి ఎదిగింది.

అది పెద్ద పరీక్షా సమయం...

నేను అబ్బాయిగా పుట్టినా... నాది కాని శరీరంలో నేనున్నానన్న బాధ నన్ను కుదురుగా ఉండనివ్వలేదు. నా లైంగికతకు, సమాజం నన్ను చూస్తున్న తీరుకు మధ్య సంఘర్షణలో నలిగిపోతూ మాటల్లో చెప్పలేనంత మనోవ్యధను అనుభవించాను. ట్రాన్స్‌గా మారే వరకు ఒక రకంగా నరకాన్ని చూశాను. బహుశా... ఇది నాలాంటి వారందరి జీవితానుభవం కూడా కావచ్చు. మాదొక మధ్య తరగతి కుటుంబం. నాన్న ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగి. అమ్మ ఇంట్లోనే కుట్టు పని చేసేది. నాకు అక్క, అన్నయ్య ఉన్నారు. ఫ్యాషన్ డిజైనింగ్ చదవాలన్నది చిన్నప్పటి నుంచి నా కోరిక. కానీ ఆర్థిక పరిస్థితి అనుకూలించక... పెద్దల ఒత్తిడితో మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాను. సరిగ్గా అదే సమయంలో నా అస్తిత్వం బహిర్గతమైంది. నాదైన రూపం మా కుటుంబం కంట పడింది. దాన్ని చూసి వాళ్లు భరించలేకపోయారు. నా అభిమతాన్ని నిరాకరించారు. దాంతో నాకు ఇష్టమైనట్టు బతకడం కోసం ఇంట్లో నుంచి బయటకు వచ్చాను. నిజానికి అది నాకొక పెద్ద పరీక్షా సమయం.

సుబ్బలక్ష్మిగా మారిన తర్వాత...

ట్రాన్స్‌గా మారతానన్నప్పుడు నన్ను ఎంతగానో ప్రేమించే మా అక్క కూడా అనేక అనుమానాలు వ్యక్తం చేసింది. ట్రాన్స్ మహిళలు అనగానే సెక్స్‌వర్క్ లేదంటే యాచకవృత్తి చేసుకొని బతికేవాళ్లనేది మా కుటుంబ సభ్యుల అభిప్రాయం. నేనలా కానని అన్నాను. "సమాజం వాళ్లను అలానే చూస్తుంది కదా" అన్నారు. అప్పుడు నన్ను నేను నిరూపించుకోవాలని దృఢంగా నిశ్చయించుకున్నాను. శారీరకంగా ట్రాన్స్‌గా మారడాన్ని కొద్దిరోజులు వాయిదా వేసి, ఒక ఇంజనీరింగ్ కాలేజీలో లెక్చరర్‌గా చేరాను. ఏడాది వరకు ఉద్యోగంలో చేసి, ఆ జీతంలో మిగిలించుకున్న కొద్దిపాటి డబ్బుతో 2018లో బోటిక్ ప్రారంభించాను. కొన్నాళ్లకే వ్యాపారం వృద్ధి కావడంతో ఉద్యోగుల సంఖ్య పెరిగింది. ఒకరోజు మా సిబ్బందిని పిలిచి... "ఇప్పటి వరకు మీరు చూస్తున్న నేను ఒక అబద్ధం. ఇకమీదట నాదైన రూపంలోకి మారుతున్నాను. మీకేమైనా అభ్యంతరాలున్నాయా?" అని అడిగాను. "మేము మీ సంస్థలో పనిచేస్తున్నాం, అందుకు తగిన జీతం మాకు ఇస్తున్నారు. అంతకుమించి మీ లైంగికతతో, మీ జెండర్‌తో మాకు పనిలేదు. మాకెలాంటి అభ్యంతరం లేదు"అని వారంతా చెప్పారు. ఒక పెద్దాయన "ఇన్నాళ్లు నీలో నా కొడుకును చూసుకున్నాను, ఇకమీదట నువ్వు నా కూతురు అనుకుంటాను" అన్నారు. అదే ప్రశ్న మా ఇంటి ఓనర్‌ను కూడా అడిగాను. ఆమె నన్ను ప్రేమగా దగ్గరికి తీసుకొని, మరింత ధైర్యాన్ని ఇచ్చారు. సుబ్బలక్ష్మిగా మారిన నాకు ఎన్నడూ సమాజం నుంచి అవమానాలు, ఛీత్కారాలు ఎదురుకాలేదు. ఇదివరకు "అన్నా" అని పిలిచిన వారు ఇప్పుడు 'అక్కా" అని పిలుస్తున్నారు. "సర్" అని సంబోధించేవారు కాస్తా "మేడమ్" అంటున్నారు. మా కస్టమర్లు కూడా నా లైంగికతకన్నా నేను రూపొందించిన డిజైన్లకు ప్రాధాన్యత ఇవ్వడం సంతోషంగా ఉంది.

> చిన్నతనంలో ఇంటా, బయటా, బడిలో... ఇలా ఎక్కడో ఒక చోట లైంగిక వేధింపులకు గురికాని ట్రాన్స్ మహిళ ఉండదు. ప్రతి ట్రాన్స్ మహిళ టీనేజీలో శారీరక, మానసిక, లైంగిక వేధింపులకు లోనైన బాధితురాలే! మా జీవితాల్లోని ఆ పార్శ్వాన్ని పట్టించుకునే వారెవరు? మా బాధకు ఉపశమనం కలిగించే చోటెక్కడుంది? కాలేజీలు, మరీ ముఖ్యంగా అబ్బాయిల హాస్టళ్లలో లైంగికత విభిన్నంగా ఉన్నవారిపై జరిగే హింస మాటలతో చెప్పేది కాదు. ఒకవైపు వేధింపులు, మరోవైపు తామేంటో తమకు తెలియకపోవడం... ఈ మనో వ్యధతో చదువు మీద శ్రద్ధ పెట్టలేక చాలామంది పదో తరగతి, ఇంటర్‌తోనే చదువు మానేస్తున్నారు. వారి అస్తిత్వాన్ని కుటుంబం అంగీకరించకపోవడంతో ఇంటి నుంచి బయటకువస్తున్నారు. బతుకుదెరువు కోసం యాచకవృత్తి లేదంటే సెక్స్‌వర్క్ లాంటివాటిని ఆశ్రయిస్తున్నారు.

అదే నా ప్రత్యేకత...

ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు చదవని నాకు... దుస్తుల డిజైనింగ్‌లో నాకంటూ ప్రత్యేక గుర్తింపు రావడానికి ప్రధాన కారణం దానిమీద నాకున్న ఆసక్తి మాత్రమే. ఇంట్లో అమ్మ మిషన్ కుట్టడం, క్లాత్ కత్తిరించడం లాంటివి చిన్నప్పటి నుంచి చూస్తూ పెరిగాను. మా అక్కతో షాపింగ్‌కు వెళ్లినప్పుడు డ్రెస్సుల రంగులు, వాటి మీద డిజైన్లను క్షుణ్ణంగా చూడటం యుక్త వయసులోనే నాకు ఒక వ్యాపకం అయింది. దానికితోడు సినిమాల్లోని కథానాయికల కాస్ట్యూమ్స్‌ను పరిశీలిస్తుండేదాన్ని. బోటిక్ పెట్టాలన్న ఆలోచన నాకు మొదటి నుంచి ఉంది కనుక... ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్స్ లాంటివన్నీ యూట్యూబ్‌లో వీడియోలు చూసి నేర్చుకున్నాను. నాకు మొదటి నుంచి మన సంప్రదాయ వస్త్రాలంటే చాలా ఇష్టం. వాటిని ప్రస్తుత కాలానికి తగినట్టుగా కస్టమర్లు ఇష్టపడేలా డిజైన్ చేయడం మొదలుపెట్టాను. ఒక కొత్తదనాన్ని పరిచయం చేశాను. అది ఇవాళ నన్ను ఈ స్థానంలో నిలబెట్టింది.

కావాల్సింది గౌరవ మర్యాదలు కాదు...

కాదంబరీ స్టూడియోస్ ఫ్రాంఛైజీ ఇవ్వమని చాలామంది అడుగుతున్నారు. వారందరికీ నిర్మొహమాటంగా కుదరదని చెబుతున్నాను. నా వస్త్ర వ్యాపారాన్ని మరింత విస్తరింపచేయాలి. తద్వారా మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నది నా లక్ష్యం. మా కమ్యూనిటీలో కుట్టుపనిలాంటివి తెలిసినవారు పెద్దగా లేకపోవడంతో ముగ్గురు ట్రాన్స్ మహిళలకు మాత్రమే నా పరిశ్రమలో ఉద్యోగం ఇవ్వగలిగాను. ట్రాన్స్ వ్యక్తులను అర్థంచేసుకొనేంతగా ఈ సమాజం ఎదగలేదు. కనుక వారికి ఉద్యోగాలు ఇవ్వడం చాలా అరుదు. ఒకవేళ అలాంటి అవకాశం వచ్చినా, తోటి ఉద్యోగులు వారిని సరిగ్గా అర్థం చేసుకోవాలి కదా. అందుకే ట్రాన్స్ వ్యక్తులకు ఉద్యోగాలకన్నా ఆత్మగౌరవంతో బతికేందుకు చిన్నదైనా వ్యాపారమే ఉత్తమం. కాబట్టి వారికి జీవన నైపుణ్యాల శిక్షణ ఇప్పించడం తక్షణ అవసరం. దీన్ని మనమంతా గుర్తించాలి. ట్రాన్స్ మహిళలుగా మాకు ఈ సమాజం నుంచి ప్రత్యేక గౌరవ మర్యాదలేమీ అక్కర్లేదు, వాటిని ఆశించడం లేదు కూడా. సాటి మనుషుల్లా మా బతుకు మమ్మల్ని బతకనిస్తే చాలు.

• సాంత్వన్

బొప్పాయితో అందంగా...

బొప్పాయి తింటే చక్కటి ఆరోగ్యం కలుగుతుంది. ఇదే బొప్పాయి గుజ్జు జుట్టుకే కాదు.. చర్మ సౌందర్యానికీ మేలు చేస్తుంది. బొప్పాయితో ఇలా సులువుగా ఫేస్‌ప్యాక్స్ చేసుకోవచ్చు...

- బౌల్‌లో పావు కప్పు బొప్పాయి గుజ్జును తీసుకుని ఇందులో రెండు టేబుల్ స్పూన్ల తేనె, స్పూన్ తులసి పొడి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి ఆరిన తర్వాత కడిగేస్తే మృతకణాలు తొలగిపోతాయి. అంతేకాకుండా మొటిమలు తగ్గిపోతాయి.
- రెండు టేబుళ్ల బొప్పాయి చూర్ణంలోకి అరటీస్పూన్ పసుపు వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పటిస్తే పిగ్మెంటేషన్ పోతుంది. ముఖం మీద ఉండే నొప్పులు పోతాయి. యూత్‌ఫుల్‌గా కనిపిస్తారు.



- ఇంట్లో బొప్పాయి తప్ప ఏమీ లేకపోతే.. బొప్పాయి చూర్ణాన్ని చర్మంమీద పట్టించాలి. ముప్పయి నిముషాల తర్వాత ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. దీనివల్ల అందులోని ఎ, సి విటమిన్ల వల్ల చర్మంలో డీప్ క్లీనింగ్ జరుగుతుంది. చర్మం విఎలమిలా మెరుస్తుంది.
- బౌల్‌లో రెండు టేబుల్ స్పూన్ల బొప్పాయి గుజ్జును, రెండు టేబుల్ స్పూన్ల అరటిగుజ్జు కలిపి ముఖానికి, మెడ చివర వరకూ పట్టించాలి. ఇలా తరచుగా చేస్తుంటే చర్మం మృదువుగా ఉంటుంది.
- రెండు టేబుల్ స్పూన్ల బొప్పాయి పేస్టులో అరటీస్పూన్ కొబ్బరి నూనె వేసి మెత్తగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి అరగంట తర్వాత కడిగేయాలి. ఇలా చేస్తుంటే చర్మం మీద మంటలు తగ్గుతాయి.
- బౌల్‌లో తెల్లసొన వేసి ఇందులోకి రెండు చెంచాల బొప్పాయి పేస్ట్ వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టిస్తే చర్మం మీద ముడతలు కనపడవు.
- జిడ్డు చర్మం లేదా ఆయిలీ స్కిన్ ఉంటే నిద్రపోయే ముందు రెండు స్పూన్ల బొప్పాయి గుజ్జు, రెండు స్పూన్ల పెరుగు తీసుకుని కలిపాక.. ముఖానికి పట్టించుకోవాలి. ఆరిన తర్వాత శుభ్రం చేసుకోవాలి.

ట్రెండీ టచ్

'అహో'నా స్టైలంటా!



ట్రెండ్‌ను ఫాలో అవదు... అలాగని ట్రెండ్‌ను సెట్ చేయదు. కానీ ఆమెకంటూ ఒక ట్రెండ్ ఉంది. సినిమాల్లో నటిస్తూనే... సామాజిక మాధ్యమాల్లో యమ బిజీగా ఉంటుంది. నచ్చింది చేస్తూ... విభిన్నడ్రెస్సుల్లో ఆకట్టుకొంటూ... ఎప్పటికప్పుడు సరికొత్తగా కనిపిస్తుంది. నవతరం ఫ్యాషన్ ఐకాన్‌గా 'ఇన్‌స్టా'ంట్‌గా వేలకు వేలు లైక్‌లు కొట్టేస్తున్న మళయాళ మనోహరి... అహానా కృష్ణ ట్రెండీ టచ్ ఇది.

మళయాళ చిత్ర పరిశ్రమలోనే ప్రధానంగా పని చేస్తున్నా... సామాజిక మాధ్యమాల్లో సరిహద్దులు దాటిన అభిమానం ఉంది అహానా కృష్ణకు. ఇన్‌స్టాగ్రామ్‌లో ముప్పై లక్షలకు పైగా ఆమెను ఫాలో అవుతున్నారు. యూట్యూబ్‌లో పదిహేను లక్షల మంది సబ్‌స్క్రైబర్స్ దీనికి అదనం. అద్భుతమైన నటనతో ప్రేక్షకుల హృదయాల్లో స్థానం సంపాదించుకున్న అహానా... సామాజిక మాధ్యమాల్లో పెట్టే ప్రతి పోస్టుకూ క్షణాల్లో లైక్‌లు లక్ష దాటుతున్నాయి.

పదేళ్ల కిందట పరిశ్రమలో ప్రయాణం మొదలుపెట్టినా... ఇప్పటికి ఆమె నటించిన చిత్రాలు పది దాటలేదు. కానీ స్టార్ హీరోయిన్లకు తీసిపోని ఫాలోయింగ్. అందుకు ముఖ్య కారణం... నెట్టింట ఆకట్టుకొనే ఆమె డ్రెస్సింగ్ స్టయిల్. పాశ్చాత్య వస్త్రధారణలో అహానా లుక్ ఎంతగా అలరిస్తుందో... సంప్రదాయ దుస్తుల్లోనూ అంతే అబ్బుర పరుస్తుంది. రెండిటికీ సమప్రాధాన్యం ఇస్తుంది ఈ నటి. బ్లాక్ లేస్ అవుట్‌ఫిట్‌లో ఫొటోషూట్ చిత్రాలను అహానా ఇటీవల ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది. గంటల వ్యవధిలోనే ఆ ఫొటోలకు లెక్కకు మించి లైక్‌లు వచ్చాయి. వేలల్లో నెట్టింట చక్కర్లు కొట్టాయి. అంతకుముందు ఆఫ్ షోల్డర్ టాప్, హై స్లిట్ ప్యాంట్‌తో మెరిసిన ఫొటోలూ తక్కువేంకాదు. లక్షకు పైగా లైక్‌లు సంపాదించాయి.

మళయాళ నటుడు కృష్ణ కుమార్ నలుగురు కూతుళ్లలో అహానా పెద్దమ్మాయి. అహ్మదాబాద్ 'ముద్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ కమ్యూనికేషన్'లో అడ్వర్‌టైజింగ్ మేనేజ్‌మెంట్ అండ్ పబ్లిక్ రిలేషన్స్‌లో పీజీ చదివింది. ఆమె స్వస్థలం కేరళ రాజధాని తిరువనంతపురం. సరిగ్గా పదేళ్ల కిందట తొలిసారి వెండితెర మీద తళుక్కుమంది. కథాబలంతో పాటు ప్రాధాన్యమున్న పాత్రలనే ఎంచుకొంటూ... అడుగులు వేస్తోంది. మాధ్యమం ఏదన్నది ఆమెకు ముఖ్యం కాదు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొంటూ... తనకు పేరు తెస్తాయనుకున్న కథలను ఓకే చేస్తూ... ఒక విభిన్నమైన కెరీర్‌ను నిర్మించుకుంది. అందులో భాగంగానే వెబ్‌సిరీస్‌లలో నటిస్తోంది. కొన్ని మ్యూజిక్ వీడియోల్లోనూ కనిపించి.. అన్ని వర్గాల అభిమానులకూ చేరువ అయ్యే ప్రయత్నం చేస్తోంది. రెండు మూడు పాటలూ పాడి... తన సంగీత అభిరుచినీ చాటుతోంది.

ఇవన్నీ ఒకటైతే... సామాజిక మాధ్యమాల్లో ఆమె ట్రెండీ టచ్ మరొక ఎత్తు. ఫ్యాషన్‌పై తన ఆసక్తితో పాటు... విభిన్నమైన వస్త్రధారణతో ఫ్యాషన్ ఐకాన్ గానూ వేలమంది మనసు దోచుకొంటోంది. ఇదే ఆమెకు సినిమాలకు మించి గుర్తింపు తెచ్చి పెడుతోంది. డ్రెస్సింగ్‌లోనూ ఆమెకంటూ ఒక అభిరుచి ఉంది. ఎక్కువగా వి-నెక్ టాప్స్, డ్రెస్‌లు ఇష్టపడే ఈ తార... ఆకర్షణీయమైన రంగులు, పాలెట్స్, ప్యాటరన్స్‌కు ప్రాధాన్యం ఇస్తుంది. సంప్రదాయ సల్వార్ సూట్ అయినా... వెస్టరన్ అవుట్‌ఫిట్స్ అయినా... ఆమె ధరిస్తే 'ఆహా' అనాల్సిందే. కళ్లు చెదిరే వర్ణాలు, హుందాగా కనిపించే వస్త్రశ్రేణులు, సరికొత్త హంగులతో ప్రయోగాలు చేయడానికి ఎప్పుడూ వెనకాడదు. 'హీరామండీ' స్ఫూర్తితో ఇటీవల ఆమె చేసిన ఓ డిజైన్... నెటిజనులనే కాదు, ఫ్యాషన్ పండితులను కూడా మైమరిపించింది. స్టయిలిష్ జంప్‌సూట్స్, స్వెటర్స్, టీషర్ట్స్, క్యాజువల్ అవుట్‌ఫిట్స్ కలెక్షన్ అహానా వద్ద లెక్కకు మించి ఉన్నాయి. యువత అభిరుచిని, నయా ట్రెండ్‌ను పట్టేయడం, ఏ వెరైటీ అయినా తనకు నప్పేలా మార్చుకోవడం... ఇవే అహానాను స్టైల్ ఐకాన్‌ను చేశాయి.



సెన్సెక్స్ @ 78,000

- 23,700 ఎగువకు నిఫ్టీ
- సరికొత్త శిఖరాలకు సూచీలు



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు మంగళవారం సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. సెన్సెక్స్ తొలిసారిగా 78,000 మైలురాయిని చేరగా.. నిఫ్టీ 23,700 స్థాయిని దాటింది. మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎస్‌బీఐతో పాటు ప్రైవేట్ బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, ఐటీ రంగ షేర్లలో కొనుగోళ్లు మార్కెట్ ర్యాలీకి దోహదపడ్డాయి. సెన్సెక్స్ ఒక దశలో 823.63 పాయింట్లు పెరిగి 78,164.71 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును తాకి చివరికి 712.44 పాయింట్ల లాభంతో 78,053.52 వద్ద సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపును నమోదు చేసింది. ఈ నెల 10న తొలి సారిగా 77,000 మార్క్‌కు చేరిన సెన్సెక్స్.. గడిచిన 15 రోజుల్లోనే మరో 1,000 పాయింట్లు పుంజుకోవడం గమనార్హం. నిఫ్టీ విషయానికొస్తే, 216.3 పాయింట్ల వృద్ధితో 23,754.15 వద్ద సరికొత్త ఇంట్రాడే రికార్డును, చివర్లో 183.45 పాయింట్ల లాభంతో 23,721.30 వద్ద ఆల్‌టైం గరిష్ఠ ముగింపును నమోదు చేసింది.

ఈ ఏడాదిలో ఇప్పటివరకు నిఫ్టీ సరికొత్త రికార్డు గరిష్ఠాన్ని నమోదు చేయడం ఇది 34వ సారి. కాగా, ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.435.76 లక్షల కోట్లకు (5.22 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో 15 లాభపడ్డాయి.

నెఫ్రో కేర్ ఐపీఓ ధరల శ్రేణి రూ.85-90

నెఫ్రో కేర్ ఇండియా లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ఈ నెల 28న ప్రారంభమై జూలై 2న ముగియనుంది. ఐపీఓ ద్వారా కంపెనీ 45.84 లక్షల తాజా ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. షేరు ధరల శ్రేణిని రూ.85-90గా నిర్ణయించింది. తద్వారా రూ.41.26 కోట్ల వరకు సమీకరించనుంది.

1:5 నిష్పత్తిలో కిమ్స్ షేర్ల విభజన!

హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న కృష్ణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్) తన షేర్లను విభజించనుంది. రూ.10 ముఖవిలువ కలిగిన ఒక్కో షేరును రూ.2 ముఖవిలువతో కూడిన 5 షేర్లుగా విభజించాలని ప్రతిపాదించింది. ఈ నెల 28న (శుక్రవారం) కంపెనీ బోర్డు సమావేశమై ఈ ప్రతిపాదనపై తుది నిర్ణయం తీసుకోనుందని స్టాక్ ఎక్స్ఛేంజీలకు కిమ్స్ సమాచారం అందించింది. దాంతో కంపెనీ షేరు ఒక దశలో 6.40 శాతం వరకు పెరిగి రూ.2,187.45 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 3.6 శాతం లాభంతో రూ.2,128.50 వద్ద ముగిసింది.

ఏడాది గరిష్ఠానికి అమర రాజా షేరు

హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ షేరు మంగళవారం ఇంట్రాడే ట్రేడింగ్‌లో దాదాపు 20 శాతం ఎగబాకి రూ.1,655.20 వద్ద సరికొత్త ఏడాది గరిష్ఠాన్ని నమోదు చేసింది. బీఎస్ఈలో ట్రేడింగ్ నిలిచేసరికి, కంపెనీ షేరు ధర 19.40 శాతం లాభంతో రూ.1,647 వద్ద స్థిరపడింది. లిథియం అయాన్ సెల్స్ టెక్నాలజీ కోసం స్లొవేకియాకు చెందిన జీబీబీ ఎనర్జీతో అమర రాజా పూర్తి అనుబంధ విభాగమైన అమర రాజా అడ్వాన్స్‌డ్ సెల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ లైసెన్సింగ్ అగ్రిమెంట్‌ను కుదుర్చుకోవడం షేర్ల ర్యాలీకి కారణమైంది. అంతేకాదు, ఈ ఏడాదిలో ఇప్పటివరకు అమర రాజా షేరు ధర రెట్టింపైంది. 2014లో 144 శాతం వృద్ధిని నమోదు చేసిన కంపెనీ షేరుకు ఆ తర్వాత ఇదే అత్యుత్తమ ప్రదర్శన.

100 బిలియన్ డాలర్ల క్లబ్‌లోకి ఐసీఐసీఐ బ్యాంక్

ప్రైవేట్ రంగానికి చెందిన ఐసీఐసీఐ బ్యాంక్ తాజాగా మరో రికార్డును సృష్టించింది. బీఎస్ఈలో బ్యాంక్ షేరు మంగళవారం రెండున్నర శాతం వరకు వృద్ధి చెంది రూ.1,199 వద్దకు ఎగబాకింది. దాంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.8.44 లక్షల కోట్లకు (100 బిలియన్ డాలర్లు= 10,000 కోట్ల డాలర్లు) చేరుకుంది. ఇప్పటివరకు దేశీయ స్టాక్ మార్కెట్లో 100 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువను సాధించిన ఆరో సంస్థగా ఐసీఐసీఐ బ్యాంక్ నిలిచింది. ఐసీఐసీఐ కంటే ముందు ఈ మైలురాయికి చేరుకున్న కంపెనీల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్ ఉన్నాయి.

వచ్చే ఐదేళ్లలో రూ.2,000 కోట్ల పెట్టుబడులు

2025-26లో పబ్లిక్ ఇష్యూకి..

వచ్చే ఏడాది మంత్రాలయం ప్లాంట్ విస్తరణ పూర్తి

ఎంఐపీపీఎల్ సీఈఓ అభిషేక్ అగర్వాల్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న మారుతి ఇస్పాత్ అండ్ పైప్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎంఐపీపీఎల్) వచ్చే ఐదేళ్లలో రూ.2,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. మంగళవారం నాడిక్కడ కంపెనీ కొత్త ఉత్పత్తి 'ఎంఎస్ వాయు' విడుదల చేసిన సందర్భంగా సంస్థ సీఈఓ అభిషేక్ అగర్వాల్ మాట్లాడుతూ.. కార్యకలాపాల విస్తరణ కోసం ఈ మొత్తాలను వెచ్చించనున్నట్లు తెలిపారు. కంపెనీ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని మంత్రాలయం,నాయుడుపేట, తెలంగాణలోని హైదరాబాద్ సమీపంలో ప్లాంట్లను నిర్వహిస్తోంది. ఈ ప్లాంట్లలో స్పాంజ్ ఐరన్, బిల్లెట్స్, టీఎంటీ బార్స్, ఎంఎస్ రౌండ్, బైండింగ్ వైర్స్‌ను ఉత్పత్తి చేస్తున్నట్లు అగర్వాల్ చెప్పారు.

కార్యకలాపాల విస్తరణలో భాగంగా 300 ఎకరాల్లో విస్తరించి ఉన్న మంత్రాలయం ప్లాంట్ కార్యకలాపాలను మరింతగా విస్తరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా మరో 300 ఎకరాలను కొనుగోలు చేయటంతో పాటు కొత్త ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన చెప్పారు. వచ్చే ఏడాది డిసెంబరు నాటికి ఈ కొత్త ప్లాంట్ అందుబాటులోకి రానుందన్నారు. అంతేకాకుండా ప్లాంట్ మొత్తం ఉత్పత్తి సామర్థ్యం 1.8 లక్షల టన్నుల నుంచి 2.86 లక్షల టన్నులకు పెరగనుందని చెప్పారు. ఉత్తరాది మార్కెట్లో కార్యకలాపాలను విస్తరించేందుకు గాను నోయిడా సమీపంలోని ఘజియాబాద్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌ల్లో ప్లాంట్లను ఏర్పాటు చేయాలని చూస్తున్నట్లు అగర్వాల్ తెలిపారు. విస్తరణకు అవసరమైన మొత్తాలను రుణాలు, అంతర్గత వనరులతో పాటు పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించనున్నట్లు ఆయన చెప్పారు.

ఐపీఓ ద్వారా రూ.400 కోట్ల సమీకరణ: వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో కంపెనీ పబ్లిక్ ఇష్యూకి రానుందని అగర్వాల్ వెల్లడించారు. ఈ ఇష్యూ ద్వారా రూ.400 కోట్లు సమీకరించాలని చూస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇష్యూలో భాగంగా కంపెనీలో 25 శాతం వాటాలను విక్రయించాలని యోచిస్తున్నట్లు తెలిపారు. ఈ మొత్తాలను కార్యకలాపాల విస్తరణకు వెచ్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ మొత్తం టర్నోవర్ రూ.1,200 కోట్లుగా ఉండగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.1,500 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు.

మన విదేశీ అప్పులు రూ.55.38 లక్షల కోట్లు

ముంబై : ఈ ఏడాది మార్చి నెలాఖరుకు నాటికి ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలతో సహా భారత విదేశీ రుణ భారం 66,380 కోట్ల డాలర్లకు (సుమారు రూ.55.38 లక్షల కోట్లు) చేరింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 3,970 కోట్ల డాలర్లు (సుమారు రూ.3.31 లక్షల కోట్లు) ఎక్కువ. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మంగళవారం ఇందుకు సంబంధించిన వివరాలు విడుదల చేసింది. జీడీపీపరంగా చూస్తే ఇదే కాలంలో విదేశీ రుణ భారం 19 శాతం నుంచి 18.7 శాతానికి తగ్గింది. మొత్తం 18.7 శాతం విదేశీ రుణ భారంలో ప్రభుత్వ వాటా 4.2 శాతం మాత్రమే. మిగతాదంతా ప్రభుత్వేతర సంస్థలు చేసిన రుణాలు.

ముడి చమురు మళ్లీ పైపైకి..

న్యూయార్క్: ముడి చమురు ధర మళ్లీ సెగలు కక్కుతోంది. న్యూయార్క్ మార్కెట్లో బ్యారల్ బ్రెంట్ రకం చమురు ధర మంగళవారం రెండు నెలల గరిష్ఠ స్థాయి 86 డాలర్లకు చేరింది. ఎర్ర సముద్రంలో చమురు రవాణా నౌకలపై కొనసాగుతున్న హౌతీల దాడులు, క్రిమియాలోని రష్యా స్థావరాలపై ఉక్రెయిన్ దాడుల నేపథ్యంలో అమెరికా-రష్యా మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు ఇందుకు ప్రధాన కారణమని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో బ్యారల్ బ్రెంట్ ముడి చమురు ధర వచ్చే కొద్ది నెలల్లో 85-100 డాలర్ల మధ్య ట్రేడయ్యే అవకాశం ఉందని ఎస్ అండ్ పీ గ్లోబల్ అంచనా.

స్పెక్ట్రమ్ వేలంలో తొలిరోజు రూ.11,000 కోట్ల బిడ్లు

న్యూఢిల్లీ: దేశంలో మంగళవారం నుంచి ప్రారంభమైన స్పెక్ట్రమ్ వేలంలో తొలిరోజు బిడ్ల ప్రక్రియ ముగిసే సమయానికి టెలికాం కంపెనీలు రూ.11,000 కోట్ల విలువ గల బిడ్లు దాఖలు చేశాయి. ఈ విడతలో ప్రభుత్వం రూ. 96,238 కోట్ల విలువ గల 10,500 మెగాహెడ్జ్ స్పెక్ట్రమ్‌ను వేలానికి పెట్టింది. మంగళవారం ప్రధానంగా 900, 1800 మెగాహెడ్జ్ బ్యాండ్లకు అధిక బిడ్లు దాఖలయ్యాయి.

- ఐఎస్‌బీ-రూట్‌లెడ్జ్ నుంచి మరో పుస్తకం

ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)-రూట్‌లెడ్జ్ పబ్లిక్ పాలసీ బుక్ సీరీస్‌లో భాగంగా భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ మరో పుస్తకం విడుదల చేసింది. 'ఇన్నోవేషన్స్, ప్రాక్టీస్ అండ్ ఫ్యూచర్ ఆఫ్ పబ్లిక్ పాలసీ ఇన్ ఇండియా' పేరుతో ఈ పుస్తకం విడుదలైంది. టెక్నాలజీ, పాలసీ అండ్ ఇంక్లూజన్ వంటి అనేక అంశాలపై ఈ పుస్తకంలో చర్చించారు. ఆసక్తి ఉన్న పాఠకులు ఆన్‌లైన్‌లోనూ ఈ పుస్తకాన్ని ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,200 ▼	66,200 ▼	95,500 ▼
ముంబై	71,739 ▲	65,713 ▲	88,515 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



26వ తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	515
వరంగల్	517	గోదావరి	515
చిత్తూరు	573	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	119	విజయవాడ	132
వరంగల్	119	గుంటూరు	132
కరీంనగర్	119	ఒంగోలు	132
మహబూబ్‌నగర్	119	చిత్తూరు	129
కర్నూలు	119	నెల్లూరు	129
విశాఖపట్నం	138	అనంతపురం	132
గోదావరి	132		

సిడ్స్ ఫామ్ రూ.83 కోట్ల సమీకరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న సిడ్స్ ఫామ్.. రూ.83 కోట్లు (కోటి డాలర్లు) సమీకరించింది. ఓమ్నివోర్, నరోతం సెక్సారియా ఫ్యామిలీ ఆఫీస్ (ఎన్ఎస్ఎఫ్ఓ) నుంచి ఈ మొత్తాలను సమీకరించినట్లు వెల్లడించింది. హైదరాబాద్, బెంగళూరు మార్కెట్లలో స్థానాన్ని పటిష్ఠం చేసుకోవటంతో పాటు హై-క్వాలిటీ డెయిరీ ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి సామర్థ్యాలను పెంచుకునేందుకు ఈ మొత్తాలను వెచ్చించనున్నట్లు సిడ్స్ ఫామ్ వ్యవస్థాపకుడు కిశోర్ ఇందుకూరి వెల్లడించారు. 2016లో కార్యకలాపాలు ప్రారంభించిన సిడ్స్ ఫామ్‌కు ఈ రెండు నగరాల్లో 25,000 పైగా కస్టమర్లు ఉన్నారు.

సౌర, పవన విద్యుత్‌పై అదానీ గ్రూప్ ఫోకస్

- 2030 నాటికి 50,000 మెగావాట్ల సామర్థ్యం
- రూ.2 లక్షల కోట్ల భారీ పెట్టుబడులు
- ఏపీలో 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్లాంట్

అహ్మదాబాద్: సౌర,పవన వంటి పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులపై అదానీ గ్రూప్ పెద్దఎత్తున పెట్టుబడులు పెడుతోంది. 2030 నాటికి ఈ రంగంలో విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని ప్రస్తుత 10,000 మెగావాట్ల నుంచి 50,000 మెగావాట్లకు విస్తరించాలని భావిస్తోంది. ఇందుకోసం రూ.2 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టనుంది. అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాగర్ అదానీ ఈ విషయం వెల్లడించారు. ఇందులో 80 శాతం సౌర విద్యుత్ ద్వారా, మిగతాది పవన విద్యుత్ ద్వారా ఉత్పత్తి చేస్తామని తెలిపారు. ఇందుకు అవసరమైన సౌర ఫలకాలు, టర్బైన్స్‌ను కూడా సొంతంగా తయారు చేస్తామన్నారు.

ఏపీలో పంప్డ్ స్టోరేజీ ప్లాంట్ పనులు షురూ

పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులతో పాటు రాత్రి సమయాల్లో ఉపయోగించుకునేందుకు వీలుగా 5,000 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు అదానీ గ్రీన్ ఎనర్జీ కంపెనీ సీఈఓ అమిత్ సింగ్ చెప్పారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ లో 500 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన పంప్డ్ స్టోరేజీ ప్లాంట్ నిర్మాణ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్రల్లో జల విద్యుత్ కేంద్రాల వద్ద విద్యుత్ నిల్వ కోసం పెద్ద ఎత్తున పంప్డ్ స్టోరేజీ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉందన్నారు. అదానీ గ్రూప్ కంపెనీలు అన్నీ కలిసి 2024-25లో వ్యాపార విస్తరణ కోసం రూ.1.3 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టనున్నాయి.

మా దేశంలో పెట్టుబడులు పెట్టండి: ఉజ్బెకిస్థాన్

హైదరాబాద్: భారత ఫార్మా, ఐటీ కంపెనీల నుంచి ఉజ్బెకిస్థాన్ పెట్టుబడులు ఆశిస్తోంది. ఇందుకోసం ఆ దేశ రాయబారి సర్దార్ ఎం రుస్తంబవె హైదరాబాద్‌లోని పలు ఐటీ, ఫార్మా కంపెనీల ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ రెండు రంగాలతో పాటు విద్య, వైద్యం, పారిశ్రామిక ఉత్పత్తి, ఇంధనం, పర్యాటక రంగాల్లోనూ భారత కంపెనీల నుంచి పెట్టుబడులు ఆశిస్తున్నట్టు తెలిపారు. భారత్‌లానే తమ దేశం కూడా స్టార్టప్ కంపెనీలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు రుస్తంబవె చెప్పారు.

స్పోర్ట్స్

సెమీఫైనల్స్ రేపు

దక్షిణాఫ్రికా x అఫ్ఘానిస్థాన్ (ఉ. 6 గం.)

భారత్ x ఇంగ్లండ్ (రా. 8 గం.)

అఫ్ఘాన్ అద్భుతః

తొలిసారి సెమీస్‌కు

బంగ్లాదేశ్‌పై ఉత్కంఠ విజయం ● రషీద్, నవీనుల్‌లకు నాలుగేసి వికెట్లు

టీ20 వరల్డ్‌కప్

ఆస్ట్రేలియా అవుట్



వాట్ ఏ మ్యాచ్! హైడ్రామా, సస్పెన్స్, సంబరాలు, భావోద్వేగాలతో పాటు వరుణుడి దోబూచులాట.. వెరసి అఫ్ఘాన్ సేన సగర్వంగా తలెత్తుకునేలా, అంతులేని ఆనందంతో ముగిసిన ఈ పోరు.. ఏ మసాలా సినిమాకూ తీసిపోని మలుపులతో సాగింది. సెమీస్ బెర్త్ కోసం బంగ్లాదేశ్‌తో గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లో అఫ్ఘాన్ చేసింది 115 పరుగులే. ఇంకేం.. వారి ఆశలు గల్లంతైనట్టేనని అనుకున్న స్థితిలో బౌలర్లు పట్టు వదల్లేదు. సులువుగా నెగ్గాల్సిన బంగ్లాను ముప్పుతిప్పలు పెడుతూ పేసర్ నవీనుల్ హక్, స్పిన్నర్ రషీద్ ఖాన్ ముచ్చెమటలు పట్టించారు. ఆధిపత్యం అటూ.. ఇటూ మారుతూ వచ్చినా చివరకు తమ క్రికెట్ చరిత్రలోనే చిరస్మరణీయ విజయంతో అఫ్ఘాన్ సెమీస్ చేరింది. ఇక వీరి గెలుపుతో బంగ్లాతో పాటు ఆస్ట్రేలియా కూడా ఇంటిబాట పట్టక తప్పలేదు.

కింగ్స్‌టౌన్: తాజా టీ20 వరల్డ్‌కప్‌లో అఫ్ఘాన్ వీరులు మరోసారి తమ సత్తాను చాటుకున్నారు. మంగళవారం అత్యంత నాటకీయ పరిస్థితుల్లో బంగ్లాదేశ్‌తో జరిగిన సూపర్-8 ఆఖరి మ్యాచ్‌లో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిన 8 పరుగుల తేడాతో గెలిచిన ఈ జట్టు.. తొలిసారిగా సెమీఫైనల్లో అడుగుపెట్టింది. గురువారం రషీద్ సేన దక్షిణాఫ్రికాతో తొలి సెమీస్‌లో తలపడనుంది. 2022 మెగా టోర్నీలో ఒక్క విజయం కూడా అందుకోని అఫ్ఘాన్ ఈసారి మాత్రం న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలను మట్టికరిపిస్తూ టైటిల్ రేసులోనూ ఉన్నామంటూ చాటుకోవడం విశేషం. ఇక, మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన అఫ్ఘాన్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 115 పరుగులు మాత్రమే చేసింది. ఓపెనర్ గుర్బాజ్ (43) టాప్ స్కోరర్. స్పిన్నర్ రిషాద్‌కు మూడు వికెట్లు దక్కాయి. అనంతరం మ్యాచ్ మధ్యలో వర్షం కారణంగా 19 ఓవర్లకు కుదించగా లక్ష్యాన్ని 114కు మార్చారు. అయితే బంగ్లా 17.5 ఓవర్లలో 105 పరుగులకే పరిమితమైంది. ఓపెనర్ లిట్టన్ దాస్ (54 నాటౌట్) అజేయ పోరాటం ఫలితాన్నివ్వలేదు. రషీద్ (4/23), ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ నవీనుల్ (4/26) వణికించారు.

సమష్టిగా దెబ్బతీశారు..: వాస్తవానికి ఈ మ్యాచ్ గ్రూప్-1లోని అఫ్ఘాన్, బంగ్లా, ఆసీస్ జట్లకు కూడా సెమీస్ బెర్త్‌ను ఊరించింది. దీనికి తగ్గట్టుగానే బంగ్లా ముందు 116 పరుగుల లక్ష్యమే ఉండడంతో 12.1 ఓవర్లలో గెలిస్తే షంటో సేనకు సువర్ణావకాశం ఉండేది. దీన్ని దృష్టిలో ఉంచుకునే వారి ఛేదన సాగింది. కానీ వారి వ్యూహం బెడిసికొట్టింది. ముఖ్యంగా ఆరంభ, చివర్లో పేసర్ నవీనుల్ హక్ చెలరేగగా.. మిడిలార్డర్‌ను స్పిన్నర్ రషీద్ ఖాన్ దెబ్బతీశాడు. దీంతో ఎనిమిది మంది బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. తొలి ఓవర్‌లో లిట్టన్ 4,6తో 13 రన్స్ రాబట్టి ఆశలు రేపాడు. కానీ రెండో ఓవర్‌లో ఓపెనర్ తన్‌జీద్‌ను పేసర్ ఫరూఖి డకౌట్ చేయగా... తర్వాతి ఓవర్‌లో పేసర్ నవీనుల్ మరింత గట్టి షాక్ ఇస్తూ కెప్టెన్ షంటో (5), షకీబ్ (0)లను వరుస బంతుల్లో అవుట్ చేశాడు. ఈ దశలో పది నిమిషాలపాటు వర్షం అంతరాయం కలిగించింది. అటు బంగ్లా కూడా సెమీస్ కోసం కాకుండా ఓదార్పు విజయంపై దృష్టి పెట్టింది. కానీ రషీద్ రాకతో వీరి కష్టాలు మరింతగా పెరిగాయి. వరుస ఓవర్లలో కీలక నాలుగు వికెట్లు తీయడంతో బంగ్లా 80/7 స్కోరుతో ఒత్తిడిలో పడింది. అయినా అప్పటికీ 9 ఓవర్లలో కేవలం 34 పరుగులు చేస్తే చాలు. ఓవైపు లిట్టన్ చక్కటి షాట్లతో ఆకట్టుకున్నా మరో ఎండ్‌లో అతడికి తోడ్పాటు అందలేదు. బౌలర్లు పకడ్బందీగా బంతులు వేయడంతో వికెట్ కాపాడుకునేందుకు లిట్టన్ కూడా భారీ షాట్లు ఆడలేదు. నెమ్మదిగా సమీకరణం 12 బంతుల్లో 12 పరుగులకు మారడంతో అఫ్ఘాన్ మరింత పట్టు బిగించింది. 18వ ఓవర్‌లో నవీనుల్ వరుస బంతుల్లో చివరి రెండు వికెట్లు తీయడంతో బంగ్లా షాక్‌లో మునిగిపోగా.. అఫ్ఘాన్ సంబరాలు ఆకాశాన్నంటాయి.

గుర్బాజ్ ఒక్కడే..: టాస్ గెలిచిన అఫ్ఘాన్ బ్యాటింగ్ ఎంచుకోగా.. ఓపెనర్ గుర్బాజ్ మాత్రమే బంగ్లా బౌలర్లను ఎదుర్కోగలిగాడు. అయితే చివర్లో రషీద్ 3 సిక్సర్లతో కీలక పరుగులు అందజేశాడు. మరో ఓపెనర్ జద్రాన్ (18) కాస్త సహకారం అందించడంతో తొలి వికెట్‌కు 59 పరుగుల భాగస్వామ్యంతో మంచి స్థితిలోనే నిలిచింది. కానీ ఆ తర్వాత స్పిన్నర్ రిషాద్, పేసర్ ముస్తాఫిజుర్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. దీంతో ఓవర్లు కరుగుతున్నా స్కోరు కదల్లేదు. 93/5 స్కోరుతో ఇబ్బందుల్లో పడిన దశలో రషీద్ 18వ ఓవర్‌లో సిక్స్, ఆఖరి ఓవర్‌లో రెండు సిక్సర్లతో జట్టు స్కోరు వంద దాటింది.

సంక్షిప్త స్కోర్లు

అఫ్ఘానిస్థాన్: 20 ఓవర్లలో 115/5 (గుర్బాజ్ 43, రషీద్ 19 నాటౌట్, జద్రాన్ 18; రిషద్ 3/26).

బంగ్లాదేశ్: 17.5 ఓవర్లలో 105 ఆలౌట్ (లిట్టన్ దాస్ 54 నాటౌట్, హ్రిదయ్ 14; రషీద్ 4/23, నవీనుల్ హక్ 4/26).

స్ఫూర్తిదాయకం.. వీరి ప్రయాణం

బాంబుల మోతలు.. విధ్వంసాలు.. అణచివేతలు.. వినాశనాలు.. ఆంక్షలు.. అఫ్ఘానిస్థాన్ అంటే ఎక్కువగా గుర్తుకు వచ్చేది ఇవే. అలాంటి పరిస్థితుల నుంచి ప్రపంచమే నివ్వెరపోయేలా.. క్రికెట్‌లో తనకంటూ ప్రత్యేక అధ్యాయం లిఖించే స్థాయికి ఎదిగింది అఫ్ఘాన్ జట్టు. పరిస్థితులకు ఎదురీది.. పవర్‌ఫుల్‌గా మారింది.

శరణార్థి శిబిరాల నుంచి..: గత దశాబ్ద కాలంలో క్రికెట్‌లో అత్యంత వేగంగా వృద్ధి చెందిన జట్టు అఫ్ఘాన్. పాకిస్థాన్ శరణార్థి శిబిరాల్లో పరిచయమైన క్రికెట్.. ఇప్పుడు వారికంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చింది. ఆటపై మక్కువ పెంచుకొన్న అఫ్ఘాన్‌లు.. తమతోపాటు క్రికెట్‌నూ తీసుకెళ్లారు. జట్టులో ఎక్కువ మంది 2001లో అమెరికా సేనల ప్రవేశానికి అటూఇటూగా పుట్టినవారే. వారిలో 25 ఏళ్ల కెప్టెన్ రషీద్ ఖాన్.. అఫ్ఘాన్ క్రికెట్ ముఖచిత్రంగా మారాడు. తన స్పిన్ మాయాజాలంతో ఫ్రాంచైజీ క్రికెట్‌లో స్టార్ ఇమేజ్ తెచ్చుకొన్నాడు.

అంతా ఒక కథలా..: 2021లో పాలన మళ్లీ తాలిబన్ల చేతిలోకి వెళ్లడం.. ఆటకు పెద్ద దెబ్బగా భావించారు. అయితే, జట్టు ఆడుతున్న తీరు, ఆటగాళ్ల నిబద్ధతను చూసిన పాలకులు కఠిన వైఖరి వీడడం ఒక రకంగా అఫ్ఘాన్ క్రికెట్ వేగంగా ఎదిగేందుకు దోహదం చేసింది. 'అఫ్ఘాన్ రిపబ్లిక్' జెండా కింద ఆడేందుకు కూడా అభ్యంతరం చెప్పలేదు. 2015లో తొలిసారి వరల్డ్‌కప్‌నకు అర్హత సాధించిన అఫ్ఘాన్.. క్రమంగా రాటుదేలింది. గతేడాది భారత్‌లో జరిగిన వన్డే ప్రపంచకప్‌లో పాకిస్థాన్, ఇంగ్లండ్ లాంటి జట్లను ఓడించి ఔరా అనిపించింది. ఇప్పుడు పొట్టికప్‌లో న్యూజిలాండ్‌కు షాకిచ్చిన రషీద్ సేన.. ఏకంగా కంగారూల కథనే ముగించింది.

అండగా బీసీసీఐ..: అఫ్ఘాన్ క్రికెట్ పురోభివృద్ధిలో బీసీసీఐ పాత్ర ఎనలేనిది. అసోసియేట్ సభ్యదేశం హోదా రావడానికి కృషి చేసిన బోర్డు.. ఆర్థిక సాయంతోపాటు భారత్‌లో సకల సౌకర్యాలున్న స్టేడియాల్లో శిక్షణ, మ్యాచ్‌లు ఆడేందుకు అనుమతించింది. లాల్‌చంద్ రాజ్‌పుత్, మనోజ్ ప్రభాకర్ లాంటి టీమిండియా మాజీలు అఫ్ఘాన్ కోచ్‌లుగా పనిచేశారు. 2014లో భారత ప్రభుత్వం కాందహార్‌లో స్టేడియం నిర్మాణానికి నిధులు కూడా అందించింది. ఐపీఎల్‌లో రషీద్, నూర్ అహ్మద్, రహ్మనుల్లా గుర్బాజ్, నవీనుల్ హక్‌లకు ఆడే అవకాశం కల్పించడం వారి కెరీర్‌లకు మలుపు. పొట్టికప్‌లో అఫ్ఘాన్ సెమీస్ చేరడంతో.. భారత్‌కు తాలిబన్ల అధికార ప్రతినిధి సుహైల్ షహీన్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పారు.

అంతా రషీద్ చుట్టూనే..: అఫ్ఘాన్ టీమ్ విజయాలు మొత్తం రషీద్ చుట్టూనే అల్లుకొన్నాయనడంలో సందేహం లేదు. ప్రపంచవ్యాప్తంగా లీగ్‌లు ఆడుతున్న రషీద్.. ఇప్పుడు అఫ్ఘాన్ యూత్ ఐకాన్. కెప్టెన్‌గా జట్టులో అనుక్షణం స్ఫూర్తిని నింపుతూ అద్భుతాలు సాధిస్తున్నాడు. అఫ్ఘాన్ క్రికెట్ స్వర్ణ యుగానికి ప్రతినిధిగా నిలుస్తున్నాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)



అతని నమ్మకాన్ని నిలబెట్టాం

మేం సెమీస్ చేరగలమని నమ్మిన ఒకేఒక్క వ్యక్తి బ్రియాన్ లారా. టోర్నీకి ముందు కలిసినప్పుడు.. మీ నమ్మకాన్ని మేం వమ్ము చేయం అని అతనితో చెప్పాం. ఇప్పుడదే నిజమైంది. దిగ్గజ ఆటగాళ్ల నుంచి అలాంటి గొప్ప మాటలు రావడం మాకెంతో శక్తినిస్తుంది. ఇప్పుడు మీ ముందు ఇలా గర్వంగా నిలబడినందుకు చాలా సంతోషంగా ఉంది. మా ఈ ప్రదర్శన అఫ్ఘానిస్థాన్‌లో యువతకు స్ఫూర్తినిస్తుందనుకుంటున్నా.

- కెప్టెన్ రషీద్ ఖాన్

గుల్బదిన్... తూనే క్యా కియా..



బంగ్లాతో మ్యాచ్‌లో అఫ్ఘాన్ ఫీల్డర్ గుల్బదిన్ నైబ్ ప్రవర్తించిన తీరు వివాదాస్పదంగా మారింది. 11.4 ఓవర్ల సమయంలో చినుకులు ఆరంభం కాగా అప్పటికి డ/లూ పద్ధతిన బంగ్లా విజయానికి 2 పరుగుల దూరంలోనే ఉంది. ఒకవేళ ఈ సమయంలో ఆ రన్స్ తీసి మ్యాచ్ రద్దయినా బంగ్లానే గెలిచేది. అందుకే డగౌట్ నుంచి కోచ్ ట్రాట్.. 'వర్షం కురుస్తోంది.. స్లోగా ఆడండ'ని సూచించాడు. దీంతో స్లిప్‌లో ఫీల్డింగ్ చేస్తున్న నైబ్ హఠాత్తుగా కండరాలు పట్టేసినట్టు కిందపడిపోయాడు. వెంటనే అంపైర్ మ్యాచ్‌ను ఆపేయగా.. అతడిని సిబ్బంది బయటికి తీసుకెళ్లారు. కానీ ఆ తర్వాత వర్షం ఆగి మ్యాచ్ సజావుగానే సాగింది. కానీ నైబ్ చేసిన పనికి మాత్రం నెట్టింట ట్రోలింగ్‌గా మారింది. కామెంటేటర్లు సైతం అతడికి ఆస్కార్ అవార్డు ఇవ్వచ్చంటూ సరదాగా కామెంట్స్ చేశారు.

మిన్నంటిన సంబరాలు



టీ20 ప్రపంచకప్‌లో అఫ్ఘానిస్థాన్ జట్టు సెమీస్ చేరడంతో ఆ దేశంలో సంబరాలు అంబరాన్నంటాయి. తమ క్రికెట్ జట్టు అద్భుత విజయాన్ని పురస్కరించుకొని అభిమానులు వేలసంఖ్యలో వీధుల్లో గుమిగూడారు. మిఠాయిలు పంచుకోవడంతో పాటు ర్యాలీలు తీస్తూ సంతోషాన్ని పంచుకున్నారు. ఇప్పుడీ దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి.

వార్నర్ వీడ్కోలు



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా స్టార్ ఓపెనర్ డేవిడ్ వార్నర్ అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. గతంలోనే తను టెస్టు, వన్డే ఫార్మాట్ల నుంచి తప్పుకొని పొట్టి ఫార్మాట్‌కే పరిమితమయ్యాడు. ఇక టీ20 వరల్డ్‌కప్ తన కెరీర్‌లో చివరిదని వార్నర్ ఇదివరకే చెప్పాడు. 2009లో అరంగేట్రం చేసిన తను ఆడిన 110 టీ20ల్లో ఓ సెంచరీ, 28 హాఫ్ సెంచరీలతో 3277 పరుగులు సాధించాడు. 161 వన్డేల్లో 22 శతకాలు, 6932 రన్స్ ఉండగా.. 112 టెస్టుల్లో 26 సెంచరీలు, 8786 పరుగులు సాధించాడు. అలాగే మూడు ఫార్మాట్లలోనూ శతకాలు బాదిన మూడో ఆసీస్ ఆటగాడిగా నిలిచాడు.

వచ్చే 19న పాక్‌తో భారత్ పోరు

మహిళల టీ20 ఆసియా కప్

న్యూఢిల్లీ: మహిళల టీ20 ఆసియా కప్ షెడ్యూల్ విడుదలైంది. ఈ టోర్నీ వచ్చేనెల 19 నుంచి 28 వరకు శ్రీలంకలోని దంబుల్లాలో జరగనుంది. భారత్ తన తొలి మ్యాచ్‌ను పాకిస్థాన్‌తో జూలై 19న ఆడనుంది. 8 జట్లు 2 గ్రూపులుగా తలపడే ఈ టోర్నీలో గ్రూప్-ఎ నుంచి భారత్, పాకిస్థాన్, యూఏఈ, నేపాల్ ఉన్నాయి. గ్రూప్-బి నుంచి శ్రీలంక, బంగ్లాదేశ్, థాయ్‌లాండ్, మలేసియా పోటీపడనున్నాయి. భారత్ తన రెండో మ్యాచ్‌ను జూలై 21న యూఏఈతో, మూడో మ్యాచ్‌ను 23న నేపాల్‌తో ఆడనుంది. 26న సెమీఫైనల్స్, 28న ఫైనల్ జరగనుంది.

డీఎల్ఎస్ సహ రూపకర్త డక్‌వర్త్ ఇకలేరు



న్యూఢిల్లీ: క్రికెట్‌లో వినియోగించే డక్‌వర్త్ లూయిస్ (డీఎల్ఎస్) పద్ధతి సహ రూపకర్త ఫ్రాంక్ డక్‌వర్త్ (84) కన్నుమూశాడు. మ్యాచ్‌లు జరుగుతున్నప్పుడు వర్షం పడితే, ఫలితం రాబట్టేందుకు ఉపయోగించే ఈ పద్ధతిని ఇంగ్లండ్‌కు చెందిన డక్‌వర్త్-టోనీ లూయిస్ రూపొందించారు. దీనిని 1997లో మొదటిసారిగా అంతర్జాతీయ క్రికెట్‌లో ఉపయోగించారు.



విశాఖ ఉక్కుపై 'స్టేటస్‌కో' సవరించండి!

» ఆస్తుల విక్రయానికి అనుమతించండి

» హైకోర్టులో ప్లాంట్ అనుబంధ పిటిషన్



అమరావతి, జూన్ 25(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారం భూములు, ఇతర ఆస్తుల విషయంలో స్టేటస్‌కో(యథాతథ స్థితి) పాటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ హైకోర్టు ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే.. ఈ ఉత్తర్వులను సవరించాలని, స్టీల్ ప్లాంట్ సొంత నిధులతో కొనుగోలు చేసిన ఆస్తులను విక్రయించుకునేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ ఆర్ఐఎన్ఎల్ హైకోర్టులో అనుబంధ పిటిషన్ వేసింది. ఈ పిటిషన్ మంగళవారం విచారణకు వచ్చింది. అనుబంధ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని పిటిషనర్లు, కేంద్ర ప్రభుత్వాన్ని ధర్మాసనం ఆదేశించింది. విచారణను జూలై 2వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు. దుర్గాప్రసాదరావు, జస్టిస్ జగడం సుమతితో కూడిన ధర్మాసనం ఆదేశించింది. ప్లాంటు తరఫున సీనియర్ న్యాయవాది డబ్ల్యూబీ. శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. ప్రస్తుతం స్టీల్ ప్లాంట్ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని, ఆస్తులు విక్రయిస్తే తప్ప మనుగడ సాధ్యం కాదని చెప్పారు. మధ్యంతర ఉత్తర్వులను సవరించాలని అభ్యర్థించారు. అడిషనల్ సొలిసిటర్ జనరల్ బి. నరసింహశర్మ జోక్యం చేసుకుని.. స్టీల్ ప్లాంట్‌లో ఉన్న వందశాతం కేంద్ర పెట్టుబడులు మాత్రమే ఉపసంహరిస్తున్నట్లు తెలిపారు. కర్మాగారాన్ని ప్రైవేటీకరిస్తున్నాము తప్ప మూసివేయడం లేదన్నారు. ప్లాంటు యాజమాన్యం సొంత నిధులతో కొనుగోలు చేసిన ఆస్తులతో తమకు సంబంధం లేదన్నారు. తొలుత పిటిషనర్ల తరఫున న్యాయవాది వై.బాలాజీ వాదనలు వినిపించారు.

వాసుదేవరెడ్డికి రక్షణ కల్పించొద్దు!

» బేవరేజెస్ డిస్క్ ఫైళ్ల చోరీ కేసులో హైకోర్టుకు సీఐడీ అధికారుల వినతి

» వ్యాజ్యం విచారణ నుంచి తప్పుకొన్న జడ్జి

అమరావతి, జూన్ 25(ఆంధ్రజ్యోతి): ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డికి ఎలాంటి రక్షణా కల్పించవద్దని సీఐడీ అధికారులు కోర్టుకు విన్నవించారు. ఇప్పటికే ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారని, విచారణ పెండింగులో ఉందని తెలిపారు. బేవరేజెస్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి కీలక ఫైళ్లు, కంప్యూటర్ హార్డ్ డిస్క్‌లు చోరీ చేశారనే ఆరోపణలతో వాసుదేవరెడ్డిపై సీఐడీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే, ఈ పిటిషన్ విచారణ నుంచి తప్పుకొంటున్నట్లు న్యాయమూర్తి జస్టిస్ కె. శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అనుమతితో విచారణ నిమిత్తం ఈ పిటిషన్‌ను మరో బెంచ్ ముందు ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశించారు. పిటిషన్ ఈ నెల 27న విచారణకు వచ్చేలా చూడాలని స్పష్టం చేశారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. వ్యాజ్యం మరో బెంచ్ ముందు విచారణకు వచ్చేవరకు పిటిషనర్‌కు రక్షణ కల్పించాలని అభ్యర్థించారు. న్యాయమూర్తి స్పందిస్తూ.. పిటిషన్ విచారణ నుంచి తప్పుకొన్న తర్వాత ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమన్నారు. మరోవైపు సీఐడీ తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ ఇప్పటికే సీఆర్పీసీ సెక్షన్ 438 కింద ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారని తెలిపారు. దానిపై విచారణ పెండింగ్‌లో ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి రక్షణ కల్పించవద్దని విన్నవించారు.

పొన్నవోలుకు భద్రత కొనసాగించండి

» హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ

అమరావతి, జూన్ 25(ఆంధ్రజ్యోతి): మాజీ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డికి నాలుగు వారాల పాటు భద్రత కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. భద్రత తొలగిస్తారేమోనని పిటిషనర్ ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ప్రస్తుతం ఉన్న 2 ప్లస్ 2 భద్రతా సిబ్బందిని కొనసాగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ మాజీ ఏఏజీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు రాగా రాష్ట్ర అడ్వకేట్ జనరల్ తరఫున న్యాయవాది కృష్ణారెడ్డి వాదనలు వినిపిస్తూ... వ్యాజ్యం మొదటిసారి విచారణకు వచ్చిందని, పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి పిటిషనర్‌కు ప్రస్తుతం ఉన్న భద్రతను నాలుగు వారాలపాటు కొనసాగించాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులపై న్యాయవాది కృష్ణారెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి వాదనలు వినిపించారు. పిటిషనర్ గత ప్రభుత్వంలో ఏఏజీగా సేవలు అందించారని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేసిన అధికారులను ఉపేక్షించబోమని, వారి పేర్లు అన్నీ రెడ్‌బుక్‌లో నమోదు చేశానని ఓ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మంత్రి లోకేశ్ మాట్లాడారని, రెడ్‌బుక్‌లో ఏఏజీ పేరు ఉన్నట్లు మరో చానల్‌లో వార్తను ప్రసారం చేశారని వివరించారు. పిటిషనర్‌కు భద్రతను కొనసాగించేలా ఆదేశించాలని కోరారు.

సీఎంసీవో లేఖల పునరుద్ధరణ..

» నేటి నుంచి పంపిణీ.. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో లక్ష్మీశ

అమరావతి, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): చీఫ్ మినిస్టర్ క్యాంప్ ఆఫీస్ (సీఎంసీవో) రిఫరల్ లెటర్లను ప్రభుత్వం పునరుద్ధరించింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం సీఎంసీవో లేఖలను నిలిపివేసింది. సీఎంసీవో లేఖపై జగన్ బొమ్మ ఉండడంతో ఈసీ ఆ నిర్ణయం తీసుకుంది. ఆరోగ్యశ్రీ కార్డుతో పాటు ప్రభుత్వ గుర్తింపు ఉన్న ఏ కార్డూ లేని వారికి ప్రభుత్వం సీఎంసీవో లెటర్‌ను అందిస్తుంది. ఈ లెటర్ ఆధారంగా ప్రయివేటు ఆస్పత్రులు ఆయా రోగులకు ఆరోగ్యశ్రీలో ఉచితంగా వైద్య సేవలు అందిస్తారు. రెండు నెలల నుంచి సీఎంసీవో లేఖలు నిలిపివేయడంతో రోగులకు ఇబ్బందులకు గురయ్యారు. కొత్త ప్రభుత్వం సీఎంసీవో లేఖలను పునరుద్ధరిస్తూ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో లక్ష్మీశ ఉత్తర్వులు ఇవ్వడంతో రోగులకు వెసులుబాటు లభించింది. జిల్లాల్లో ఉన్న ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కోఆర్డినేటర్లు వెంటనే సీఎంసీవో లేఖలు అందించాలని ట్రస్ట్ సీఈవో ఆదేశించారు. బుధవారం నుంచి ఈ లేఖలు జిల్లా ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ కార్యాలయాల నుంచి జారీ చేయనున్నారు.

అమరావతిలో సహకార శిక్షణ కేంద్రం

» భవనాల రంగులకోసం వృథా ఖర్చు వద్దు: మంత్రి అచ్చెన్న

అమరావతి, జూన్ 25(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో సహకార శిక్షణ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలంటూ అధికారులను వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. ప్రతి జిల్లాలో ఆప్కాబ్ బ్రాంచ్ ఏర్పాటు చేయాలని, పీఏసీఎస్‌లను(ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు) కంప్యూటరీకరించి, ఆన్‌లైన్ చేసే ప్రక్రియ మూడు నెలల్లో పూర్తి చేయాలని నిర్దేశించారు. సహకార వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ఈ చర్యలను వెంటనే ప్రారంభించాలని స్పష్టం చేశారు. మంగళవారం మంగళగిరిలోని వ్యవసాయశాఖ కార్యాలయం, విజయవాడలోని పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో తన శాఖలకు చెందిన ఉన్నతాధికారులతో అచ్చెన్న సమీక్షలు నిర్వహించారు. "రాష్ట్రంలో అవకాశమున్న సొసైటీల పరిధిలో పెట్రోల్ బంకులు పెట్టాలి. సొసైటీల అభివృద్ధికి అగ్రి ఇన్‌ఫ్రా ఫండ్ వినియోగించుకోవాలి. విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెంచాలి. ఉద్యాన రైతులకు రాయితీలు సకాలంలో అందించాలి. ఆయిల్ పామ్ విస్తీర్ణం పెంచాలి. ఖరీఫ్ సీజన్ డిమాండ్‌కు సరిపడా ఎరువులను సిద్ధం చేయాలి. ఎరువుల కోసం ముందుగా నగదు చెల్లించకుండా, సరుకు తీసుకున్నాకే చెల్లించే పద్ధతిని అమలు చేయాలి. రైతులు కోరుకున్న విత్తనాలు రాయితీపై అందించాలి. రైతులకు రాయితీపై యంత్రపరికరాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలి" అని కోరారు. గ్రూపులకిచ్చిన ట్రాక్టర్లలో అక్రమాల సంగతి తేల్చాలని మంత్రి ఆదేశించారు. "రైతు బజార్లన్నీ మరింత చురుగ్గా పనిచేసేలా చూడాలి. ఆర్బీకేలు, ఇతర వ్యవసాయ భవనాలకు రంగులకోసం వృథా ఖర్చులు చేయవద్దు. పంటల బీమా, అంతర పంటలు, పాడి-పంటలు తదితర కార్యక్రమాలపై రైతులకు అవగాహన కల్పించాలి" అని అధికారులను ఆదేశించారు.

కోడిగుడ్లపై ఫొటోలు వద్దు

» పౌష్టికాహార లోపంతో.. ఒక్క గిరిజన బిడ్డా చనిపోకూడదు

» ఇదే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి సంధ్యారాణి



అమరావతి, జూన్ 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పౌష్టికాహార లోపంతో ఒక్క గిరిజన బిడ్డా చనిపోకూడదని రాష్ట్ర గిరిజన, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి జి.సంధ్యారాణి స్పష్టం చేశారు. ఇదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మంగళవారం అమరావతి సచివాలయంలో ఆమె మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 554 గిరిజన పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఏఎన్ఎంలతో ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. గిరిజన పాఠశాలల్లో అనారోగ్యం, పోషకాహార లోపం సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. గత ప్రభుత్వంలో కోడిగుడ్లపైనా జగన్ బొమ్మలు వేసినట్లు, నాయకుల బొమ్మలు వేయవద్దని, ప్రభుత్వ ఎంబ్లమ్ మాత్రమే వేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో పెరిగిపోతున్న బాల కార్మికుల సంఖ్యపై అధికారులు దృష్టి సారించాలన్నారు. అడ్డుకోవడానికి చాలా చోట్ల అనాథ పిల్లలను అద్దెకు తీసుకొస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్వాడీ సెంటర్ల నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వద్దన్నారు. అలాగే, ఫీడర్ అంబులెన్స్, తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్ సేవలను పునరుద్ధరిస్తామని తెలిపారు. 11 సీట్లు వచ్చిన జగన్ ప్రతిపక్ష హోదాను ఎలా అడుగుతారని సంధ్యారాణి ప్రశ్నించారు.

ఐదేళ్లలో సాగునీటి రంగం నిర్వీర్యం: నిమ్మల

గడచిన ఐదేళ్లలో సాగునీటి రంగాన్ని వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై రైంతాంగానికి సాగునీరు అందలేదనే మాట రాకుండా, కాలువల ద్వారా చివరి ఎకరం దాకా నీరందించేలా చర్యలు చేపట్టాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని ఆ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. వర్షాకాలానికి ముందే మరమ్మతుల కోసం ప్రత్యేక నిధులను సీఎం చంద్రబాబు కేటాయించినట్లు తెలిపారు. వర్షాలు పడనున్నందున వరద పరిస్థితులు తలెత్తకుండా కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. సాగునీటి కాలువలలో పూడికను.. గుర్రపుడెక్కను తొలగించాలన్నారు.

బీసీ సంక్షేమ పథకాల అమలుకు టోల్‌ఫ్రీ

స్టడీ సర్కిళ్లలో డీఎస్సీ కోచింగ్: మంత్రి సవిత

అమరావతి, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అసంపూర్తిగా ఉన్న బీసీ భవనాలు, గురుకుల పాఠశాలల భవనాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి ఎస్. సవిత ఆదేశించారు. బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమశాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలను సమర్థంగా అమలు చేసేందుకు టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించాలని చెప్పారు. మంగళవారం సచివాలయంలో బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లోని విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు చేపట్టాల్సిన మరమ్మతులపై నివేదిక ఇవ్వాలన్నారు. నిర్మాణంలో ఉన్న బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల భవనాలను త్వరితగతిన పూర్తిచేసి విద్యార్థులకు సాధ్యమైనంత త్వరగా అందుబాటులోకి తేవాలని సూచించారు. పంపిణీకి ఉద్దేశించిన బీసీ కుల వృత్తుల పనిముట్లు ఇంకా గోదాముల్లో ఉంటే వాటిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కోరారు. స్టడీ సర్కిళ్లలో డీఎస్సీ కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు.

మళ్లీ 'అన్నదాత సుఖీభవ'

రైతు భరోసా పేరు మార్పు.. ఏటా 20 వేల సాయం..త్వరలో విధి విధానాలు జారీ

అమరావతి, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం మళ్లీ 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని అమలులోకి తెస్తోంది. ఇందుకోసం గత వైసీపీ ప్రభుత్వం పెట్టిన రైతు భరోసా పేరును 'అన్నదాత సుఖీభవ'గా మార్పు చేసింది. తాము అధికారంలోకి వస్తే రైతులకు ఏటా రూ.20వేలు అందిస్తామని టీడీపీ అధినేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు 'సూపర్‌సిక్స్'లో ప్రకటించారు. ఈ మేరకు 'అన్నదాత సుఖీభవ' పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం కింద రాష్ట్ర ఖజానా నుంచి ఏటా రూ.14వేలు ఇచ్చి, కేంద్రం ఇచ్చే రూ.6వేలను కలుపుకొని అర్హత కలిగిన రైతులకు ఏటా రూ.20వేల చొప్పున అందించనున్నట్లు సమాచారం. దీనిపై త్వరలో విధి విధానాలతో అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో గత ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అమలు చేసిన మరికొన్ని పథకాల పేర్లు కూడా మార్చాలని ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయించింది. 'వైఎస్సార్ సున్నావడ్డీ పంట రుణాల' పేరును 'వడ్డీలేని రుణాలు'గా, 'వైఎస్సార్ ఉచిత పంటల బీమా'ను 'ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన'గా మార్చారు.

ఇక.. 'చంద్రన్న బీమా'

వెంటనే ఫైల్స్ సిద్ధం చేయాలని కార్మిక మంత్రి సుభాష్ ఆదేశం

అమరావతి, జూన్ 25(ఆంధ్రజ్యోతి): చంద్రన్న బీమా పథకాన్ని ప్రభుత్వం మళ్లీ అమలు చేయబోతోందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చెప్పారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనల ఫైల్‌ను సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. కార్మిక శాఖపై మంగళవారం సచివాలయంలోని ఐదో బ్లాక్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆస్పత్రుల్లో సబ్సిడీ, మెటర్నిటీ, ఎడ్యుకేషన్‌లో సబ్సిడీ ఉండేదని, వాటిని తిరిగి ప్రారంభించే ఆలోచనలో ఉన్నట్లు మంత్రి చెప్పారు. ఆయన ఆదేశాల మేరకు కార్మిక శాఖ కమిషనర్ శేషగిరి బాబు ఫైల్స్ సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. ఈఎస్ఐ డైరెక్టర్ వి.ఆంజనేయులు, పరిశ్రమల శాఖ డైరెక్టర్ చంద్రశేఖర్, బాయిలర్ల డైరెక్టర్ ఉమామహేశ్వర్, లేబర్ వెల్ఫేర్ కమిషనర్ రాణి పాల్గొన్నారు.

మరో ఐదు వైసీపీ కార్యాలయాలకు నోటీసులు

» అక్రమ నిర్మాణాలను ఎందుకు కూల్చివేయకూడదు?

» వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశం

» స్థలాల ఆక్రమణపైనా గళం విప్పుతున్న బాధితులు

» నెల్లూరులో మాజీ మంత్రి అనిల్‌పై పోలీసులకు ఫిర్యాదు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)



పల్నాడు జిల్లా నరసరావుపేటలో వైసీపీ కార్యాలయ గోడకు నోటీసు అంటిస్తున్న పూడా అధికారులు

అనుమతులు తీసుకోకుండా నిర్మిస్తున్న వైసీపీ కార్యాలయాలపై చర్యలను అధికారులు వేగవంతం చేశారు. సోమవారం విజయనగరం, పుట్టపర్తిలోని పార్టీ కార్యాలయాలకు అధికారులు నోటీసులు అంటించిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా మరో ఐదు వైసీపీ కార్యాలయాలకు అధికారులు మంగళవారం నోటీసులు జారీ చేశారు. బాపట్ల పట్టణంలో నిర్మించిన వైసీపీ జిల్లా కార్యాలయ భవనానికి మున్సిపల్ అధికారులు తాజాగా నోటీసులు అంటించారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు, ఎంపీ మోపిదేవి వెంకటరమణారావుకు వ్యక్తిగతంగా నోటీసులు అందించడానికి సోమవారమే ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. దీంతో మంగళవారం మరోసారి రేపల్లె వెళ్లి నోటీసులు ఇవ్వాలని చూసినా ఆ ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో కార్యాలయం బయట గేటు పక్కన ఉన్న పిల్లర్‌కు అధికారులు నోటీసులు అంటించి వెనుదిరిగారు. ఎంపీ మోపిదేవికి రిజిస్టర్ పోస్టు ద్వారా నోటీసులు పంపినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాన్ని ఎందుకు తొలగించకూడదో వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. తదుపరి నిర్మాణాన్ని వెంటనే ఆపేయాలని కూడా ఆదేశించారు. వారం రోజుల్లోగా నోటీసులకు వివరణ ఇవ్వాలని, ఇచ్చే సమాధానం ఆధారంగా తదుపరి చర్యలు ఉండనున్నాయని స్పష్టం చేశారు.

స్పందించకపోతే కూల్చివేత తప్పదు: పూడా

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో ప్లాన్ అప్రూవల్ కూడా తీసుకోకుండా నిర్మించిన వైసీపీ కార్యాలయ భవనం పూర్తిగా అక్రమమని పూడా(పల్నాడు అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ) తేల్చేసింది. ఆ భవనానికి మంగళవారం పూడా ప్లానింగ్ అధికారులు నోటీసు అంటించారు. ఏడు రోజుల్లో వివరణ ఇవ్వాలని, లేకుంటే కూల్చేస్తామని నోటీసుల్లో స్పష్టం చేశారు. అలాగే, శ్రీకాకుళం, పార్వతీపురం, పశ్చిమ గోదావరి జిల్లా ఉండిలో కూడా వైసీపీ కార్యాలయాలకు నోటీసులు అంటించారు.

నా స్థలం ఆక్రమించి.. వైసీపీ ఆఫీసు నిర్మాణం!

నెల్లూరులో మాజీ మంత్రి అనిల్‌పై పోలీసులకు మహిళ ఫిర్యాదు

మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ తన స్థలాన్ని ఆక్రమించి వైసీపీ కార్యాలయాన్ని నిర్మిస్తున్నారని, నెల్లూరులోని జెండావీధికి చెందిన బాధితురాలు కౌసర్‌జాన్ మంగళవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి గోడు వెళ్లబోసుకున్నా ఎవరూ పట్టించుకోలేదని ఆమె వాపోయారు. రూ.కోట్ల విలువచేసే తమ 3.75 ఎకరాల స్థలంలో వైసీపీ కార్యాలయ నిర్మాణానికి అనిల్‌కుమార్ శంకుస్థాపన చేశారని, తాము నిలదీయడంతో న్యాయం చేస్తానంటూ దాదాపు రెండేళ్లు కార్యాలయం చుట్టూ తిప్పుకొని చివరకు పొలం తాలూకు నగదు ఎప్పుడో ఇచ్చేశానంటూ మోసం చేశాడని వాపోయారు. చివరకు అద్దె ఇంట్లో ఉండే దయనీయ పరిస్థితి వచ్చిందన్నారు. అనిల్‌కుమార్‌ను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు.

సజ్జల కనుసన్నల్లో క్వార్ట్జ్ దోపిడీ

» మా పొలాలను బలవంతంగా లాక్కున్నారు

» రూ.800 కోట్లు అక్రమంగా సంపాదించారు

» సీఐడీకి బాధితుడు బద్రినాథ్ ఫిర్యాదు

నెల్లూరు, జూన్ 25(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి కనుసన్నల్లో క్వార్ట్జ్‌లో భారీ దోపిడీ జరిగిందని సీఐడీ అధికారులకు మంగళవారం ఫిర్యాదు అందింది. నెల్లూరు జిల్లాలోని వైసీపీ నాయకులు బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, కొడవలూరు ధనుంజయరెడ్డితో పాటు సజ్జల భార్గవ్‌రెడ్డి, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అల్లుడు సందీప్ ఈ దోపిడీలో పాత్రధారులని బాధితుడు ఆదూరు బద్రినాథ్ ఆరోపించారు. సైదాపురం మండలం జోగుపల్లిలో తనకున్న 240 ఎకరాల భూమిని బలవంతంగా లాక్కొని క్వార్ట్జ్‌ను అక్రమంగా తవ్వి దోచుకున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒక్క తన భూమిలోనే రూ.800 కోట్ల విలువైన క్వార్ట్జ్‌ను దోపిడీ చేశారని, ఇది అన్యాయమని అన్నందుకు తమపై రౌడీషీట్లు ఓపెన్ చేస్తామని బెదిరించారని వాపోయారు. తమ పిల్లల మీద ఆత్మకూరు డీఎస్పీ కేసులు పెట్టారని చెప్పారు. తవ్వకాలు ఆపాలని హైకోర్టుకు వెళ్లి ఆదేశాలు తెచ్చినా పట్టించుకోలేదని, తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని బద్రీనాథ్ కోరారు.

టెట్‌లో 1,37,903 మంది పాస్

» అర్హత సాధించిన వారు 58.4% మంది

» ఫలితాలు విడుదల చేసిన మంత్రి లోకేశ్

అమరావతి, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలను మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ మంగళవారం విడుదల చేశారు. పరీక్షకు 2,67,789 మంది దరఖాస్తు చేసుకోగా 2,35,907 మంది పరీక్ష రాశారు. వారిలో 1,37,903 (58.4%) మంది ఉత్తీర్ణులై అర్హత సాధించారు. పేపర్-1ఏ (ఎస్జీటీ రెగ్యులర్)లో 66.32%, పేపర్-1బీ (ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్)లో 46.47%, పేపర్-2ఏ (స్కూల్ అసిస్టెంట్ రెగ్యులర్)లో 50.93%, పేపర్-2బీ (స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్)లో 79.73% మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రస్తుతం అర్హత సాధించనివారు, కొత్తగా బీఈడీ, డీఈడీ పూర్తిచేసిన వారి కోసం త్వరలో మరోసారి టెట్ నిర్వహిస్తామని లోకేశ్ చెప్పారు. దీనిపై ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి హర్షం వ్యక్తం చేశారు. వయోపరిమితిని 46ఏళ్లకు పెంచాలని, జీవో 117ను రద్దు చేయాలని కోరారు. మెగా డీఎస్సీకి కేబినెట్ ఆమోదం తెలపడంపై నోబుల్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నడిపినేని వెంకట్రావు, బి.హైమారావు హర్షం వ్యక్తం చేశారు.





ఎంవీవీపై భూకబ్జా కేసు

- విశాఖ మాజీ ఎంపీపై 'హయగ్రీవ ఫర్మ్స్' అధినేత ఫిర్యాదు
- వైసీపీ నాయకుడు జీవీ, మరొకరిపై కూడా...
- వృద్ధాశ్రమం,నిర్మాణాలకు ఉద్దేశించిన భూమి కబ్జా
- ఖాళీ పత్రాలపై సంతకాలు, ఫోర్జరీ
- విశాఖలో మొత్తం 12.51 ఎకరాల ఆక్రమణ
- ప్రశ్నిస్తే చంపేస్తామంటూ బెదిరింపులు
- ఆరిలోవా పోలీసులకు జగదీశ్వరుడి ఫిర్యాదు
- పది నాన్‌బెయిల్‌బుల్ సెక్షన్ల కింద కేసు నమోదు


ఎంవీవీ సత్యనారాయణ


జీవీ

విశాఖపట్నం, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): భూకబ్జా వ్యవహారంలో విశాఖ మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణపై విశాఖ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎంవీవీతోపాటు ఆయన స్నేహితుడు, ఆడిటర్ గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ), గాదె బ్రహ్మాజీలపై కూడా ఆరిలోవ స్టేషన్‌లో కేసు నమోదైంది. తనను, తన భార్యను బెదిరించి ఖాళీ పత్రాలపై సంతకాలు చేయించుకుని తనకు చెందిన భూమిని కబ్జా చేశారని ఆరోపిస్తూ హయగ్రీవ ఫర్మ్స్ అండ్ డెవలపర్స్ 'భాగస్వామి' సీహెచ్ జగదీశ్వరుడు అలియాస్ జగదీశ్ (64) తన ఫిర్యాదులో తెలిపారు. తమ సంతకాలను కూడా ఫోర్జరీ చేశారని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఈనెల 22న పోలీసులకు జగదీశ్ ఫిర్యాదు చేశారు. దీనిపై ఐపీసీ సెక్షన్ 120 బీ, 420, 465, 467, 468, 471, 383, 506 రెడ్‌విత్ 34 సెక్షన్ల కింద అదేరోజు కేసు నమోదైంది. బాధితుని కథనం ప్రకారం, వృద్ధుల కోసం అనాథ ఆశ్రమం, వారికి విల్లాలు నిర్మించి తక్కువ ధరకే విక్రయించేందుకు వీలుగా తనకు నామమాత్రపు ధరకు భూమిని కేటాయించాలంటూ జగదీశ్ 2006లో రాష్ట్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. అప్పటిరాష్ట్ర ప్రభుత్వం 2008లో ఎండాడ సర్వే నంబర్ 93/3లోని 12.51 ఎకరాల భూమిని ఆయనకు కేటాయించింది. ఆ భూమికి ప్రభుత్వం నిర్ణయించిన ధరను ఆయన చెల్లించారు. తనతోపాటు భార్య రాధారాణి ప్రొప్రయిటర్‌గా ఉన్న హయగ్రీవ ఫర్మ్స్ అండ్ డెవలపర్స్ పేరుతో 2010లో దాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఆడిటర్‌గా జగదీశ్‌కు జీవీ పరిచయం అయ్యారు. డెవలపర్స్ పేరుతో మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, బ్రహ్మాజీలను పరిచయం చేశారు. జగదీశ్‌కు ఇచ్చిన భూమిలో 2020 వరకూ నిర్మాణాలు చేపట్టని విషయం వారు తెలుసుకున్నారు. అప్పుడు రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఉంది. ఆ పార్టీ విశాఖ ఎంపీగా ఉన్న ఎంవీవీ, ఇతరులు.. ఆ భూమిలో డెవలప్‌మెంట్ కోసం 2020లో జగదీశ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సమయంలో ఎంవీవీ, జీవీ, బ్రహ్మాజీ కలిసి తనతోపాటు తన భార్య రాధారాణి సంతకాలను ఫోర్జరీ చేయడంతోపాటు కొన్ని ఖాళీ పత్రాలపై సంతకాలు తీసుకున్నారని బాధితుడు ఆరోపించారు. వాటి ఆధారంగా ప్రభుత్వం నుంచి పొందిన 12.51 ఎకరాల భూమిని కబ్జా చేశారని వాపోయారు. దీనిపై ప్రశ్నించిన తమను చంపేస్తామని బెదిరించినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, తన భూమిని ఎంవీవీ, జీవీ, బ్రహ్మాజీలు మోసపూరితంగా లాక్కొన్నారంటూ గతంలో ఒకసారి జగదీశ్ సెల్ఫీ వీడియో విడుదల చేశారు. దీనిపై అప్పట్లోనే కలకలం రేగింది.

కేసు ఎఫ్ఐఆర్ దశలోనే ఉంది

- మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేం.. ఎంవీవీకి హైకోర్టు స్పష్టీకరణ

అమరావతి, జూన్ 25(ఆంధ్రజ్యోతి): హయగ్రీవ భూముల వ్యవహారంలో పోలీసులు తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ విశాఖ మాజీ ఎంపీ, వైసీపీ నేత ఎంవీవీ సత్యనారాయణ దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు సమర్పించాలని కోర్టు పోలీసులను ఆదేశించింది. ప్రతివాదులకు నోటీసులు జారీచేస్తూ విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ప్రస్తుతం కేసు ఎఫ్ఐఆర్ దశలోనే ఉందని గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని పేర్కొంది. ముందస్తు బెయిల్ కోసం దాఖలు చేసుకోవాలని సూచించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి ఆదేశాలిచ్చారు. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది వైవీ రవిప్రసాద్ వాదనలు వినిపించారు. ఘటన జరిగిన నాలుగేళ్ల తరవాత పిటిషనర్‌పై క్రిమినల్ కేసు పెట్టారని తెలిపారు. పిటిషనర్‌కు అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని అభ్యర్థించారు.

మోయలేనంత భారముంది!

(మొదటి పేజీ తరువాయి)

భవిష్యత్ ఉండదని వారు భయపడ్డారని చెప్పారు. కొత్త కేబినెట్‌లో 8 మంది బీసీలకు మంత్రులుగా స్థానం కల్పించామన్నారు. ప్రమాణం చేసిన వెంటనే పోలవరం, అమరావతిని సందర్శించానని చెప్పారు. ఇచ్చిన హామీ మేరకు 5 హామీలపై సంతకం చేశానన్నారు. ఆర్థిక పరిస్థితి, సాగునీటి ప్రాజెక్టులు, అమరావతి, నాసిరకం మద్యం అమ్మకాలు, భూగర్భ ఖనిజాల వంటి 7 అంశాలపై త్వరలో శ్వేతపత్రాలను విడుదల చేస్తామని తెలిపారు.


కుప్పంలో సీఎం చంద్రబాబు పాల్గొన్న సభలో జోరు వర్షంలోనే జనం

వృద్ధులకు పింఛన్లను ప్రవేశపెట్టిందే ఎన్టీఆర్ అని గుర్తుచేశారు. రూ.4 వేలకు పెంచిన పింఛన్ మొత్తాన్ని ఒకటో తేదీనే ఇంటికొచ్చి ఇస్తామన్నారు. 'ప్రభుత్వం చేసే మంచి పనులకు ప్రజలు తోడు ఉండాలి. గత ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టు మోసం. ఇచ్చిన హామీ మేరకు ఆ చట్టాన్ని రద్దు చేస్తున్నాం. మీ పట్టాదార్ పాస్‌పుస్తకాలపై జగన్ ఫొటో తీసేసి, మళ్లీ రాజముద్రతో పంపిణీ చేస్తాం. త్వరలో 283 అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తాం' అని వివరించారు.



ఏడాదిలోగా కుప్పానికి హంద్రీనీవా జలాలు

సొంత నియోజకవర్గానికి సీఎం అనేక హామీలిచ్చారు. ఏడాదిలోగా నియోజకవర్గానికి హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కెనాల్ ద్వారా నీళ్లు తెస్తానన్నారు. 'మళ్లీ జన్మంటూ ఉంటే కుప్పం ముద్దుబిడ్డగానే పుడతాను. నేను మొత్తం 9 సార్లు ఎమ్మెల్యేగా గెలిస్తే.. 8 సార్లు కుప్పం నుంచే గెలిపించారు. వచ్చే ఐదేళ్లలో వారి రుణం తీర్చుకుంటా. ప్రజాక్షేత్రంలోకి వెళ్లే ముందు మీ ఆశీస్సుల కోసం వచ్చాను. కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ, రింగు రోడ్డు, కార్గో విమానాశ్రయం, కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేస్తా' అని తెలిపారు.

నా మెజారిటీ 48 వేలేనా?

'ఓట్లు.. గుద్దారు. అంతా వన్ సైడ్. రాష్ట్రమంతా ఒక ఊపు ఊపింది. కానీ కుప్పంలో 48 వేలేనా' అని నియోజకవర్గ ప్రజల ఎదుట చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. బహిరంగ సభలో ఆయన ప్రసంగం హఠాత్తుగా టీడీపీ కూటమి ప్రభజనంవైపు మళ్లింది. 'గాజువాకలో 95 వేలు మెజారిటీ. భీమిలిలో 92 వేలు.. మునుపెన్నడూ గెలవని మంగళగిరిలో లోకేశ్‌కు 91 వేల మెజారిటీ.. పవన్ కల్యాణ్‌కు 71 వేలు. నేనే ఆశ్చర్యపోయాను. రాష్ట్రమంతా టీడీపీ సునామీ. మరి ఇక్కడెంత.. 48 వేలా' అంటూ అంతటితో ఆపేశారు. పోస్టల్ బ్యాలెట్ వన్ సైడ్ అయిందని.. మహిళలు, బీసీలు కూడా ఏకపక్షంగా వేశారని చెప్పారు. ప్రజలకు మంచి చేస్తే గుర్తు పెట్టుకుంటారని, తాత్కాలికంగా కాకపోయినా, దీర్ఘకాలంలో అటువంటివారికి మంచే జరుగుతుందని అన్నారు. 'మా ఇంట్లో ఆడవాళ్లు ఎప్పుడైనా బయటకు రావడం చూశారా? భువనేశ్వరి వచ్చి ప్రచారం చేసింది. వీళ్లు చేసిన అరాచకానికి తప్పలేదు' అని ఆవేదన వ్యక్తం చేశారు.

సీఎంకు ఘనస్వాగతం..

ఐదేళ్ల తర్వాత సీఎం హోదాలో కుప్పం వచ్చిన చంద్రబాబుకు ఘన స్వాగతం లభించింది. ఆయన్ను చూసేందుకు జనం పోటెత్తారు. పీఈఎస్ మెడికల్ కాలేజీలో హెలిప్యాడ్ వద్ద జిల్లా నాయకులు, అధికారులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి రోడ్డుమార్గాన బయల్దేరి శాంతిపురం మండలం కడపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న తన ఇంటి నిర్మాణ పనులను పరిశీలించారు. అదే మండలం జల్లిగానిపల్లె, చిన్నారిదొడ్డి గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను పరిశీలించారు. అక్కడి నుంచి కుప్పం వస్తుండగా తుమ్మిసి రోడ్డు వద్ద చంద్రబాబును చూసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో గుమిగూడారు. ఆయన కాన్వాయ్ ఆపి వాహనంలో నుంచి దిగి వారిని ఆప్యాయంగా పలకరించారు. ఆయన వెంట రవాణా మంత్రి రాంప్రసాద్‌రెడ్డితో పాటు ఎమ్మెల్సీ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

రాజధానికి డ్వాక్రా మహిళల భారీ విరాళం

రాజధానినిర్మాణానికి చిత్తూరు జిల్లాకు చెందిన గ్రామీణ, పట్టణ స్వయం సహాయక సంఘాల్లోని 4.30 లక్షల మంది మహిళల తరఫున సీఎం చంద్రబాబుకు రూ.4.50 కోట్ల మెగా చెక్కును అందించారు. అలాగే రాజధాని కోసం ఆనందరెడ్డి రూ.5 లక్షలు, కిరణ్‌కుమార్ రూ.లక్ష చొప్పున చెక్కులు అందించారు.

సభలో హుందాగా ప్రవర్తిద్దాం

మన నడవడిక, చర్చించే విధానం మన్ననలు పొందాలి: పవన్ కల్యాణ్

అమరావతి, జూన్ 25(ఆంధ్రజ్యోతి): 'మనపై ప్రజలు ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో ఉన్నారు. పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీలతో, వంద శాతం స్ట్రైక్‌రేట్‌తో గెలిపించి శాసనసభకు పంపించారు. వారి ఆశలు, ఆకాంక్షలను సభలో ప్రతిఫలింపచేద్దాం' అని జనసేన పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిర్దేశించారు. అసెంబ్లీ వ్యవహారాలు, నియమావళి, సంప్రదాయాలపై జనసేన పార్టీ ఎమ్మెల్యేలకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ పార్టీ నుంచి గెలిచిన వారిలో ఎక్కువ శాతం శాసనసభ వ్యవహారాలకు కొత్తవారేనని, అందరం సభ నియమావళి, సంప్రదాయాలపై అవగాహన తెచ్చుకోవడంతో పాటు వాటిని పాటించి, గౌరవించాలని సూచించారు. 'సభలో హుందాగా ప్రవర్తించాలి. మన నడవడిక, చర్చించే విధానం ప్రజల మన్ననలు పొందాలి. తొలి 100 రోజులు పాలనాపరమైన విషయాలపై అవగాహన, అధ్యయనంపై దృష్టిపెట్టాలి. ప్రభుత్వ శాఖలు, పథకాలు, వాటి అమలు తీరును అధ్యయనం చేయాలి. ఆ తరువాత మీరు చేసే చర్చలు ఎంతో బలంగా ఉంటాయి. ఎప్పటికప్పుడు ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉండాలి. ప్రజా సంక్షేమం, అభివృద్ధి సమంగా సాగాలి. గ్రామ స్థాయిలో మౌలిక వసతుల కల్పన ఎంతో అవసరం. శాంతిభద్రతల పరిరక్షణలో ఎక్కడా రాజీపడొద్దు. మహిళల రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి. గంజాయి, డ్రగ్స్ ముఠాలు, బ్లేడ్ బ్యాచ్‌ల నుంచి యువతను కాపాడుకోవాలి' అని పవన్ పేర్కొన్నారు. ఇలాంటి ముఠాలపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. సభలో విషయాన్ని చెప్పేటప్పుడు భావ తీవ్రత ఉండొచ్చని, భాష సరళంగా, మర్యాదపూర్వకంగా ఉండాలని స్పష్టం చేశారు. అధికారులు, ఉద్యోగులతో మాట్లాడేటప్పుడు, చర్చల్లో పరుష పదజాలం వాడొద్దని, ప్రజలతో గౌరవంగా ఉంటూ వారి బాధలు, సమస్యలను జాగ్రత్తగా వినాలని' ఆయన సూచించారు. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలకు అభినందన కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించామని, ఆ తర్వాత నియోజకవర్గ స్థాయిలో ఇటువంటి కార్యక్రమాలు చేపట్టి, గెలుపు కోసం సహకరించిన కూటమి నాయకులను అభినందించాలని ఆదేశించారు. పార్టీ కోసం క్షేత్రస్థాయిలో నిస్వార్థంగా పని చేసిన జనసైనికులు, వీర మహిళలు, సభల్లో వలంటీర్లుగా పనిచేసిన వారికోసం ప్రత్యేకంగా కృతజ్ఞత కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పార్టీ శ్రేణులను బలోపేతం చేసే బాధ్యత ఎమ్మెల్యేలపై ఉందని పేర్కొన్నారు. పార్టీ తరఫున చేసిన జనవాణి కార్యక్రమం ఎంతో విజయవంతమైందని, నియోజకవర్గ స్థాయిలో కూడా ప్రతినెలా జనవాణి చేపట్టాలని పార్టీ ఎమ్మెల్యేలను పవన్ ఆదేశించారు. కాగా, విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చేలా పనిచేసి దేశం మెచ్చేలా రాష్ట్ర పంచాయతీరాజ్ వ్యవస్థకు సొబగులు అద్దుతామని పవన్‌కల్యాణ్ అన్నారు. మంగళవారం ఆయనను కలిసిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉద్యోగ సంఘాల నేతలతో మాట్లాడారు.


సీఆర్‌డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్‌తో మాట్లాడుతున్న ఆస్ట్రేలియా కాన్సులేట్ జనరల్ బృందం

అమరావతిలో పెట్టుబడులకు సిద్ధం!

- సీఆర్‌డీఏ కమిషనర్‌తో ఆస్ట్రేలియా కాన్సులేట్ బృందం చర్చలు

విజయవాడ, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో.. అమరావతిలో పారిశ్రామిక, వాణిజ్య పెట్టుబడులకు మార్గం సుగమం అవుతోంది. ప్రపంచవ్యాప్తంగా పలుదేశాలు అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి. తాజాగా ఆస్ట్రేలియా కాన్సులేట్ జనరల్ సిలై జాకీ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం అమరావతిలో పారిశ్రామిక, వాణిజ్య పెట్టుబడుల అంశంపై దృష్టి సారించింది. ఈ క్రమంలో సీఆర్‌డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్‌తో ఈ బృందం మంగళవారం భేటీ అయింది. అమరావతిలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై ప్రధానంగా చర్చించింది. ఇక్కడ పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు తమ దేశం సిద్ధంగా ఉందని, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి తాము ఆసక్తిగా ఉన్నామని తెలిపారు. అమరావతి మాస్టర్ ప్లాన్ గురించి వారికి వివరించిన కమిషనర్ భాస్కర్.. రాజధానిలో వ్యాపారవేత్తలకు ఉన్న అవకాశాలను తెలియజేశారు.

1 నుంచి పిఠాపురంలో పవన్ పర్యటన

పవన్ జూలై 1 నుంచి పిఠాపురంలో పర్యటించనున్నారు. మూడు రోజులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. పవన్ వారాహి దీక్షకు మంగళవారం శ్రీకారం చుట్టారు. 11 రోజుల పాటు ఆయన దీక్షలో ఉంటారు. కాగా, గత ప్రభుత్వంలో ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రాన్ని అందించారు.

ఇంకా అంతరిక్షంలోనే సునీతా విలియమ్స్

న్యూఢిల్లీ, జూన్ 25: భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ ఇటీవల ప్రయాణించిన బోయింగ్ స్టార్‌లైనర్ వ్యోమనౌకకు సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో ఆమెతోపాటు మరో నాసా వ్యోమగామి బుచ్ విల్‌మోర్ కూడా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లోనే చిక్కుకుపోయారు. వారిద్దరూ స్టార్‌లైనర్‌లో ఈ నెల 5న ఐఎస్ఎస్‌కు చేరుకున్న సంగతి తెలిసిందే. అక్కడ ఈ వ్యోమనౌకలో హీలియం లీకేజీ సమస్య తలెత్తడంతో.. నాసా ఇంజనీర్లు దాన్ని సరిదిద్దే పనిలో నిమగ్నమయ్యారు. ఈ నెల 26న వారు భూమిపైకి తిరిగొస్తారని నాసా 4 రోజుల క్రితం ప్రకటించినప్పటికీ.. ఈ ప్రక్రియ వాయిదాపడింది. దీంతో వారు స్పేస్‌స్టేషన్‌లోనే ఉండిపోవాల్సి వచ్చింది. వాస్తవానికి, ఈ నెల 14న భూమిపైకి తిరిగి రావాల్సి ఉంది. కానీ, హీలియం లీకేజీ కారణంగా వారి ప్రయాణాన్ని నాసా 2 సార్లు వాయిదా వేసింది. విమానయాన రంగంలో ఘనమైన చరిత్ర ఉన్న దిగ్గజ సంస్థగా పేరొందిన బోయింగ్.. వరుస ప్రమాదాలతో ఇటీవలి కాలంలో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



డీజీపీ ద్వారకా తిరుమలరావును సత్కరించిన బుద్దా వెంకన్న

డీజీపీకి బుద్దా వెంకన్న శుభాకాంక్షలు

వన్‌టౌన్, జూన్ 25: డీజీపీ ద్వారకా తిరుమలరావును మంగళగిరి లోని ఆయన కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుద్దా వెంకన్న మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్ప గుచ్ఛం అందజేసి దుశ్శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు అందజేశారు.



సత్యనారాయణకు ఆశీస్సులు అందజేస్తున్న వేద పండితులు

దుర్గమ్మ సన్నిధిలో దేవదాయ శాఖ కమిషనర్

వన్‌టౌన్, జూన్ 25: ఇంద్రకీలాద్రిపైనున్న దుర్గమ్మను మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ దర్శించుకున్నారు. అలాగే ఆలయ ప్రాంగణంలోని రావి చెట్టు వద్ద ఉన్న ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఈవో రామారావు, అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆంజనేయస్వామికి, దుర్గమ్మకు ప్రత్యేక అర్చనలు చేసిన అనంతరం ఆయనకు తీర్థ ప్రసాదాలను అందజేయగా, వేద పండితులు ఆశీస్సులందజేశారు. ఈవో శేషవస్త్రం అందజేశారు.



నూతనంగా ఎన్నికైన ఏపీ టెంట్‌హౌస్ కార్యవర్గసభ్యులు

ఏపీ టెంట్‌హౌస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక

పటమట, జూన్ 25: ఏపీ టెంట్‌హౌస్ అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గ ఎన్నిక పటమటలోని ఆషా ఫంక్షన్‌హాల్లో మంగళవారం జరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచి వివిధ జిల్లాల నేతలు ఈ ఎన్నిక లో పాల్గొన్నారు. నూతన అధ్యక్షుడిగా ఎస్‌కే బాషా, ఉపాధ్యక్షుడిగా సీ హెచ్ వెంకట సుబ్బారావు, సెక్రటరీగా వూటుకేరి వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ గార్లపాటి శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమను ఒక పరిశ్రమగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. టెంట్‌హౌస్ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలపై సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామన్నారు.

ఎన్నాళ్లయినా బెర్మ్‌పార్క్, భవానీ ఐల్యాండేనా..?

కొత్త ప్రాంతాల గుర్తింపు, అభివృద్ధిపై దృష్టిపెట్టేదెప్పుడు..?

పర్యాటకానికేదీ.. ప్రోత్సాహం?


గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విచ్చల విడిగా పర్యాటక వినాశనం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో బ్రహ్మయ్యలింగం చెరువు, కొండపల్లి రిజర్వు ఫారెస్ట్, జగ్గయ్యపేట చెరువు, గాంధీహిల్ అభివృద్ధిపై దృష్టి

మళ్లీ పర్యాటకాన్ని పెంపొందించాలంటే ఆయా ప్రాంతాల అభివృద్ధి తప్పనిసరి

తక్కువ ఖర్చుతో పర్యాటక శాఖ ప్రాంతాలకు మహర్దశ

రాష్ట్ర ఆదాయాన్ని పెంచే శాఖల్లో పర్యాటకం ఒకటి. అభివృద్ధి చెందాల్సిన ప్రాంతాలు చెంతనే ఉన్నా గత వైసీపీ ప్రభుత్వం దృష్టి సారించలేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చేయతలపెట్టిన ప్రాజెక్టులను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా పక్కనపెట్టింది. డివిజన్ పరిధిలో అనాదిగా హరిత బెర్మ్‌పార్క్ భవానీ ఐలాండ్ తప్పితే మరో పర్యాటక ఆకర్షణ లేకుండా పోయింది. మరిన్ని పర్యాటక ప్రాంతాలను తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



కొండపల్లి కోట, రిజర్వ్ ఫారెస్ట్



గాంధీహిల్



బ్రహ్మయ్యలింగం చెరువులో రెండు కొండల మధ్య ప్రవాహం

ఆంధ్రజ్యోతి, విజయవాడ: రాష్ట్రానికి ఆదాయాన్నిచ్చే వనరుల్లో పర్యాటకం ప్రధానమైంది. ప్రస్తుతం రాష్ట్రానికి ఆదాయం అవసరం. పెద్దగా పెట్టుబడి లేకుండానే పర్యాటక ఆదాయాన్ని సాధించే ప్రాంతాలు మన చెంతనే ఉన్నాయి. నూతన ప్రభుత్వం వీటిని పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విజయవాడ పర్యాటకాభివృద్ధి డివిజన్ పరిధిలోకి ఉమ్మడి కృష్ణాజిల్లా కూడా వస్తుంది. గన్నవరం మండలం చిక్కవరం గ్రామంలోని బ్రహ్మయ్యలింగం చెరువును పర్యాటకంగా తీర్చిదిద్దటానికి అన్ని వనరులూ ఉన్నాయి. ఈ ప్రాంతానికి చారిత్రక నేపథ్యం కూడా ఉంది. 12వ శతాబ్దం నాటి పురాతనమైన బ్రహ్మయ్యలింగేశ్వర స్వామి ఆలయం ఇక్కడే ఉంది. ప్రస్తుతం ఈ ఆలయ నిర్వహణ కంచి కామకోటిపీఠం చూస్తోంది. ఇక్కడి కొండ సానువులు కొండసానువుల అందం చెప్పలేనిది. దిగువన 1200 ఎకరాల విస్తీర్ణంలోని బ్రహ్మయ్యలింగం చెరువు, అనుకుని ఉండే కొండ ప్రాంతాలను చూస్తే పాపికొండలను తలపిస్తాయి. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే పాపికొండలు కనుమరుగయ్యే అవకాశం ఉంది. కాబట్టి ఆ కొరతను బ్రహ్మయ్యలింగం చెరువు వద్ద పూడ్చుకోవచ్చు. ఈ చెరువును వీక్షించటానికి దూరప్రాంతాల నుంచి ఎంతో మంది వస్తుంటారు. మౌలిక సదుపాయాలు లేకపోవటంతో నిరాదరణకు గురౌతోంది. ఇక్కడ బోటింగ్ కార్యకలాపాలు ప్రారంభిస్తే పర్యాటకం పుంజుకునే అవకాశం ఉంది. తాత్కాలికంగానైనా రెండు, మూడు కాటేజీలను నిర్మిస్తే చాలు. పెద్దగా పెట్టుబడి లేకుండానే పర్యాటకరంగాన్ని బలోపేతం చేయవచ్చు. దీంతో అటు గుడి అభివృద్ధితో పాటు, ఇటు పర్యాటకాభివృద్ధి కూడా కలుగుతుంది. దేవస్థానం ట్రస్టీ అయిన చిక్కవరం గ్రామ సర్పంచ్ అన్నే లక్ష్మణరావు నేతృత్వంలో ఎందరో దాతల సహకారంతో చిక్కవరం కొండపై పురాతనమైన దేవాలయాన్ని పునర్నిర్మించి భక్తులకు అందుబాటులోకి తెచ్చారు. చరిత్ర కలిగిన దేవాలయాలను నేటితరానికి చెప్పాలంటే ఇలాంటి వాటిని సంరక్షించుకోవాలి.

కొండపల్లి రిజర్వ్ ఫారెస్ట్

అలాగే జిల్లా పరిధిలో కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ మంచి పర్యాటక ప్రాంతంగా ఉంది. మూలపాడు నుంచి కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ కొన్ని వందల ఎకరాల్లో విస్తరించింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఈ రిజర్వు ఫారెస్టులోకి అడుగుపెట్టిన ట్రెక్కర్లు అటవీ ప్రాంతంలోని ఎన్నో జలపాతాలున్నాయన్న విషయాన్ని సమాజానికి తెలిపారు. చిన్నా, చితకా కలుపుకుని దాదాపుగా వందకు పైగా జలపాతాలున్నాయన్నది ట్రెక్కర్ల అంచనా. వీరు ఆయా జలపాతాలకు పలు పేర్లు పెట్టి పోస్టర్లను కూడా విడుదల చేశారు. పర్యాటక ధామంగా, ట్రెక్కింగ్ ప్రాంతంగా ఉన్న మూలపాడు, కొండపల్లి రిజర్వు ఫారెస్టును పెద్దగా ఖర్చు లేకుండానే పర్యాటక ధామంగా తీర్చిదిద్దవచ్చు. అటవీ ప్రాంతం కాబట్టి సహజ ప్రకృతి సోయగాలు ఎటూ ఉన్నాయి. కావాల్సింది రోడ్లు మాత్రమే. అభయారణ్యంలోకి సిమెంట్ పాత్‌వేలను అభివృద్ధి చేయగలిగితే ట్రెక్కర్లకు, రైడర్లకు, బైకర్లకు ఉపయోగంగా ఉంటుంది. పెద్దగా ఖర్చు లేకుండా క్యాంపింగ్స్ నిర్వహించవచ్చు. నైట్ క్యాంప్‌లు నిర్వహించటానికి వీలుగా టెంట్లు అందుబాటులోకి వస్తే పర్యాటకాదరణ పెరుగుతుంది. అడవిలో అక్కడక్కడా పాత్‌వేల వెంబడి బెంచీలు, మంచినీటి సదుపాయాలు కల్పించినా సరిపోతుంది. అడవి కాబట్టి ఏదైనా ప్రమాదం తలెత్తితే వైద్య సదుపాయాలు అందించటానికి వీలుగా వైద్యారోగ్య శాఖ నేతృత్వంలో ఓ క్లినిక్‌ను ఏర్పాటు చేస్తే పర్యాటకులకు రక్షణగా ఉంటుంది.

గాంధీహిల్

నగరంలోని గాంధీహిల్ అభివృద్ధి బాధ్యతలను గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏపీటీడీసీ దక్కించుకుంది. గాంధీహిల్ సొసైటీ నుంచి ఏపీటీడీసీకి అభివృద్ధి బాధ్యతలను అప్పగించారు. అప్పట్లో కొంతఅభివృద్ధి పనులు జరిగాయి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక పూర్తిగా పక్కన పెట్టారు. గాంధీహిల్‌లో ప్లానిటోరియం, మ్యూజియం, లైబ్రరీ ఉన్నాయి. గాంధీ మాన్యుమెంట్‌తో పాటు, కొండ చుట్టూ తిరిగే ట్రెయిన్ కూడా ఉంది. గాంధీహిల్‌కు ఎంతోమంది సందర్శకులు వస్తుంటారు. ఇన్ని ప్రత్యేకతలున్న గాంధీహిల్‌ను అభివృద్ధి చేస్తే పర్యాటకాదరణ మరింత పెరగటంతో పాటు ఆదాయం పెరుగుతుంది. జిల్లాలో కొత్తూరు తాడేపల్లిలో అటవీశాఖ అధికారులు నగరవనం ఏర్పాటు చేశారు. ఇక్కడ పర్యాటకంగా ఒకటి, రెండు కాటేజీల ఏర్పాటుకు అవకాశం ఉంది. జగ్గయ్యపేట బస్టేషన్ ఎదురుగా ఉన్న చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ చెరువులో బోటు తిప్పటానికి ప్రణాళికలు రూపొందించారు. ఆపరేషన్స్ కూడా చేపట్టారు. కానీ వైసీపీ ప్రభుత్వం బోటింగ్‌ను పూర్తిగా పడుకోబెట్టింది. జగ్గయ్యపేట పరిసరాల్లో మరెన్నో పర్యాటక వనరులు కలిగిన ప్రాంతాలున్నాయి. వీటిని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.



బ్రహ్మయ్యలింగం చెరువు

ప్రభుత్వ ఉద్యోగాలకు అవకాశం

20 లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామని టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అన్నట్టుగానే మెగా డీఎస్సీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ క్రమంలో మరిన్ని ఉద్యోగాల కల్పనకు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి దోహదపడుతుంది. పైన చెప్పుకున్న పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయటం ద్వారా ప్రభుత్వ రంగ ఉద్యోగాలను కల్పనకు దోహదపడుతుంది. కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీటీడీసీ ఉన్నతాధికారులు విచ్చలవిడిగా ప్రైవేటు వ్యక్తులను నియమించుకున్నారు. ప్రభుత్వ పెద్దలు చెప్పినట్టుగా తలాపి అడ్డగోలుగా వైసీపీ కార్యకర్తలకు ఉద్యోగాలిచ్చారు. పీపీపీ పేరుతో తమకు నచ్చిన సంస్థలకు పర్యాటక యూనిట్లను కట్టబెట్టేశారు. టీడీపీ ప్రభుత్వం వీటిని సమీక్షించి తక్కువ ఖర్చుతో ఏపీటీడీసీనే పర్యాటక యూనిట్ల ద్వారా ఆదాయంతో పాటు, ఉద్యోగాల కల్పన హామీ కూడా నెరవేరుతోంది. ఈ దిశగా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పాయకాపురం, జూన్ 25: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లకు, ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతుల కారణంగా ఏపీఎస్ రెడ్డి రోడ్డు, డాక్టర్స్ కాలనీ, న్యూ రాజీవ్‌నగర్, రాధానగర్, బర్మాకాలనీ, విశాలాంధ్ర కాలనీ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు.

పేపర్లో వస్తే ఏమౌతుంది.. నన్నెవరూ ఏం చేయలేరు..?

రాణిగారితోట, జూన్ 25: కృష్ణానదిలో ఇసుకను లారీతో అక్రమంగా తరలిస్తున్న లారీపై ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన వార్తపై లారీ యజమాని చేసిన హంగామా స్థానికులను ముక్కున వేలేసుకునేలా చేసింది. నేనింతే నదిలో ఇసుక తెస్తా, నన్నేవరూ ఏం పీకలేరు, పేపర్లో వార్త వస్తే ఏమౌతుంది, ఇసుక తెచ్చుకోవడానికి ఎవరికేం ఇవ్వాలో ఇస్తున్నా అంటూ అహంకారంతో వీరంగం చేసినట్టు సమాచారం. ఇసుకను తరలిస్తున్న ఫొటోలు కృష్ణలంక పోలీసులకు తెలిసింది. వెంటనే వారు లారీ యజమానిని స్టేషన్‌కు పిలిపించి మాట్లాడినట్టు సమాచారం. ఈ అక్రమ రవాణా చాలాకాలం నుంచే జరుగుతుందని ఆ విషయం పోలీసులకు తెలియకపోతే అర్ధరాత్రి ఫొటోలు తీసిన విషయం తెలియగానే అతడిని స్టేషన్‌కు పిలవడంపై ఎందుకు ఉత్సాహం చూపించారో పోలీసులే తేల్చాలి. మరో విషయం ఏమిటంటే అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీకి ముందు నెంబర్ ప్లేట్‌పై నెంబర్ కనిపించదు, వెనుక స్పష్టంగా ఉంటుంది. ఈ విషయం ఇరిగేషన్ అధికారుల దృష్టిలో ఉన్నా వారెక్కడా స్పందించిన దాఖలాలులేవు.

రామోజీరావు సంస్మరణ సభ ఏర్పాట్లను

సమన్వయంతో పూర్తి చేయాలి

● కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

పెనమలూరు, జూన్ 25: ఈనెల 27న జరగనున్న దివంగత రామోజీ గ్రూపు సంస్థల చైర్మన్ చెరుకూరి రామోజీరావు సంస్మరణ సభ నిర్వహణను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. తాడిగడప-ఎనికేపాడు వందడుగుల రోడ్డులో జరుగుతున్న సభ ఏర్పాట్లను కలెక్టర్ మంగళవారం పర్యవేక్షించారు. సభాస్థలి ఎదురుగా ఉన్న శ్రీచైతన్య కళాశాల మీటింగ్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన అధికారులతో మాట్లాడారు. అధికారులు నిర్వర్తించాల్సిన బాధ్యతలను శాఖల వారీగా అప్పగించామని, ఆ ప్రకారం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. తొలుత సీఆర్‌డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్, ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సంపత్‌కుమార్, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్, కృష్ణా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, సీఆర్డీఏ అదనపు కమిషనరు అలీంబా షా, జీఏడీ ప్రొటోకాల్ అదనపు డైరెక్టర్ వాణి సభాస్థలి వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. సమావేశంలో డీఆర్‌వో కే చంద్రశేఖర్‌రావు, అదనపు ఎస్పీ ప్రసాద్, సమాచార శాఖ అదనపు డైరెక్టర్ స్వర్ణలత, జాయింట్ డైరెక్టర్లు కిరణ్‌కుమార్, కస్తూరి, రీజనల్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, గుడివాడ, ఉయ్యూరు ఆర్డీవోలు పీ పద్మావతి, డీ రాజు, కమిషనర్లు సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వరరావు, ముడా వీసీ వెంకటరమణ, అధికారులు పాల్గొన్నారు.



సభాస్థలి వద్ద ఉన్నతాధికారుల పర్యవేక్షణ

10వేల మందికి ఏర్పాట్లు: ఎమ్మెల్యే బోడె

రామోజీరావుకు సుమారు 10వేల మంది అంజలి ఘటించనున్నారని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. దానికి తగ్గ ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో చేస్తున్నారన్నారు. ఎక్కడో ఇతర దేశాల్లో భారీ ఎత్తున నిర్మితమైన యూనివర్సల్ స్టూడియోకు దీటుగా రామోజీ ఫిల్మ్ సిటీని నిర్మించడం ఒక పెద్ద సవాలన్నారు. అంతటి గొప్ప వ్యక్తిని గౌరవించుకోవడం సముచితంగా ఉంటుందని భావించి సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఈనెల 27న వందడుగుల రోడ్డులోని అనుమోలు గార్డెన్స్‌లో కార్యక్రమం తలపెట్టామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సినీ, పాత్రికేయ ప్రముఖులు తరలి రానున్నారన్నారు. ఆయన వెంట అనుమోలు ప్రభాకరరావు, సూదిమళ్ల రవీంద్ర ఉన్నారు.



ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు వినతిపత్రం అందజేస్తున్న విమానాశ్రయ విస్తరణలో భూములు కోల్పోయిన రైతులు

విమానాశ్రయం నిర్వాసితులకు

న్యాయం చేస్తా: యార్లగడ్డ

గుణదల, జూన్ 25: విమానాశ్రయం విస్తరణలో భూములు కోల్పోయిన రైతుల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు రైతులకు హామీ ఇచ్చారు. విమానాశ్రయ విస్తరణలో భూములు కోల్పోయి నేటికీ న్యాయం జరగని రైతులు తమ సమస్యలను విన్నవించి వినపత్రం సమర్పించేందుకు ఫన్‌టైమ్స్ క్లబ్ రోడ్‌లోని యార్లగడ్డ క్యాంపు కార్యాలయానికి మంగళవారం విచ్చేశారు. తమ సమస్యను గత ప్రభుత్వానికి విన్నవించినా ప్రయోజనం లేకపోయిందని రైతులు యార్లగడ్డ వద్ద వాపోయారు. అజ్జంపూడి, గన్నవరం, బుద్దవరం గ్రామాల నుంచి విమానాశ్రయ విస్తరణలో భూములు కోల్పోయిన రైతులు యార్లగడ్డను మంగళవారం ఆయన కార్యాలయంలో కలిశారు. రాజధానిలో భూములు కొందరికే రిజిస్ట్రేషన్ కావటం, ఇచ్చినవి ఎక్కడో స్పష్టత లేకపోవడం, రాజధాని మార్పు ప్రకటన వంటి అంశాలు భూత్యాగం చేసిన అన్నదాతలను ఆందోళనకు గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సమీకరించిన భూమి కేంద్రానికి అప్పగించటంతో విమానాశ్రయం అభివృద్ధిలో భాగంగా ఆ భూమి చుట్టూ ప్రహరీ నిర్మించి అభివృద్ధి పనులు వేగవంతం చేశారు. చంద్రబాబు ప్రభుత్వం గతంలో ఏదైతే ఒప్పందం కుదుర్చుకుందో ఆ ఒప్పందాన్ని అమలు చేసేలా చిత్తశుద్ధితో కృషి చేస్తానని యార్లగడ్డ వెంకట్రావు వారికి హామీ ఇచ్చారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి వంటి హామీలపై కలెక్టర్‌తో చర్చించి భూములు కోల్పోయిన వారందరికీ న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చి పంపారు.

ప్రమాదభరితంగా ఐదో నెంబర్ రోడ్డు

ఫుట్‌పాత్ లేకపోవడంతో రోడ్డుపైనే రాకపోకలు

సైడ్ డ్రెయిన్‌తో మరింత ప్రమాదం



వరలక్ష్మీనగర్ కాలనీపై లేని ఫుట్‌పాత్



పాలిటెక్నిక్ కళాశాల రోడ్డులో ప్రమాదకరంగా సర్వీస్ మురుగు కాలువ.

భారతీనగర్: ప్రమాదకరంగా మారిన ఐదో నెంబర్ రోడ్డులో ప్రయాణించడానికి పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరంలోని ప్రధాన రహదారుల్లో ఒకటైన ఐదో నెంబర్ రోడ్డు నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. అంతటి ప్రాధాన్యత కలిగిన రోడ్డులో ఫుట్‌పాత్ లేకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. ఐటీఐ కళాశాల నుంచి రమేష్ ఆసుపత్రి సెంటర్ వరకు సుమారు కిలోమీటర్ దూరం ఉంది. ఈరోడ్డులో ప్రభుత్వ పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలతో పాటు, లయోలా ఇంజనీరింగ్ కళాశాల, పలు ప్రభుత్వ కార్యాలయాలు, పలు కాలనీలున్నాయి. దీంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వైపు ఉన్న సర్వీస్‌రోడ్డుకు మార్జిన్‌లో సుమార్ 4 అడుగుల వెడల్పు, 5 అడుగుల లోతుగల మురుగు కాలువప్రవహిస్తూ ప్రమాదకరంగా ఉంది. ఈ ప్రాంతంలో రోడ్డుకు రెండు వైపులా ఫుట్‌పాత్ లేకపోవడంతో రోడ్డుపై నడవాల్సివస్తుందని పాదచారులు వాపోతున్నారు. ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోని భయపడుతూ ప్రయాణించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు రక్షణ గోడ ఏర్పాటు చేయకపోవడం వల్లే ప్రమాదకరంగా కనిపిస్తోంది.

నిత్యం వాహనాలతో రద్దీ

రమేష్ ఆసుపత్రి సెంటర్, అమ్మ కల్యాణ మండపం సెంటర్‌తో పాటు ఈరోడ్డులో ప్రభుత్వ పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలతో పాటు, లయోలా ఇంజనీరింగ్ కళాశాల, పలు ప్రభుత్వ కార్యాలయాలు, పలు కాలనీలున్నాయి. అందుకే ఈ రోడ్డు రద్దీగా ఉంటుంది.

నిలిచిపోతున్న వర్షపు నీరు

రమేష్ ఆసుపత్రి వైపు ఉన్న రోడ్డుకు డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షం కురిసిన ప్రతి సారి వర్షపు నీరు నిలిచిపోవడంతో రోడ్డు అధ్వానంగా మారుతోంది.

ఫుట్‌పాత్ ఏర్పాటు చేయాలి: వాసు, స్థానికుడు

రమేష్ ఆసుపత్రి నుంచి ఐటీఐ కళాశాల సెంటర్ వరకు రోడ్డుకు రెండు వైపులా ఫుట్‌పాత్ లేకపోవడంతో కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, కాలనీల ప్రజలు, విద్యార్థులు రోడ్డుపై నడవాల్సి వస్తుంది. దీంతో తరచూ పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు.



పాలిటెక్నిక్ కళాశాల ఎదురుగా ఉన్న డ్రైనేజీ రక్షణ గోడ



రమేష్ ఆసుపత్రి వైపు నిలిచిన వర్షపు నీరు

పార్టీ ఎంపీలకు టీడీపీ విప్ జారీ

నేడు లోక్‌సభ స్పీకర్ ఎన్నిక

న్యూఢిల్లీ, జూన్ 25(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ స్పీకర్ ఎన్నిక నేపథ్యంలో పార్టీ ఎంపీలకు టీడీపీ విప్ జారీ చేసింది. 16 మంది లోక్‌సభ ఎంపీలకు త్రీ లైన్ విప్ జారీ చేసింది. లోక్‌సభకు నేటి(బుధవారం) ఉదయం 11 గంటల నుంచి తప్పనిసరిగా హాజరుకావాలని, ఎన్డీఏ స్పీకర్ అభ్యర్థికే ఓటేయాలని పార్టీ చీఫ్ విప్ జీఎం హరీష్ బాలయోగి విప్‌లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎంపీలందరూ టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయల నేతృత్వంలో బుధవారం ఉదయం పార్లమెంటుకు బయలుదేరే ముందు సమావేశం కానున్నారు. స్పీకర్ ఎన్నికలో ఓటింగ్ విధానం పట్ల ఈ భేటీలో ఎంపీలకు లావు శ్రీకృష్ణదేవరాయలు అవగాహన కల్పించనున్నారు. ఏపీ బీజేపీ, జనసేన ఎంపీలను ఈ సమావేశానికి టీడీపీ ఆహ్వానించింది. సమావేశం అనంతరం టీడీపీ ఎంపీలందరూ పార్లమెంటుకు వెళ్లనున్నారు.

నేడు ఇంటర్ ఫస్టియర్ సప్లిమెంటరీ ఫలితాలు

అమరావతి, జూన్ 25(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫస్టియర్ సప్లిమెంటరీ, బెటర్‌మెంట్ ఫలితాలు నేడు(బుధవారం) విడుదల కానున్నాయి. సాయంత్రం 5గంటలకు విడుదల చేసేందుకు ఇంటర్ బోర్డు అధికారులు సన్నద్ధమవుతున్నారు. సుమారు 3.5లక్షల మంది విద్యార్థులు ఈ ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు. కాగా, ఇటీవల సెకండియర్ ఫలితాలను ముందే విడుదల చేశారు. ఉన్నత విద్యా కోర్సుల్లో చేరేందుకు ఇబ్బంది లేకుండా ఈ మేరకు ముందస్తు చర్యలు తీసుకున్నారు.

రైతుసాధికార సంస్థ వైస్ చైర్మన్‌గా విజయ్‌కుమార్

అమరావతి, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి.విజయ్ కుమార్ ఏపీ రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్‌గా, వ్యవసాయ, సహకారశాఖ ప్రభుత్వ సలహాదారుగా నియమితులయ్యారు. ఆయన ఈ పదవిలో రెండేళ్లు ఉంటారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. షరతులు, నిబంధనలతో మరో ఉత్తర్వు జారీ కానున్నది.

స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులు భర్తీ చేయాలి

అమరావతి, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని ఏపీయూఎస్‌టీఎఫ్ నాయకుడు ఎం.వెంకటనాయుడు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులకు అర్హులైన పలువురు మంగళవారం అమరావతిలో మంత్రి లోకేశ్‌ను కలిసి, ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. దీనిపై దివ్యాంగులకు బోధించే టీచర్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు వెంకటనాయుడు మీడియాకు చెప్పారు.

శ్రీనివాసరాజు వీఆర్‌ఎస్ ఆమోదం

అమరావతి, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): మరో ఏడాది సర్వీసు ఉన్నప్పటికీ ఆల్ ఇండియా సర్వీసెస్ 1999 బ్యాచ్‌కు చెందిన కె.శ్రీనివాసరాజు వలంటరీ రిటైర్మెంట్‌కు దరఖాస్తు చేయగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమోదించింది. తిరుమల తిరుపతి దేవస్థానం జేఈవోగా దాదాపు ఎనిమిది సంవత్సరాలు పని చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆయన్ను ప్రభుత్వం సాధారణ పరిపాలన శాఖకు పంపించింది. ప్రభుత్వం పోస్టింగ్ ఇవ్వకపోవడంతో తెలంగాణకు డిప్యుటేషన్‌పై వెళ్లిపోయారు. తెలంగాణలో నాలుగేళ్ల పాటు పనిచేసిన తర్వాత క్యాట్ అనుమతివ్వకపోవడంతో ఆయన తిరిగి ఏపీలో రిపోర్ట్ చేశారు. వలంటరీ రిటైర్మెంట్ కోసం ఏపీ ప్రభుత్వానికి దరఖాస్తు చేయగా ప్రభుత్వం ఆమోదించింది.

వైసీపీ ప్రభుత్వంలో జర్నలిస్టులపై వేధింపులు

- ప్రభుత్వ మార్పుతో సాంత్వన
- ఐజేయు జాతీయ అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి

విజయవాడ(వన్‌టౌన్), జూన్ 25: గత ప్రభుత్వంలో జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం కాలేదని, పైగా వేధింపులు ఎదుర్కొన్నామని, ప్రస్తుతం ప్రభుత్వ మార్పుతో సాంత్వన లభించిందని ఐజేయూ జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. విజయవాడ గాంధీనగర్‌లోని చాంబర్ ఆఫ్ కామర్స్ హాలులో మంగళవారం జరిగిన ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త ప్రభుత్వంలో పాత్రికేయుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అనుకుంటున్నామని, కొంత సమయం ఇవ్వాలని సూచించారు. జర్నలిస్టుల సమస్యలను ఇప్పటికే మంత్రుల దృష్టికి తీసుకువెళ్లామని, సీఎంను త్వరలో కలిసి వివరిస్తామని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వి.సుబ్బారావు చెప్పారు. మీడియాను బెదిరించేందుకు జగన్ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 2430ను వెంటనే రద్దు చేయాలని, వైసీపీ ప్రభుత్వంలో జర్నలిస్టులపై నమోదు చేసిన కేసులను తక్షణం ఎత్తివేయాలని సమావేశం డిమాండ్ చేసింది. శాసనసభ సమావేశాలను కవర్ చేయనీయకుండా కొన్ని చానళ్లను నిషేధిస్తూ గత ప్రభుత్వం జారీ చేసిన జీవోను రద్దు చేస్తూ ఉత్తర్వులిచ్చిన స్పీకర్ అయ్యన్న పాత్రుడికి కృతజ్ఞతలు చెబుతూ తీర్మానం చేశారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో జర్నలిస్ట్ పిల్లలకు ఫీజు రాయితీని కొనసాగించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని సమావేశం విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా పూతలపట్టు శాసనసభ్యుడిగా ఎన్నికైన సీనియర్ జర్నలిస్ట్ ఏపీయూడబ్ల్యూజే నాయకుడు కె.మురళీమోహన్‌ను సత్కరించారు.చందు జనార్దన్, డి.సోమసుందర్, ఆలపాటి సురేష్‌కుమార్ తదితరులు ప్రసంగించారు.

కళ్లలో కారంచల్లి.. రాడ్లతో కొట్టి..

- ఫ్యాక్షన్ తరహాలో ఆళ్లగడ్డలో హత్య
- హంతక దాడిలో టీడీపీ నేత భార్య మృతి
- అట్ల భాస్కరరెడ్డికి తీవ్ర గాయాలు
- ఆస్తి గొడవలే కారణం: పోలీసులు

నంద్యాల, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు అట్ల భాస్కరరెడ్డి దంపతులపై మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. కారు దిగి ఇంట్లోకి వెళ్తున్న సమయంలో కళ్లలో కారంకొట్టి ఇనుప రాడ్లతో విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ ఘటనలో భాస్కరరెడ్డి సతీమణి శ్రీదేవి (55) ప్రాణాలు కోల్పోయారు. ఆళ్లగడ్డ పట్టణం పాత బస్టాండ్ ప్రాంతంలోని పాతూరు వీధిలో భాస్కరరెడ్డి కుటుంబం నివాసం ఉంటోంది. మంగళవారం సాయంత్రం 6.30 గంటల సమయంలో భాస్కరరెడ్డి, శ్రీదేవి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చారు. వాహనం దిగి ఇంట్లోకి వెళ్తుండగా ముసుగులు వేసుకుని వచ్చిన ఓ మహిళ, ముగ్గురు పురుషులు ఒక్కసారిగా దాడికి దిగారు. వచ్చీ రావడంతోనే భాస్కరరెడ్డి దంపతులపై విరుచుకుపడ్డారు. వారి దాడిలో శ్రీదేవి అక్కడికక్కడే మృతి చెందగా, భాస్కరరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. ఆయనను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో పోలీసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. భాస్కరరెడ్డిని ఆస్పత్రిలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పరామర్శించారు. నిందితులు ఎవరో వెంటనే తేల్చాలంటూ పోలీసులను ఆదేశించారు. అయితే, ఈ దాడి ఆస్తి గొడవల్లో భాగంగానే జరిగినట్టు పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. భాస్కర్‌రెడ్డికి, ఆయన తమ్ముడు అట్ల గోపాల్‌రెడ్డి మధ్య కొన్నేళ్లుగా ఆస్తి గొడవలు నడుస్తున్నాయని, దీనిని మనసులో పెట్టుకుని గోపాల్‌రెడ్డి, ఆయన భార్య శిరీష మరికొంతమందితో కలిసి వారిపై దాడికి పాల్పడ్డారని తెలిపారు. ఇందులో ఎలాంటి రాజకీయ కోణం లేదన్నారు. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

రాజ్యాంగంపై రాహుల్‌ది మొసలి కన్నీరు: దినకర్

న్యూఢిల్లీ, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీది మొసలి కన్నీరని ఏపీ బీజేపీ అధికార ప్రతినిధి లంకా దినకర్ విమర్శించారు. చేతిలో రాజ్యాంగం ఉన్నంత మాత్రాన సరిపోదని, దానిని చదివి అర్థం చేసుకోగల పరిణతి ఉండాలని ఎద్దేవా చేశారు.

కర్ణాటకలో కబాబ్ కృత్రిమ రంగులపై నిషేధం

బెంగళూరు, జూన్ 25(ఆంధ్రజ్యోతి): కృత్రిమ రంగుల వాడకం వల్ల క్యాన్సర్, బీపీ, మధుమేహం వంటి జబ్బులు ప్రబలే ప్రమాదం ఉందని పరిశోధనల్లో తేలిన నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం చేప, చికెన్ కబాబ్‌ల తయారీలో కృత్రిమరంగుల వాడకాన్ని నిషేధించింది. ఈ మేరకు ఆహారభద్రతా విభాగం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. కొన్ని నెలల కిందట గోబీ మంచూరియా, కాటన్‌క్యాండీ తయారీలో కృత్రిమ రంగుల వినియోగాన్ని నిషేధించారు. కబాబ్‌లకూ ఇటువంటి రంగులు వాడుతున్నారని ఇటీవల ఫిర్యాదులు అందడంతో ఆరోగ్యశాఖ పరీక్షలు నిర్వహించింది.

మళ్లీ ఆంధ్రాకు ఆడతా!

- వైసీపీ ప్రభుత్వం నన్ను తొక్కేసింది.. టీమిండియా క్రికెటర్ హనుమ విహారి
- లోకేశ్ భరోసాతో తిరిగి ఏసీఏకు ఆడాలని నిర్ణయం




డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్‌లతో క్రికెటర్ హనుమ విహారి

అమరావతి, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మితిమీరిన రాజకీయ జోక్యం వల్ల ఆంధ్ర క్రికెట్ జట్టు కెప్టెన్సీని వదులుకోవాల్సి వచ్చిందని టీమిండియా క్రికెటర్ హనుమ విహారి అన్నారు. జగన్ ప్రభుత్వం తన టాలెంట్‌ను తొక్కేసిందని.. ఇప్పుడు ప్రభుత్వం మారిన నేపథ్యంలో మళ్లీ తాను ఆంధ్ర జట్టుకు ఆడాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. అమరావతి సచివాలయంలో మంగళవారం ఆయన మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. జగన్ ప్రభుత్వంలో తనకు జరిగిన అవమానాలను లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ)తో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని లోకేశ్ తనకు హామీ ఇచ్చారన్నారు. దీంతో తాను మళ్లీ ఏసీఏ తరఫున ఆడాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం మితిమీరిన రాజకీయ జోక్యం కారణంగా అవమానకర రీతిలో ఆంధ్రా జట్టు కెప్టెన్సీని వదులుకున్నట్లు తెలిపారు. వారు చెప్పిన వారిని జట్టులోకి తీసుకోలేదని నాటి ఏసీఏ పెద్దలు తనపై కుట్రపన్నారన్నాని అన్నారు. ఆ సమయంలో తనకు చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ అండగా నిలబడ్డారన్నారు. ఆంధ్రాలో క్రికెట్‌ను ప్రోత్సహిస్తామని, ఏసీఏ తరఫునే ఆడాలని లోకేశ్ సూచించారని చెప్పారు. క్రీడల్లో రాజకీయాలు లేకుండా చూస్తామని ఆయన హామీ ఇవ్వడంతో తిరిగి ఏసీఏకు ఆడాలని నిర్ణయించుకున్నాని వెల్లడించారు. కాగా, విహారి మంగళవారం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను కూడా కలిశారు. జనసేన పార్టీ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఇటీవల ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఆయనకు అభినందనలు తెలిపారు.

అలా లీకయిందా?

కొరియర్ కంపెనీ నిర్లక్ష్యమే కారణం!

- నీట్ ప్రశ్నపత్రాన్ని కంపెనీ వాహనానికి బదులు వేరే రిక్షాలో తరలించిన వైనం
- మార్గమధ్యంలోనే అక్రమార్కులు పేపర్‌ను చేజిక్కించుకుని ఉండొచ్చని అంచనా

న్యూఢిల్లీ, జూన్ 25: నీట్ పేపర్ లీక్ గుట్టు రట్టవుతోంది. అక్రమార్కులకు ప్రశ్నపత్రం ముందే ఎలా అందింది? అనే ప్రశ్నకు సమాధానం నెమ్మదిగా బయటికి వస్తోంది. షెడ్యూలు ప్రకారం.. అహ్మదాబాద్ నుంచి ఓ ప్రైవేటు కొరియర్ సంస్థ ద్వారా రాంచీకి చేరుకున్న ప్రశ్నపత్రాలు.. అక్కణ్నుంచి స్థానిక ఎస్‌బీఐ బ్రాంచ్‌కి చేరాల్సి ఉంది. తర్వాత ఆ బ్యాంకు నుంచి అవి సంబంధిత ఎగ్జామ్ సెంటర్‌కు చేరాలి. రాంచీకి వచ్చిన ప్రశ్నపత్రాలను తన సొంత వాహనంలో బ్యాంకుకు తరలించాల్సిన కొరియర్ కంపెనీ.. అందుకు ఒక ఈ-రిక్షాను బుక్ చేసుకున్నట్టు బిహార్ ఆర్థిక నేరాల విభాగం అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో.. కొరియర్ కంపెనీ నుంచి బ్యాంకుకు వెళ్లే సమయంలోనే ప్రశ్నపత్రాలు ఉన్న బాక్సు ట్యాంపరింగ్‌కు గురై, పేపర్ లీక్ అయి ఉండొచ్చని వారు అంచనా వేస్తున్నారు. నీట్ పేపర్ లీక్ గురించి మే 4వ తేదీనే ఉప్పందుకున్న బిహార్ పోలీసులు.. మే 5వ తేదీ నాటికే సాల్వర్ గ్యాంగ్ ముఠా విద్యార్థులకు ఆ ప్రశ్నపత్రాన్ని అందజేసిన స్కూలుకు చేరుకున్నారు. అక్కడ వారికి తగలబెట్టిన ప్రశ్నపత్రం తాలూకా అవశేషాలు దొరికాయి. ఆ బుక్‌లెట్‌పై ఉన్న నంబర్ (636488) ఆధారంగా విచారణ జరపగా.. అది ఝార్ఖండ్ హజారీబాఘ్‌లోని ఒయాసిస్ అనే పాఠశాలకు (నీట్ పరీక్షా కేంద్రం) చేరాల్సిన ప్రశ్నపత్రంగా తేలింది. దీంతో వారు జూన్ 21న అక్కడికి చేరుకుని ఒయాసిస్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడిని ప్రశ్నించగా.. ఆయన ఒక ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు. ఆరోజు తమకు అందిన ప్రశ్నపత్రాల బాక్సు డిజిటల్ లాక్ మధ్యాహ్నం ఒకటింబావు సమయంలో దానంతట అదే తెరుచుకోవాల్సి ఉందని.. కానీ, తెరుచుకోకపోవడంతో జాతీయ టెస్టింగ్ ఏజెన్సీని సంప్రదించామని.. వారు దాన్ని కట్టర్‌తో బలవంతంగా తెరవాలని సూచించడంతో అలాగే చేశామని ప్రిన్సిపాల్ వివరించారు. దర్యాప్తులో భాగంగా జూన్ 21న వచ్చిన ఈవోయు అధికారులు.. ప్రశ్నపత్రాలున్న అల్యూమినియం బాక్సు చుట్టూ ఉండే స్టిక్కర్లు ఉండాల్సిన రీతిలో లేవని, ప్రశ్నపత్రాలున్న ఎన్వలప్ కవర్‌ను ఒక చివర చాలా తెలివిగా తెరిచారని.. తమకు తెలిపినట్టు వెల్లడించారు.

NATIONAL TESTING AGENCY
Excellence in Assessment

ప్రజలే ఇవ్వని హోదాను స్పీకర్ ఎలా ఇస్తారు?

- పది శాతం సీట్లు ఉంటేనే ప్రతిపక్ష నేత హోదా: యనమల



అమరావతి, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): జగన్‌కు ప్రజలే ఇవ్వని హోదాను స్పీకర్ ఎలా ఇస్తారని శాసనమండలి ప్రతిపక్ష నేత, మాజీ స్పీకర్ యనమల రామకృష్ణుడు అన్నారు. మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. శాసనసభలో తనకు ప్రతిపక్ష నేత హోదా కల్పించాలని వైసీపీ అధ్యక్షుడు జగన్ చేసిన డిమాండ్ ఆచరణ సాధ్యం కాదని స్పష్టం చేశారు. 'అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీకి వచ్చిన సీట్ల సంఖ్య చాలా పరిమితం. ప్రతిపక్ష హోదా రావాలంటే 18 సీట్లు గెలవాలి. ప్రజలు అన్ని సీట్లు ఇవ్వకుండా స్పీకర్ తనకు ఆ హోదా ఇవ్వాలని జగన్ కోరడం హాస్యాస్పదం. ఎన్ని సీట్లు వస్తే ప్రతిపక్ష హోదా వస్తుందో చట్టసభల నిబంధనల్లో స్పష్టంగా ఉంది. చట్టసభల నిర్వహణకు ప్రామాణికంగా 'కౌల్ అండ్ షక్దర్' రాసిన పుస్తకాన్ని దేశం అంతా పరిగణనలోకి తీసుకొంటుంది. అందులో కూడా దీనిపై స్పష్టత ఉంది. పార్లమెంటరీ సంప్రదాయాల ప్రకారం పది శాతం సీట్లు చట్టసభల్లో ఉంటేనే ప్రతిపక్షనేత హోదా వస్తుంది' అని చెప్పారు. 1994లో ఉమ్మడి అసెంబ్లీలో చాలినన్ని సీట్లు రాకపోయినా పి. జనార్దనరెడ్డికి ప్రతిపక్ష నేత హోదా ఇచ్చారని జగన్ చేసిన వాదన నిజం కాదని, ఆ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 26 మాత్రమే వచ్చాయని, అప్పుడు తానే స్పీకర్‌గా ఉన్నానని, పి. జనార్దనరెడ్డిని కాంగ్రెస్ పక్ష నేతగా మాత్రమే గుర్తించామని, ఇప్పుడు కూడా జగన్‌ను వైసీపీ పక్ష నేతగా గుర్తిస్తారు' అని వివరించారు.

18 మంది ఉంటేనే ప్రతిపక్ష హోదా అని జగనే చెప్పారు

- ఆయన మాటలు అసెంబ్లీ రికార్డులు చూసుకోవచ్చు: మంత్రి నిమ్మల

అమరావతి, జూన్ 25(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష నేత హోదా విషయంలో జగన్ వ్యాఖ్యలు అసంబద్ధంగా ఉన్నాయని, ఐదేళ్ల పాలనలో ప్రజల్లో పని చేసి ఉంటే.. ఇప్పుడు స్పీకర్‌కు లేఖలు రాసే పరిస్థితి వచ్చేది కాదని మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యానించారు. మంగళవారం అమరావతి సచివాలయంలో తన చాంబర్‌లో మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీలో ఒకసారి జగన్ మాట్లాడిన మాటలు రికార్డుల్లో చూసుకుంటే ఆయనకే తెలుస్తుందన్నారు. 'చంద్రబాబూ నీకు 23మంది ఉన్నారు. ఐదారుగురు ఎమ్మెల్యేలను మేం తీసుకుంటే 17మందితో ప్రతిపక్ష నేత హోదా కూడా మిగలదు అన్నాడు. అంటే 18మంది ఉంటేనే ప్రతిపక్ష హోదా అని జగనే చెప్పాడు. జగన్ కనీసం ప్రతిపక్షంలో ఉండటానికి కూడా అర్హుడు కాదని ప్రజలే తిరస్కరించారు' అని అన్నారు. కాగా, 'పేదల పింఛన్లపై పేటెంట్ హక్కులు టీడీపీకే ఉన్నాయని ఆ పార్టీకి చెందిన మాజీ మంత్రి కెఎస్ జవహర్ అన్నారు. రూ.వెయ్యి పెంచడానికి నాలుగేళ్ల సమయం తీసుకొన్న పార్టీకి ఇప్పుడు తమను ప్రశ్నించడానికి ఏం నైతిక హక్కు ఉందని ప్రశ్నించారు. కాగా, 'అధికారం ఉందని అడ్డగోలుగా నిర్మాణాలు చేస్తే చట్టం చూస్తూ ఊరుకుంటుందా జగన్? చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుంది' అని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. నాడు ప్రజావేదిక అక్రమ నిర్మాణమని కూల్చివేసి.. నేడు అక్రమంగా కడుతున్న భవనాలను కూల్చుతుంటే ఎందుకు గగ్గోలు పెడుతున్నారని మండిపడ్డారు.

నాడు ఏం చేశారో గుర్తు లేదా?

- జగన్‌కు బుద్దా బహిరంగ లేఖ



విజయవాడ(వన్‌టౌన్), జూన్ 25: గతంలో చంద్రబాబుకు ప్రతిపక్ష హోదా లేకుండా చేయాలని ప్రయత్నించింది మీరు కాదా అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుద్దా వెంకన్న మంగళవారం మాజీ సీఎం జగన్‌కు బహిరంగ లేఖ రాశారు. టీడీపీకి గతంలో 23 మంది ఎమ్మెల్యేలు ఉంటే నలుగురిని లాక్కుని మరో ఇద్దరిని కూడా లాక్కుందామని ప్రయత్నించి చంద్రబాబుకు ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేద్దామనుకోలేదా? అని ప్రశ్నించారు. స్పీకర్‌కు లేఖ రాసేముందు రాజ్యాంగ నిపుణులను జగన్ ఒకసారి సంప్రదించి ఉంటే బాగుండేదన్నారు. అతడికి ఇంకా పదవీకాంక్ష తీరలేదని, భ్రమలోనే ఉన్నారని పేర్కొన్నారు. అయ్యన్నపాత్రుడు స్పీకర్ పదవి చేపట్టకముందు అన్న వ్యాఖ్యలను జగన్ తన లేఖలో పేర్కొన్నారన్నారు. జగన్ సీఎం స్థానంలో ఉన్నప్పుడు చంద్రబాబును, పవన్‌కల్యాణ్‌ను, అయ్యన్నపాత్రుడు గురించి మాట్లాడిన మాటలను చూస్తే ప్రతిపక్ష హోదా కాదు కదా అసెంబ్లీలో కూడా కూర్చునే అర్హత ఉండేది కాదని చెప్పారు. జగన్‌కు ప్రతిపక్ష హోదా లేకుండా చేసింది ప్రజలేనని, చంద్రబాబు కాదన్నారు.



నర్సింగరావు (ఫైల్)



భార్గవ్

పెంపుడు కుక్క కరిచి.. తండ్రీకొడుకు మృతి

తండ్రి ఆర్టీసీ కండక్టర్.. కుమారుడు రైల్వే ఉద్యోగి

విశాఖ జిల్లా భీమిలీలో విషాదం

భీమునిపట్నం, జూన్ 25: ఇంట్లో పెంచుకుంటున్న కుక్క కరవడంతో నాలుగు రోజుల వ్యవధిలో తండ్రీకొడుకు మృతి చెందారు. విశాఖ జిల్లా భీమిలిలో ఈ ఘటన విషాదం నింపింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం, అల్లిపిల్లి నరసింగరావు (59) ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు భార్గవ్ (27) రైల్వేలో పనిచేస్తున్నారు. కుమార్తెకు వివాహం చేశారు. వారు మూడేళ్లుగా ఇంట్లో కుక్కను పెంచుకుంటున్నారు. వారం క్రితం తండ్రీ కొడుకు కుక్కతో ఆడుతుండగా అది వారిని కరిచింది. భార్గవ్‌ను ముక్కు మీద, నరసింగరావును కాలిపై కరిచింది. పెంపుడు కుక్క కావడంతో వ్యాక్సిన్ వేయించుకోకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. ఈ సంఘటన జరిగిన రెండు రోజులకు ఆ కుక్క చనిపోయింది. దీంతో అప్రమత్తమైన వారిద్దరూ యాంటీ రేబిస్ ఇంజక్షన్ చేయించుకున్నారు. అయితే అప్పటికే రేబిస్ వ్యాధి ప్రబలింది. గత శుక్రవారం సాయంత్రం భార్గవ్ ఆరోగ్యం క్షీణించడంతో ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. అప్పటికే పచ్చకామెర్లు పెరిగిపోవడం, లివర్, బ్రెయిన్ తదితర శరీర భాగాలకు రేబిస్ సోకడంతో అదేరోజు మృతిచెందాడు. నరసింగరావు మంగళవారం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు.

పవన్ క్యాంపు కార్యాలయం ముందు మహిళ ఆత్మహత్యాయత్నం

- అడ్డుకుని రక్షించిన పోలీసులు
- వైసీపీ కార్పొరేటర్ వేధింపులతోనేనని వెల్లడి
- అధికారంతో భూమిని ఆక్రమించినట్టు ఆరోపణ

విజయవాడ, రాజమహేంద్రవరం, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతల భూదాహం, వేధింపులతో విసిగిపోయిన ఓ మహిళ విజయవాడలోని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ క్యాంపు కార్యాలయం వద్ద ఆత్మహత్యకు యత్నించారు. మంగళవారం జరిగిన ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన మేడిశెట్టి రాంబాబు, దుర్గాదేవి దంపతులు. వీరికి రాజమహేంద్రవరంలో 1,200 గజాల స్థలం ఉంది. దీన్ని వైసీపీ మహిళా కార్పొరేటర్ ఆక్రమించుకున్నారని దుర్గాదేవి ఆరోపిస్తున్నారు. సీఎం చంద్రబాబుకు తమ సమస్యను విన్నవించుకోవడానికి దంపతులు విజయవాడకు వచ్చారు. అయితే, పోలీసులు అడ్డుకోవడంతో ఆయనను కలవలేకపోయారు. దీంతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కార్యాలయం వద్దకు వచ్చిన వారిని కూడా పోలీసులు అడ్డుకున్నారు. అపాయింట్‌మెంటు ఉండాలని సూచించారు. దీంతో దుర్గాదేవి క్యాంపు కార్యాలయానికి ఎదురుగా ఉన్న పోలీసు క్వార్టర్స్ భవనం ఎక్కి, దూకేసేందుకు ప్రయత్నించారు. ఈ ఘటనను గమనించిన పోలీసులు వెంటనే ఆమెను భవనంపై నుంచి కిందికి తీసుకొచ్చారు. అనంతరం దంపతులను సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మహిళా కార్పొరేటర్ ఓ దళారీ ద్వారా తమ స్థలాన్ని ఆక్రమించుకున్నారని వారు ఆరోపించారు. రాజమహేంద్రవరం పోలీసులపై నమ్మకం లేదని, అందుకే సీఎం చంద్రబాబును కలిసి గోడు వెళ్లబోసుకోవాలని వచ్చినట్టు వివరించారు.

రాజమండ్రిలో కాదు.. రాజాంలో స్థలం కోసం: పోలీసులు

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కార్యాలయం ఎదుట దుర్గాదేవి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన ఘటనపై రాజమహేంద్రవరం పోలీసులు స్పందించారు. రాజమహేంద్రవరం తుమ్మలోవ ప్రాంతంలో మేడిశెట్టి రాంబాబు దంపతులు నివాసం ఉంటున్నారని, వారికి ఆర్యాపురంలో సుమారు 30 గజాల్లో పాడుబడిన పెంకుటిల్లు ఉందని తెలిపారు. దాన్ని తన ముగ్గురు కొడుకుల్లో ఒకరైన మేడిశెట్టి రాంబాబుకు ఆయన తల్లి రాసిచ్చింది. అయితే తమ తల్లితో సోదరుడు రాంబాబు బలవంతంగా రాయించుకున్నాడని మిగతా ఇద్దరు సోదరులు కోర్టుకు వెళ్లారు. విచారణ అనంతరం రాంబాబు పేరున డిక్రీ వచ్చింది. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరంలో ఉన్న 30 గజాల పెంకుటిల్లు ఇవ్వడానికి తమకు అభ్యంతరం లేదని ఆ సోదరులు చెబుతున్నారు. అయితే తన తల్లిదండ్రులు తనకు శ్రీకాకుళం జిల్లా రాజాంలో 1200 గజాల స్థలం ఇచ్చారని రాంబాబు భార్య దుర్గాదేవి చెబుతున్నారు. ఆ స్థలాన్ని అక్కడ వైసీపీ నాయకుడు ఆక్రమించారని ఆరోపిస్తున్నారు. రాజాంలోని స్థలం అంశం తేల్చాలని రాంబాబు, ఆయన భార్య రాజమండ్రి పోలీసులను కోరుతూ వచ్చారు. ఈ క్రమంలో గతంలో హైకోర్టు వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కోర్టు ఆదేశాలతో 2023 మార్చిలో త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఆ కేసు పెండింగ్‌లో ఉంది. రాజమండ్రిలోని ఇంటికి సంబంధించి ఆమె ఆత్మహత్యాయత్నం చేయలేదని, రాజాంలో స్థలం కోసం చేసి ఉంటారని స్థానిక పోలీసులు వెల్లడించారు. భార్యాభర్తలు మానసికంగా అసమతుల్యంగా ఉన్నారని పేర్కొన్నారు.



భవనంపైకి ఎక్కి దూకేసేందుకు ప్రయత్నిస్తున్న మహిళ

క్షీణించిన అతీశి ఆరోగ్యం నిరాహార దీక్ష విరమణ



న్యూఢిల్లీ, జూన్ 25: ఢిల్లీలో తాగునీటి కొరత సమస్యకు కేంద్రప్రభుత్వం పరిష్కారం చూపాలని, హరియాణా నుంచి ఢిల్లీకి రావాల్సిన నీటి వాటాను మొత్తం సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని నిరవధిక నిరాహార దీక్ష చేపట్టిన ఆప్ నాయకురాలు అతీశి ఆరోగ్యం బాగా క్షీణించింది. ఆమె రక్తంలో షుగర్ స్థాయి బాగా పడిపోయింది. దీంతో, ఆమెను ఢిల్లీలోని లోక్‌నాయక్ ఆస్పత్రిలో చేర్చారు. ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. అతీశి ఐదు రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నారు. దీక్ష విరమించాలని సోమవారం సాయంత్రమే వైద్యులు ఆమెకు సూచించారు. దానికి ఆమె నిరాకరించారు. అయితే, సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత అతీశి ఆరోగ్యం మరింత క్షీణించడంతో ఆదివారం తెల్లవారుజామున 3.45గంటలకు ఆమెను ఆస్పత్రిలో చేర్చారు. కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నందున ఆతీశి తన నిరాహార దీక్షను విరమించారని ఆప్ రాజ్యసభ సభ్యుడు సంజయ్‌సింగ్ ప్రకటించారు. అతీశి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం స్థిరంగా ఉందని వైద్యులు తెలిపారు.

నోట్ల ముద్రణపై 6 నెలలు శిక్షణ

- బస్తర్ అడవుల్లో పొందిన మావోయిస్టులు
- నిపుణులను బయటి నుంచి రప్పించారు
- సౌరశక్తి, ఇన్వర్టర్, టాప్ క్వాలిటీ పేపర్ వినియోగం
- ఛత్తీస్‌గఢ్ పోలీసుల దర్యాప్తులో వెల్లడి

న్యూఢిల్లీ, జూన్ 25: నకిలీ కరెన్సీ ముద్రణకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానంపై మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్‌లోని పశ్చిమ బస్తర్ అడవుల్లో సుమారు 6 నెలలు శిక్షణ పొందినట్టు అధికారుల దర్యాప్తులో వెల్లడైంది. సుక్మా జిల్లాలోని అడవుల్లో భారీగా నకిలీ కరెన్సీ నోట్లు, వాటిని ముద్రించేందుకు ఉపయోగించిన సామగ్రిని భద్రతా దళాలు శనివారం స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. వీటిలో రూ.50, రూ.100, రూ.200, రూ.500 నోట్లు, కలర్ ప్రింటింగ్ మెషిన్, బ్లాక్ అండ్ వైట్ ప్రింటర్, ఇన్వర్టర్, 200 బాటిళ్ల ఇంకు, నాలుగు క్యాట్రిడ్జ్‌లు, తొమ్మిది ప్రింటర్ రోల్స్, ఆరు వైర్‌లెస్ సెట్లు, చార్జర్, బ్యాటరీలు ఉన్నాయి. వీటిపై దర్యాప్తు చేపట్టిన అధికారులు కీలక విషయాలను గుర్తించారు. 'మావోయిస్టులకు నకిలీ కరెన్సీ నోట్లపై శిక్షణ ఇచ్చేందుకు 2023లోనే రాష్ట్రం బయటి నుంచి కొందరు వ్యక్తులు అడవిలోకి వచ్చారు. దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా సీనియర్ మావోయిస్టులు వారిని సంప్రదించారు. నోట్ల ముద్రణకు టాప్ క్వాలిటీ పేపరును ఉపయోగించారు. మెట్రోపాలిటన్ నగరాల్లో పోలీసులు లేదా తరచుగా సీబీఐ స్వాధీనం చేసుకున్న నకిలీ కరెన్సీల్లో ఇలాంటి టాప్ క్వాలిటీ పేపర్‌ను వినియోగిస్తుంటారు' అని ఒక అధికారి మంగళవారం వెల్లడించారు. కొన్నేళ్లుగా మావోయిస్టులపై భద్రతాదళాలు ఉక్కుపాదం మోపడంతో ఆర్థికంగానూ మావోయిస్టులు గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నారని చెప్పారు. దీంతో తమ కనీస అవసరాలకు కావాల్సిన నగదు కోసం నకిలీ కరెన్సీ ముద్రణపై శిక్షణ తీసుకోవాలని 2022 డిసెంబరులో నిర్వహించిన మావోయిస్టు నేతల సమావేశంలో నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. నోట్ల ముద్రణకు సౌర శక్తిని, ఇన్వర్టర్లను కూడా వినియోగించారని వివరించారు. అలా ముద్రించిన నకిలీ కరెన్సీని స్థానిక గ్రామస్థులకు ఇచ్చి తమకు కావాల్సిన వస్తువులు కొనుగోలు చేస్తున్నారని, బస్తర్ ప్రాంతంలోని వారాంతపు సంతల్లోనూ చెలామణి చేస్తున్నారని తెలిపారు. సుక్మా జిల్లాలోని మైలాసుర్, కోరజ్‌గూడ, దంతేశ్‌పురం ప్రాంతాల్లో ఈ నకిలీ కరెన్సీ ముద్రణ జరుగుతోందని గుర్తించినట్టు చెప్పారు. ఇంకెక్కడైనా మావోయిస్టులు ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడుతున్నారేమోనని గుర్తించేందుకు భద్రతాదళాలు ప్రయత్నిస్తున్నాయని సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి దిక్సూచి

diksuchi@andhrajyothy.com

విజయవాడ ● బుధవారం 26 జూన్ 2024

ఒక వస్తువుని ఉత్పత్తి చేయడం ఎంత ముఖ్యమో, దానిని అంతే భద్రంగా వినియోగదారుడికి చేర్చడం కూడా ప్రధానమే. ఈ ప్రక్రియలో కూడా ఎంతో మంది పాల్గొంటారు. అందులో ప్యాకేజింగ్ ముఖ్యమైనది. వస్తువు స్వరూప స్వభావాలను అనుసరించి అవసరమైన విధంగా అట్టపెట్టె లేదంటే మరొకదానిలో పెట్టాలి. భద్రంగా దానిని వినియోగదారుడి ఇంటికి లేదంటే తను సందర్శించే షాపు వద్దకు చేర్చాలి. ఈ ప్రాసెస్ మొత్తం ప్యాకేజింగ్ కిందకు వస్తుంది. ఈ రంగంలో ప్రాథమిక కోర్సు 'డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్ టెక్నాలజీ'. హైదరాబాద్ రామంతపూర్‌లో ఉన్న జెఎన్ గవర్నమెంట్ పాలిటెక్నిక్‌లో ఈ కోర్సు ఉంది.

విలక్షణ కోర్సు ప్యాకేజింగ్ టెక్నాలజీ



- హరియాణా రాష్ట్రం హిస్సార్‌లోని గురు జంబేశ్వర్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అలాగే హర్యానా సెంట్రల్ యూనివర్సిటీ ప్రింటింగ్ అండ్ ప్యాకేజింగ్ టెక్నాలజీలో బీటెక్ కోర్సును అందిస్తున్నాయి.
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ సహకారంతో హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ ప్యాకేజింగ్‌లో ఎమ్మెస్సీ, ఐఐటీ రూర్కీ ప్యాకేజింగ్ టెక్నాలజీలో ఎంటెక్ అందిస్తున్నాయి.
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ నేరుగా ప్యాకేజింగ్‌లో సర్టిఫికెట్, పీజీ డిప్లొమా ఆఫర్ చేస్తోంది.

గ్రామాలు లేదంటే సమీప వ్యవసాయ క్షేత్రాల నుంచి పట్టణాలకు వెదురు బుట్టలు, తాటాకు తట్టల్లో కూరగాయలు, పండ్లు వస్తుంటాయి. జనుము సంచీల్లో బియ్యం రవాణా అవుతుంది. అయితే సాంకేతిక పురోభివృద్ధితో ప్యాకేజింగ్ అక్కడితో ఆగలేదు. ఒక హోటల్ నుంచి వండిన ఆహార పదార్థం, ఒక ఫార్మా కంపెనీ నుంచి పలు రకాల మందులు డిస్ట్రిబ్యూటర్‌కు చేరుకోవడం మొదలుకుని రకరకాల వస్తువులు ఆన్‌లైన్‌లో పొందే అవకాశం నేడుంది. ఆ క్రమంలో వస్తువు చెడిపోకుండా వినియోగదారుడికి చేర్చే ప్రక్రియకు సాంకేతికతను జోడించారు. దానిని పటిష్టంగా అమలు చేసేందుకు ప్యాకేజింగ్ ప్రధాన ఊతంగా మారింది. దేశీయంగా మధ్యతరగతి ఎదుగుదల, వ్యవస్థీకృత రీటైల్ రంగ విస్తరణ, ఎగుమతుల్లో పెరుగుదల ఫలితంగా ఈ కామర్స్ బలపడింది. అది సహజంగానే ప్యాకేజింగ్ పెరుగుదలకు దోహదపడింది. కొవిడ్ సంక్షోభం ఊహించని పెనుముప్పు. అయితే, ప్యాకేజింగ్ పరిశ్రమకు మాత్రం మంచి ఊపునిచ్చింది. ఒక పక్క ఔషధ పరిశ్రమ, మరోపక్క ఇంటికే నేరుగా డెలివరీలతో ప్యాకేజింగ్ పరిశ్రమ అవసరం బాగా పెరిగింది. ఆహారం నుంచి అవసరమైన వస్తువు వరకు ఏదైనా సరే, తప్పనిసరి పరిస్థితుల్లో ఇంటికే తెప్పించుకోవాల్సిన అగత్యం ఏర్పడింది.

కోర్సుగా: హైదరాబాద్‌లోని రామాంతపూర్‌లో ఉన్న జెఎన్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ మాత్రమే ఈ కోర్సును ఆఫర్ చేస్తోంది. ఈ కోర్సులో 60 సీట్లు ఉన్నాయి. 1996లో దీన్ని ఇక్కడ ఆరంభించారు. దక్షిణాది రాష్ట్రాల్లో ముఖ్యంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఈ ఒక్క పాలిటెక్నిక్ మాత్రమే ప్యాకేజింగ్ టెక్నాలజీలో డిప్లొమాను అందిస్తోంది. గ్రామీణ, పేద విద్యార్థులకు ఈ కోర్సు నిజంగా వరమని చెప్పాలి. అత్యంత ప్రతిభావంతులైన ఫ్యాకల్టీ ఈ కోర్సును తీర్చిదిద్దడం నుంచి తమ విద్యార్థులకు ప్రాక్టికల్ ఎక్స్‌పీరియెన్స్ కల్పించేందుకు తద్వారా వారు ఉద్యోగాల్లో స్థిరపడేందుకు ఎంతో కృషి చేస్తున్నారు. కోర్సులో భాగంగా ప్యాకేజింగ్ మెటీరియల్ బేసిక్స్, మెథడాలజీ, డిజైన్, అప్లికేషన్ వంటి విషయాలన్నీ బోధిస్తారు. చివరి సెమిస్టర్‌లో సంబంధిత కంపెనీకి పంపి ప్రాక్టికల్‌గా అవగాహన కల్పిస్తారు.

ఉన్నత చదువులు

- ఈసెట్‌లో ర్యాంక్ సాధించి లేటరల్ ఎంట్రీ కింద బీటెక్‌లో చేరవచ్చు. మెకానికల్, ఏరోనాటికల్, ప్రొడక్షన్ ఇంజనీరింగ్ సీఎస్ఇ, ఐటీ బ్రాంచీల్లో చేరవచ్చు.

ఉపాధి: ప్రొడక్ట్ డెలివరీ(అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థలు), ఫుడ్ డెలివరీ(స్విగ్గీ, జొమాటో వంటివి), ఫార్మా ఇండస్ట్రీ సహా ప్యాకేజింగ్ అవసరమైన ప్రతి సంస్థలో వీరికి ఉపాధి అవకాశాలు ఉంటాయి. ఎలక్ట్రికల్ - ఎలక్ట్రానిక్ గాడ్జెట్ల నుంచి వినియోగదారుడి చెంతకు చేరాల్సిన ప్రతి ప్రొడక్ట్‌కు ప్యాకేజింగ్ అవసరమే. అందుకే ఈ డిప్లొమా చేసిన వారికి నిరుద్యోగం అన్న ప్రసక్తే ఉండదు. నిజానికి డిమాండ్‌కు తగ్గ సరఫరాలేదు. ప్రాక్టికల్ ఎక్స్‌పీరియెన్స్ కోసం ఈ ఏడాది 16 మందిని తీసుకున్న రెడ్డి ల్యాబ్స్ ఒకొక్కరికి స్టయిపెండ్‌గా రూ.15,000 చెల్లిస్తోందని ప్యాకేజింగ్ టెక్నాలజీ హెడ్ డాక్టర్ వై.వెంకటరెడ్డి తెలిపారు. తదుపరి మరో ఆరు నెలలు కూడా అదే స్టయిపెండ్‌కు పనిచేస్తే రెగ్యులర్ స్కేల్ ఇస్తామని హామీ ఇచ్చారని అన్నారు. అంతేకాకుండా అరబిందో సహా పలు కంపెనీలు కూడా తమ విద్యార్థులను ఈ ఏడాది తీసుకున్నాయని తెలిపారు. చివరకు కోర్సు పూర్తి చేయలేని విద్యార్థులను సైతం కంపెనీలు తీసుకునే పరిస్థితి నెలకొందని ఆయన వివరించారు.

తెలంగాణ క్రీడా పాఠశాలల్లో అయిదోతరగతి ప్రవేశాలు

హైదరాబాద్-మాసబ్‌ట్యాంక్‌లోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ- రాష్ట్రంలోని క్రీడా పాఠశాలల్లో అయిదోతరగతి ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. మొత్తం 160 సీట్లు ఉన్నాయి. ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఎంపికైన విద్యార్థులకు బోధన, భోజనం, వసతి ఉచితం. రెండు జతల పీటీ డ్రెస్, ట్రాక్ సూట్, షూస్-సాక్స్, కిట్ బ్యాగ్, వాటర్ బాటిల్, టవల్, క్యాప్ తదితరాలు ఇస్తారు.

క్రీడా పాఠశాలలు-సీట్లు

- టీజీటీడబ్ల్యూయూఆర్‌జేసీ(బాలురు), ఏటూరునాగారం స్పోర్ట్స్ స్కూల్, ములుగు జిల్లా-80 సీట్లు
- టీజీటీడబ్ల్యూయూఆర్‌జేసీ(బాలికలు), చేగుంట స్పోర్ట్స్ స్కూల్, మెదక్ జిల్లా-80 సీట్లు

అర్హత: టీజీటీడబ్ల్యూఆర్ఈఐఎస్ సంస్థలు, ఆదర్శ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్ పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలలు, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో నాలుగోతరగతి చదివిన బాలబాలికలు అప్లయ్ చేసుకోవచ్చు. విద్యార్థులకు ఫిజికల్ ఫిట్‌నెస్ తప్పనిసరి. కుటుంబ వార్షికాదాయం 2023-24 సంవత్సరానికి పట్టణాల్లో రూ.2 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.5 లక్షలు మించకూడదు.



ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు

- ఇందులో బ్యాటరీ టెస్ట్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్‌లు ఉంటాయి.
- బ్యాటరీ టెస్ట్-వెయిటేజీ: హైట్, వెయిట్, 30మీ ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, మెడిసిన్ బాల్ పుట్, షటిల్ రన్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, వర్టికల్ జంప్, 200మీ రన్‌లకు ఒక్కోదానికి మూడు మార్కులు నిర్దేశించారు. ఒక గేమ్ ఈవెంట్ కూడా ఉంటుంది.
- ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్‌లో వినికిడి శక్తి, కంటిచూపు, ఇతర అవయవాల పనితీరు తదితరాలను పరీక్షిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 1
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** జూలై 8 నుంచి
- **ఎంట్రెన్స్ టెస్ట్(బ్యాటరీ టెస్ట్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్) తేదీలు:** జూలై 18, 19
- **ఎంపికైన అభ్యర్థుల సమాచారాన్ని ఎస్ఎంఎస్/ఫోన్ ద్వారా తెలిపే తేదీ:** జూలై 30
- **క్రీడా పాఠశాలల్లో అడ్మిషన్స్:** ఆగస్టు 1
- **వెబ్‌సైట్:** www.tgtwgurukulam.telangana.gov.in

జేఎన్‌టీయూకేలో ఇంటర్నేషనల్ కొలాబరేటివ్ ప్రోగ్రామ్

కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూకే)- ఇంటర్నేషనల్ కొలాబరేటివ్ ప్రోగ్రామ్(ఐసీపీ)లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. స్వీడన్‌లోని బ్లీకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బీటీహెచ్)తో కలసి ఆరేళ్ల ప్రోగ్రామ్‌ను, యూఎస్ఏలోని యూనివర్సిటీ ఆఫ్ నార్తరన్ అయోవా(యూఎన్ఐ)తో కలసి నాలుగేళ్ల ప్రోగ్రామ్‌ను అందిస్తోంది. జేఈఈ మెయిన్ 2024/ఏపీ ఈఏపీసెట్ 2024/టీజీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్, కౌన్సెలింగ్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

జేఎన్‌టీయూకే-బీటీహెచ్ ప్రోగ్రామ్: ఈ ప్రోగ్రామ్‌లో సీఎస్ఈ, సీఎస్ఈ(ఏఐ&ఎంఎల్), ఈసీఈ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో 20 సీట్లు చొప్పున మొత్తం 60 సీట్లు ఉన్నాయి. వీటిలో సగం సీట్లను ఐఐటీ జేఈఈ మెయిన్ అభ్యర్థులకు మిగిలిన సగం సీట్లను టీజీ/ఏపీ ఈఏపీసెట్ అభ్యర్థులకు నిర్దేశించారు.

- ప్రోగ్రామ్ మొదటి మూడేళ్లు కాకినాడ జేఎన్‌టీయూలో, చివరి మూడేళ్లు బీటీహెచ్-స్వీడన్‌లో చదవాల్సి ఉంటుంది. నాలుగో ఏడాది కోర్సును బీటీహెచ్‌లో పూర్తిచేశాక ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. వీరికి కాకినాడ జేఎన్‌టీయూ బీటెక్ డిగ్రీని, బీటీహెచ్ బీఎస్ డిగ్రీని ప్రదానం చేస్తాయి. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ మొత్తం పూర్తిచేసినవారికి బీటీహెచ్ నుంచి ఎంఎస్ డిగ్రీ లభిస్తుంది.

ఎంఎస్ స్పెషలైజేషన్‌లు: కంప్యూటర్ సైన్స్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, మెషిన్ లెర్నింగ్-సెన్సర్స్-సిస్టమ్స్

జేఎన్‌టీయూకే-యూఎన్ఐ ప్రోగ్రామ్: ఈ ప్రోగ్రామ్‌లో ఈఈఈ స్పెషలైజేషన్ ఉంది. మొదటి మూడేళ్లు కాకినాడ జేఎన్‌టీయూలో, చివరి ఏడాది యూఎన్ఐ-యూఎస్ఏలో చదవాలి. వీరికి జేఎన్‌టీయూకే నుంచి బీటెక్ డిగ్రీ, యూఎన్ఐ నుంచి బీఎస్ డిగ్రీ లభిస్తుంది. ఆసక్తిగల అభ్యర్థులు యూఎన్ఐలో కోర్సును కొనసాగిస్తూ మాస్టర్స్ ప్రోగ్రామ్‌లో చేరే వీలుంది.

అర్హత వివరాలు: తెలంగాణ/ఆంధ్రప్రదేశ్ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ నుంచి ఎంపీసీ గ్రూప్‌తో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 70 శాతం మార్కులు తప్పనిసరి. సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థులందరికీ జేఈఈ మెయిన్ 2024/ఏపీ ఈఏపీసెట్ 2024/టీజీ ఈఏపీసెట్ 2024 అర్హత తప్పనిసరి.

- బీటీహెచ్ నిబంధనల ప్రకారం ఇంటర్ ఆంగ్ల మాధ్యమంలో చదవని వారు టోఫెల్/ఐఈఎల్‌టీఎస్ అర్హత పొందాల్సి ఉంటుంది. టోఫెల్‌లో 575/90 స్కోర్; ఐఈఎల్‌టీఎస్‌లో ప్రతి సెక్షన్‌లో కనీసం 5.5 స్కోర్‌తోపాటు మొత్తమ్మీద కనీసం 6.5 స్కోర్ రావాలి.
- యూఎన్ఐ నిబంధనల ప్రకారం ఐఈఎల్‌టీఎస్‌లో 6.0 లేదా టోఫెల్‌లో 79 స్కోర్ ఉండాలి. మాస్టర్స్ ప్రోగ్రామ్‌లో చేరాలంటే బీఎస్ డిగ్రీలో కనీసం 3.0 క్యుములేటివ్ గ్రేడ్ పాయింట్ ఉండాలి. మూడు రికమండేషన్ లెటర్లు, పర్సనల్ స్టేట్‌మెంట్ సబ్మిట్ చేయాలి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **చిరునామా:** డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, జేఎన్‌టీయూకే, కాకినాడ - 533003
- **వెబ్‌సైట్:** www.jntuk.edu.in

SCHOLARSHIP ALERT

Tata Capital Pankh Scholarship Program

Description: An initiative of Tata Capital Limited aimed at providing financial support to students belonging to economically weaker sections of society to help them fulfill their academic dreams.

Eligibility: Indian students who are currently studying in Classes 11, 12 general graduation (B.Com., B.Sc., B.A., etc.), diploma and ITI courses at recognised institutions are eligible. Applicants must have scored at least 60% marks in the preceding class. The annual family income of the applicants from all sources must be less than or equal to INR 2.5 lakh.

Prizes & Rewards: Up to an amount ranging from INR 10,000 to INR 12,000 or 80% of course fees (whichever is less)

Last Date to Apply: 15-09-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/TCPS27

Kotak Life Insurance Scholarship Program

Description: An initiative by Kotak Life Insurance Company Ltd. to provide financial assistance to students from Tamil Nadu and Maharashtra to help them pursue their undergraduate studies in the commerce stream.

Eligibility:

- Open to students who are residents of Tamil Nadu and Maharashtra.
- Applicants must be enrolled in the first year of a B.Com. program at any of the eight specified colleges in Tamil Nadu and Maharashtra. The list of colleges is given below:
- A. Veeriya Memorial Sri Pushpam College (Thanjavur, Tamil Nadu)
- Nadar Mahajana Sangam S. Vellaichamy Nadar College (Madurai, Tamil Nadu)
- Edayathangudy G.S. Pillay Arts and Science College (Nagapattinam, Tamil Nadu)
- Jai Hind Sindhu Education Trust's Manghanmal Udharam College of Commerce (Pune, Maharashtra)
- Gokhale Education Society's B.Y.K. (Sinnar) College of Commerce (Nashik, Maharashtra)



- LRD and SRP College for Women (Nagpur, Maharashtra)
- Vysya Arts and Science College (Salem, Tamil Nadu)
- Dharmapuram Adhinam Arts College (Mayiladuthurai, Tamil Nadu)
- Applicants must have scored 65% marks or more in Classes 10 and 12.
- Applicants must have passed Class 12 in the year 2023-24.
- The applicant's annual family income must be INR 3,60,000 or less.

Prizes & Rewards: Up to INR 30,000 per year

Last Date to Apply: 31-07-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/KLISP2

HOPE Engineering Scholarship by Schaeffler India

Description: Schaeffler India invites applications from first-year engineering female students (preference will be given to students with physical disabilities) to provide them with financial support for their engineering studies.

Eligibility: The scholarship is open to female students and preference will be given to students with physical disabilities. The applicants must have scored more than 60% marks in Class 12 (science) in the academic year 2023-24. They must be enrolled in the first year of an engineering program at any recognized college in India. The annual family income of the applicants should be less than INR 5 lakh.

Prizes & Rewards: Scholarship of INR 50,000

Last Date to Apply: 30-07-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/SIHE15

buddy4study.com

లిటిల్స్

స్నేహితుల వేట

ఒక అడవిలో సింహం పులి, కలిసిమెలిసి ఉండేవి. ఒక వేసవిలో వాటికి వారం రోజులపాటు ఆహారం దొరకలేదు. అవి రెండు ఆకలితో నకనకలాడిపోయాయి. ఆ సమయంలో వాటికి ఒక జింక కనిపించింది. అపుడు సింహం పులితో.. మిత్రమా మనిద్దరం ఎవరికి వారే వేటాడితే జంతువులు చిక్కకుండా పారిపోతున్నాయి. కాబట్టి ఈసారి ఇద్దరం కలిసి ఒకేసారి చెరువు వైపు నుంచి దాడి చేద్దాం అన్నది పులి. ఆ మాటలకు సరైన అంది రెండు కలిసికట్టుగా వేటాడటంతో జింక సులువుగా దొరికిపోయింది. కానీ సింహం కలిసి వేటాడాలి అన్న ఆలోచన వచ్చింది నాకే మొదట కాబట్టి ఈ జింకను నేను తింటాను



అన్నది. జింక మీద వేగంగా మొదట దెబ్బ వేసింది నేను కాబట్టి జింకను నేనే తింటాను అన్నది పులి. ఈ రెండింటి గొడవను చెట్టు చాటు నుంచి ఒక నక్క చూస్తూ ఉంది అసలే ఆకలితో అలసిపోయి ఉండి బలహీనపడ్డ ఆ రెండు జంతువులు ఎక్కువసేపు కొట్లాడుకోలేవని అర్థమైన నక్క. సింహం పులి కాసేపు గొడవపడి కూలబడగానే చాటుక్కున చెట్టు చాటు నుంచి వచ్చి జింకను లాక్కుని వెళ్లిపోయింది. అట్లా నక్క జింకను తీసుకుని వెళ్ళిపోగానే సింహం, పులి అనవసరంగా స్నేహితులమై ఉండి కూడా గొడవపడి చేతికి అందిన ఆహారాన్ని చేజార్చుకున్నామే అని బాధపడ్డాయి. ఇకమీదట కలిసికట్టుగానే పంచుకోవాలి అని నిర్ణయించుకున్నాయవి.

జత లేని బొమ్మ ఏది?



10 తేడాలు గుర్తించండి!



దారి కనుక్కోండి





డైలీ సుడోకు - 342

3		8	7	6				
2			3					
	7	6		4	2			
	2	3		7		6		
8								9
		7		8		2	5	
			4	3		8	2	
					9			4
				2	7	3		6

సుడోకు - 341 సమాధానం

7	2	3	5	9	4	6	1	8
8	9	1	2	6	7	3	4	5
6	4	5	8	1	3	7	9	2
1	7	8	4	3	2	9	5	6
5	3	2	9	7	6	4	8	1
4	6	9	1	5	8	2	7	3
2	1	4	6	8	9	5	3	7
9	5	7	3	2	1	8	6	4
3	8	6	7	4	5	1	2	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.